ఈనాడు

గుంటూరు 6-5-2026 బుధవారం సిటీ సంపుటి 31 సంచిక 30
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మళ్లీ మళ్లీ... మంచిది కాదు!

ఓ సీసాలో కొబ్బరి నీళ్లు తెచ్చుకుంటాం.
ఓ కవర్‌లో టీ తెచ్చుకుంటాం.
కూల్‌డ్రింక్‌తో పాటు పల్చటి గ్లాసులు కూడా తీసుకుంటాం.
ఇంతకూ ఈ సీసా, కవర్, గ్లాస్‌లన్నీ రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో చేసినవి.
ఇలా రీసైక్లింగ్ చేయడం మంచిదే అయినా... వాటిని సరైన విధానాల్లో తయారు చేయకుంటే మాత్రం ప్రమాదం పొంచి ఉన్నట్టే.



వాడేసిన ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయటం మంచి పరిణామమే అయినా నిబంధనలు, పరిమితులు పాటించకుండా చేసే వస్తువులతో దుష్ప్రయోజనాలున్నాయి. వాటిని ఇష్టారాజ్యంగా వాడితే దీర్ఘకాలిక సమస్యలు ఖాయమంటున్నారు నిపుణులు.

- రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ను ఆహార, వైద్య పరమైన అవసరాలకు వినియోగించటం నిషేధం. కానీ రెండు తెలుగురాష్ట్రాల్లో వందల సంఖ్యలో కంపెనీలు ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి ఆహార ప్యాకింగ్, వైద్య అవసరాలకు వాడే వస్తువులు తయారు చేస్తున్నాయి. కొన్ని చోట్ల ఇంజెక్షన్లు కూడా వీటిలో నిల్వ చేస్తున్నారు.
- లోకల్ తాగునీటి బాటిల్స్‌ను రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తోనే చేస్తున్నారు. రోడ్లపై అమ్మే కొబ్బరి నీళ్లు, చెరుకురసం, పాలు తదితర పదార్థాల ప్యాకింగ్‌కు సీసాలను ఈ రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తోనే రూపొందిస్తున్నారు.
- సినిమా థియేటర్లలో కూల్‌డ్రింక్ పోసి అమ్మే గ్లాసులు, స్ట్రాలు, ఐస్‌క్రీమ్ కప్పులు, టిఫిన్ ప్యాకింగ్ చేసే కవర్లు, మాంసాహార దుకాణాల్లో సంచులు ఇలా ఎన్నో అవసరాలకు అవగాహన లేక, అప్పటికి ప్రత్యామ్నాయం లేక వాడేస్తున్నారు.

(మిగతా 3లో)

రైల్వే జోన్ స్వప్నం సాకారం

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుపై గెజిట్ నోటిఫికేషన్ జారీ
జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని రైల్వే శాఖ ప్రకటన

రాష్ట్ర విభజన చట్టంలోని కీలక హామీకి కార్యరూపం

ఈనాడు - దిల్లీ

రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పుడున్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు వాల్తేరు డివిజన్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విశాఖపట్నం డివిజన్‌తో కలిపి మొత్తం నాలుగు డివిజన్లతో ఈ కొత్త రైల్వే జోన్ పని చేయనుంది. ఈ మేరకు రైల్వే శాఖ సోమవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 13(8)లో ఇచ్చిన కీలక హామీ నెరవేరినట్లైంది. 'ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటుపై రైల్వే శాఖ రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఆరు నెలల్లోపు పరిశీలించి, వేగంగా నిర్ణయం తీసుకుంటుంది' అని విభజన చట్టంలో ఇచ్చిన హామీ.. 12 ఏళ్ల తర్వాత సాకారమవుతోంది. 2024లో కేంద్రంలో, ఏపీలో ఎన్డీయే అధికారం చేపట్టాక ఊపందుకున్న కొత్త జోనల్ ఏర్పాటు ప్రక్రియ సుమారు రెండేళ్లలో సాకారమవుతోంది. గతనెల 28న విశాఖపట్నంలో జరిగిన గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జూన్ 1 నుంచి కొత్త రైల్వే జోన్ ప్రారంభమవుతుందని సీఎం చంద్రబాబు సమక్షంలో (మిగతా 10లో)

మన అవసరాల మేరకు లైన్లు.. రైళ్లు 10లో



రైల్వే జోన్ ప్రకటన తర్వాత విశాఖ రైల్వే స్టేషన్ వద్ద తెదేపా శ్రేణుల సంబరాలు

గుంతకల్లు-వాడి మధ్య 3, 4 లైన్లు

రూ.4,758 కోట్లతో 230 కి.మీ. మేర నిర్మాణం • కేంద్ర కేబినెట్ ఆమోదం

ఈనాడు, దిల్లీ: ముంబయి-చెన్నై రైల్వేమార్గంలో ప్రధాన కేంద్రాలైన గుంతకల్లు-వాడి మధ్య 3, 4 రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సమావేశమైన కేబినెట్ ఇందుకు పచ్చజెండా ఊపింది. మొత్తం రూ.4,758 కోట్ల వ్యయంతో కర్ణాటకలోని యాదగిరి, కలబుర్గి, రాయచూరు, తెలంగాణలోని నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాల మీదుగా 230 కిలోమీటర్ల మేర లైన్ల నిర్మాణం చేపడతారు. (మిగతా 10లో)



గంధం సునీత | చింతలపూడి పురుషోత్తం కుమార్ | ఆలపాటి గిరిధర్

ఏపీ హైకోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు

న్యాయాధికారుల కోటా నుంచి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

ఈనాడు - దిల్లీ, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కొత్తగా మూడు న్యాయమూర్తుల పోస్టుల భర్తీ కోసం సుప్రీంకోర్టు కొలీజియం ముగ్గురు న్యాయాధికారుల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అందులో గంధం సునీత, ఆలపాటి గిరిధర్, చింతలపూడి పురుషోత్తం కుమార్ ఉన్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఈ నెల 4న సమావేశమైన కొలీజియం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 37 న్యాయమూర్తుల పోస్టులు మంజూరైన ఏపీ హైకోర్టులో ప్రస్తుతం 32 మంది సేవలందిస్తున్నారు. 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో మూడు పోస్టుల భర్తీకి అవసరమైన కార్యాచరణను కొలీజియం చేపట్టింది. మరోవైపు ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తుల్లో జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ ఈ నెల 20న, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ 27న పదవీ విరమణ చేయనున్నారు.

గంధం సునీత
తూర్పుగోదావరి పీడీజే

గంధం వీరయ్య, శివనాగేంద్రమ్మ దంపతులకు కృష్ణా జిల్లా పెదకళ్లేపల్లి గ్రామంలో 1977 జూన్ 14న గంధం సునీత జన్మించారు. వీరిది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. డిగ్రీ చదివేటప్పుడు ముత్యాల నాగమల్లేశ్వరరావును వివాహమాడారు. భర్త, కుటుంబ సభ్యుల సహకారంతో ఉన్నత చదువులను (మిగతా 3లో)

రాజీనామా చేయను



అది ప్రజల తీర్పు కాదు • కుట్రల ఫలితమే
మమతా బెనర్జీ స్పష్టీకరణ • సామాన్యురాలినయ్యానని వ్యాఖ్య
మళ్లీ వీధి పోరాటాలకు దిగుతానని వెల్లడి
రాజీనామా చేయకపోతే ప్రభుత్వాన్ని గవర్నర్ రద్దు చేసే అవకాశం

కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతున్న టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ. చిత్రంలో పార్టీ నేత అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా: అసెంబ్లీల ఎన్నికల ఫలితాల అనంతరం.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా.. ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు తమ పదవికి రాజీనామా చేస్తుంటే.. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ భిన్నమైన పంథా ఎంచుకున్నారు. ఎన్నికల్లో పార్టీ ఓడినా, స్వయంగా పరాజయం పాలైనా రాజీనామా చేయబోనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర జరిగిందని, ఇది ప్రజలిచ్చిన అసలైన తీర్పు కాదని, తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. భాజపాకు వ్యతిరేకంగా కాకుండా ఆ పార్టీ తరఫున పని చేసిన ఎన్నికల సంఘంపై తృణమూల్ పోటీ చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం మంగళవారం కోల్‌కతాలో ఆమె మీడియాతో మాట్లాడారు. "నేను రాజీనామా చేయాలన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎందుకంటే మేం ప్రజా తీర్పుతో ఓడిపోలేదు. కుట్రల ఫలితంగా ఓటమి పాలయ్యాం. నేను ఓడిపోలేదు. నేను లోక్ భవన్‌కు (గవర్నర్ వద్దకు) వెళ్లను. రాజ్యాంగపరంగా వారేమైనా చర్యలు తీసుకోవాలనుకుంటే తీసుకోనీయండి. ఈ ఎన్నికల్లో అనేక అక్రమాలు జరిగాయి. కనీసం 100 సీట్లను లూటీ చేశారు. చరిత్రలో ఇది చీకటి అధ్యాయంగా మిగిలిపోనుంది. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అణగదొక్కారు. కేంద్ర సంస్థలు, అధికార వ్యవస్థలు కుమ్మక్కై పని చేశాయి. సోదాలు, బదిలీలు, పక్షపాతం పోటీ వాతావరణాన్ని దెబ్బతీశాయి. ఇంకా నిష్పాక్షికత ఎక్కడుంటుంది. ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో నన్ను నెట్టేశారు. తోసేసి కొట్టారు. కేంద్ర బలగాలకు చెందిన జవాన్లు గూండాల్లా వ్యవహరించారు" అని మమత ఆరోపించారు.

విపక్ష కూటమిని బలోపేతం చేస్తా: ఫలితాల అనంతరం చోటుచేసుకున్న (మిగతా 3లో)

రేపే విజయ్ ప్రమాణం?


- ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- గవర్నర్‌కు టీవీకే అధినేత విజయ్ లేఖ
- టీవీకే మా మద్దతు కోరింది: కాంగ్రెస్
- నిర్ణయం రాష్ట్ర నేతలకే వదిలేశామని వెల్లడి

3లో



చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయానికి వస్తున్న విజయ్

ఉక్కు రంగంలో రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు



రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవకాశం
ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉక్కు రంగంలో రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, 1.52 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి.. దీనికి అనుగుణంగా ఇనుప ఖనిజ ఉత్పత్తి పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మున్ముందు ఇనుప ఖనిజ వినియోగం 4 రెట్లు పెరగనుందని, మన వద్ద లభించే ఖనిజాన్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉందని సీఎం తెలిపారు. మంగళవారం సీఎం తన క్యాంప్ కార్యాలయంలో గనులశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1,938 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలతో ప్రభుత్వానికి రాబడి పెరిగే వీలుంటుందని తెలిపారు. ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ ఇండియా సంస్థ 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు పరిశ్రమ, జేఎస్‌డబ్ల్యూ సంస్థ రాయలసీమలో భారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. 2035 నాటికి వీటి సామర్థ్యం ఏటా 20 మిలియన్ టన్నుల చొప్పున చేరుకుంటుందని, దీనికి అనుగుణంగా రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి పెంచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 17 ఇనుప గనులు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు ఎవరికీ కేటాయించని బ్లాక్‌లను వివిధ సంస్థలకు అప్పగించేలా చూడాలని సూచించారు. 2030 నాటికి 30 మిలియన్ టన్నులు, 2035 నాటికి 113 మిలియన్ టన్నుల ఖనిజ ఉత్పత్తి లక్ష్యంగా ఉండాలని ఆదేశించారు. (మిగతా 3లో)

ఎల్ నినో ప్రారంభమైంది

రుతుపవనాలపై వ్యతిరేక ప్రభావం
ఇన్‌కాయిస్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తూర్పు, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రారంభమైందని ఇన్‌కాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్ నినోగా మారిందని వెల్లడించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని ఇన్‌కాయిస్ మంగళవారం ఓ బులెటిన్‌లో స్పష్టం చేసింది. ఇన్‌కాయిస్ ప్రత్యేకంగా రూపొందించిన బేయేసియన్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్‌వర్క్(బీసీఎన్ఎన్) అనే డీప్ లెర్నింగ్ మోడల్ ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను విశ్లేషించి అంచనాలను రూపొందించినట్లు పేర్కొంది. దీనిద్వారా భవిష్యత్తులో వచ్చే ఎల్ నినో లేదా లా నినా పరిస్థితులను 24 నెలల ముందస్తుగా (మిగతా 3లో)

ఇదీ సంగతి!



మేడం! నేను స్వీపర్ని.. మీరు రూమ్ ఖాళీ చేస్తే శుభ్రం చేసి వేరే వాళ్లకివ్వాలి!

మట్టి పనుల్లో మాయాజాలం!



- తక్కువ పరిమాణంలో చేసి ఎక్కువ మట్టి వాడినట్లు నమోదు
- పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ లెక్కలే ఇంజినీర్ల దృష్టిలో పక్కా
- క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆమోదం
- ఈఎన్‌సీ కార్యాలయం, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో కీలక స్థానాల్లో ఇప్పటికీ అదే ఇంజినీర్లు

ఈనాడు - అమరావతి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబసభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో చేపట్టిన రహదారుల మట్టి పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల నిర్మాణంలో భాగంగా ప్రాథమికంగా మట్టితో రోడ్ల ఎత్తు, వెడల్పు చేసిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. తక్కువ పరిమాణంలో చేసిన పనులకు ఎక్కువ క్యూబిక్ మీటర్ల మట్టి వినియోగించినట్లు రికార్డులు తయారుచేయడం, వీటిని ఇంజినీర్లు గుడ్డిగా ఆమోదించడం ద్వారా భారీగా బిల్లులు చేసుకున్నారన్నది ప్రధాన అభియోగం. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రుణంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ చేపట్టిన రహదారుల పనులపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

పీఎల్ఆర్ చెప్పిందే ఇంజినీర్లకు వేదం

వైకాపా ప్రభుత్వంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ హవా సాగింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదట పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రివర్గ విస్తరణలో ఆయన శాఖ మారినా ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. మట్టితో రోడ్డు ఎత్తు, వెడల్పు చేసినప్పుడు చీఫ్ ఇంజినీర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. లోపాలుంటే రాతపూర్వకంగా అభ్యంతరం తెలియజేయాలి. మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో ఈఎన్‌సీ కార్యాలయంలో అప్పట్లో సీఈగా ఉన్న సుబ్బారెడ్డి ఈఎన్‌సీ బాధ్యతలు (మిగతా 3లో)

రెండేళ్ల తర్వాత ₹2,631 కోట్ల జేజేఎం నిధులు

- ప్రాజెక్టు గడువు పెంచి రాష్ట్రానికి నిధులిచ్చిన కేంద్రం
- రెండున్నరేళ్లలో రూ.22వేల కోట్ల ఖర్చుకు ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ (జేజేఎం)లో రెండేళ్ల తర్వాత రాష్ట్రానికి కేంద్రం రూ.2,631.07 కోట్లు కేటాయించింది. 2026-27 సంవత్సరానికి తొలివిడతగా ఈ నిధులు అందించింది. వైకాపా ప్రభుత్వం జేజేఎంకి రాష్ట్ర వాటా నిధులివ్వనందున కేంద్రం నిధులు నిలిపేసింది. రూ.22వేల కోట్ల ప్రాజెక్టు అంచనా వ్యయంలో వైకాపా హయాంలో రూ.5వేల కోట్లే వెచ్చించారు. గుత్తేదారులకు సైతం బిల్లులు చెల్లించలేదు. దీంతో 2022-23 నుంచి 2023-24 మధ్య పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్రప్రభుత్వ వాటా నిధులిస్తే తమ వాటా (మిగతా 3లో)



వెలిగొండ ప్రాజెక్టు నుంచి మార్కాపురం జిల్లాకు తాగునీటి సరఫరా పనుల కోసం సిద్ధం చేసిన పైపులు

మీకెన్ని మార్కులు?



ఈ ప్రశ్న చూడగానే క్లాస్‌లో మార్కులా? లేదంటే ఏదైనా సబ్జెక్టులోనా అని ఆలోచిస్తున్నారు కదూ! అవేమీ కాదు. ఈ సెలవుల్లో మీరు ఎలా ఉంటున్నారు? ఏ మేరకు అమ్మనాన్నల మాట వింటున్నారు? మంచి అలవాట్లు చేసుకుంటున్నారా లేదా? గతంలోని మీకు.. ప్రస్తుతం మీకు ఉన్న తేడా ఏంటి?.. ఇలా కొన్ని ప్రశ్నలు కింద ఉన్నాయి. వాటిలో మీరెన్ని చేస్తున్నారో లెక్కపెట్టుకోండి.

సెలవుల్లో సరదాగా!

1. పొద్దున్నే లేవడం, అమ్మ పెట్టిన హెల్దీ ఫుడ్‌ను పూర్తిగా తినడం
2. గంటల తరబడి ఫోన్/టీవీ చూడకపోవడం
3. రోజులో కనీసం గంటపాటు చదవడం
4. ఎండలో తిరగకపోవడం, ఒకవేళ తిరిగితే సరైన జాగ్రత్తలు తీసుకోవడం
5. కొత్త విషయాలు నేర్చుకోవడం, నేర్చుకున్నవి ఫ్రెండ్స్‌తో పంచుకోవడం
6. ఆలోచనలను పదును పెట్టే పజిల్స్ పరిష్కరించడం
7. గత తరగతిలో మీరు వెనుకబడిన సబ్జెక్టును ఇప్పుడు నేర్చుకోవడం
8. రోజుకి కనీసం ఒక పండు అయినా తినడం
9. గది నుంచి బయటకు వెళ్తే.. ఫ్యాన్/లైట్ ఆఫ్ చేయడం
10. నీటిని సరిపడా తాగడం.

వీటిలో 10 మార్కులు వస్తే.. మీరే చాలా గ్రేట్. ఒకవేళ తక్కువ వస్తే.. పది మార్కులు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తారు కదూ!

గుర్తుపట్టేద్దాం



కేవలం స్పర్శతోనే వస్తువులను గుర్తుపట్టే ఆట ఇది. ఐదారుగురు కలిసి ఒక దగ్గర కూర్చోండి. ఇంట్లో ఉండే చిన్న చిన్న కప్పులు కొన్ని తీసుకోండి. అన్నీ ఒక టేబుల్ మీద ఒకదాని పక్కన ఒకటి పెట్టండి. ఆ కప్పుల్లో ఒక్కొక్క వస్తువు ఉంచండి. అవి కూరగాయలు, పండ్లు, ఆట వస్తువులు.. ఇలా ఏవైనా కావొచ్చు. స్నేహితుల్లో ఒకరి కళ్లకు గంతలు కట్టి.. కప్పులు ఉన్న టేబుల్ దగ్గరకి తీసుకెళ్లండి. వాళ్లు ఆ కప్పులో ఉన్నది ఏ వస్తువో స్పర్శ ద్వారా గుర్తుపట్టాలి. కరెక్ట్‌గా చెప్తే వారికి ఒక పాయింట్. ఇలా ఒక్కొక్కరుగా వచ్చి వాటిల్లో ఏముందో చెప్పే ప్రయత్నం చేయాలి. అందరూ అయిపోయాక ఎవరికి ఎక్కువ పాయింట్స్ వస్తే వాళ్లే గెలుస్తారు.

రూ.1,000 కోట్లతో శ్రీ సిటీలో క్యారియర్ పరిశ్రమ

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి, శ్రీసిటీ (వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్‌కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ తిరుపతి జిల్లా శ్రీ సిటీలో రూ.1,000 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక స్మార్ట్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. 3,000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది. శ్రీ సిటీలో 39 ఎకరాల్లో ఏర్పాటుచేసే ఈ పరిశ్రమకు మంత్రి లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. గురుగ్రామ్‌లో తయారీ యూనిట్, హైదరాబాద్ గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేసింది.

నా ఫోన్ పాస్‌వర్డ్ మర్చిపోయా!

- నాపై అభిమానంతోనో.. ఇరికించడానికో ఎవరో బెదిరింపులు చేసుంటారు
- పోలీసు విచారణలో అనంతబాబు పొంతన లేని సమాధానాలు

ఈనాడు, కాకినాడ: 'సాక్షులను బెదిరించిన వారెవరో నాకు తెలియదు. నాపై అభిమానంతో ఎవరో చేసుండొచ్చు. అబ్బే కాదు, కాదు.. నన్ను కావాలని ఇరికించడానికి ఎవరో చేసిన పని అయిండొచ్చు' అని వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసుల కస్టడీ విచారణలో పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులకు డబ్బులిచ్చి, తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపి శవాలను మాయం చేస్తానని అనంతబాబు తన అనుచరులతో బెదిరించినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో ఒక్కరోజు విచారణకు న్యాయస్థానం అనుమతించింది. దీంతో అనంతబాబును మంగళవారం మధ్యాహ్నం 1.40 గంటలకు సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఒక్కోసారి ఒక్కోలా సమాధానాలు చెబుతూ గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. విచారణ మధ్యలో తమ న్యాయవాదులతో మాట్లాడి వారి సలహాలతో సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది.

మొక్కుబడి సమాధానాలతో సరి

సాక్షులను అనంతబాబు వీడియోకాల్ ద్వారా బెదిరించినట్లు ఆరోపణలొచ్చాయి. ఆ దృశ్యాలను సేకరించేందుకు ఫోన్‌ను తెరవాలని ఎమ్మెల్సీని విచారణాధికారి అడిగితే పాస్‌వర్డ్ మర్చిపోయానని చెప్పారు. తెరవడానికి ప్రయత్నించాలని చెప్పగా కావాలనే తప్పుడు పాస్‌వర్డ్ ఉపయోగించి 90 నిమిషాల పాటు ఆ ఫోన్ తెరిచే అవకాశం లేకుండా చేశారు. బెదిరించిన సాక్షులను ఫొటోలు చూపించి వీరు మీకు ఎప్పటి నుంచి పరిచయం..? వీరికి డబ్బులు ఎలా చేర్చారు..? అరెస్టుకు ముందు పరారీలో ఉన్నప్పుడు ఉపయోగించిన ఫోన్ ఎక్కడ దాచారు..? ఇలా 60కి పైగా ప్రశ్నలతో ఆరుగంటల పాటు విచారించినా మొక్కుబడి సమాధానాలతో దాటవేసినట్లు తెలిసింది. బుధవారం మధ్యాహ్నం వరకు విచారించి కోర్టులో హాజరుపర్చనున్నారు.



అనంతబాబును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్న పోలీసులు

★ సాక్షులను బెదిరించి బెయిల్ నిబంధనలను ఉల్లంఘించినందున అనంతబాబు బెయిల్‌ను రద్దు చేయాలని రాజమహేంద్రవరం కోర్టులో పోలీసులు గతంలోనే పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం జిల్లా కోర్టులో విచారణ జరగనుంది. సాక్షుల బెదిరింపు కేసులో అనంతబాబు దాఖలుచేసిన బెయిల్ పిటిషన్ పైనా బుధవారం విచారణ జరగనుంది.

ఆర్టీఈ రెండో విడతలో 10 వేల మందికి సీట్ల కేటాయింపు

ఈనాడు, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు 10,453 మందికి సీట్లు కేటాయించారు. రెండో విడతలో లాటరీ విధానంలో ఈ సీట్లు కేటాయించినట్లు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25% సీట్లను ప్రభుత్వం ఉచితంగా కేటాయిస్తోంది. ఈ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 54,647 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 54,016 మందిని అర్హులుగా తేల్చారు. మొదటి విడతలో ఆవాసానికి కి.మీ పరిధిలో ఉన్న పాఠశాలల్లో 30,075 మందికి సీట్లు కేటాయించారు. రెండో విడతలో 1-5 కి.మీ. పరిధిలోని 10,453 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు సంక్షిప్త సందేశాలను పంపించారు. వెబ్‌సైట్ https://cse.ap.gov.in లో వివరాలను అందుబాటులో ఉంచారు. విద్యార్థి తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఆదాయం, కులం, విద్యార్థి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, తోబుట్టువుల ఆధార్, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలతో బుధవారం నుంచి ఈ నెల 17 లోపు సంబంధిత పాఠశాలల్లో ప్రవేశాలు పొందాలని ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. పూర్తి వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 18004258599 లో సంప్రదించొచ్చని తెలిపారు. సరైన కారణం లేకుండా పాఠశాల యాజమాన్యాలు ప్రవేశాలను నిరాకరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు రూ.52 కోట్ల బకాయిలు విడుదల చేసిన మార్క్‌ఫెడ్

ఈనాడు, అమరావతి: ఖరీఫ్, రబీల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన శనగ, కందులు, పెసరకు సంబంధించి రైతులకు బకాయిలు విడుదల చేసినట్లు సంస్థ జీఎం లక్ష్మణకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నాఫెడ్, మార్క్‌ఫెడ్ కలిసి ఇప్పటి వరకు రూ.963 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని.. మంగళవారం రూ.52 కోట్లు విడుదల చేశామని వివరించారు.

గ్రహం అనుగ్రహం

6-5-2026 బుధవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళ పక్షం
పంచమి: పూర్తి
మూల: మ. 1-16 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: ఉ. 11-29 నుంచి 1-16 వరకు
తిరిగి రా. 11-48 నుంచి 1-33 వరకు
అమృత ఘడియలు: ఉ. 6-10 నుంచి 7-57 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-31 నుంచి 12-21 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.36; సూర్యాస్తమయం: సా.6.17

మంచి మార్కులు.. కలలకు రెక్కలు!

నందిగామ, నందిగామ రూరల్, న్యూస్‌టుడే: ఆకాశంలో విమానం ఎగురుతుంటే చూసి ఆశ్చర్యపోయే పిల్లలు ఎందరో..! అందులో ఒక్కసారైనా ఎక్కాలని కలలు కంటుంటారు. అలాంటి వారికి విమాన ప్రయాణం అనుభూతిని ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య 'కలలకు రెక్కలు'కు శ్రీకారం చుట్టారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన నందిగామ నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు షేక్ అర్షియానాజ్ (589) ప్రజాపతి పర్విన్ (576), స్వర్గం హర్షిత (571), పల్లెపోగు వినీల (567), నారిశెట్టి జగదీష్ ఆదిత్య (559), ఉప్పులూరి సోనీప్రియ (549)లను సొంత ఖర్చులతో మంగళవారం విజయవాడలోని గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో భోజనాల తర్వాత సాయంత్రానికి కారులో నందిగామ తీసుకొచ్చారు.



గన్నవరం విమానాశ్రయంలో విద్యార్థులతో విప్ సౌమ్య

చిన్న వయసులోనే ఒత్తిడి తెస్తున్నాం..



మనం చిన్న వయసులోనే పిల్లలను సైన్స్, మెడిసిన్, ఆర్ట్స్, కామర్స్ వంటి రంగాలను ఎంచుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నాం. మహాసముద్రంలా విస్తరించి ఉన్న వారి ప్రతిభను రెండు ఏటిగట్ల మధ్య ప్రవహించే నదిలా మన విద్యా వ్యవస్థ మార్చేస్తోంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
అనంతపురం	42.0	27.4
కర్నూలు	41.8	29.2
రాజమహేంద్రవరం	41.5	27.0
తిరుపతి	40.4	25.5
కడప	40.2	25.0
విజయవాడ	38.4	28.4
నెల్లూరు	38.2	28.0
ఒంగోలు	36.7	27.8
గుంటూరు	36.0	31.0
తాడేపల్లిగూడెం	36.0	27.0
నరసాపురం	35.9	28.4
శ్రీకాకుళం	35.0	28.0
విశాఖపట్నం	34.2	27.2
విజయనగరం	33.0	18.0

నిశ్శబ్దంగా ఆడేయొచ్చు

ఎప్పుడూ అల్లరి చేస్తూ, కేకలు వేస్తూ ఆడుకోవడమే కాదు.. ఈ సైలెంట్ గేమ్ 'పాసింగ్ ది బెల్' ఆడి చూడండి.. భలే వెరైటీగా ఉంటుంది.

▼ ఫ్రెండ్స్ అందరూ ఒక సర్కిల్‌లో కూర్చోవాలి.

▼ ఒక గంటను తీసుకొని, మన పక్కన కూర్చున్న ఫ్రెండ్‌కి అందించాలి.

▼ అయితే ఆ గంటను మనం పట్టుకున్నప్పుడు కానీ, వేరే వాళ్లకు ఇస్తున్నప్పుడు కానీ అస్సలు శబ్దం రాకూడదు.

ఒకవేళ పొరపాటున శబ్దం వస్తే.. వాళ్లు ఔట్!



సెలవుల్లో సరదాగా!

బోలెడు లాభాలు

▼ ఈ గేమ్ వల్ల మనకు టీమ్ వర్క్ అలవాటవుతుంది.

▼ గంట శబ్దం రాకుండా ఉండాలంటే మన దృష్టి అంతా దానిపైనే పెట్టాలి కదా! దీని వల్ల ఫోకస్ పెరుగుతుంది.

▼ ఓపిక అలవాటవుతుంది. గంటను వణుకు లేకుండా, జాగ్రత్తగా పట్టుకోవడం వల్ల చేతులపై కంట్రోల్ వస్తుంది.



నురగలో హరివిల్లు

సబ్బు నీళ్లతో బుడగలు చేయడం భలే ఉంటుంది. మరి అదే నురగ ఇంద్రధనస్సులా రంగురంగుల్లో మెరిస్తే ఇంకెంత బాగుంటుందో కదా! ఇంట్లో ఉండే పాత ప్లాస్టిక్ బాటిల్‌తో ఈ రెయిన్‌బో ఫోమ్ ఎలా తయారు చేయాలో నేర్చుకుందామా?

ఇది చేయడానికి ఒక ప్లాస్టిక్ బాటిల్, పాత రుమాలు లేదా కాటన్ క్లాత్, రబ్బర్ బ్యాండ్, డిష్ వాష్ లేదా షాంపూ, రంగులు ఉంటే సరిపోతుంది.



➤ ముందుగా ప్లాస్టిక్ బాటిల్‌ను సగానికి కట్ చేయాలి. మనకు మూత ఉన్న పై భాగం మాత్రమే అవసరం.

➤ దాని కింది వైపు (నోటివైపు కాకుండా రెండోవైపు) ఒక పాత క్లాత్‌ను పెట్టి, అది ఊడిపోకుండా రబ్బర్‌బ్యాండ్‌తో గట్టిగా బిగించాలి. ➤ క్లాత్ పైన వేర్వేరు రంగులను వరుసగా వేయాలి. ➤ ఇప్పుడు ఒక ప్లేట్‌లో కొంచెం నీరు తీసుకుని, అందులో డిష్ వాష్ లేదా షాంపూ వేసి బాగా కలపాలి.

➤ ఇప్పుడు బాటిల్ అడుగు భాగాన్ని అందులో ముంచి.. బాటిల్ మూత వైపు నుంచి గట్టిగా ఊదాలి. అంతే.. రంగురంగుల నురగ పాములా బయటకు వస్తుంది.

మోదీకి ట్రంప్ అభినందన

వాషింగ్టన్: అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. 'చరిత్రాత్మక విజయం సాధించిన ప్రధాని మోదీకి అధ్యక్షుడు అభినందనలు తెలిపారు. గత నెలలోనే ఫోన్ చేసిన సందర్భంగా ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో అభిమానమని, ఆయన భారత్‌కు లభించడం ఎంతో అదృష్టమని ట్రంప్ పేర్కొన్నారు' అని శ్వేతసౌధం అధికార ప్రతినిధి కుష్ దేశాయ్ వివరించారు.

9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. పార్టీ కేంద్ర పరిశీలకుడిగా హోం మంత్రి అమిత్ షా నియమితులయ్యారు. మరోవైపు ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా బలం 207కు చేరింది. రాజర్హట్-న్యూటౌన్‌లో ఆ పార్టీ అభ్యర్థి పీయూష్ కనోడియా గెలిచారు.

ఏపీ హైకోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యసించారు. మాంటిస్సోరి కళాశాలలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1999లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ఆచార్య నాగార్జున వర్సిటీలో లేబర్ లాలో ఎల్‌ఎల్‌ఎం చదివారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుడివాడలో 2008 నుంచి 2010 వరకు సేవలు అందించారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా, 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. విశాఖపట్నం సీబీఐ కోర్టు జడ్జిగా, వైఎస్సార్ కడప జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల పీడీజే (జిల్లా ప్రధాన న్యాయమూర్తి)గా సేవలు అందించారు. 2019 నుంచి 2023 వరకు హైకోర్టులో వివిధ హోదాల్లో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. 2023 నుంచి ఇప్పటి వరకు తూర్పుగోదావరి పీడీజేగా రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఆలపాటి గిరిధర్
వ్యాట్ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఛైర్మన్

ఆలపాటి గిరిధర్ స్వగ్రామం ప్రకాశం జిల్లా కొండపి మండలం గోగినేనివారిపాలెం. తండ్రి బాపయ్యచౌదరి స్వాతంత్ర్య సమరయోధుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. గిరిధర్ ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయకళాశాలలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. తర్వాత న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని ఒంగోలులోని జిల్లా కోర్టులో 9 ఏళ్లు ప్రాక్టీసు చేశారు. ఉమ్మడి హైకోర్టులో మూడేళ్లు ప్రాక్టీసు చేశారు. సివిల్, క్రిమినల్, వినియోగదారులు, సర్వీసు, రాజ్యాంగ సంబంధ కేసులలో ప్రాక్టీసు చేసి మంచి అనుభవం గడించారు. మచిలీపట్నం మొదటి అదనపు జిల్లా జడ్జిగా, విజయవాడ ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా పనిచేశారు. విజయనగరం, కర్నూలు జిల్లాల ప్రధాన న్యాయమూర్తి(పీడీజే)గా సేవలు అందించారు. హైకోర్టులో వివిధ హోదాల్లో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ తర్వాత విశాఖపట్నం జిల్లా జడ్జి(పీడీజే)గా సేవలు అందించారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఏపీ వ్యాట్ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చింతలపూడి పురుషోత్తం కుమార్
ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్

విశ్రాంత జిల్లా జడ్జి సి.రాంబాబు, రమారత్నం దంపతులకు విశాఖపట్నంలో చింతలపూడి పురుషోత్తం కుమార్ జన్మించారు. మూడు తరాలుగా న్యాయవాదులు, న్యాయమూర్తులుగా వీరి కుటుంబం సేవలు అందిస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మెరైన్ బయాలజీలో ఈయన ఎంఎస్సీ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. ఇంటీరియర్ డెకరేషన్, డిజైనింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, మీడియా లాలో డిప్లొమో చేశారు. 2002లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని సీనియర్ న్యాయవాది ఎస్.రవి కార్యాలయంలో చేరి ప్రాక్టీసు ప్రారంభించారు. 2010లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. 2012లో రాజమహేంద్రవరం కుటుంబ న్యాయస్థానంలో న్యాయాధికారిగా పనిచేశారు. తర్వాత తిరుపతి అదనపు జిల్లా జడ్జిగా, 2019లో ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే)గా పనిచేశారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా వివిధ హోదాల్లో రెండేళ్లు సేవలు అందించారు. వైఎస్సార్ కడప, పశ్చిమగోదావరి జిల్లాలకు పీడీజేగా వ్యవహరించారు. 2025 జనవరి 25 నుంచి ఇప్పటి వరకు ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు.

మళ్లీ మళ్లీ... మంచిది కాదు!

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు ఖాయం..

- ఎక్కడెక్కడో సేకరించిన ప్లాస్టిక్ మొత్తం కలిపి కరిగించటం, పూర్తిగా శుద్ధి చేయకపోవటం, అప్పటికే ఒకట్రెండుసార్లు రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్‌ను మళ్లీ ప్రాసెస్ చేయడం, కెమికల్స్, ఇంధనాల అవశేషాలు ఉండటం వల్ల హానికర రసాయనాలు నిక్షిప్తమై ఉంటాయి. కొన్ని రీసైక్లింగ్ ప్రక్రియలోనూ విడుదలవుతాయి. బిస్ఫినాల్, థాలేట్స్, స్టైరిన్, ఫార్మాల్డిహైడ్ వంటి హానికర రసాయనాలతో పాటు సీసం, క్యాడ్మియం, పాదరసం వంటి భార లోహాలు ఉంటాయి.
- సాధారణంగా ఒకసారి తయారు చేసి వాడేసిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తే దాని నాణ్యత బాగా తగ్గిపోతోంది. బిస్ఫినాల్ అనే రసాయనాన్ని ప్లాస్టిక్ గట్టిగా ఉండేందుకు వాడతారు. ఈ ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్‌లో పానీయాలు, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు ప్యాకింగ్ చేసినప్పుడు ఇది విడుదలై ఆహారంలో కలుస్తుంది.
- దీనివల్ల దీర్ఘకాలంలో క్యాన్సర్ వచ్చేందుకు అవకాశం ఉంది. జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. భార లోహాల వల్ల అవయవాలు దెబ్బతినటం, కాలేయం. మూత్రపిండాలకు ఇబ్బందులు వస్తాయి. రసాయనాలు శరీరంలో పేరుకుపోయి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు, దీర్ఘకాలికంగా కళ్లు, ముక్కు సమస్యలు రావచ్చు. చిన్న పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది.
- రీసైక్లింగ్ ప్రక్రియలో వెలువడే రసాయనాలు భూమిలో చేరి మట్టి సారాన్ని దెబ్బతీస్తాయి. వ్యర్థాలు నదుల్లో, ఇతర జలవనరుల్లో కలిస్తే అవి కలుషితం కావడమే కాకుండా. ఆ నీటిని మళ్లీ పశువులు, పక్షులు, మనుషులు తాగి ఇబ్బందులు పడతారు.



మనం మారాలి...

- ఆహారం, జ్యూస్, కర్రీలు, కొబ్బరినీరు, చెరుకురసం, టీ, కాఫీలు ఇలా ఏ ఆహార, ద్రవ పదార్థాల ప్యాకింగ్‌కి ప్లాస్టిక్‌ను వాడవద్దు.
- చిన్న పిల్లలు ఆడుకునే రోడ్ల మీద అమ్మే ఆట వస్తువులు కూడా ఎక్కువగా రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తోనే తయారు చేస్తున్నారు. వీటిని పిల్లలు తరచూ నోట్లో పెట్టుకోవటం హానికరం.
- వస్తువులు ఎక్కువగా ప్లాస్టిక్ వాసన వస్తున్నా, ముడతలు ఎక్కువగా ఉన్నా అవి మంచివి కాదని గుర్తించాలి.
- ఆహార పదార్థాల, ఇంట్లో నిత్యవసరాలు నిల్వ చేసుకునేందుకు ప్లాస్టిక్ డబ్బాల బదులుగా గాజు, స్టీల్ పాత్రలు వాడాలి. ప్లాస్టిక్ బదులుగా నార సంచులు వాడడం ఉత్తమం.
- రీసైక్లింగ్ చేసి తయారు చేసిన ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహారం పెట్టి మైక్రోఓవెన్లలో వేడిచేయడం వల్ల కూడా రసాయనాలు కలుస్తాయి.

ఇలా మేలు...

ప్లాస్టిక్ మిశ్రమాలతో అనేక రాష్ట్రాల్లో రోడ్లు వేస్తున్నారు. ఇటుకలు తయారు చేస్తున్నారు. డ్రైనేజీ పైపులు, కేబుల్ కవరింగ్, కుర్చీలు, టేబుల్స్, డస్ట్‌బిన్లు, కుండీలు, ట్రాఫిక్ బారికేడ్లు వంటివి తయారు చేయటం వల్ల కాలుష్యం నుంచి ఊరట కలుగుతుంది. **- ఈనాడు, అమరావతి**

రాజీనామా చేయను

(మొదటి పేజీ తరువాయి)

హింసపై క్షేత్ర స్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు 10 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మమత ప్రకటించారు. ఇక నుంచి తాను జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. "నేను కుర్చీలో ఉన్నంత కాలం ఎన్నో అంశాల్లో వేధింపులను సహించా. నేనిప్పుడు స్వేచ్ఛా జీవిని. సామాన్యురాలిని. వీధి పోరాటయోధురాలిని. మళ్లీ వీధుల్లోకి వచ్చి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడతా" అని మమత వివరించారు.

రాజ్యాంగం ఏం చెబుతోంది?

ఓడిపోయినా రాజీనామా చేయబోనని మమత భీష్మించిన నేపథ్యంలో తదుపరి జరగబోయే పరిణామాలపై ఆసక్తి నెలకొంది. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి ఎదురు కాలేదు. ఏ ముఖ్యమంత్రీ తాను రాజీనామా చేయబోనని చెప్పలేదు. ఓడిపోగానే రాజీనామా చేశారు. రాజ్యాంగం ప్రకారం.. ముఖ్యమంత్రి తప్పనిసరిగా అసెంబ్లీ విశ్వాసం పొంది ఉండాలి. అయితే ఎన్నికల తర్వాత చేపట్టాల్సిన చర్యల క్రమంపై రాజ్యాంగంలో వివరంగా లేదు. కానీ ప్రభుత్వం మెజారిటీ కోల్పోతే తప్పనిసరిగా దిగిపోవాల్సిందే.

■ రాజ్యాంగంలోని 164(1) ఆర్టికల్ ప్రకారం.. గవర్నర్‌కు విశ్వాసం ఉన్నంతకాలమే మంత్రులు తమ పదవుల్లో ఉంటారు. అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో మెజారిటీ సాధించలేకపోతే సాధారణంగా ముఖ్యమంత్రి రాజీనామా చేస్తుంటారు. తమిళనాడు, కేరళల్లో అదే జరిగింది. ఓడిపోయిన ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, విజయన్ వెంటనే రాజీనామా చేశారు.

రాజీనామా చేయకపోతే..

ముఖ్యమంత్రి రాజీనామా చేయకపోతే గవర్నర్ జోక్యం చేసుకోవచ్చు. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. ఎలాగూ ఓడిపోయిన పార్టీకి మెజారిటీ ఉండదు కాబట్టి ప్రభుత్వం పడిపోతుంది. అప్పుడు ప్రభుత్వాన్ని గవర్నర్ డిస్మిస్ చేస్తారు. మరో పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానిస్తారు.

■ మమత రాజీనామా చేయడానికి నిరాకరిస్తే అసెంబ్లీలో బలాబలాలను గవర్నర్ పరిగణనలోకి తీసుకుంటారు. ఆమెకు బలముందో లేదో చూస్తారు. మెజారిటీ లేకపోతే ఆర్టికల్ 164(1) ప్రకారం.. మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేస్తారు. కొత్త ప్రభుత్వానికి అవకాశమిస్తారు.

తీర్పులను చోరీ చేసిన భాజపా: రాహుల్

దిల్లీ: ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడంలో భాగంగా పశ్చిమ బెంగాల్, అస్సాంలలో ప్రజా తీర్పులను భాజపా చోరీ చేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మమత ఓటమిని చూసి సంబరపడుతున్న తమ పార్టీతోపాటు ఇతర పార్టీల్లోని వారు ఇకనైనా చిల్లర రాజకీయాలను పక్కన పెట్టాలని, ఇది ఏ ఒక్క పార్టీకో కాకుండా దేశానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. తృణమూల్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

రేపే విజయ్ ప్రమాణం?

ఈనాడు-చెన్నై, దిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రిగా సినీనటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న (గురువారం) ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నానని, దీనికిగాను తమ పార్టీని ఆహ్వానించాలని రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ కార్యాలయానికి విజయ్ లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15రోజుల్లో అసెంబ్లీలో బలం నిరూపించుకుంటామని తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న గవర్నర్ బుధవారం చెన్నైకి తిరిగి వచ్చే అవకాశముంది. ఆ వెంటనే విజయ్ బృందం గవర్నర్‌ను కలిసి నూతన ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తారని టీవీకే వర్గాలు వెల్లడించాయి.

శాసనసభా పక్ష నేతగా ఎన్నిక

విజేతలైన ఎమ్మెల్యే అభ్యర్థులతో చెన్నై సమీప పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో మంగళవారం విజయ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం తమ శాసనసభాపక్ష నేతగా విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు తమ ఎమ్మెల్యేలను భద్రంగా చూసుకునేందుకు మామల్లపురంలోని ఓ స్టార్ హోటల్‌ను అద్దెకు తీసుకున్నారు.

విజయ్‌కి కాంగ్రెస్ మద్దతు!

టీవీకే అధ్యక్షుడు విజయ్‌కి మద్దతివ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ తమ సహాయం కోరారని, ప్రజాతీర్పును దృష్టిలో ఉంచుకొని వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీని ఆదేశించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దిల్లీలో వెల్లడించారు. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 118 మంది ఎమ్మెల్యేలు అవసరం. ప్రస్తుతం టీవీకేకు 108 మందే ఉన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతిచ్చినప్పటికీ మరో ఐదుగురిని కూడగట్టాల్సి ఉంటుంది. దీనికోసం ఇతర రాజకీయ పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.



విజయ్ రాక సందర్భంగా చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు

■ ఎన్నికల్లో అధికార డీఎంకే ఓటమి చెందడంతో సీఎం పదవికి మంగళవారం ఎం.కె.స్టాలిన్ రాజీనామా చేశారు.

■ రాష్ట్ర ప్రజల శ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమని టీవీకే అధినేత విజయ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తొలిసారి 'ఎక్స్' వేదికగా స్పందించారు. తమ పార్టీ విజయాన్ని అభినందించిన మోదీ, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ వేర్వేరుగా పోస్టులు పెట్టారు.

చెరకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.10 పెంపు

దిల్లీ: అక్టోబరు నుంచి ప్రారంభం కానున్న 2026-27 సీజన్ కోసం చెరకు రైతులకు మిల్లులు చెల్లించాల్సిన కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచడంతో కొత్త ధర రూ.365కి చేరింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ ధర 10.25% ప్రాథమిక రికవరీ రేటుకు వర్తిస్తుంది. రికవరీ 10.25% కంటే 0.1% పెరిగితే, క్వింటాల్‌కు రూ.3.56 అదనంగా లభిస్తుంది. ఈ నిర్ణయం వల్ల దాదాపు కోటి మంది చెరకు రైతులకు రూ.లక్ష కోట్లకు పైగా లబ్ధి చేకూరనుందని అంచనా.

కుమ్మక్కై తప్పించేశారు!

- **జిత్తులమారి అజిత్ పరారీకి సహకరించిన పోలీసులు, జైలు సిబ్బంది, వైద్యాధికారులు**
- **జైళ్ల శాఖాధికారుల విచారణలో వెల్లడి**

ఈనాడు, అమరావతి: ఓఎల్‌ఎక్స్ మోసాల్లో ఆరితేరిన భీముడు అజిత్‌కుమార్‌తో పోలీసులు, జైలు సిబ్బంది, వైద్యాధికారులు కుమ్మక్కై.. అతను పారిపోవటానికి అన్ని విధాలా సహకరించారని విచారణలో తేలింది. ఒంగోలు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అజిత్‌కుమార్‌ను పీటీ వారెంట్‌పై రేపల్లె సబ్ జైలుకు తీసుకురావటం మొదలు అనారోగ్యం పేరిట అతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించటం.. అక్కడి నుంచి తప్పించుకునేలా చేయటం వరకూ ప్రతిదీ ముందస్తు కుట్ర, కుమ్మక్కుతోనే జరిగిందని వెల్లడైంది. రూ.10 వేలు, రూ.20 వేల లంచాలకు కక్కుర్తి పడి పలు రాష్ట్రాల్లో 32కు పైగా కేసులున్న నిందితుడి దగ్గరుండి వదిలేసినట్లు తేలింది. ఈ మేరకు జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు రెండు రోజుల కిందట సమగ్ర విచారణ నివేదిక చేరింది.

ఇలా తప్పించుకున్నాడు...

ఏలూరు జిల్లా పెదవేగి మండలం నాగన్నగూడెంకు చెందిన భీముడు అజిత్‌కుమార్ ఓఎల్‌ఎక్స్‌లోని ప్రకటనలను అడ్డం పెట్టుకుని మోసాలకు పాల్పడుతుంటాడు. ఓ కేసులో 2018లో అరెస్టై ఒంగోలు జైల్లో రిమాండ్‌లో ఉంటూ... అనారోగ్యం పేరిట ఒంగోలు రిమ్స్‌కు వెళ్లి తప్పించుకున్నాడు. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ ఏడాది మార్చి 7న ఓఎల్‌ఎక్స్ మోసం కేసులో అరెస్టు చేశారు. తొలుత విజయవాడ జిల్లా జైల్లో ఉండగా పీటీ వారెంట్‌పై ప్రకాశం జిల్లా పోలీసులు ఒంగోలు జైలుకు తరలించారు. తెనాలి పోలీసులు మరో కేసులో పీటీ వారెంట్ వేసి.. రేపల్లె సబ్‌జైలుకు తీసుకెళ్లారు. అనారోగ్యం పేరిట గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన అజిత్‌కుమార్ మార్చి 28న తప్పించుకున్నాడు. ఇప్పటికీ పోలీసులు పట్టుకోలేకపోతున్నారు.

అనారోగ్యమేమీ లేదన్నా.. పరీక్షలకు సిఫార్సు

మార్చి 25 ఉదయం 10.30 గంటలప్పుడు రేపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా.పృథ్వీ గణేశ్.. సబ్‌జైలుకు వెళ్లి అజిత్‌కుమార్‌ను పరీక్షించారు. అనారోగ్యమేమీ లేదని చెప్పి, ఆసుపత్రికి అవసరం లేదన్నారు. అయినా.. జైలు సిబ్బంది, పోలీసు గార్డులు మధ్యాహ్నం రేపల్లె సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. డా.పృథ్వీ గణేశ్ మళ్లీ పరీక్షించి గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లి గుండె పరీక్షలు చేయించాలన్నారు. వైద్యుడు మాట మార్చడమూ అనుమానాలకు తావిచ్చేలా ఉంది.

ప్రైవేటు కారులో తరలింపు...

■ 25న సాయంత్రం అజిత్‌కుమార్‌ను ఓ ప్రైవేట్ ట్రావెల్ కారులో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్కార్ట్‌గా ఏఆర్ సిబ్బందితో పోలీసు వాహనం లేదా బస్సులో తరలించాల్సి ఉన్నా ఇవేవీ పాటించలేదు.

■ జీజీహెచ్‌కు వెళ్తున్నప్పుడు నిందితుడు కారు డ్రైవర్ కె.రాజశేఖర్ ఫోన్‌తో కావాల్సిన వారితో మాట్లాడి, తప్పించుకోవటానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ప్రతిగా డ్రైవర్ ఖాతాలో జమైన రూ.49 వేలలో రూ.10 వేలు సహకరించిన అంక మల్లేశ్వరరావుకు, రూ.35 వేలు రవితేజకు ఇచ్చేసి.. కారు అద్దె డబ్బులు రాజశేఖర్ ఉంచుకున్నాడు.

■ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో అజిత్‌కుమార్‌ను పరీక్షిస్తే.. అనారోగ్యం లేదని తేలింది. అయినా ఇన్‌పేషెంట్‌గా చేర్చుకున్నారు? దీని వెనుక ఎవరి ఒత్తిడి ఉందనేది తేలాల్సి ఉంది.

■ 160 కిలోల బరువుండే నిందితుడు జీజీహెచ్ నుంచి పారిపోయే వరకూ ఎస్కార్ట్ సిబ్బంది గుర్తించకపోవడం గమనార్హం.

పక్కా ప్రణాళికతో రేపల్లెకు..

■ అజిత్‌కుమార్ ఒంగోలు జైలు నుంచి తప్పించుకోవటానికి అప్పట్లో అక్కడ జైలు వార్డర్‌గా పనిచేసిన కె.దేవపాల్ సహకరించాడు. అతను రేపల్లె సబ్‌జైల్లో పనిచేస్తున్నాడని తెలుసుకొని.. అతని ద్వారా మరోసారి స్కెచ్ వేశాడు. ఇందుకు రేపల్లె సబ్‌జైల్లో పోలీసుగార్డు హెడ్‌కానిస్టేబుల్ అంక మల్లేశ్వరరావు సహకరించాడు. రేపల్లెకు వచ్చిన రోజే జైలు సూపరింటెండెంట్ మల్లేశ్వరరావు ఖాతాకు అజిత్‌కుమార్ మనుషులు రూ.25 వేలు పంపించారు.

■ ఈ మొత్తం వ్యవహారంలో వార్డర్లు దేబి గురువారావు, టి.యేసుబాబు, కె.డానియల్, హెడ్‌వార్డర్ సీహెచ్.ధనరాజ్, చెరుకుపల్లి స్టేషన్ కానిస్టేబుల్ కె.త్రిశూల్‌పాణి, చోడాయపాలెం కానిస్టేబుల్ బి.చంద్రశేఖర్, రేపల్లె కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు ఖాతాల్లోకీ లంచాల సొమ్ము వెళ్లింది.

రెండేళ్ల తర్వాత ₹2,631 కోట్ల జేజేఎం నిధులు

(మొదటి పేజీ తరువాయి)

నిధులు విడుదల చేస్తామని కేంద్రం తెలిపినా పట్టించుకోలేదు. 80% పనులు పూర్తవ్వకముందే జేజేఎం ప్రాజెక్టు గడువు 2024 మార్చితో ముగిసింది.

రూ.13,500 కోట్ల రుణాల సమీకరణ

జేజేఎం ప్రాజెక్టు గడువును కేంద్రం పొడిగించే అవకాశం ఉందని ముందే ఊహించిన ప్రభుత్వం.. ఈలోగా రాష్ట్రవాటా నిధుల సమీకరణకు ఏర్పాట్లు చేసింది. గత ఏడాది జులైలో జలజీవన్ తాగునీటి సరఫరా సంస్థను ఏర్పాటుచేసి రూ.13,500 కోట్ల రుణాలు వివిధ ఆర్థికసంస్థల నుంచి సేకరించే ప్రయత్నాలు ప్రారంభించింది. నాబార్డ్ ఇప్పటికే రూ.8,500 కోట్లు మంజూరు చేసింది. మరో రూ.5వేల కోట్ల రుణ సేకరణకు సన్నాహాలు చేస్తోంది. పెండింగ్‌లోని రూ.22 వేల కోట్ల పనులకు రాష్ట్రవాటాగా రూ.12వేల కోట్లు సిద్ధం చేస్తోంది. ఇలా 2028 డిసెంబరు నాటికి గ్రామాల్లో అందరికీ రక్షిత తాగునీరు అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రూ.5,262 కోట్లతో పెండింగ్ పనులు తిరిగి మొదలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో జేజేఎం ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురించాయి. గడువు పెంపునకు కేంద్రంతో చేసిన సంప్రదింపులు ఫలించాయి. మొదట 2025 మార్చి వరకు, తాజాగా 2028 డిసెంబరు వరకు ప్రాజెక్టు గడువు పొడిగించింది. 2026-27 సంవత్సరానికి తొలి విడతగా రూ.2,631.07 కోట్లు కేంద్రం గత నెల 30న కేటాయించింది. రాష్ట్రప్రభుత్వ వాటాగా అంతే మొత్తం సమకూర్చాలి. మొత్తం రూ.5,262.14 కోట్లతో పెండింగ్ పనులు మళ్లీ మొదలుకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే రెండున్నరేళ్లలో రూ.22వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయనున్నారు.



గనులశాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు

ఉక్కు రంగంలో రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

తక్కువ గ్రేడ్ ఖనిజాన్ని శుద్ధిచేసి, గ్రేడ్ పెంచేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సీఎం ఆదేశించారు.

108 శాతం రాబడి..: గనులశాఖ రాబడి పెరిగేలా చూసేందుకు అన్ని గనుల్లో తవ్వకాలు కొనసాగేలా చూడాలని సీఎం ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గనులశాఖ 108% ఆదాయం పొందినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఆ సంవత్సరంలో రూ.3,416 కోట్ల రాబడి వచ్చినట్లు వెల్లడించారు. 2026-27లో రూ.4,650 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. సమీక్షలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ఏపీఎండీసీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి పనుల్లో మాయాజాలం!

(మొదటి పేజీ తరువాయి)

కూడా చేపట్టారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ చేసిన పనుల్లో ఇంజినీర్లు పంపిన అంచనాలపై సుబ్బారెడ్డి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించింది తక్కువే. పీఎల్ఆర్ ప్రతినిధులే అంచనాలు తయారుచేయడం, వాటిని క్షేత్రస్థాయిలో ఎస్ఈ, డీఈ, జేఈలు యథావిధిగా సిఫార్సు చేయడం, సీఈ వాటిని ఆమోదించేవారన్నది ప్రధాన ఆరోపణ. ఇలా తక్కువ పరిమాణంలో జరిగిన మట్టి పనిని భారీగా చూపించి పీఎల్ఆర్‌కి ఇంజినీర్లు లబ్ధి చేకూర్చారు.

తారు రోడ్లు తొలగించి సిమెంట్ రోడ్లు వేసేయ్

పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సేవలో ఇంజినీర్లు ఎంతగా తరించారంటే చిత్తూరు జిల్లాలో బాగున్న తారు రోడ్ల స్థానంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చేశారు. తారు రోడ్ల కంటే సిమెంట్ రోడ్ల పనుల్లో గుత్తేదారు సంస్థలకు మార్జిన్ బాగుంటుంది. తారు రోడ్ల కాలపరిమితి ఇంకా ఉన్నా.. వాటిని తొలగించి ఆ స్థానంలో సిమెంట్ రోడ్లు వేసేశారు. వీటికి సీఈ నుంచి ఈఎన్‌సీ వరకు అభ్యంతరం చెప్పలేదు. బిల్లుల చెల్లింపుల్లోనూ ప్రాధాన్యమిచ్చారు.

కీలక స్థానాల్లో అదే ఇంజినీర్లు

వైకాపా హయాంలో కీలక స్థానాల్లో ఉన్న ఇంజినీర్లను ఇప్పటికీ అక్కడే కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు పీఎల్ఆర్‌కి అత్యంత అనుకూలంగా వ్యవహరించిన మదనపల్లె డివిజన్‌లోని ఒక ఈఈ జోలికి ఐదేళ్లుగా వెళ్లట్లేదు. ఈఎన్‌సీ కార్యాలయంలో మరో జేఈ పీఎల్ఆర్ వ్యవహారాలే చూస్తుంటారు. గత ప్రభుత్వంలో జేఈని ఈఎన్‌సీ కార్యాలయానికి చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై తీసుకొచ్చారు. పీఎల్ఆర్ సేవలో ఇప్పటికీ తరించే ఇలాంటి ఇంజినీర్లు అనేకమంది ఉన్నా ఉన్నతాధికారులకు ఇవేవీ పట్టడం లేదు.

ఎల్‌నినో ప్రారంభమైంది

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసే అవకాశం ఉందని తెలిపింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు నెలకొనడం వల్ల భారత వేసవి రుతుపవన వర్షపాతంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది.

జపాన్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందం

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ నైపుణ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం జపాన్‌కు చెందిన ఫోర్త్ వ్యాలీ కాన్సియెర్జ్ కార్పొరేషన్ (ఎఫ్‌వీసీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా జపాన్‌లో ఆటోమొబైల్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఐటీఐ విద్యార్థులకు జపనీస్ భాషపై శిక్షణ అందిస్తారు.

ఈనాడు

తన దాకా వస్తే గానీ...

మానవతకు మాయనిమచ్చ వంటి ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు. ఇదే విషయాన్ని ఇండియా సుదీర్ఘకాలంగా స్పష్టీకరిస్తున్నప్పటికీ కెనడా ఇంతవరకు పూర్తిగా చెవొగ్గలేదు. తన గడ్డపై తిష్ఠవేసి భారత వ్యతిరేక కుట్రలకు తెగబడుతున్న ఖలిస్థానీ మూకలను కట్టడి చేయడానికి గట్టి చర్యలూ తీసుకోలేదు. కానీ, నిప్పుతో చెలగాటమాడటం తనకే ప్రాణాంతకమన్న సంగతి ఒట్టావా నెమ్మదిగా అవగతమవుతోంది. కాబోలు- ఖలిస్థానీ ముష్కర బృందాలతో తమ జాతీయ భద్రతకు ప్రమాదం పొంచి ఉందని కెనడా రక్షణ నిఘా సంస్థ(సీఎస్ఐఎస్) తాజాగా ఆందోళన వెలిబుచ్చింది. ఉగ్రవాద అజెండా వ్యాప్తికోసం స్థానికంగా పలుకుబడి కలిగిన కెనడియన్ పౌరులతో ఆ ముష్కర మూకలు బలమైన సంబంధాలను నెరపుతున్నాయని, నిధులు సేకరించి హింసాత్మక కార్యకలాపాలకు మళ్లిస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. కెనడా కేంద్రంగా ఇన్ని కుతంత్రాలు జరుగుతున్నప్పటికీ, ఖలిస్థానీ వేర్పాటువాదానికి ఎవరైనా శాంతియుతంగా మద్దతు పలకడం తప్పేమీ కాదంటూ మళ్లీ అదే సీఎస్ఐఎస్ విస్మయకర వాదన వినిపిస్తోంది. భారత సార్వభౌమాధికారానికి సవాలు విసురుతూ, ఇండియాను విచ్ఛిన్నం చేయడానికి విధ్వంసక ప్రణాళికలను రచిస్తున్న వేర్పాటువాదులకు వంతపాడటం చట్టబద్ధమేనంటే అంతకంటే అవ్యవస్థ మరేదీ ఉండదు! జస్టిన్ ట్రూడో జమానా నాటి చేదు అనుభవాలను మరిచిపోయి భారతావనితో దౌత్య, వాణిజ్య, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవాలనుకుంటున్న కెనడాకు ఇది మేలు చేయదు!

సిక్కుల దేశభక్తి, సైన్యంలో వారి సేవలు నిరుపమానమైనవి. మాతృభూమి రక్షణలో వారి త్యాగాలూ అమూల్యమైనవి. అలాంటి భారతావని ముద్దుబిడ్డల మార్గాన్ని వదిలి ఖలిస్థానీ వేర్పాటువాద భావజాలాన్ని తలకెక్కించుకున్న కొంతమంది ప్రబుద్ధులు పాకిస్థాన్ ఐఎస్ఐ ప్రోద్బలంతో లోగడ పంజాబ్‌లో నరమేధానికి పాల్పడ్డారు. ఆ సమయంలోనే వారు కెనడాలోనూ వ్యాపించారు. సోవియట్ యూనియన్‌తో ప్రచ్ఛన్న యుద్ధంలో మునిగిన అమెరికాకు అప్పట్లో అంతేవాసిగా ఉన్న కెనడా- అగ్రరాజ్యానికి కొమ్ముగాస్తూ భారత ప్రాదేశిక సమగ్రతకు ప్రమాదకారులైన ఖలిస్థానీల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించింది. తల్వీందర్‌సింగ్ పర్మార్ లాంటి కరడుగట్టిన ఉగ్రవాదులను ఇండియాకు అప్పగించడానికీ ససేమిరా అంది. దాంతో ఆ ముష్కరులు చెలరేగిపోయి ఎయిరిండియా 'కనిష్క' విమానాన్ని పేల్చేసి మూడొందల మందికి పైగా ప్రాణాలను బలితీసుకున్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలకోసం కెనడా పార్టీలన్నీ ఖలిస్థానీల పట్ల ఉదార వైఖరి అవలంబిస్తే- ఆ పెడపోకడలను గత ప్రధాని జస్టిన్ ట్రూడో పరాకాష్ఠకు తీసుకెళ్లారు. అధికార యావలో పడి ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ కీలక నేత హర్దీప్ సింగ్ నిజ్జర్‌పై తెగ ప్రేమ ఒలకబోశారు. ట్రూడో హయాంలో పెళుసుబారిన ఇండియా-కెనడా ద్వైపాక్షిక బంధం మార్క్ కార్నీ హయాములో ఇప్పుడిప్పుడే కొత్త ఊపిరి పోసుకుంటోంది. అది పటిష్ఠం కావాలంటే తన భూభాగంలోని ఖలిస్థానీ ఉగ్రవాదులపై కెనడా ఉక్కుపాదం మోపి తీరాలి!


పంజాబ్ పోలీసుల అంచనా ప్రకారం, 56 ఖలిస్థానీ అనుకూల సంస్థలు పరాయి దేశాల్లో పాగావేసి ఇండియాలో లక్షిత దాడులకు పాల్పడుతున్నాయి. అలాంటి ఉగ్రవాద బృందాలు ఒక్క కెనడాలోనే పన్నెండు పోగుపడ్డాయి. రాజకీయ స్వేచ్ఛ, భావప్రకటనా హక్కుల పేరిట ఖలిస్థానీ ప్రచారాన్ని ఉపేక్షిస్తున్న ఒట్టావా- పరోక్షంగా ఉగ్రవాద విషవృక్షానికి నీరుపోస్తోంది. భారతావనిపై విద్వేషాన్ని విరజిమ్ముతూనే స్థానికంగా ఎన్నో నేరాలకు పాల్పడుతున్న వేర్పాటువాద శక్తులను కొమ్ముగాయడం ప్రజాస్వామ్య సంస్కృతికి ఏవిధంగానూ శోభనివ్వదని కెనడా ఇప్పటికైనా గుర్తించాలి!



క్రికెట్‌ని ఒలింపిక్ క్రీడల్తో పోల్చలేం కానీ, ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోవాలి. ఒకప్పుడు క్రికెట్ గొప్పవాళ్ల క్రీడగా ఉండేది. ఇప్పుడది సాధారణ ప్రజల్లోకి వచ్చింది. అలాగే ఇతర క్రీడల్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనదే.


– గగన్ నారంగ్, ఒలింపిక్ పతక విజేత

మార్గదర్శకాలు కావాలిప్పుడు!



ఇటీవల సుప్రీంకోర్టు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో 24 వారాల తరవాత కూడా గర్భస్రావానికి అనుమతిస్తూ, ఆ మేరకు చట్టంలోనూ మార్పులు తీసుకురావాలని కేంద్రానికి సూచించింది. భ్రూణ లోపాలు, అత్యాచారం వంటి హేయ ఘటనల్లో అవాంఛిత గర్భాలకు సంబంధించి కోర్టు మానవీయంగా స్పందిస్తూ న్యాయనిర్ణయం చేసింది. కానీ వైద్యులూ బాధితులూ నైతికంగా, మానసికంగా తీవ్ర సంఘర్షణకు లోనయ్యే సున్నిత విషయమిది. కాబట్టి, ఇలాంటి సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో వైద్య నిపుణులు, పౌర సమాజం, ప్రభుత్వం ఆలోచించి తగిన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరముంది.

దేశంలోని మహిళలు, బాలికలు అవాంఛిత గర్భాన్ని తొలగించుకోవడానికీ; ముఖ్యంగా అత్యాచార బాధితులు 'గర్భధారణ వయసు'తో నిమిత్తం లేకుండా అబార్షన్ చేయించుకోవడానికీ అనుమతించాలని సుప్రీంకోర్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కొన్ని సందర్భాల్లో చివరి దశలోనూ గర్భవిచ్ఛిత్తికి వీలు కల్పించేలా చట్టాలను సవరించాలంది. మహిళలకు పునరుత్పత్తి హక్కుల్లో స్వయంప్రతిపత్తి ఉండాలనీ; గర్భధారణ, గర్భవిచ్ఛిత్తిలో వారి గౌరవాన్ని కాపాడాలనీ సర్వోన్నత న్యాయస్థానం చేసిన సిఫార్సు ఎంతో మానవీయమైనది, ఉన్నత విలువలతో కూడినది. నిజానికి, 2021లోనే రిజిస్టర్డ్ వైద్యుల పర్యవేక్షణలో గర్భస్రావం చేయించుకోవడానికి వీలు కల్పించే మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) చట్టానికి చేసిన సవరణలు కీలక మార్పును తీసుకొచ్చాయి. నిర్దిష్ట



పరిస్థితుల్లో మహిళలకు గర్భవిచ్ఛిన్న కాలపరిమితిని 24 వారాలకు పెంచడమే కాకుండా, రాష్ట్ర వైద్యమండలి తీవ్రమైన భ్రూణ లోపాలను నిర్ధారించిన సందర్భంలోనూ 24 వారాల వయసున్న పిండాన్ని తొలగించుకోవడానికి ఈ సవరణలు అనుమతించాయి. కానీ, ఈ ప్రక్రియను ఎలా నిర్వహించాలనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

చట్టపరమైన అస్పష్టతే సమస్య

సాధారణంగా 24 వారాల తరవాత గర్భస్రావం చేస్తే, తల్లి కడుపులోని పిండం లేదా బిడ్డ- గుండె కొట్టుకుంటూ, శ్వాస తీసుకుంటూ, కొన్నిసార్లు ఏడుస్తూ సజీవంగా బయటికి వచ్చే అవకాశం ఉంటుంది. అలా ఈ లోకంలోకి వచ్చే అవాంఛిత పసికందును ఏం చెయ్యాలో తెలీక వైద్యులూ, బాధిత కుటుంబాల వారూ తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనవుతారు. కొన్ని పాశ్చాత్య దేశాల్లో అయితే, గర్భంలో ఉన్నప్పుడే మందుల ద్వారా పిండాన్ని నిర్జీవంగా మార్చి, ఆ తరవాత కాన్పు చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై మన దగ్గర స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. దీంతో ఇది వైద్యపరంగా, నైతికంగా, చట్టపరంగా ఎంతో సవాలుతో కూడిన పరిస్థితిని సృష్టిస్తోంది. కడుపులోని బిడ్డకు తీవ్రమైన లోపాలు ఉండటంవల్ల, లేదంటే అత్యాచార బాధితులకు గర్భవిచ్ఛిన్నం చేస్తున్నప్పుడు... నవజాత శిశువు పునరుజ్జీవన పద్ధతులు, సంరక్షణకు సంబంధించిన అంశాలు వైద్యులను ఎన్నో సందిగ్ధతల్లోకి నెట్టేస్తాయి.

మన దేశంలో భ్రూణ లోపాలను ఆలస్యంగా గుర్తించడం అసాధారణమేమీ కాదు. గుండె, మెదడుకు సంబంధించిన కొన్ని లోపాలు రెండో లేదా మూడో త్రైమాసికంలో బయటపడతాయి. నాణ్యమైన స్కాన్‌లు అందుబాటులో లేకపోవడం, ఆలస్యంగా రిఫర్ చేయడం వల్ల బాధిత మహిళలు మూడో త్రైమాసికంలో వైద్యులను సంప్రదిస్తున్నారు. అత్యాచారం వంటి దారుణ ఘటనల్లో ఇది మరింత ఆలస్యం కావచ్చు. చట్టం ఇటువంటి గర్భస్రావాలకు అనుమతిస్తున్నప్పుడు, ఆ ప్రక్రియను ఉత్తమంగా ఎలా నిర్వహించాలనేది ఇప్పుడు వైద్యుల ముందున్న ప్రశ్న.

న్యాయస్థానాలు గర్భవిచ్ఛిత్తి విషయంలో తల్లి స్వయంప్రతిపత్తికి, వైద్య మండలి పాత్రకు ప్రాధాన్యమిస్తున్నాయి. అయితే, పిండాన్ని నిర్జీవంగా మార్చడం వంటి ప్రక్రియల గురించి మన చట్టాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. దీనివల్ల భారతీయ వైద్యులు ఇలాంటి విషయాల్లో అంతర్జాతీయ పద్ధతులపైనో, తమ సంస్థాగత నిబంధనలపైనో ఆధారపడాల్సి వస్తోంది. సుప్రీంకోర్టు గర్భవిచ్ఛిత్తిని 21వ అధికరణ కింద రాజ్యాంగ హక్కుగా అభివర్ణించింది. 2024లో ఇచ్చిన తీర్పులో "గర్భవిచ్ఛిన్నం చేసుకునే హక్కు మహిళ గౌరవం, స్వయంప్రతిపత్తి, పునరుత్పత్తి నిర్ణయాల్లో అంతర్భాగం. గర్భవిచ్ఛిత్తి నిర్ణయం వ్యక్తిగతమైనది" అని విస్పష్టం చేసింది. 24 వారాల తరవాత గర్భస్రావాన్ని అనుమతిస్తున్నప్పుడు, ఆ ప్రక్రియను అత్యంత మానవీయంగా, సాధ్యమైనంత వేదనా రహితంగా నిర్వహించాల్సి ఉంది.

ప్రామాణికంగా నిర్ధరించాలి...

2023లో ఒక వైద్యుడు "గర్భవిచ్ఛిత్తికి ముందే పిండం హృదయ స్పందనను ఆపేయాలా?" అంటూ సుప్రీంకోర్టును అడిగారు. అందుకు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ- "ఇక్కడ పిటిషనర్ నిర్ణయాన్ని గౌరవించడం అవసరం... పిండాన్ని తల్లికి భిన్నమైన వ్యక్తిగా గుర్తించలేము" అని వ్యాఖ్యానించారు. తల్లి స్వయంప్రతిపత్తికే కాదు... వైద్యపరంగానూ స్పష్టతను ఇస్తోందా వ్యాఖ్య. అయితే, పిండాన్ని నిర్జీవంగా మార్చడానికి సంబంధించి తగిన మార్గదర్శకాలు లేకపోవడం కొన్ని ప్రమాదాలకు దారితీస్తుంది. ముఖ్యంగా వైద్య ప్రేరేపిత ప్రసవంతో శిశువు సజీవంగా జన్మిస్తే, ఆ బిడ్డ సంరక్షణ విషయంలో సందిగ్ధతలు తలెత్తుతాయి. ఆ శిశువుకు శ్వాస సరిగ్గా ఆడనప్పుడు వైద్యులు చేపట్టాల్సిన పునరుజ్జీవన బాధ్యతలకు సంబంధించి ప్రశ్న ఎదురవుతుంది. దాంతో చట్టపరమైన చిక్కులు వస్తాయి, శిక్ష పడుతుందనే భయంతో గర్భవిచ్ఛిత్తి సేవలు అందిస్తున్నవారు వెనకడుగు వేస్తున్నారు. దీన్ని గుర్తించిన సుప్రీంకోర్టు- చట్టపరమైన స్పష్టత కొరవడితే సేవలు అందకుండా పోతాయనీ అంగీకరించింది.

అబార్షన్లకు అనుమతులు పెరుగుతున్న నేపథ్యంలో, భారత ప్రసూతి వైద్యం-స్త్రీ సంబంధ వ్యాధుల చికిత్సా సంఘాల సమాఖ్య వంటి జాతీయ సంస్థలు ఇటువంటి సందర్భాల్లో గర్భవిచ్ఛిత్తికి సంబంధించి ప్రామాణిక పద్ధతులను నిర్వచించడంతో పాటు సురక్షితమైన, సాక్ష్యాధార నమోదు పద్ధతులను వివరించాలి. సమ్మతి, డాక్యుమెంటేషన్ ప్రక్రియలను స్పష్టం చేయాలి. సదుద్దేశంతో పనిచేసే వైద్యులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. గర్భవిచ్ఛిత్తిని నైతికంగా, చట్టపరంగా, మానవీయంగా ఎలా నిర్వహించాలన్నది చాలా ముఖ్యం కాబట్టి, అందుకు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించడం అత్యావశ్యకం.



డాక్టర్ ఎ.ప్రణతీరెడ్డి
క్లినికల్ డైరెక్టర్, మెటర్నల్-ఫీటల్ మెడిసిన్,
బర్త్‌రైట్ (రెయిన్‌బో హాస్పిటల్)

ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించడానికి దాదాపు వందేళ్ల క్రితం గ్రంథాలయ ఉద్యమం మొదలైంది. ఎందరో నాయకులు పూనుకుని ఊరూరా కొత్త గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ అలాంటి అవసరం వచ్చిందనిపించింది నేటి సామాజిక పరిస్థితులను చూస్తోంటే. చదువుల్లోంచి మాతృభాష దాదాపుగా మాయమవుతోంది. టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు వచ్చి పిల్లల్నీ పెద్దల్నీ పూర్తిగా పుస్తకాలకు దూరంగా తెరలకు అతుక్కుపోయేలా చేశాయి. ఉన్న కొన్ని లైబ్రరీలు బూజుపట్టిపోతున్నాయి. ఈ పరిస్థితులను మార్చడానికి ప్రకాశం జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పదేళ్లపాటు చేసిన ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చాయి. ఆ నేపథ్యమే మా మరో గ్రంథాలయోద్యమానికి ప్రేరణనిచ్చింది.



మరోసారి... గ్రంథాలయ ఉద్యమం!

కాల్పనిక సాహిత్యం చదివితే పిల్లల ఆలోచనా పరిధి విస్తృతమవుతుంది. ఊహాశక్తి, విశ్లేషణా సామర్థ్యం పెరుగుతాయి. జీవిత చరిత్రలు వారికి ప్రేరణనిస్తాయి. పుస్తకాలు చదివే అలవాటు ఉన్న పిల్లలు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. సామాజిక సమస్యలను గుర్తించగలుగుతారు. సమయాన్నయినా, టెక్నాలజీనయినా సద్వినియోగం చేసుకోవడం తెలుస్తుంది. ఈ విషయాలను ప్రచారం చేస్తూ 2023 మేలో మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. ఆంధ్రప్రదేశ్‌లో మోటార్ సైకిల్ యాత్ర చేపట్టాం. ఆ తరవాత దీన్ని పలువురి సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలకూ విస్తరించాం. బస్సు యాత్రలు, పాదయాత్రలు జరిపాం. ఈ విషయం పట్ల ఆసక్తి కలిగిన చాలామంది మాతో చేయి కలిపారు. కలిసి నడిచారు. అందరం కలిసి ఊరూరా సభలు నిర్వహించాం. కొత్త లైబ్రరీలు పెట్టడానికి గ్రంథాలయ సంస్థతోనూ, స్వచ్ఛంద సంస్థలతోనూ సంప్రదింపులు జరిపాం. ఇటీవలే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను అనుసంధానిస్తూ చేపట్టిన బస్సు యాత్రకు మంచి స్పందన లభించింది. పలు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు... మా యాత్రకు సంఘీభావం తెలపడమే కాక తమవంతు పాత్ర పోషించడానికి ముందుకు రావడం శుభసూచకం. అనేకమంది సాహితీవేత్తలు, మేధావులు, భాషాభిమానులు ఉత్సాహంగా పాల్గొని మార్గనిర్దేశం చేశారు. అదే సమయంలో కందుకూరి రాము ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల్లో సైతం పోస్టర్ల ద్వారా ఉద్యమాన్ని ప్రచారం చేస్తూ వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం.

మా కృషి ఫలిస్తోందని ఒకింత గర్వంగా చెప్పగలను. ఈ ఉద్యమ ప్రభావంతో లైబ్రరీల ఆవశ్యకత గురించి సమాజంలో ఆలోచన మొదలైంది. గ్రంథాలయాల తలుపులు తెరుచుకుంటున్నాయి. ఉపాధ్యాయులు చొరవ తీసుకుని పిల్లలకు బాల సాహిత్యాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. వర్క్‌షాపులు పెట్టి పిల్లలతో రచనలు చేయిస్తున్నారు. స్థానికులే కాక ప్రవాస భారతీయులు సైతం పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకాలను బహుమతులుగా ఇవ్వడం అభిలషణీయమైన మార్పు. పలుచోట్ల పార్కులలో పుస్తక పఠన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం, పుస్తకాలు పంపిణీ చేయడం, పిల్లలతో రాయించి పుస్తకాలు ప్రచురించడం, సదస్సులూ చర్చావేదికలు నిర్వహించడం, ప్రభుత్వ గ్రంథాలయాల పర్యవేక్షణ మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ మాతృభాషకు ఆదరణనూ పెంచగలవన్న ఆశలు రేకెత్తిస్తున్నాయి.

– మంచికంటి వెంకటేష్

శాంతి మంత్రం

వేగవంతమైన నేటి సామాజిక జీవనంలో మానసిక ప్రశాంతత, మనుషుల మధ్య సహనం, సామరస్యం తగ్గిపోతున్నాయి. ఇలాంటి సమయంలో వేదోక్తమైన శాంతి మంత్రాలు మనిషి మనసును నిలకడగా, ప్రశాంతంగా ఉంచే ఆధ్యాత్మిక ఆధారాలుగా నిలుస్తాయి. వ్యక్తిలో సద్భావనను, కుటుంబంలో సఖ్యతను, సమాజంలో ఐక్యతను పెంపొందించే శక్తి వాటికి ఉంది.

చాలావరకు శాంతి మంత్రాలు వేదాలు, ఉపనిషత్తుల నుంచి ఉద్భవించాయి. 'సహనావవతు సహనౌభునక్తు...' అన్న మంత్రానికి మూలం తైత్తరియోపనిషత్తు. విద్యారంభ సమయంలో దీన్ని పఠిస్తారు. ప్రతి ఉపనిషత్తుకు ఎన్ని అధ్యాయాలు ఉన్నా ప్రారంభంలో ఒక శాంతి మంత్రం ఉంటుంది. కానీ ఈ ఉపనిషత్తులో మాత్రం ప్రతి అధ్యాయానికీ ఓ శాంతి మంత్రం ఉంటుంది. గురుశిష్యులు రక్షణతో, పరస్పరం ద్వేషం లేకుండా జ్ఞానం పొందాలి. వ్యక్తిగత శాంతి, దైవిక శాంతి, ప్రాకృతిక శాంతి కలుగుగాక... అని ఈ మంత్రానికి అర్థం.




'ఓం పూర్ణమదః పూర్ణమిదం...' అన్న ఈసావాస్యోపనిషత్తు ప్రారంభంలోని శాంతి మంత్రానికి అర్థం భగవంతుడు సంపూర్ణుడు. ఆయన నుంచి ఉద్భవించిన విశ్వమూ సంపూర్ణమే. పూర్ణం నుంచి పూర్ణాన్ని పరిహరిస్తే మిగిలేదీ పూర్ణమే. ఈ శాంతి మంత్రం బ్రహ్మాంతాలూకు పరిపూర్ణ తత్వాన్ని సూచిస్తూ ఆ బ్రహ్మం నుంచే ఈ చరాచర జగత్తు అంతా ఉద్భవించిందని చెబుతుంది. అత్యంత గంభీరమైన శాంతి మంత్రమిది. సర్వేషాం స్వస్తిర్భవతు..' అనేది బృహదారణ్యక ఉపనిషత్తులోది. సంప్రదాయ శాంతి ప్రార్థనగా ప్రాచుర్యం పొందిన ఈ మంత్రానికి అర్థం అందరికీ శుభం, శాంతి, మంగళం కలగాలి అని. 'ఓం ద్యౌః శాంతి అంతరిక్షం శాంతిః పృథ్వీ శాంతిః' అనే మంత్రానికి మూలం యజుర్వేదం. ఆకాశంలో, భూమిపై, జలంలో, సర్వత్రా శాంతి పరిఢవిల్లాలి అన్న విశ్వశాంతి భావాన్ని వ్యక్తపరుస్తుందీ మంత్రం.

అంతర్యామి

'ఓం భద్రం కర్ణే భిః శృణుయామదేవాః' అనే మంత్రాన్ని ముండకోపనిషత్తు ప్రారంభంలో పఠిస్తారు. 'ఓ పూజ్య దేవతలారా మా చెవులతో శుభమైనదే వినగలగాలి, మా కళ్లతో మంగళకరమైనవే చూడాలి, భగవంతుడి అనుగ్రహంతో ఆరోగ్యంగా, ధార్మికంగా జీవించగలగాలి' అని దీనికి అర్థం. ఇంద్రియాలను మంచి విషయాల వైపు మళ్లించాలని చేసే ప్రార్థన ఇది. ఉపనిషత్తుల అధ్యయన ప్రారంభంలోనూ, యజ్ఞాలు, హోమాలు వంటి క్రతువులలోనూ ఆధ్యాత్మిక సభలలోనూ విశ్వశాంతి కోసం ఈ మంత్రం పఠిస్తారు. భారతీయ వేద సంస్కృతి ఉన్నతిని చాటే అత్యంత పవిత్రమైన మంత్రాలివి. శాంతి అంటే కేవలం భౌతికంగా కనిపించే కలహ లేమి మాత్రమే కాదు; ప్రశాంత చిత్తం, ఆత్మసంతృప్తి కూడా. ఈ మంత్రాలలో మూడుసార్లు శాంతిః అనే పదం ఉచ్చరించడం ద్వారా ఆది భౌతిక, ఆది దైవిక, ఆధ్యాత్మిక అడ్డంకులు తొలగాలని కోరుకుంటారు. అందువల్ల ఇవి వ్యక్తిగత వికాసానికే కాక సమాజ శ్రేయస్సుకు కూడా మార్గదర్శకాలు, మానవ జీవితాన్ని సవ్యమైన దిశలో నడిపించే దారిదీపాలు.

– గంటి ఉషాబాల

అసమానతల ప్రజ్వలనం



దేశ ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించాలంటే అసమానతలను తగ్గించాలి. దానివల్ల సామాజిక ఐక్యత మెరుగుపడుతుంది. పౌరుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. కానీ, దురదృష్టవశాత్తు చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు తీవ్రంగా ప్రజ్వరిల్లుతున్నాయి. ఫలితంగా సామాజిక అశాంతి ప్రబలుతోంది. భారతదేశ ఆదాయంలో 58శాతం జనాభాలో పదిశాతం ఉండే శ్రీమంతుల చేతుల్లోకే చేరిపోతోంది. దక్షిణ అమెరికా ఖండంలోని పలు దేశాల ఆదాయంలో అక్కడి జనాభాలో 10శాతం ఉండే ధనవంతుల వాటాలు ... (శాతాల్లో)

63	కొలంబియా
59	చిలీ
59	బ్రెజిల్
59	పెరు
46	ఈక్వెడార్
44	ఉరుగ్వే
43	అర్జెంటీనా

(ఆధారం: వరల్డ్ ఇనీక్వాలిటీ డాటాబేస్-2026)

ప్రజాస్వామ్య పంచాంగం!

'ధనమేరా! అన్నిటికీ మూలం!' అంటారు. కానీ, ప్రజాస్వామ్యంలో ధనం పాత్ర ఎంత ఉన్నా అన్నిటికీ అది మూలం కానే కాదు. జనస్వామ్యంలో 'జనమేరా అన్నిటికీ మూలం' అనేది తిరుగులేని సత్యం. తాజా ఎన్నికలలో ఇది మరోసారి రుజువైంది. 'పవరు నాదనియేవు/ పార్టీ నాదనియేవు/ నీ పవరు ఎక్కడే చిలకా! నీ పార్టీ ఎక్కడే చిలకా!!' అని అన్ని పార్టీలకు ప్రత్యేకించి అధికారంలో ఉన్న పార్టీలకు ప్రజాస్వామ్యం ఘనమైన గుణపాఠం నేర్పింది.

మన దేశం గణతంత్రమైన తరవాత కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు ప్రజా జీవన రంగంలోనూ, ఎన్నికల పోరాట రంగంలోనూ పోటాపోటీగా తలపడేవి. కాంగ్రెస్ కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ నిరాఘాటంగా రాజ్యమేలింది. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తామని అప్పట్లో కలలు కన్న కమ్యూనిస్టు పార్టీల్లోని ఆవేశపరుల్లో కొంతమంది ఎర్రకోట మీద ఎర్ర జెండాను ఎగురవేస్తామనేవాళ్లు. అదేమీ జరగలేదు కానీ అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ముక్కచెక్కలై ఏ ముక్కకాముక్క తమ జెండాను తమ పార్టీ కార్యాలయంలో ఎగురవేసుకున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, త్రిపుర లాంటి రాష్ట్రాల్లో ప్రజలు ఆ రోజుల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలకు అధికారం కట్టబెట్టి అందలమెక్కించారు. ఆ క్రమంలోనే పశ్చిమ బెంగాల్‌కు సుదీర్ఘకాల సీఎంగా జ్యోతిబసు రికార్డు సాధించారు. ఆపైకొంత కాలానికి మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఆ రాష్ట్రంలో ఫాంలోకి వచ్చి వరస విజయాలు సాధించింది. 'తృణమూలం ఇదం బెంగాల్' అన్న దీదీ పార్టీని భాజపా ఇప్పుడు తృణప్రాయం చేసి ఘనాతి ఘన విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్‌కు పర్యాయ పదం సీపీఎం అనుకున్న పార్టీ అడ్రస్ గల్లంతైంది.

ఇలాంటిదే తమిళనాడుది ఇంకో చిత్రం. ఆరు దశాబ్దాల పాటు అక్కడ రాజ్యమేలిన ద్రవిడపార్టీలు పరాజయం పాలయ్యాయి. డీఎంకే, అన్నాడీఎంకే ఒకదానినొకటి ఓడించుకుంటూ అధికారం సంపాదించుకుంటుంటే- జనం ఈ రెండు పార్టీలను మట్టికరిపించి కొత్తగా వచ్చిన టీవీకే అధినేత విజయ్‌ను నెత్తికెత్తుకున్నారు. మెజార్టీకి కొద్ది దూరంలో ఆగిపోయిన ఆ పార్టీతో ఏ పార్టీ జతకట్టి అధికారంలోకి వస్తుందో



అసెంబ్లీకే ఎరుక! ఇక కేంద్రంతో సహా ఎన్నో రాష్ట్రాల్లో ఓటమిని మూటగట్టుకున్న కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కేరళలో విజయభేరి మోగించింది. అసమ ప్రాంతమైన అస్సాంలో తనకు సమమెవ్వరూ లేరన్నట్టు భాజపా మరోసారి గెలిచింది. ఇక పుదుచ్చేరిలో సామాన్యుడనిపించుకున్న రంగసామినే అధికారం వరించింది. మొత్తానికి ఓటర్ మహారాజులు ప్రజాస్వామ్య రణంలో కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ ఏదో ఒక పార్టీ వైపు పూర్తిగా ఒరిగిపోకుండా ఎక్కడికక్కడ విలక్షణంగా ఓట్లేశారు. 'మార్పు మా తీర్పు' అని కొన్ని పార్టీలను ముంచి, ఇంకొన్ని పార్టీలను తేల్చిచెప్పారు.

ప్రపంచంలో అతి పెద్దదైన మన ప్రజాస్వామ్యంలో ఇది పూర్తిగా కొత్త పరిణామం కాదు. ఇందుకు కొన్ని పాత దృష్టాంతాలూ, దుష్టాంతాలూ ఉన్నాయి. సమోసాలో ఆలూ ఉన్నంత వరకు బిహార్‌లో లాలూ ఉంటాడని లాలూప్రసాద్ యాదవ్ ఒకప్పుడు తొడగొట్టేవారు. తరవాత ఏమైంది? సమోసాలో ఆలూ అలాగే ఉంది కానీ, 'జంగిల్ రాజ్' దెబ్బకు బిహార్ ఎన్నికల ప్రచారంలో లాలూ పేరును ఆయన కొడుకు తేజస్వీ కూడా తలచుకోని రోజులొచ్చాయి. 'కుర్రాళ్లు కుర్రాళ్లే... కొన్ని తప్పులు చేస్తారు' అంటూ అత్యాచార కేసుల్లో కఠినశిక్షలను తప్పుపట్టిన ములాయం అధికార బలగర్వాన్ని అణచివేసింది కూడా ప్రజలే. నడమంత్రపు అధికారం మత్తులో నాయకుల కళ్లు నెత్తికెక్కుతాయి. అప్పుడు జనమే పూనుకుని వారిని నేలకుదించి పుణ్యం కట్టుకుంటారు. మమతా బెనర్జీలానే సొంత నియోజకవర్గంలో కంగుతిన్న డీఎంకే అధినేత స్టాలిన్ ఇటీవల తాము రెండొందలకు పైగా సీట్లలో గెలుస్తామని ఢంకా బజాయించారు. కానీ, ఆయన 'రైజింగ్ సన్' పార్టీకి ఎండాకాలం ఎన్నికల్లో 'సన్ స్ట్రోక్' గట్టిగా తగిలింది. అధికారంలో ఉన్న వాళ్లు తమ పవరు శాశ్వతమని భ్రమపడుతుంటారు. అనుచరులను భ్రమ పెడుతుంటారు. ప్రజలు పడేసేంత వరకు వాళ్లకు తత్వం తలకెక్కదు. 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన జగన్ తాను 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని చెప్పేవారు. 2024 ఎన్నికల్లో ఏమైంది... వైకాపా 11 సీట్లకే పరిమితమైంది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. అధికారం అశాశ్వతం. ప్రజాసేవ శాశ్వతం. ఇది గ్రహిస్తేనే ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకున్నట్టు. కాదని ఎన్నికలకు ముందూ వెనకా దొంగ సర్వేలు చేయించుకుని రాజకీయ పార్టీలు తమ భుజాలు తామే చరుచుకున్నంత మాత్రాన ప్రజాస్వామ్య సర్వేశ్వరుడు కరుణించడు. జై ప్రజ! జై సుప్రజా!!

– శంకర నారాయణ

హాయ్! బుజ్జీ!!



అలా వచ్చిందట!

చిట్టి: అమ్మా! నాకు ఏబీసీడీలు కాపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్ సరిగ్గా వచ్చు కదా!

అమ్మ: నీకు రావని ఇప్పుడు ఎవరన్నారు?

చిట్టి: అది కాదమ్మా.. నాకు వచ్చినా టీచర్ నన్ను కోప్పడ్డారు.

అమ్మ: ఎందుకని తప్పు రాశావా?

చిట్టి: లేదమ్మా... టీచరు కాపిటల్, స్మాల్ లెటర్స్ అనకుండా ఇంకేదో అన్నారు. దాంతో నాకర్థం కాలేదు.

అమ్మ: ఏమన్నారు? అప్పర్ కేస్, లోయర్ కేస్ అన్నారా?

చిట్టి: అవునవును. అలా అంటే నాకు తెలియదు కదమ్మా!



అమ్మ: నిజమే. మీరింకా చిన్న పిల్లలు కాబట్టి అవన్నీ తెలియదు. అయితే తెలియనప్పుడు ఆ విషయం టీచర్‌కి చెప్పి ఎందుకలా అంటారు అని అడగాలి కదా నువ్వు!

చిట్టి: కోప్పడతారేమో అని అడగలేదు.

అమ్మ: అలా అనుకుని ఆగిపోతే.. కొత్త విషయాలు ఎలా నేర్చుకుంటావు?

చిట్టి: ఈసారి కచ్చితంగా అడుగుతానమ్మా! ఇప్పుడు నువ్వు చెప్పమ్మా.. అప్పర్ కేస్, లోయర్ కేస్ అని ఎందుకంటారు?

అమ్మ: ఒకప్పుడు ప్రింటింగ్ పని ఇప్పటిలాగా కంప్యూటర్‌తో కాకుండా టైప్‌సెట్టింగ్ పద్ధతిలో చేసేవారు. దానికోసం మెటల్‌తో చేసిన అక్షరాలను అచ్చులు పోసి వాడేవారు. పనిచేసేవాళ్లకు సులువుగా ఉంటుందని కాపిటల్ లెటర్స్‌ని పై అరలో, స్మాల్ లెటర్స్‌ని కింది అరలో పెట్టేవారు. అందుకే వాటికి అప్పర్ కేస్, లోయర్ కేస్ అని పేరొచ్చింది.

– జ్యోతి

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి.

ఏనుగు	చేప	చెవి
ఎలుగుబంటి	భూమి	గుడ్డు
బొమ్మ	కన్ను	బంతిపువ్వు

పీజీఐఎంఈఆర్‌లో కన్సల్టెంట్లు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్), తాత్కాలిక ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **కన్సల్టెంట్:** 3 పోస్టులు.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. **జీతం:** నెలకు రూ.1,50,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12-05-2026

ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 14-05-2026.

వెబ్‌సైట్: https://pgimer.edu.in/PGIMER_PORTAL/PGIMERPORTAL/Vacancies/JSP/VACANCIE_VIEW.jsp?countt=0

డిప్లొమా కోర్సులు

గుంటూరు లాంలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏఎన్‌జీఆర్‌ఏయూ)..2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాలిటెక్నిక్, అనుబంధ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పదోతరగతి

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21-05-2026

వయసు: 15 - 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: పదో తరగతి మార్కులు, రిజర్వేషన్లతో.

వెబ్‌సైట్: https://angrau.ac.in/

దేశంలో ప్రాధాన్యమున్న చదువుల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు ముఖ్యమైనవి. ఈ విభాగంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లు పేరున్న సంస్థలు. వీటిలో కొన్ని ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సులు అందిస్తున్నాయి. అలాగే మరెన్నో సంస్థలు ఇంటిగ్రేటెడ్ చదువులకు శ్రీకారం చుట్టాయి. మేనేజ్‌మెంట్ విద్యపై ఆసక్తి ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులు వీటిపై దృష్టి సారించవచ్చు.

మేటి మేనేజ్‌మెంట్‌కు మార్గాలివీ!

ఇంటర్ తర్వాత?



ఇంటర్మీడియట్ అన్ని గ్రూపులవారూ ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సుల్లో చేరవచ్చు. పరీక్షల్లో ప్రతిభ, ఇంటర్వ్యూలతో కోర్సుల్లోకి తీసుకుంటారు. సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విద్యలో ప్రపంచ స్థాయి చదువులు అందించి, క్రియాశీలకమైన భావి మేనేజర్లను తయారుచేసే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు కొన్ని ఐఐఎంలు శ్రీకారం చుట్టాయి.

ఐఐఎంల్లో ఉన్నత విద్యను లక్ష్యంగా చేసుకున్నవారు డిగ్రీ పూర్తయిన వరకు వేచిచూడకుండా ఇంటర్ అర్హతతోనే ప్రయత్నించవచ్చు. కోర్సులను ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) పేరుతో అందిస్తున్నారు. కొన్ని సంస్థలు బీబీఏ+ఎంబీఏ, బీఎంఎస్+ఎంబీఏ పేర్లతోనూ నడుపుతున్నాయి.

ఏంటి ప్రయోజనం?

ఐఐఎంల్లో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో చేరినవారు డిగ్రీ తర్వాత ప్రవేశ పరీక్ష (క్యాట్) అవసరం లేకుండా చేరిన సంస్థలోనే పీజీ కొనసాగించుకోవచ్చు. మూడేళ్లు ముందు నుంచే మేటి సంస్థల్లో చదువుకోవడం వల్ల మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో పాటు వివిధ నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవడం సాధ్యమవుతుంది. క్యాట్‌తో పోలిస్తే ఇంటిగ్రేటెడ్ కోర్సులకు పోటీ కొంచెం తక్కువే. ఒకవేళ చేరిన సంస్థలో ఉన్నత చదువులు కొనసాగించడానికి ఆసక్తి లేకపోతే మూడేళ్ల అనంతరం బ్యాచిలర్ డిగ్రీ (బీబీఏ/బీబీఎం/బీఎంఎస్)తో వైదొలగవచ్చు. వీరు క్యాట్‌రాసి మెరుగైన సంస్థలో సీటుకోసం ప్రయత్నించవచ్చు లేదా నచ్చిన కోర్సులు ఇతర సంస్థల్లో చదువుకోవచ్చు.

ఏం నేర్పుతారు?

ఐఐఎం ఇండోర్‌నే తీసుకుంటే ఇక్కడి ఐదేళ్ల కోర్సులో రెండు భాగాలు ఉంటాయి. మొదటి మూడేళ్లు ఫౌండేషన్, తర్వాత రెండేళ్లు మేనేజ్‌మెంట్ విద్యపై ఫోకస్ ఉంటుంది. తొలి భాగంలో భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు; మేనేజ్‌మెంట్ విద్య ప్రాథమికాంశాలు, నైతిక విలువలు అర్థం చేసుకునే నైపుణ్యం, ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. చివరి రెండేళ్లూ పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం(పీజీపీ) కరిక్యులమే ఐపీఎంలో చేరినవారికీ ఉంటుంది. అన్ని సంస్థల్లోనూ ఐదేళ్ల కోర్సులో ఏడాదికి 3 చొప్పున 15 టర్మ్‌లు ఉంటాయి. ఒక్కో టర్మ్ 3 నెలలు. మొదటి మూడేళ్లు మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, సైకాలజీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, హ్యూమానిటీస్, లిటరేచర్, ఫైన్ ఆర్ట్స్ సబ్జెక్టుల్లో మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాలను బోధిస్తారు. రెండేళ్ల కోర్సు అనంతరం సోషల్ ఇంటర్న్‌షిప్పు, నాలుగేళ్ల తర్వాత బిజినెస్ ఇంటర్న్‌షిప్పు పూర్తిచేయాలి. ఇండోర్‌లో ఐదేళ్ల కోర్సు పూర్తిచేసుకున్నవారికి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (ఫౌండేషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) డ్యూయల్ డిగ్రీలను ప్రదానం చేస్తారు. దాదాపు అన్ని ఐఐఎంల్లోనూ ఇదే విధానం ఉంటుంది.

ఎంపిక

చేరాలనుకుంటున్న సంస్థను బట్టి ఎంపిక విధానంలో కొద్దిపాటి వ్యత్యాసాలు ఉంటాయి. అలాగే ఎంపికలో పరీక్షతో పాటు అకడమిక్ సామర్థ్యాలు, కో కరిక్యులర్ యాక్టివిటీస్ గమనిస్తారు. ప్రవేశ పరీక్షలో ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్, మ్యాథ్స్ నైపుణ్యాలు తెలుసుకునేలా ప్రశ్నలు వస్తాయి. కొన్ని సంస్థలకు ఇంటర్వ్యూ అదనం.

ఇవి కూడా

రాంచీ, అమృత్‌సర్, షిల్లాంగ్‌ల్లోని ఐఐఎంలూ ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ అందిస్తున్నాయి. ఈ సంస్థలో చదవడానికి ఐఐఎం ఇండోర్ నిర్వహించే ఐపీఎం పరీక్ష రాయాలి. అందులో ప్రతిభ, అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూలతో సీట్లు కేటాయిస్తారు.

ఐఐఎం రోహ్‌తక్

ఈ సంస్థ కోర్సు పూర్తిచేసుకున్నవారికి ఎంబీఏతోపాటు బీబీఏ డిగ్రీ ప్రదానం చేస్తుంది. ప్రవేశ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ ఒక్కో విభాగం నుంచి 40 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రతి విభాగాన్నీ 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. మొత్తం పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే అడుగుతారు. సరైన సమాధానానికి 4 మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు జవాబుకు ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు.

అర్హులకు ఇంటర్వ్యూలో భాగంగా అకడమిక్స్, జనరల్ అవేర్‌నెస్, కమ్యూనికేషన్ స్కిల్స్ పరిశీలిస్తారు. తుది నియామకాల్లో ఆప్టిట్యూడ్ టెస్టు స్కోరుకు 55 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ 15 శాతం, అకడమిక్స్ అంటే పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభకు 30 శాతం వెయిటేజీ ఉంటాయి.

జిప్‌మ్యాట్

జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (జిప్‌మ్యాట్)తో ఐఐఎం బుద్ధగయ, జమ్ముల్లో ప్రవేశం లభిస్తుంది. ఈ రెండు సంస్థలూ ఐపీఎం కోర్సు అందిస్తున్నాయి. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష, అకడమిక్ మార్కులతో సీట్లు కేటాయిస్తారు. పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. పరీక్షలో వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ 4 మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ 34 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.

ఈ రెండు సంస్థలూ ఇంటర్వ్యూ లేకుండా కోర్సుల్లోకి తీసుకుంటాయి. ఈ సంస్థల్లో ప్రవేశానికి జిప్‌మ్యాట్ స్కోరుకు 60 శాతం, పదో తరగతి మార్కులకు 15, ఇంటర్మీడియట్ మార్కులకు 15, జండర్ డైవర్సిటీ (మహిళలకు) 10 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇక్కడ మొదటి ఏడాది కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకుంటే సర్టిఫికెట్ ఇన్ బేసిక్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, రెండేళ్ల చదువులకు అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్, మూడేళ్లు పూర్తి చేసుకుంటే బీబీఏ ప్రదానం చేస్తారు. ఐదేళ్లు చదివినవారికి ఎంబీఏ డిగ్రీ అందిస్తారు.

అర్హత: ఇంటర్మీడియట్ 2024/2025/2026లో పూర్తిచేసినవారై ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 10

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జండర్లకు రూ.1100. మిగిలిన అందరికీ రూ.2200

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూన్ 7

పరీక్ష కేంద్రాలు: ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్.

వెబ్‌సైట్: exams.nta.nic.in/

ఇతర సంస్థలు

ఐఐఎఫ్‌టీ-కాకినాడ క్యాంపస్, నిర్మా యూనివర్సిటీ, నార్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, జిందాల్ గ్లోబల్ బిజినెస్ స్కూల్, దేవీ అహల్య విశ్వవిద్యాలయ, ఎన్‌ఐటీ యూనివర్సిటీ, యూపీఈఎస్, పలు ప్రైవేటు విశ్వ విద్యాలయాలు/ డీమ్డ్ సంస్థలు ఇంటిగ్రేటెడ్ విధానంలో ఎంబీఏ కోర్సు అందిస్తున్నాయి.

ఫోరెన్సిక్ సైన్స్ ఎక్కడ బాగు?

బీఎస్సీ చదువుతున్నాను. ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ అందించే మేటి సంస్థలు, ఉద్యోగ అవకాశాలు తెలపండి. - పురుషోత్తం

■ బీఎస్సీలో ఉన్నప్పుడే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఫోరెన్సిక్ సైన్స్ చదవడం గురించి ఆలోచించడం అభినందనీయం. ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు సైన్స్‌ను న్యాయ వ్యవస్థతో అనుసంధానించే ప్రత్యేక రంగం. నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలను సేకరించడం, విశ్లేషించడం, వాటిని కోర్టులో సమర్పించడం లాంటి కీలక బాధ్యతలు ఈ రంగంలో ఉంటాయి. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగానికి ప్రాధాన్యం పెరిగింది.



▲ భారతదేశంలో ఫోరెన్సిక్ సైన్స్ అందించే ఉత్తమ విద్యా సంస్థలను పరిశీలిస్తే నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్, బనారస్ హిందూ, ఉస్మానియా, డాక్టర్ హరిసింగ్ గౌర్, అమిటీ, చండీగఢ్, పారుల్, పంజాబీ, కర్ణాటక, బుందేల్‌ఖండ్, క్రైస్ట్, జైన్, గల్గోటియాస్, శారదా, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలు, కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, గురు ఘాసీదాస్ విశ్వవిద్యాలయాలు గుర్తింపు పొందాయి. ఈ సంస్థలు ఆధునిక ల్యాబ్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశోధనకు అనుకూల వాతావరణాన్ని అందిస్తూ విద్యార్థులకు ప్రాక్టికల్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తున్నాయి. సాధారణంగా ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌లో ప్రవేశానికి రాత పరీక్షలో మెరుగైన ర్యాంకు సాధించాలి. కొన్ని యూనివర్సిటీలు సీయూఈటీ-పీజీ, డిగ్రీలో పొందిన మార్కులతోనూ ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

▲ ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో వివిధ ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ ఎమ్మెస్సీ పూర్తిచేసిన వెంటనే ఉద్యోగాలు, ప్రారంభ వేతనాలు కొంత పరిమితంగా ఉండవచ్చు. కాబట్టి డిగ్రీతో పాటు వృత్తి అనుభవాన్ని, నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలి. ఇంటర్న్‌షిప్స్, ప్రాక్టికల్ ట్రైనింగ్, నైపుణ్యాల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకొనే ప్రయత్నాలు చేయాలి. పీహెచ్‌డీ లాంటి ఉన్నత విద్యను కొనసాగిస్తే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. పరిశోధన, బోధన, ఉన్నత స్థాయి శాస్త్రవేత్త ఉద్యోగాలకు పీహెచ్‌డీ ఉపయోగకరం.

▲ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్స్, పోలీస్ శాఖలు, ప్రైవేట్ డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ల్యాబ్స్‌లో వివిధ రకాల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. పరిశోధన, అకడమిక్ రంగంలోకి వెళ్లాలనుకునే వారికి నెట్/సెట్‌ల్లో అర్హత సాధించడం ఉపయోగకరం. ఇవి జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు మార్గం సుగమం చేస్తాయి.

ఫోరెన్సిక్ సైన్స్ ముఖ్యమైన, అభివృద్ధి చెందుతున్న రంగం. ఇందులో వివిధ రకాల ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ సరైన ప్రణాళిక, ఉన్నత విద్య, నైపుణ్యాలు, సహనం ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుకోవడం వీలవుతుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పవర్ గ్రిడ్‌లో ట్రెయినీలు



పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్).. 660 డిప్లొమా ట్రెయినీ, జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ, జూనియర్ టెక్నీషియన్ ట్రెయినీ పోస్టులను భర్తీచేయనుంది. ఇంజినీరింగ్ డిప్లొమా/ గ్రాడ్యుయేషన్/ సీఏ/ సీఎంఏ/ ఐటీఐతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షతో నియామకాలు ఉంటాయి.

మొత్తం పోస్టుల్లో ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న వాటి వివరాలు

పోస్టు: డిప్లొమా ట్రెయినీ ఎలక్ట్రికల్ **ఖాళీలు:** 479

అర్హత: 70 శాతం మార్కులతో ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ (పవర్)/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ పవర్ సిస్టమ్స్/ పవర్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్) డిప్లొమా. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు పాసైతే సరిపోతుంది. బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్ లాంటి ఉన్నత సాంకేతిక విద్యార్హతలు ఉన్నవారికి అవకాశం లేదు..

పోస్టు: డిప్లొమా ట్రెయినీ సివిల్ **ఖాళీలు:** 111

అర్హత: 70 శాతం మార్కులతో సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు పాసైతే సరిపోతుంది.

పోస్టు: జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (ఎఫ్అండ్ఏ). **ఖాళీలు:** 32.

అర్హత: సీఏ/సీఎంఏలో ఇంటర్ పూర్తిచేయాలి. పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమా, సీఏ, సీఎంఏ పూర్తి చేసినవారికి అవకాశం ఉండదు.

పోస్టు: జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (హెచ్ఆర్). **ఖాళీలు:** 18.

అర్హత: 60 శాతం మార్కులతో బీబీఏ/ బీబీఎం/ బీబీఎస్. పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమా చేసినవారికి అవకాశం లేదు.

ఎంపిక

రాత పరీక్ష/ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ స్కిల్ టెస్టులతో ఉంటుంది. రాత పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 170 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రంలో రెండు భాగాలు ఉంటాయి. పార్ట్-1లో 120 టెక్నికల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఇస్తారు. పార్ట్-2లో ఆప్టిట్యూడ్ టెస్టు 50 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ ఒకాబ్యులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియన్సీ, ఇంటర్‌ప్రెటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావుమార్కు తగ్గిస్తారు.

✦ రాత పరీక్ష/ కంప్యూటర్ బేస్డ్ టెస్టులో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. వీరిని 1:5 నిష్పత్తిలో కంప్యూటర్ స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు. ఇందులో జనరల్ 40 శాతం, రిజర్వుడ్ అభ్యర్థులు 30 శాతం కనీసార్హత మార్కులు పొందాలి. సీబీటీ మార్కులతోనే తుది ఎంపిక ఉంటుంది.

వివరాలు

వయసు: 11.05.2026 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు కేటగిరీని బట్టి పది నుంచి పదిహేనేళ్ల సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: డీటీఈ/ డీటీసీ/ డీటీఎస్/ జేఓటీ పోస్టులకు రూ.300. జేటీటీ-సర్వే పోస్టుకు రూ.200. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు ఉండదు.

వేతన శ్రేణి: నెలకు రూ.24,000 నుంచి 1,08,000 వరకు ఉంటుంది. శిక్షణ అనంతరం నెలకు రూ.25,000 - 1,17,500 చెల్లిస్తారు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.05.2026.

వెబ్‌సైట్: http://www.powergrid.in/

సీఎస్‌సీ ఆధార్ కొలువులు

దేశవ్యాప్తంగా ఉన్న కామన్ సర్వీస్ సెంటర్లలో (సీఎస్‌సీ) ఆధార్ సేవలను మరింత వేగం చేసేందుకు సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్: 344 ఖాళీలు.

అర్హత: పదో తరగతి లేదా ఐటీఐ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా. దీంతో పాటు యూఐడీఏఐ ఆధార్ ఆపరేటర్/సూపర్‌వైజర్ సర్టిఫికెట్ ఉండాలి.

వయసు: కనీసం 18 ఏళ్లు నిండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20-05-2026

వెబ్‌సైట్: https://csc.gov.in/

టీచింగ్ అసోసియేట్లు

ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఏఎన్‌జీఆర్‌ఏయూ) పులివెందుల కాలేజీ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: 2

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ లేదా పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: పురుషులకు 40 ఏళ్లు, మహిళలకు 45 ఏళ్లు మించరాదు.

వేతనం: నెలకు రూ.61,000- రూ.67,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.

వేదిక: కాలేజ్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ పులివెందుల.

ఇంటర్వ్యూ తేదీ: 18-05-2026

వెబ్‌సైట్: https://angrau.ac.in/ANGRU/Recruitment_Notification_2021.aspx

సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), హైదరాబాద్.. టెక్నీషియన్, డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పదో తరగతి, ఐటీఐ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రేడ్ టెస్ట్/ స్కిల్ టెస్ట్/ రాత పరీక్షతో నియామకాలు ఉంటాయి.

సీసీఎంబీలో టెక్నీషియన్లు



పోస్టు: టెక్నీషియన్ **ఖాళీలు:** 22

అర్హత: 55 శాతం మార్కులతో పదోతరగతి, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (కెమికల్ ప్లాంట్)/ కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్/ ఫుడ్ ప్రొడక్షన్ ట్రేడ్‌తో ఐటీఐ సర్టిఫికెట్. లేదా 55 శాతం మార్కులతో పదోతరగతి, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (కెమికల్ ప్లాంట్)/ కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్/ ఫుడ్ ప్రొడక్షన్ ట్రేడ్‌తో అప్రెంటిస్ ట్రెయినీగా రెండేళ్ల అనుభవం ఉండాలి.

పోస్టు: డ్రైవర్ **ఖాళీలు:** 1

అర్హత: పదోతరగతి, లైట్ అండ్ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, మూడేళ్ల ఉద్యోగానుభవం, మోటర్ మెకానిజం పరిజ్ఞానం ఉండాలి.

ఎంపిక

టెక్నీషియన్ పోస్టులకు రెండు దశల్లో జరుగుతుంది. స్టేజ్-1లో ట్రేడ్ టెస్టు, స్టేజ్-2లో రాత పరీక్ష ఉంటాయి. విద్యార్హతలు, అనుభవంతో అభ్యర్థులకు స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని రాత పరీక్షకు ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి.

✦ పేపర్-1 మెంటల్ ఎబిలిటీ టెస్టు 50 ప్రశ్నలతో 100 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. రుణాత్మక మార్కులు ఉండవు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సిట్యుయేషనల్ జడ్జిమెంట్ల నుంచి ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి గంట.

✦ పేపర్-2లో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ల నుంచి 25 ప్రశ్నల చొప్పున ఉంటాయి. వీటికి 150 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. వ్యవధి 30 నిమిషాలు.

✦ పేపర్-3లో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 50 ఇస్తారు. వీటికి 150 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. వ్యవధి గంట.

✦ పేపర్-1లో అర్హత పొందితేనే పేపర్-2, పేపర్-3 మూల్యాంకనం చేస్తారు. ఈ రెండు పేపర్లలో సాధించిన మార్కులతోనే తుది జాబితా తయారుచేస్తారు.

డ్రైవర్ పోస్టుకు: స్కిల్ టెస్టులో అర్హత పొందినవారిని రాత పరీక్షకు ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ల నుంచి 25 ప్రశ్నల చొప్పున ఉంటాయి. మొత్తం 100 ప్రశ్నలకు 300 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ఈ పరీక్షలో సాధించిన మార్కులతో తుది ఎంపిక చేస్తారు.

వివరాలు

వయసు: టెక్నీషియన్‌కు 28, డ్రైవర్‌కు 27 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)కి మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: యూఆర్, ఓబీసీ (ఎన్‌సీఎల్), ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు ఉండదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత ఆ కాపీకి సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి కింది చిరునామాకు పంపాలి.

చిరునామా: ద సెక్షన్ ఆఫీసర్ (రిక్రూట్‌మెంట్ సెక్షన్), సీఎస్ఐఆర్ - సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, ఉప్పల్ రోడ్, హబ్సిగూడ, హైదరాబాద్ - 500007.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.05.2026

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 05.06.2026

వెబ్‌సైట్: www.ccmb.res.in/

ఐఐటీ వారణాసిలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వారణాసి..అకౌంట్స్ సెక్షన్/ ఆర్ అండ్ డీ యూనిట్లలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రొఫెషనల్ ట్రెయినీల కోసం దరఖాస్తులను కోరుతోంది.

పోస్టులు: 10 **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఎంకామ్/ఎంబీఏ (ఫైనాన్స్) ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించకూడదు. **స్టైపెండ్:** నెలకు రూ.25,000.

ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.250. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19-5-2026.

వెబ్‌సైట్: https://www.iitbhu.ac.in/positions

చదువు

ఉన్నత విద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానం, ఊగిసలాటలు సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్ సిటీ - 501 512

edc@eenadu.in

ప్రజలకు నచ్చాలి.. వారు మెచ్చాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేస్తే సత్ఫలితాలు
- జిల్లా ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాధవి, కందుల దుర్గేష్, నసీర్, చంద్రశేఖర్, రామాంజనేయులు, నరేంద్రకుమార్, లోకేశ్, శ్రావణ్‌కుమార్

ఈనాడు – అమరావతి: ప్రజాప్రతినిధులు.. అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉన్నప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు.

> ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటూ ఉండాలి. ప్రజలకు అందించే సేవలు, వారి నుంచి వస్తున్న స్పందన, పనితీరును ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలి. నిత్యం ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై సేవలందించాలి. ప్రభుత్వ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా? ఎక్కడైనా లోపాలున్నాయా? గుర్తించి వాటిని సరిదిద్దేలా ఎమ్మెల్యేలు పని చేయాలి. అధికారులు కూడా బాధ్యతగా పని చేయాలి.

ప్రజాప్రతినిధుల తీరు పార్టీ అధ్యక్షుడికి నచ్చితే సరిపోదని, ప్రజలకు నచ్చేలా ప్రతి ఒక్కరూ మెచ్చేలా పని చేయాలని సూచించారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జిల్లా ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. వారికి కీలక సూచనలు చేశారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి లోకేశ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొన్నారు.

- ఎమ్మెల్యేల పనితీరుపై వారికి సీఎం చంద్రబాబు వ్యక్తిగతంగా కవర్లు అందజేశారు.
- అందులో ఎమ్మెల్యే ర్యాంక్, చేపడుతున్న కార్యక్రమాలు, లోపాలు, ప్రజలతో మమేకమవుతున్న తీరు తదితర అంశాలున్నాయి.
- వచ్చే సమావేశం నాటికి మెరుగైన పని తీరు కనబరచాలని సీఎం సూచించారు.
- పట్టాల పంపిణీ, టిడ్కో గృహాలు పూర్తి చేయడం, భూగర్భడ్రైనేజీ పనులు, గుంటూరు చానెల్ విస్తరణ, ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపరచడం వంటి పనులకు నిధులు కావాలని ఎమ్మెల్యేలు కోరారు.

ఎమ్మెల్యేల వినతులు..

ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు): గుంటూరు నల్లా అభివృద్ధికి భూసేకరణ, గుంటూరు-బాపట్ల రహదారి విస్తరణ, పొన్నూరు ఆటోనగర్ ఏర్పాటు, సుద్దపల్లి, ముత్తుకూరు ఎత్తిపోతల పథకాలు, 29 కమ్యూనిటీ భవనాల నిర్మాణం, ఉప్పలపాడు పక్షుల కేంద్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.

తెనాలి శ్రావణ్‌కుమార్ (తాడికొండ): గుంటూరు-తెనాలి-మంగళగిరి రోడ్ల అభివృద్ధి పనులు, గుంటూరు-అమరావతి రోడ్డు, కొండవీటి వాగు పునరుద్ధరణ, ఎర్రవాగుపై వంతెన నిర్మాణం, పొట్లపాడు నుంచి యలవర్తిపాడు వరకు రహదారి నిర్మాణం, కొర్రపాటి మాల చర్చికి మార్గ రోడ్డు, తాడికొండలో మల్టీపర్పస్ కాంప్లెక్స్ ఆలయానికి మాస్టర్‌ప్లాన్ నిర్మాణానికి నిధులివ్వాలి.

నసీర్ (గుంటూరు తూర్పు): ఆటోనగర్. ఎన్టీఆర్ మానస సరోవరం ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు అవసరం.

గళ్లా మాధవి (గుంటూరు పశ్చిమ): లాలాపురం, అంకిరెడ్డిపాలెంలో టిడ్కో గృహ నిర్మాణం, ఫీనిక్ నాయుడు కూరగాయల మార్కెట్ పునర్నిర్మాణం చేపట్టాలి.

బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు): గుంటూరు-పర్చూరు రహదారి విస్తరించి డ్రైయిన్ల నిర్మాణం, కాకుమానులో డ్రైనేజీ వ్యవస్థ, పెదనందిపాడు, గనికపూడి-ఉప్పల, పాండ్రపాడు-పుసులూరు-వరగాని, మేడవారిపాలెం రహదారుల పనులు చేపట్టాలి.

మంత్రి లోకేశ్ (మంగళగిరి): పట్టాల పంపిణీ కాలువపై మంగళగిరి-తెనాలి-పెదవడ్లపూడి కలిపే పాతవంతెన స్థానంలో కొత్త హైలెవెల్ వంతెన నిర్మాణం, తెనాలి-మంగళగిరిరోడ్డు అభివృద్ధి, మంగళగిరి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.

8 నుంచి వేసవి సెలవులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కళాశాలలకు ఈ నెల 8 నుంచి వేసవి సెలవులను అధికారులు ప్రకటించారు. అదే రోజు నుంచి భోజనశాలను కూడా మూసేస్తున్నట్లు చీఫ్ వార్డెన్ ఆచార్య మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 8 నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

88 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్-జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజలు అందించిన దరఖాస్తులు, అర్జీలను పరిష్కరించని 88 మంది వీఆర్వోలు, వార్డు రెవెన్యూ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్జీలు పరిష్కరించాల్సిన గడువు దాటి నెలలు గడుస్తున్నా నిర్లక్ష్యం వ్యవహరించడంతో ఆయా సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాలిసెట్‌లో ఉత్తీర్ణత శాతం 92.95

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 25న నిర్వహించిన పాలిసెట్-2026లో జిల్లా విద్యార్థులు 92.95% ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 4,894 మంది హాజరుకాగా.. వీరిలో 4,549 మంది ఉత్తీర్ణులయ్యారు. బి.చేతన్ ఆనంద్‌రామ్ 118 మార్కులతో 132వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ఇతనే టాపర్. సీహెచ్ సుజిత్ ప్రహర్ష్ 117 మార్కులతో 159వ ర్యాంక్, ఎస్.యశ్వంత్ 115 మార్కులతో 322వ ర్యాంకు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 265 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 84 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

పరిధి తగ్గి.. ఆదాయం తరిగి

- విశాఖ రైల్వే జోన్‌లోకి గుంటూరు డివిజన్
- విష్ణుపురం-పగిడిపల్లి-జాన్‌పహాడ్ సికింద్రాబాద్‌కు



డివిజన్ కేంద్ర కార్యాలయం

ఈనాడు – అమరావతి: జూన్ 1 నుంచి గుంటూరు రైల్వే డివిజన్ కొత్త జోన్‌లోకి మారబోతోంది. ఇప్పటివరకు సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉంది. విశాఖ కేంద్రంగా కొత్తగా ఏర్పడబోతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వెళ్తుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్త జోన్ పరిధిలోకి గుంటూరు, విజయవాడ, గుంతకల్ డివిజన్లను చేర్చింది. తాజా మార్పుతో గుంటూరు డివిజన్ పరిధి తగ్గిపోయింది. ఆదాయం కూడా తరిగిపోనుంది. ఓ పక్క విశాఖ రైల్వేజోన్‌లో చేర్చడంపై హర్షం వ్యక్తమవుతున్నా.. ఆదాయం వచ్చే ప్రాంతాలన్నీ దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు వెళ్లిపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

ఇదీ చరిత్ర

- గుంటూరు రైల్వే డివిజన్ 2003 ఏప్రిల్ 1న సేవలు ప్రారంభించింది.
- సరకు రవాణాలో కీలకంగా మారింది.
- విష్ణుపురం-పగిడిపల్లి సెక్షన్‌లో అనేక పరిశ్రమలు ఉండడంతో ఏటా రూ.700 కోట్ల ఆదాయం వచ్చేది. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 766.57 కోట్లతో అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7.65% వృద్ధి సాధించింది.

సెక్షన్ల మార్పులు ఇలా..

జోన్ పునర్వ్యవస్థీకరణలో కొన్ని రైల్వే లైన్ల (సెక్షన్ల) పరిధిలో మార్పులు చోటుచేసుకున్నాయి.

విష్ణుపురం-పగిడిపల్లి: కీలకమైన ఈ సెక్షన్ గుంటూరు డివిజన్ నుంచి విడిపోయి సికింద్రాబాద్ డివిజన్ (దక్షిణ మధ్య రైల్వే) పరిధిలోకి వెళ్తుంది.

విష్ణుపురం-జానపహాడ్: ఇది కూడా సికింద్రాబాద్‌లో కలుస్తుంది. బొగ్గు, సరకు రవాణా సౌలభ్యం కోసం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

గుంటూరు-నల్లపాడు: ఈ ప్రాంతంలోని కోచ్ మెయింటెనెన్స్ డిపోలు ఇకపై కొత్త జోన్ పర్యవేక్షణలోనే పనిచేస్తాయి.

మార్పు ఇలా..

విజయవాడ వైపు కృష్ణా కెనాల్.. బాపట్లవైపు రేపల్లె.. పల్నాడులో విష్ణుపురం సమీపంలోని పొందుగల వరకు; గుంతకల్ వైపు నంద్యాల వరకు గుంటూరు రైల్వే డివిజన్ విస్తరించనుంది.

ఉన్న వనరులపై దృష్టి పెడితే మేలు

సరకు రవాణా ఆదాయ మార్గాలను సికింద్రాబాద్‌కు కోల్పోవడంతో ప్రస్తుతం ఉన్న వనరులపైనే దృష్టి పెట్టాల్సిన పరిస్థితి. వేమూరులో లూప్‌లైన్ మంజూరైన నేపథ్యంలో అక్కడ అభివృద్ధి చేస్తే మొక్కజొన్న ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుంది. గుంటూరు, తెనాలిలో ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో వేజెండ్ల-సంగం జాగర్లమూడి మధ్య ఖాళీగా ఉన్న రైల్వే భూమిలో గూడ్స్ లోడింగ్ అభివృద్ధి చేసుకోగలిగితే.. కొంత ఉపశమనం కలుగుతుంది. మార్కాపురం వద్ద గూడ్స్ షెడ్ ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో చీమకుర్తి కేంద్రంగా గ్రానైట్ రవాణాకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. అమరావతి లైను, నడికుడి-శ్రీకాళహస్తి లైన్లు అందుబాటులోకి వస్తే రూట్ పొడవు పెరుగుతుంది.

ప్రయోజనాలు ఇలా..

- **వేగవంతమైన నిర్ణయాలు:** జోన్ కేంద్రం రాష్ట్రంలోనే ఉండటం వల్ల కొత్త రైళ్ల ప్రతిపాదనలు, స్టేషన్ల అభివృద్ధి పనులకు త్వరగా ఆమోదం లభిస్తుంది
- **అభివృద్ధి నిధులు:** ఏపీకి కేటాయించిన బడ్జెట్ ద్వారా గుంటూరు డివిజన్‌లోని ప్రధాన స్టేషన్ల ఆధునికీకరణ మరింత వేగవంతమవుతుంది.
- **సరకు రవాణా:** పోర్టులతో అనుసంధానం పెరగడం వల్ల గుంటూరు ప్రాంతం నుంచి మిర్చి, ఇతర వాణిజ్య పంటల ఎగుమతులకు రైల్వే ద్వారా మెరుగైన రవాణా సౌకర్యాలు లభిస్తాయి.

23 గ్రామాలు.. 720.28 ఎకరాలు

రాజధానిలో భూసేకరణకు ప్రణాళిక

ఈనాడు – అమరావతి

రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో ట్రంక్ రోడ్ల నిర్మాణం, ఎల్‌పీఎస్ లేఔట్లలో మౌలిక వసతులు, వరద నివారణ పనులు చేపట్టడానికి అవసరమైన చోట భూసేకరణ చేయనున్నారు. ఇప్పటివరకు రైతులు భూసమీకరణ కింద ఇస్తారని వేచి చూసిన యంత్రాంగం తప్పనిసరి పరిస్థితుల్లో భూసేకరణకు ప్రాథమిక ప్రకటనలు జారీ చేసింది. రాజధానిలో అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో వాటికి ఆటంకం కలగకుండా ముందుకెళ్లడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

విభాగం	భూసేకరణ ఎకరాలలో
ఉండవల్లి పంపింగ్ స్టేషన్	6.87
ట్రంక్ ఇన్‌ఫ్రా	216.33
వరద నివారణ	77.38
ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా	419.70
మొత్తం	720.28

పనులకు ఆటంకం లేకుండా....

ప్రస్తుతం అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. భూసమీకరణ కింద వేలాదిమంది రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చినా.. కొంతమంది ఇవ్వలేదు. అభివృద్ధి పనులను వీరి భూముల్లోంచి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సీఆర్డీఏ అధికారులు పలుమార్లు రైతులతో చర్చలు జరిపినా.. వారు భూసమీకరణకు ముందుకు రాలేదు. చివరకు యంత్రాంగం భూసేకరణ ప్రకటనలు ఇస్తోంది. మరోవైపు రైతులతో చర్చిస్తూ భూసమీకరణ ప్రయోజనాలు.. భూసేకరణలో ఉండవని అవగాహన కల్పిస్తోంది. రైతులు లేవనెత్తిన పలు అభ్యంతరాలు, సందేహాలను నివృత్తి చేసింది.

అవసరమైన ప్రాంతాల్లోనే...

ప్రస్తుతం ఉండవల్లి పంపింగ్ స్టేషన్, ట్రంక్ రోడ్లు, వరద నివారణ, ఎల్‌పీఎస్ లేఔట్లలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రాంతాల్లోనే భూసేకరణకు వెళ్తున్నారు. గ్రామ సభల్లో రైతులకు భూసమీకరణ ప్రయోజనాలను వివరించి మరోసారి అవగాహన కల్పిస్తారు. ఇందులో కొన్ని భూములకు గ్రామకంఠాల నుంచి మినహాయింపులివ్వాలని ఇప్పటికే 358 వరకు వినతిపత్రాలందాయి. వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులు భావిస్తున్నారు. గ్రామకంఠాలపై స్పష్టత ఇస్తే మరికొంతమంది భూసమీకరణకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

- 23 గ్రామాల పరిధిలో 720.28 ఎకరాలకు జిల్లా యంత్రాంగం ప్రాథమిక ప్రకటనలు విడుదల చేసింది.
- నిబంధనల ప్రకారం ఈ నెల 7 నుంచి గ్రామసభల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది.
- రైతులు ఇప్పటికైనా భూసమీకరణ కింద ఇవ్వడానికి ముందుకొస్తే సీఆర్డీఏ తీసుకుని.. ఆ మేరకు ప్రయోజనాలు కల్పిస్తుంది. భూములిచ్చిన రైతుల పేర్లను డ్రాఫ్ట్ డిక్లరేషన్ నుంచి మినహాయిస్తుంది.

మట్టి అక్రమ తవ్వకాలపై సంయుక్త పరిశీలన

గుంటూరు, న్యూస్‌టుడే: ఇటీవల రాజధాని గ్రామం అనంతవరం కొండ వెనుక జరిగిన అక్రమ మట్టి తవ్వకాలపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ కోరుతూ తుళ్లూరు తహసీల్దార్ ఎం.హరిబాబు గుంటూరు జిల్లా మైనింగ్ అధికారులకు కొద్ది రోజుల కిందట లేఖ రాశారు. ఈమేరకు త్వరలో మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా మట్టి తవ్వకాలపై పరిశీలన చేసి నివేదిక తయారు చేయనున్నారు. అనంతవరంలో మట్టి తవ్వకాలపై కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు అక్రమ మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతం సర్వే నంబర్లు, ఎంత మట్టి తవ్వారు..దాని విలువ ఎంత అనే వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే.

శిక్షణ పొందండి.. సర్కారు కొలువు సాధించండి

- గుంటూరులో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- రెండో బ్యాచ్‌కు రిజిస్ట్రేషన్లు మొదలు

న్యూస్‌టుడే పట్టాభిపురం

ప్రభుత్వ ఉద్యోగం.. ఎంతోమంది కల. ఏటా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలకు సంబంధించి రెండున్నర లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదలవుతుంటాయి. సరైన రీతిలో సాధన చేస్తే ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఆర్‌బీఐ, తపాలా, రైల్వే బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షల్లో విజయం సాధించొచ్చు. ఇటు రాష్ట్రంలో ఏపీపీఎస్సీ, డీఎస్సీపై దృష్టి పెడుతున్నవారెందరో. కూటమి అధికారం చేపట్టాక ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో గతేడాది విజయదశమి నుంచి ఉచిత నైపుణ్యాభివృద్ధి



ఉచిత శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులు

శిక్షణ తరగతులు లక్ష్మీపురంలోని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. బ్యాచ్‌లో వందమందికి శిక్షణ ఇస్తున్నారు. మొదటి బ్యాచ్ తరగతులు పూర్తయ్యాయి. రెండో బ్యాచ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ తరగతుల సమయం..
ఉదయం: 10 గంటల నుంచి 1 వరకు
మధ్యాహ్నం: 2 గంటల నుంచి 5 వరకు
సమన్వయకర్త: **గంగాకిశోర్,**
పదిమంది అధ్యాపకులు బోధన చేస్తున్నారు.

అంశాలు
- అంక గణితం, రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, జనరల్ సైన్స్, షార్ట్‌హ్యాండ్.
- ప్రతిరోజూ పరీక్ష ఉంటుంది.
- అభ్యర్థులు ఇప్పటికే పలు ఉద్యోగాలకు పరీక్షలు రాశారు. ఫలితాలు రావాల్సి ఉంది.

షిఫ్టుల వారీగా పరీక్షలు

శిక్షణ ముగిసినా.. అభ్యర్థులకు ఉద్యోగాలొచ్చే వరకు మరో నాలుగు నెలలపాటు కొనసాగిస్తాం. షిఫ్టులవారీగా ప్రతి రోజూ కంప్యూటర్స్‌పై ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేస్తున్నాం. ఉద్యోగాలొచ్చే వరకు రివిజన్ చేయిస్తూ సూచనలు, సలహాలిస్తున్నాం.
- గంగాకిశోర్, సమన్వయకర్త

23 మందికి ఉద్యోగాలొచ్చే అవకాశం

మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందినవారిలో 23 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మిగిలినవారికి కూడా వచ్చేలా సాధన చేయిస్తాం. ఈ నెల 13 నుంచి రెండో బ్యాచ్ మొదలవుతుంది. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. 10వ తేదీ ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. ఎంపికైనవారికి త్వరలో తెనాలి, నరసరావుపేటల్లో కూడా తరగతులు నిర్వహించాలని ఆలోచిస్తున్నాం.
- ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

నమ్మకం పెరిగింది - కంద హర్ష, కొత్తపేట



బీకామ్ పూర్తి చేశా. గతంలో సొంతంగా ప్రిపేరై కొన్ని పరీక్షలు రాశా. ఇక్కడ ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నారని తెలిసి చేరా. ఆరు నెలలుగా శిక్షణ తీసుకుంటున్నా. అన్ని అంశాల్లో పట్టు సాధించా. ఎస్ఎస్‌సీ, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ పరీక్షలు రాశా. ఆర్ఆర్‌బీలో సెక్షన్‌కంట్రోలర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. ఇదే శిక్షణ బయట కోచింగ్ సెంటర్లలో తీసుకుంటే రూ.20 వేల వరకు ఖర్చవుతుంది.

ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు



వైరాలజీలో ఎమ్మెస్సీ చేశా. పీహెచ్‌డీ చేయాల్సి ఉన్నా.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్నా. ఒక్క రూపాయి కూడా ఫీజు చెల్లించలేదు. ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ తోపాటు పది వరకు పరీక్షలు రాశా. ఎస్ఎస్‌సీలో ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్‌లో ఏదో ఒక ఉద్యోగం వస్తుందనుకుంటున్నా.
- ముదిగొండ లాస్యప్రియ, శారదాకాలనీ

సంపద సృష్టికి క్వాంటమ్ టెక్నాలజీ కీలకం

- ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న
- ఎస్ఆర్ఎంలో అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ కార్యశాల

ఈనాడు, అమరావతి: దేశంలో సంపద సృష్టి జరగాలంటే అధునాతన టెక్నాలజీ అభివృద్ధి కావాలని.. క్వాంటమ్ టెక్నాలజీ, అల్గారిథమ్స్ వల్లే అది సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న అన్నారు. చాట్‌జీపీటీ అందుబాటులోకి వచ్చాక అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్లే.. క్వాంటమ్ కంప్యూటర్లు అందుబాటులోకి వస్తే మనదేశ స్వరూపమే



ఎంపీ టెల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన విద్యార్థినులతో ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ఎస్ఆర్ఎం వీసీ సతీష్‌కుమార్

మారిపోతుందన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో క్వాంటమ్ వ్యాలీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అడ్వాన్స్డ్ క్వాంటమ్ అల్గారిథమ్స్ కార్యశాలలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేశం నలుమూలల నుంచి 300 మందికిపైగా విద్యావేత్తలు, పరిశోధక శాస్త్రవేత్తలు, నిపుణులు హాజరయ్యారు. ఐబీఎం నుంచి హాజరైన నిపుణులు క్వాంటమ్ టెక్నాలజీ, అల్గారిథమ్స్ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్‌కుమార్ స్వాగతోపన్యాసంతో వర్క్‌షాపును ప్రారంభించారు. ఏపీ స్టేట్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ అమరావతి క్వాంటమ్ వ్యాలీ, ఆవిష్కరణ సెంటర్ల లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. క్యుబిట్ ఫోర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎల్.వెంకట సుబ్రమణియన్ క్వాంటమ్ ఉపయోగాలు వివరించగా.. ఐబీఎం గ్లోబల్ స్ట్రాటజిక్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లీడ్ డాక్టర్ నిక్ బ్రాడ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎస్పీ టెల్ పరీక్షలో ఉత్తీర్ణులైన ముగ్గురు గిరిజన పాఠశాల విద్యార్థినులు వి.కృష్ణవేణి, సీహెచ్ భవానీ, ఆర్.విమోచనలకు ప్రశంసాపత్రాలతో పాటు.. ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు పారితోషికం ప్రద్యుమ్న అందించారు.



విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

'పది' స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పట్టుదలతో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడం గొప్ప విషయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో చదువుల్లో ముందుండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కార సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పదో తరగతికి వంద రోజుల ప్రణాళికను అమలుచేసి చక్కని ఫలితాలు పొందడానికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలంటే విద్యార్థులు ప్రణాళికతో చదివి.. నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు పాటుపడాలన్నారు. నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా అందించడంతో పాటు అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. సభలో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల సమస్యలకు త్వరలో పరిష్కారం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి

రాజధాని ప్రాంతంలో రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో. రాజధాని గ్రామాల్లో ట్రంక్ రోడ్ల నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, గ్రామకంఠాలు, ఎఫ్ఎస్ఐ, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. అనంతరం పెమ్మసాని విలేకరులతో మాట్లాడుతూ.. సీఆర్డీఏ అధికారులు గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకుని వాటిపై అధ్యయనం చేసి పరిష్కారమార్గాలు చూపాలని సూచించామన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాల వల్ల ఇళ్లు కోల్పోతున్నవారికి ఎన్నెస్పీ పాలసీ కింద మెరుగైన పరిహారం ఇచ్చే అంశంపై చర్చించామన్నారు. గ్రామకంఠాలపై 350కుపైగా వినతులు వచ్చాయని ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిష్కరించాలని కమిటీ నిర్ణయించిందన్నారు.

మే నెలాఖరుకు 60 శాతం భూసమీకరణ

తుళ్లూరు, అమరావతి మండలాల్లో మే నెలాఖరు నాటికి 60% భూసమీకరణ పూర్తవుతుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం మూడు గ్రామాల పరిధిలో 40శాతం చేశామన్నారు. ఆర్-5 జోన్ కింద ఉన్న భూమిని వెనక్కి తీసుకున్నామన్నారు. అక్కడ సెంటు పట్టా ఇచ్చిన లబ్ధిదారులకు ఆయా జిల్లాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో కమిషనర్ విజయరామరాజు, అదనపు కమిషనర్లు భార్గవతేజ, కె. కార్తీక్ పాల్గొన్నారు.

పశ్చిమ కాలువకు నీటి విడుదల పెంపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తాగునీరు అవసరాల దృష్ట్యా గుంటూరు జిల్లా వైపు ప్రవహించే కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు మంగళవారం నీటి విడుదల పెంచారు. ఈక్రమంలో ప్రకాశం బ్యారేజీ నుంచి 1,016 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులకు గాను, 11.5 అడుగులు ఉంది.

అద్విక అక్రమం.. రూ.413 కోట్లు!

- రూ.200 కోట్ల ఆస్తుల ఎటాచ్‌మెంట్
- పది రోజుల్లో అభియోగపత్రం దాఖలు

ఈనాడు, అమరావతి

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసు దర్యాప్తు పూర్తయింది. ఈ కేసులో అభియోగపత్రం దాఖలుకు పోలీసులు చేస్తున్న కసరత్తు తుదిదశకు వచ్చింది. పది రోజుల్లో కోర్టులో దీనిని దాఖలు చేయనున్నారు. ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్లు, డిపాజిటర్లకు నోటీసులు ఇచ్చి. వారిని పిలిపించి మాట్లాడారు. వీరి నుంచి వచ్చిన డబ్బును డిపాజిట్ చేసేందుకు కోర్టు అనుమతితో ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచారు. మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది అధిక ప్రయోజనం పొందారు. ఇప్పటికి రూ.10 కోట్ల మేర ప్రత్యేక ఖాతాలో జమైంది.

నిందితుల ఆస్తుల గుర్తింపు..

170 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. నష్టపోయిన డిపాజిటర్లకు న్యాయం చేసేందుకు 18 మంది నిందితులకు చెందిన 47 ఆస్తులను గుర్తించారు. ఇప్పటికి రూ.200 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించి ఎటాచ్ చేశారు. డిపాజిటర్లతో నిర్వాహకులు చేసుకున్న ఎంవోయూలను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు విశ్లేషణకు పంపారు. నిందితుల నుంచి రూ.23 లక్షల నగదు, రూ.30 లక్షల విలువైన వెండి, 670 గ్రాముల బంగారం తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల ఎటాచ్‌మెంట్‌పై రెండు జీవోలు వచ్చాయి. మరోటి రెండ్రోజుల్లో రానుంది. ఫోరెన్సిక్ ల్యాబ్ తుది నివేదిక వచ్చాక అభియోగపత్రం దాఖలు చేయనుంది.

17 మంది కటకటాలపాలు..

- వివిధ జిల్లాల్లో రూ.413 కోట్లు వసూలు చేసి.. తిరిగి చెల్లించలేదు.
- ప్రధాన సూత్రధారి తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య (ఏ1), అతని భార్య సుజాత (ఏ2) సహా.. 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు.
- నిరుడు జూన్‌లో డిపాజిటర్ గణేష్‌చంద్ర ఫిర్యాదుతో మాచవరం స్టేషన్‌లో బీఎన్ఎస్‌లోని 61(2), 318 (4), 316 (2), 316 (5) సెక్షన్లు... ఏపీ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ద ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 1999లోని సెక్షన్-5 కింద కేసు పెట్టారు.
- క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో సిట్ వేశారు.
- 2022లో విజయవాడలో అద్విక ట్రేడింగ్ కంపెనీ ప్రారంభమైంది. హైదరాబాద్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 60 మందికి పైగా ఏజెంట్లను నియమించారు.
- వీరిద్వారా అధిక కమీషన్ ఎరవేసి 1,367 మంది నుంచి రూ.413 కోట్ల డిపాజిట్లు వసూలు చేశారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు సహా లోకోపైలెట్, గ్రూప్-డి, ఏపీ హైకోర్టు-2026 రిక్రూట్‌మెంట్ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.మయూరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు వారికి పంపాలన్నారు. వంద మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ డిగ్రీ మార్కుల ఆధారంగా ఉంటుందని, ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 0863-2358071 నంబరును సంప్రదించవచ్చన్నారు.

తక్కువ ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేయడం తగదు



మామిళ్లపల్లిలో గోదాం ఎదుట తెదేపా శ్రేణుల నిరసన

పొన్నూరు, చేబ్రోలు, న్యూస్‌టుడే: రైతుల వద్ద తక్కువ ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేసి గోదాంలో నిల్వ చేయడం తగదని తెదేపా శ్రేణులు మండిపడ్డారు. పొన్నూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మొక్కజొన్నలు కొనుగోలు చేసి మామిళ్లపల్లిలోని ఓ గోదాంలో నిల్వ చేసినట్లు నియోజకవర్గంలోని తెదేపా ముఖ్య నాయకులకు తెలిసింది. ఈ క్రమంలో వారు మంగళవారం గోదాం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. రైతులకు, ప్రజలకు వాస్తవాలను వివరించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రభుత్వానికి లేఖ రాశారని చెప్పారు. మురళీకృష్ణ గోదాంలో సుమారు 3,500 బస్తాలు, వైకాపా జెండాలు ఉన్నట్టు ఆరోపించారు. ఆయనే దళారీలను పెట్టుకొని క్వింటా రూ.1,600 నుంచి రూ.1,720కు కొనుగోలు చేస్తున్నారన్నారు. సంగం డెయిరీ కోసం క్వింటా రూ.2,100 నుంచి రూ.2,200 కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యేపై బురద చల్లే రాజకీయాలు మానుకోవాలన్నారు. ఈ క్రమంలో మురళీకృష్ణ అనుచరులు, రైతులు వచ్చి ఈ గోదాం అద్దెకు తీసుకున్నామని, తమ చేలల్లో పండిన పంటను ఇక్కడ నిల్వ చేశామని, 1640 బస్తాలే ఉన్నాయని తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు వారిని పంపించేశారు. గోదాంలో నిల్వలు పరిశీలిస్తున్నామని పొన్నూరు మార్కెట్ యార్డు అధికారులు చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధితోనే యువతకు ఉద్యోగాలు

ఫెడర్‌లైట్ సంస్థ షోరూమ్ ప్రారంభ సభలో మంత్రి నారాయణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రం అభివృద్ధి కావాలన్నా, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నా అనేక పారిశ్రామిక సంస్థలు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచిస్తున్నారని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి బైపాస్‌రోడ్డులో ఫెడర్‌లైట్ ఫర్నిచర్ సంస్థను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధి జరిగితేనే యువతకు ఉద్యోగాలొస్తాయన్నారు. దీంతోపాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు. ఫెడర్‌లైట్ సంస్థను తాడేపల్లిలో ఎంతో నమ్మకంతో ఏర్పాటు చేశారన్నారు. శాంతిభద్రతలు ఉన్నందున నమ్మకంతో సంస్థను నెలకొల్పారని తెలిపారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో వర్మ, విజయశ్రీరామ్, కిరణ్‌దీరన్ చెల్లారం, విశాల్ సిద్ధంశెట్టి తదితరులు

ఇలాంటి సంస్థలు ఏర్పాటు చేసేవారందరు ముందుకు రావాలని, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పెద్దిరెడ్డి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ కిరణ్ దీరన్ చెల్లారం మాట్లాడుతూ 5,500 చదరపు అడుగుల మా కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌తో కార్పొరేట్లు, విద్యాసంస్థలు, చిన్న వ్యాపార యజమానులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలకు మరింత సమర్థంగా సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల సత్తా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఐటీ సంస్థ టీసీఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 262 మంది విద్యార్థులు సత్తా చాటి ఉద్యోగాలకు ఎంపికవడం తమ కళాశాలకు గర్వకారణమని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. నగర శివారు చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీసీఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ టీసీఎస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రైమ్ కేటగిరీలో రూ.9 లక్షలతో ఏడుగురు, డిజిటల్ కేటగిరీలో రూ.7 లక్షలతో 54 మంది, నింజా కేటగిరీలో రూ.3.5 లక్షల ప్యాకేజీతో 201 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో 1054 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు మాట్లాడారు. ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ రవీంద్ర, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీనివాసరావు, సురేష్ బాబు తదితరులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

బాలికల ట్రాప్ కేసులో మరో ఐదుగురి అరెస్ట్

హైదరాబాద్, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన సంపన్న కుటుంబాల బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ప్రధాన నిందితుల తల్లి, మేనమామను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్‌కు కుటుంబ సహకారం ఉన్నట్లు స్పష్టమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చలమలమూడికి చెందిన కేడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్, అతడికి సహకరించిన సోదరుడు కేడూరి రాజీవ్, ఉదిత్ కార్తికేయ్‌లను జూబ్లీహిల్స్ పోలీసులు కొద్ది రోజుల క్రితం అరెస్ట్ చేసిన విషయం విదితమే. నాలుగు రోజుల క్రితం అర్జున్, రాజీవ్‌లను కస్టడీకి తీసుకుని విచారించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్‌తో పాటు ఆయన సోదరుడు రాజీవ్ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ ద్వారా సంపన్న కుటుంబాల అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని ట్రాప్ చేసినట్లు వెల్లడైంది. తర్వాత లగ్జరీ కార్లలో తీసుకెళ్లి లైంగిక దాడులు చేసి, వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ రూ.లక్షల్లో వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

★ తల్లి, మేనమామలదే కీలక పాత్ర



మీనాకుమారి ప్రశాంత్

ఖరీదైన కార్లలోనే అర్జున్ లైంగిక చర్యలకు పాల్పడిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అర్జున్, రాజీవ్‌లకు వారి తల్లి మీనాకుమారి (గుంటూరు జిల్లా చలమలమూడి), మేనమామ ప్రశాంత్ (కేపీహెచ్‌బీ, హైదరాబాద్) పూర్తిగా సహకరించి కీలక పాత్ర పోషించారు. జూబ్లీహిల్స్‌లో ఓ బాలిక ఇంట్లో చోరీ చేయడంతో రూ.13 లక్షలు తీసుకొచ్చి అర్జున్‌కు ఇచ్చింది. మరో బాలిక నుంచి ఇదే తరహాలో డబ్బులు వసూలు చేశారు. బాధిత కుటుంబాల ఫిర్యాదుతో పోలీసులు చంద్రశేఖర్ ఆజాద్‌ను ముందుగా అరెస్ట్ చేశారు. తర్వాత వారి సోదరుడు రాజీవ్, ఉదిత్ కార్తికేయ్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా మంగళవారం ప్రధాన నిందితుడు అర్జున్‌కు సహకరించిన తల్లి మీనాకుమారి, మేనమామ ప్రశాంత్, వినీల్ చౌదరి(పెడమటిలంక, విజయవాడ), యువకులు జితేందర్ (జగద్గిరిగుట్ట, హైదరాబాద్), ఎన్.హేమంత్ (కేసముద్రం, వరంగల్) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరితో కలిపి ఇప్పటివరకు ఈ కేసులో 8 మంది అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రమేయమున్న సరస్వతి, నిషాంత్, శ్రీజిత్ పరారీలో ఉన్నారు.

గుంటూరు వాహిని ఆధునికీకరణపై మాట నిలబెట్టుకున్న సీఎం

★ రూ.369.20 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు
★ కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గుంటూరు వాహిని ఆధునికీకరణ నిమిత్తం రూ.369.20 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు మంజూరుచేసి మాట నిలబెట్టుకున్నారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు వాహిని ఆధునికీకరణ నిధుల మంజూరైన సందర్భంగా మంగళవారం వట్టిచెరుకూరు మండలంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని ప్రజల విజ్ఞప్తి మేరకు గుంటూరు వాహినిపై మంత్రి లోకేశ్, పొన్నూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు అందరం కలిసి గుంటూరు వాహిని పొడిగింపునకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. 47 కిలోమీటర్లున్న కాలువను 74 కిలోమీటర్లకు పెంచేందుకు నిశ్చయించుకున్నామని, ఇందుకు భూసేకరణ నిమిత్తం గత ఏడాది రూ.70 కోట్లతో అంచనాలు వేయగా.. ఇప్పటికే రూ.11 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేశామని తెలిపారు. మిగిలిన నిధులు రెండు నెల్లలో జమవుతాయని తెలిపారు. దీనివల్ల మరో 75 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు, మరో 40 గ్రామాలకు తాగునీరు అందుతుందని వెల్లడించారు. కాలువ చివరన 37 నుంచి 47వ కిలోమీటరు వరకు బెడ్ కేవలం ఐదు మీటర్లు ఉందని, దీనిని 12 మీటర్లకు పెంచేందుకు 50 ఎకరాల భూములు సేకరించాల్సి ఉందన్నారు. గుంటూరు వాహినికి 4 టీఎంసీలు వినియోగించుకునేందుకు అవకాశం ఉండగా. ప్రస్తుతం ఒక టీఎంసీ మాత్రమే వాడుకుంటున్నామని తెలిపారు. చంద్రబాబు నాయుడు గతంలోనే నిధులు మంజూరు చేసినా.. వాటిని వైకాపా ప్రభుత్వం ఉపయోగించలేదన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు వాహినికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌కు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుటూరి తిరుపతిరావు, బి.అమరేశ్వరి, నార్నె బాబు, ఉప్పుటూరి సుజాత, చెరుకూరి నిర్మల, గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల రుణాలు మాఫీ చేయాలి



సమావేశంలో సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రాధిక, గున్నయ్య, సమస్యలు చెబుతున్న రైతులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి రెండో దశ నిర్మాణ పనుల కోసం పెదపరిమి గ్రామం యూనిట్-2 నోటిఫికేషన్‌పై మంగళవారం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక గ్రామసభ జరిగింది. సీఆర్డీఏ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ విచారణ, అభ్యంతరాల సేకరణ సభలో నోటిఫికేషన్ షెడ్యూల్లో తెలిపిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి కోసం చేపడుతున్న రాజధాని భూసమీకరణపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలను ఏకరవు పెట్టారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో భూములు ఇస్తున్న రైతులందరికీ రూ.1.5 లక్షల చొప్పున రుణమాఫీ చేయాలని కోరారు. తమ గ్రామంలో భూమి లేని పేదలైన రైతు కూలీలకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్లు ఇవ్వాలి. గ్రామ కంఠాల కేటాయింపులను పూర్తి చేయాలి. వార్షిక కౌలు పెంచాలి. గ్రామంలోని మంచినీటి చెరువులో తాగునీరు అడుగంటుతోంది. మంత్రి నారాయణ ఇచ్చిన హామీ మేరకు రూ.25 లక్షలతో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి. తుళ్లూరు వైపు తమకు ప్లాట్లు కేటాయించాలి. స్థానికులకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. భూముల కొలతలు, సర్వే, 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని గ్రామసభలో సీఆర్డీఏ అధికారులను కోరారు. సమావేశంలో పెదపరిమి సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు టి.రాధిక, గున్నయ్య, తహసీల్దార్ వీరభద్రరావులు రైతులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకొని సమాధానాలు ఇచ్చారు. గ్రామంలో ప్రస్తుతం డ్రోన్ సర్వే చేస్తున్నామని త్వరలో గ్రామ కంఠాల అర్జీలను పరిశీలిస్తామని తెలిపారు. రైతులు కోరిన వార్షిక కౌలు, రుణ మాఫీ తదితర సమస్యలను సీఆర్డీఏ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు 'ఎక్సలెన్స్ నేషనల్' పురస్కారం



న్యూదిల్లీలో అవార్డు అందుకుంటున్న డాక్టర్లు విజయ, రాఘవశర్మ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లోని అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. న్యూదిల్లీలో ఈనెల 3న జరిగిన '3వ నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్, అవార్డు 2026'లో వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ నుంచి ప్రతిష్ఠాత్మకమైన 'స్ట్రోక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నేషనల్' పురస్కారం అందుకుంది. పక్షవాత చికిత్సలో అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక టెక్నాలజీ, నాణ్యమైన వైద్య సేవలతో వేలాది మంది ప్రాణాలు కాపాడుతున్న ఈ అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు దక్కిన పురస్కారాన్ని డాక్టర్ పి.విజయ, డాక్టర్ రాఘవశర్మ అందుకున్నారు. సదస్సులో 'భారతదేశంలో స్ట్రోక్ అక్రిడిటేషన్, స్టాండర్డైజేషన్' అంశంపై డాక్టర్ పి.విజయ ప్రసంగించారు. ఈమేరకు గుంటూరులో మంగళవారం ఆ వివరాలు ఓ ప్రకటనలో తెలిపారు. 1996లో స్థాపించిన అంకినీడు స్ట్రోక్ యూనిట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటిదని ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయంగా కూడా లలితా హాస్పిటల్ గతంలో పలు అవార్డులు కైవసం చేసుకుందన్నారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ నుంచి 'వరల్డ్ స్ట్రోక్ డే' కార్యకలాపాలకు గోల్డ్ విన్నర్ అవార్డు సాధించిందన్నారు. ఇంటర్నేషనల్ ఆర్ఈఎస్- క్యూ రిజిస్టర్ ద్వారా స్ట్రోక్ చికిత్సలో ప్రతిభకు గుర్తింపుగా డైమండ్ స్టేటస్ కేటగిరీలో ఎంపిక కావడం విశేషమన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 240, చికెన్ స్కిన్‌లెస్ - 271.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -128 రిటైల్ ధర 155 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 271
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 154, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

తెనాలిలో పర్యటించిన బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి డబుల్ హార్స్ గ్రూపు పరిశ్రమలను బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ మహమ్మద్ అలీముజ్జమాన్ తన బృందంతో మంగళవారం సందర్శించారు. సంస్థల సీఎండీ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్, జనరల్ మేనేజర్ కృష్ణప్రసాద్ వారికి స్వాగతం పలికారు. పప్పు దినుసులు, జీడిపప్పు ప్రాసెసింగ్ తీరును ఆయన పరిశీలించారు. అంతర్జాతీయ మార్కెటింగ్‌కు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో సంస్థ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాల తీరును మోహన్ శ్యామ్‌ప్రసాద్ ఆయనకు వివరించారు. తెనాలి కుమార్ పంపుల అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



ప్రమాణాల నిర్వహణ తీరును అలీముజ్జమాన్‌కు వివరిస్తున్న మోహన్ శ్యామ్‌ప్రసాద్

అసభ్య పోస్టుల కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు(పట్నంబజారు), న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిని మంగళవారం పాతగుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ అబ్దుల్ అజీజ్ కథనం ప్రకారం.. కడప జిల్లా బద్వేల్ మండలానికి చెందిన పొంగునూరు సురేష్ 2025 మార్చి, జులై నెలల్లో తన ఎక్స్ ఖాతాలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను దూషిస్తూ, అసభ్యకర పోస్టులు పెట్టాడు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతక పరిజ్ఞానంతో సురేష్‌ను గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. సమావేశంలో పాతగుంటూరు సీఐ శివప్రసాద్, ఎస్.ఐ. రెహమాన్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)



వచ్చిన బస్తాలు:	95,280
అమ్మకాలు:	93,292
నిల్వలు:	28,766

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	13,500-22,800
నంబర్ 5	13,500-22,000
341	14,000-21,500
4884	13,500-19,500
సూపర్10	14,000-22,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,500-20,500
బాడిగ	14,500-22,500
దేవనూరు డీలక్స్	15,000-22,000
ఆర్మూర్	13,000-19,200
తాలు	7,500-11,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఓ యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన మరో యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో ఈనెల 4వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు గమనించి ఆమెను వెంటనే ఎయిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళకరంగా ఉందని పోలీసులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ ఇటీవల ప్రమాదానికి గురై కాలికి తీవ్ర గాయం కావడంతో ఆటో నడపలేకపోతున్నారు. దీంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్న సమాచారంతో స్పందించిన అంగలకుదురు గణేష్ యూత్ సమన్వయకర్త వీరవల్లి మురళి, ఆటో డ్రైవర్‌కు రూ.15 వేల నగదు, నిత్యావసరాలను మంగళవారం అందించారు. కోలుకునే వరకు అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగానూ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కనగాల నాగభూషణం, సాంబశివరావు, నవీన్, సురేష్, నాగ, సుభాని, బాబు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వీధులు శుభ్రంగా ఉంచాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నిబంధనల మేరకు పూడిక తీత పనులు నిర్వహించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్, వ్యర్థాలకు సుందర రూపం వంటి కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం పలు వార్డుల్లో పర్యటించారు. తడి చెత్తతో ఎరువు తయారీ, పొడి చెత్త నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం:	4,500
అత్యల్పం:	2,000
సగటు:	3,500

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి మార్కెట్ కూడలి గాడిబావి కూడలిలో మురుగు కాలువలు పూడిపోయాయి. - **రాఘవయ్య, స్థానికుడు.** ✔ పూడిక తొలగిస్తాం. - **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్** ? మండలంలోని పెదరావూరులో వినియోగంలో లేని మరుగుదొడ్లు కూలిపోయేలా ఉన్నాయి. - **సత్యనారాయణ, స్థానికుడు** ✔ వాటిని తొలగిస్తాం. - **వైవీడీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో**

స్పందన: ✤ తెనాలి కొత్తపేటలో మురుగు కాలువలు పూడికలతో నిండిపోయాయన్న ఫిర్యాదుతో మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించారు. ✤ తెనాలి తులసీరాంచౌక్‌లో ఇంటింటి చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదన్న ఫిర్యాదుతో మున్సిపల్ సిబ్బంది వ్యర్థాలు సేకరించి తరలించారు. – న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు 29వ వార్డులో రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. - **షేక్ బాజీ, 29వ వార్డు** ✔ గొయ్యికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, సహాయ ఇంజినీర్** ? పొన్నూరు పట్టణ పరిధిలోని 9వ వార్డు ప్రధాన రహదారిలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకున్నాయి. - **డి.ప్రమీల, శాంతినగర్** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందన: మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో రెండు రోజులుగా పేరుకున్న చెత్తను తొలగించారు. కొండమూది రోడ్డులో పాడైపోయిన వీధి దీపానికి మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, పొన్నూరు

బాలికలకు ఉచితంగా ఇంటర్ విద్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే



కళాశాలలో పీఎంశ్రీ ల్యాబ్ వద్ద విద్యార్థినులు

ఇటీవల పదో తరగతి ఫలితాలు వెలువడ్డాయి. విద్యార్థులందరూ ఇంటర్ చేరికలకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఎక్కడ? ఏమిటి అని ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో తెనాలి మండలం అంగలకుదురులో బాలికలకు ఉచితంగా ఇంటర్ బోధించే ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో ఉందని.. సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు. పీఎంశ్రీ జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాల, అంగలకుదురులో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. నూరు శాతం ఉచితంగా బోధన, తల్లికి వందనం వర్తింపు, టెక్స్ట్, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలతో పాటు ఒకేషనల్ కోర్సులుగా టైలరింగ్, బ్యాంకింగ్ విభాగాల్లోనూ ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేకంగా ఆధునిక సదుపాయాలతో ల్యాబ్ కూడా ఉంది.

✤ ఉత్తమ ఫలితాలు

ఈ ఏడాది ఇంటర్‌లో ఇక్కడి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఎంపీసీలో అత్యధికంగా 935, బైపీసీలో 833 మార్కులు, జూనియర్ ఎంపీసీలో 426, బైపీసీలో 422 మార్కులతో పాటు అత్యధిక సంఖ్యలో విద్యార్థినులు మంచి మార్కులు సాధించారు. ✤ ఇంటర్‌తో పాటు ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక పుస్తకాలతో శిక్షణ కూడా ఇస్తున్నారు. తెనాలి-గుంటూరు ప్రధాన మార్గంలో ఉన్న కళాశాలకు తెనాలి పరిసర ప్రాంతాల్లోని విద్యార్థినులు ఆర్టీసీ బస్సుల ద్వారా చేరుకోవచ్చు. ప్రవేశాలు మొదలయ్యాయని, కళాశాలలో పని వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి విద్యార్థినులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ అనురాధ కోరారు.

సేంద్రియ ఎరువు తయారీ పునరుద్ధరణ



వికేంద్రీకృత సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం ప్రాంగణంలో సాగు చేస్తున్న అరటి



కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి చెంచుపేట ఉడాకాలనీలోని పురపాలక వికేంద్రీకృత సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని పునరుద్ధరించారు. దీనిలో గత తెదేపా ప్రభుత్వంలో కూరగాయలు సాగుతోపాటు, సేంద్రియ ఎరువు తయారు చేసేవారు. తర్వాత కమిషనర్లు నిర్లక్ష్యం చేశారు. కమిషనర్ రామ అప్పలనాయుడు తిరిగి వినియోగంలోకి తెచ్చారు. ఈ క్రమంలో వికేంద్రీకృత కేంద్రం ప్రాంగణంలో కూరగాయలకు బదులు అరటి పిలకలు నాటించి సంరక్షిస్తున్నారు. ఇప్పటికే ఉన్న ఎరువు తయారీ డబ్బాలను వినియోగంలోకి తెచ్చారు. మరోవైపు ప్రాంగణంలో అచ్చంగా కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తున్నారు. వీటిని ఒక ఇంజినీర్ పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ పట్టణంలోని వార్డు పర్యటనకు వచ్చినప్పుడు సిబ్బందికి తగు సూచనలు ఇస్తుంటారు. ఈ కేంద్రానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో గోడలు కట్టి గేటు పెట్టించారు. మొక్కల సంరక్షణ పనులు పురపాలక పారిశుద్ధ్య మేస్త్రి రాజేష్ చూస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా వేడుకలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా చేయాలని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ తెలిపారు. సెప్టెంబరు 11న నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రిన్సిపల్స్, ఇతర విభాగాధిపతులు, అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించి, సమాచారాన్ని, అభిప్రాయాలను సేకరించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా పైలాన్, భవనం నిర్మాణం, పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించి వేడుకలు నిర్వహించడం, సావనీర్ విడుదల చేయాలని సూచించారు. వచ్చే ఆగస్టులోపు ఆయా పనులు పూర్తి చేయాలన్నారు. రెక్టార్ ఆచార్య శివప్రసాద్ మాట్లాడుతూ విభాగాల వారీగా చేసిన పరిశోధనలు, వచ్చిన అవార్డులు, పేటెంట్‌లు, రివార్డులు, ప్రముఖులు, న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా ఎంపికైన వారి వివరాలను సేకరించాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద 50 ఏళ్ల లోగో ఏర్పాటు, పోస్టల్ స్టాంప్, కాయిన్ రిలీజ్ చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్యా కేంద్రం పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించిన తెనాలికి చెందిన విద్యార్థిని సాయిదీక్షితను రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ తమీమ్ అన్సారియా మంగళగిరిలోని తన కార్యాలయంలో అభినందించారు. తల్లిదండ్రులు సాహితి, యజ్ఞకిరణ్‌లతో కలిసి విద్యార్థిని కమిషనర్‌ను కలిశారు.

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కేటాయింపు



కమిషనర్ రామ అప్పలనాయుడు నుంచి ఉత్తర్వుల ప్రతులు అందుకుంటున్న ఆర్‌డీడీ జగదీష్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలికి మంజూరైన ఆయుష్ ఆసుపత్రి భవన నిర్మాణానికి పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని 61 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఉత్తర్వుల ప్రతులను, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అందజేసినట్లు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (జోన్-3 ఒంగోలు) డాక్టర్ పి.జగదీష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం తెనాలిలో మాట్లాడారు. కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు అప్పగించిన ఈ స్థలంలో ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో భవన నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఏఈ పెనుమాక వీరాస్వామి కృష్ణ, సహాయ కమిషనర్ జాస్తి రామారావు, ఎంహెచ్‌వో మొవ్వా ఏసుబాబు, ఏసీపీ వాణి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



లబ్ధిదారు కుటుంబ సభ్యునికి ధ్రువపత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.26 లక్షల ధ్రువపత్రాన్ని లబ్ధిదారు కుటుంబ సభ్యునికి తెదేపా నాయకులు అందించారు. తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌వర్ధన్, విజయ్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, షాపుల్, శ్రీనివాసరావు, బి.వి.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుశాన్ గ్రేస్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో చిన్నారులు, గర్భిణులు బయటకు రావొద్దని నందులపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నక్కా సుశాన్ గ్రేస్ సూచించారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు స్పందన



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న బోధకులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా విద్యార్థులు వచ్చి వివిధ అంశాలు నేర్చుకుంటున్నారు. మంగళవారం మహిళా బాలల గ్రంథాలయంలో కొనసాగుతున్న శిక్షణ శిబిరానికి వచ్చిన అనుభవజ్ఞులైన బోధకులు స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ బోధిస్తున్నారు. విద్యార్థులతో చెస్ వంటి పలు రకాల ఆటలు ఆడిస్తున్నారు. కార్యక్రమాలను గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత పర్యవేక్షిస్తున్నారు.

ముస్లిం మైనారిటీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతిలో 450 మార్కులకు పైగా సాధించిన ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్ మంగళవారం తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా హాస్టల్ వసతితో కూడిన ఇంటర్ విద్య అందిస్తామని, ఈ ఏడాది 250 మందికి అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ఇంటర్‌తో పాటు ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఉంటుందని, 33 శాతం విద్యార్థినులకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తెనాలిలోని తన కార్యాలయంలో అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బాజి, సుభాని, రబ్బాని, ఖాసింవలి పాల్గొన్నారు.

వైకాపా నాయకులపై చర్యలు తీసుకోండి

తెదేపా గ్రీవెన్స్‌లో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నెం ధర్మవరం సుబ్బారెడ్డిలకు ఓ మహిళ వినతిపత్రం అందించారు. తెనాలికి చెందిన పిల్లి స్వాతి.. ప్రియాంక డ్వాక్రా గ్రూపులో సభ్యురాలు. తమ గ్రూప్ లీడర్లు, ఆర్పీ అవినీతిని ప్రశ్నించినందుకు 2023 మే నెలలో వైకాపా నాయకులు ఇద్దరు తనపై దాడి చేసి, మెడలో బంగారు తాళి లాక్కున్నారని బాధితురాలు పేర్కొన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా నిందితుల పేర్లు ఎఫ్ఐఆర్ నుంచి తొలగించారని ఆరోపించారు.

9న తెనాలిలో మహాపురుషుడు మండలి నాటకం



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దివంగత నేత మండలి వెంకట కృష్ణారావు జీవిత దృశ్య రూపకమైన మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శన ఈనెల 9వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉంటుందని నిర్వాహకులు చందు సుబ్బారావు తెలిపారు. మంగళవారం పట్టణ గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ సంయుక్తంగా మండలి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నాటక దర్శకుడు, మండలి పాత్రధారి గంగోత్రి సాయి మాట్లాడుతూ.. నాటక రంగంలో ఏ.ఐని తొలిసారిగా ఉపయోగించిన నాటకం మహాపురుషుడు మండలి అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారానికి మండలి వెంకట కృష్ణారావు అలుపెరగని కృషి చేశారన్నారు. మాతృభాష పరిరక్షణకు కంకణబద్ధులై పనిచేసినట్లు తెలిపారు. అనంతరం గోడ ప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.వి.సుబ్బారావు, ఎ.వి.గోపాలరావు, చందు సూర్య, గరికపాటి సుబ్బారావు, కనపర్తి మధుకర్, బెల్లం కొండ వెంకట్, మొవ్వా సత్యనారాయణ, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో కిట్లు



తెనాలి కేంద్రం పరిశీలిస్తున్న జీవనజ్యోతి, అధికారులు, సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకురాలు కె.జీవనజ్యోతి తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను భద్రపరిచే తెనాలి మండల పాయింట్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాలల్లోని కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. మండల విద్యాశాఖాధికారి జయంతిబాబు, సీఎంవో అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒన్ టైమ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఒన్‌టైమ్ పరీక్షలు రాసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. బీఈడీ, ఎల్ఎల్‌బీ, బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీలో 2014 నుంచి సబ్జెక్టులు మిగిలిన అభ్యర్థులకు మళ్లీ పరీక్ష రాసేందుకు సీఈ ఆలపాటి శివప్రసాద్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. పరీక్ష రాసే విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోపు రూ.6 వేలు చెల్లించాలని సీఈ తెలిపారు. రూ.500ల అపరాధ రుసుంతో ఈ నెల 27లోపు ఫీజులు చెల్లించాలని సూచించారు. జులై 13 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని సీఈ వెల్లడించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెదకాకాని, న్యూస్‌టుడే : ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి రైతు నుంచి మొక్కజొన్నలను గిట్టుబాటు ధరకు సేకరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారని, దీంతో ఎకరం సాగు చేసిన రైతు సుమారుగా రూ.21 వేలు నష్టపోతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికే పంట అమ్ముకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలన్నారు. పొన్నూరు, తాడికొండ నియోజకవర్గాల సీపీఐ కార్యదర్శులు సత్యనారాయణ, ముప్పాళ్ల శివ, రైతులు కొల్లి శంకర్ రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి అనుగుణంగా రుణాల కేటాయింపు

చేబ్రోలు, న్యూస్‌టుడే : వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల అవసరం మేరకు రుణాల కేటాయింపు జరుగుతుందని వెలుగు ప్రాజెక్టు పీడీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఈనారీలు తయారు చేసిన రుణ ప్రణాళికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘంలోని నిధుల లభ్యతను పరిశీలించి స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజి నిధులను సభ్యులు కోరుకున్న జీవనోపాధులకు అనుగుణంగా రుణాల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అనంతరం స్థానిక ఎస్బీఐ బ్యాంకు మేనేజర్‌ను కలిసి సంఘ సభ్యులకు అవసరమైన వ్యక్తిగత రుణాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నారాయణరావు



మాట్లాడుతున్న దర్శకుడు గంగాధర్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: దర్శకులు దివంగత దాసరి నారాయణరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెనాలి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆయన జయంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దర్శకుడు చిమాట గంగాధర్, బొల్లిముంత కృష్ణ, చల్లగాని శ్రీదేవి, తుంగా బాలస్వామి, దేవిశెట్టి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఐ డొనేషన్ బ్యాంకు



అగర్వాల్ ఆసుపత్రి వైద్య బృందంతో సౌభాగ్యవాణి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్రదానానికి అంగీకరించిన మృతుల భౌతిక కాయం నుంచి ఆరు గంటల్లో కార్నియాను సేకరించేందుకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి బృందం అందుబాటులో ఉంటుందని, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి తెలిపారు. ఆమె మంగళవారం ఆసుపత్రిలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రజలకు నేత్రదానంపై అవగాహన పెంచేందుకు చైతన్య కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వైద్య బృందం స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన కళా వేడుక



స్త్రీ మాత్రే నమః నాటికలోని ఓసన్నివేశం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొలంకపురి నాటక కళా పరిషత్, శ్రీసాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సహకారంతో తెనాలి మండలం కొలకలూరులో జరుగుతున్న ఉభయ తెలుగ రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం ముగిశాయి. స్త్రీ మాత్రే నమః నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. గోపరాజు రమణ, విజయ్ పర్యవేక్షణలో జరిగిన వేడుకలో సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ నటులు సీఎస్ ప్రసాద్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. పెద్ద సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం గుడివాడ వద్ద మంగళవారం ప్రధాన కాలువలో గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథకు అంత్యక్రియలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గత నెల 21వ తేదీన చుండూరు సమీపంలో రోడ్డు వెంట అస్సాంకు చెందిన సురేష్ అనే వ్యక్తి మృతి చెందగా.. పోలీసులు గుర్తించి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా అక్కడి నుంచి ఎవ్వరూ రాకపోవడంతో తెనాలి శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి ప్రతినిధులను అంత్యక్రియల నిమిత్తం పోలీసులు సంప్రదించగా మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. కుర్రా శ్రీను, వాసు, పోతురాజు ఇతర ప్రతినిధులు సేవలు అందించారు.

దాడి చేశారని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తనకు, మరో ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఆయన తనను నలుగురు వ్యక్తులతో కొట్టించి బెదిరించాడని పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు త్రీ టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

జీతాలు పెంచాలని ఆందోళన

చేబ్రోలు, న్యూస్‌టుడే : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా తమ జీతాలు పెంచాలని స్థానిక ప్రాథమిక వైద్యశాల ముందు మంగళవారం ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలపై పని భారం తగ్గిస్తూ నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలన్నారు.



ప్రాథమిక వైద్యశాల ముందు ఆశా కార్యకర్తల నిరసన

ఉపాధ్యాయుడికి సత్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నెల 3న జరిగిన వేడుకలో తెనాలి ఎన్‌సీఆర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు నంది పురస్కారం అందుకున్న సందర్భంగా అభినందించి సత్కరించినట్లు ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముస్లిం విద్యార్థులకు 17న టాలెంట్ టెస్ట్

ఈనాడు, అమరావతి: ముస్లిం విద్యార్థులకు ఉచిత కార్పొరేటు విద్య అందించేందుకు ఉద్దేశించిన తాలీం-ఏ-హునర్ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. పథకానికి అర్హుల ఎంపిక గాను ఈ నెల 17వ తేదీన టాలెంట్ టెస్ట్ నిర్వహించనుంది. ఈ పరీక్షను విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, తిరుపతి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఈ పథకం కింద కార్పొరేటు కళాశాల్లో ఉచిత ఇంటర్మీడియట్ విద్య (రెసిడెన్షియల్)తో పాటు ఐఐటీ-జేఈఈ, నీట్, ఎంసెట్‌లకు ఉచిత శిక్షణ అందించనున్నారు. వసతి, భోజన సదుపాయం, ఉచితంగా పుస్తకాలు సమకూరుస్తారు. విద్యార్థినులకు 33% రిజర్వేషన్ వర్తింపజేయనున్నారు. 2026-27 విద్యాసంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్‌కు 250 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. తదుపరి 2027-28 నుంచి జూనియర్, సీనియర్ ఇంటర్‌కు 500 మంది విద్యార్థులకు పథకాన్ని వర్తింపజేస్తారు. మెరిట్ ఆధారంగా అర్హత కలిగిన విద్యార్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఇలా..

● ఆసక్తి గల ముస్లిం విద్యార్థులు http://apwaqfboard.el91.comEH/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి ● బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. ● దరఖాస్తుకు ఈనెల 12వ తేదీ తుది గడువు

అర్హత..

● ఎస్ఎస్‌సీలో 450, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు ● సీబీఎస్/ఐసీఎస్ఈలో 75%, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు ● ఆంధ్రప్రదేశ్‌లో నివాసులై ఉండాలి ● తెల్లరేషన్ కార్డుదారులు

మోసానికో సిమ్.. మొబైల్!

- ఉద్యోగం, ప్రేమ పేరిట యువతులకు వల
- భారీగా డబ్బు వసూలు చేసిన నిందితుడు శ్రీనివాస్ కిరణ్ బాబు

ఈనాడు, అమరావతి: తన ఉనికి పోలీసులకు చిక్కకుండా మోసానికో సిమ్, మొబైల్ వాడుతూ.. ఉద్యోగాలు, పెళ్లి, ప్రేమ పేరుతో యువతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న నిందితుడిని విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం కొటికలపూడికి చెందిన పూనాటి శ్రీనివాస్ కిరణ్ బాబు ఎంసీఏ చదివి, హైదరాబాద్‌లో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేశాడు. ఆ తర్వాత బెట్టింగులు, తాగుడుకు బానిసై డబ్బు కోసం మోసాల బాటపట్టాడు. విజయవాడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఫోన్ చేసి శాప్ కోర్సు సర్టిఫికేషన్ ఇస్తానని మోసం చేసేందుకు యత్నించాడు. ఆమె తిరస్కరించడంతో పలు నంబర్ల నుంచి ఫోన్లు చేసి అసభ్యంగా మాట్లాడాడు. దీనిపై సైబర్ క్రైమ్‌లో కేసు నమోదైంది. ఆ ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేయడంతో సిమ్‌లను కాకినాడలో యాక్టివేట్ చేసినట్లు తేలింది. ఆ సిమ్‌ల విక్రేతను విచారించగా.. నిందితుడి ఆనవాళ్లు దొరికాయి. దీంతో శ్రీనివాస్ కిరణ్ బాబును విజయవాడలో అరెస్టు చేశారు. అతడి నుంచి సిమ్‌లు, మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడు శ్రీనివాస్ కిరణ్ బాబు

ఇలా ఏమార్చాడు..: హోల్‌సేల్‌గా సిమ్‌లు విక్రయిస్తుంటానని చెప్పి.. నిందితుడు విజయవాడలోని ఓ దుకాణంలో గంపగుత్తగా వాటిని కొనుగోలు చేసేవాడు. ఒక్కో విడతలో 10 చొప్పున తీసుకునేవాడు. కొన్ని ఒక్కో సిమ్ ఫొటో తీసి కాకినాడలో తెలిసిన సిమ్ విక్రేతకు పంపేవాడు. అక్కడ యాక్టివేట్ చేయగానే.. నిందితుడు ఎక్కడున్నా కొత్తగా కొన్న మొబైల్‌లో దాన్ని వేసుకుని వాడుకునేవాడు. ఇలా ప్రతి మోసానికి ఇతరుల పేరుతో తీసుకునే మొబైల్, సిమ్‌లను వాడి ఆ తర్వాత వాటిని ధ్వంసం చేసేవాడు.

అంతులేని మోసాలు: తను ఉద్యోగం చేస్తున్న కంపెనీల్లో యువతులను కాకుండా.. 2020లో మ్యాట్రిమోనీ, డేటింగ్ సైట్లలో ఎకౌంట్ తెరిచి.. మోసాలు చేయడం ప్రారంభించాడు. బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నుంచి ఏకంగా రూ.44.45 లక్షలు తీసుకున్నాడు. బాధితుల వద్ద డబ్బులు లేకపోతే.. రుణాలకు దరఖాస్తు చేయించి మరీ తీసుకునేవాడు. మొత్తం రూ.2కోట్లకు పైగా మోసాలకు పాల్పడిన నిందితుడిపై తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో, బెంగళూరులో 10కి పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు మోసాలకు పాల్పడుతుండడంతో తల్లిదండ్రులు ఇంటికి రానివ్వడం లేదని తెలిసింది. ప్రస్తుతం పోలీసులు అతన్ని విచారించి, నోటీసులు ఇచ్చి పంపారు.

ఏపీలో ఉద్యాన సాగుకు మద్దతివ్వండి

- నాబార్డు అధికారులతో సీఎం చంద్రబాబు
- రూ.5.11లక్షల కోట్లతో నాబార్డు రుణ ప్రణాళిక ఆవిష్కరణ



నాబార్డు అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉద్యాన రంగాన్ని ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనకు నాబార్డు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏపీలో ఏడాదికి 450 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పత్తులు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన రూ.5.11 లక్షల కోట్లతో నాబార్డు రూపొందించిన 2026-27 రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. 2025-26 సంవత్సర అంచనా కేటాయింపులు రూ.4.24 లక్షల కోట్లు ఉండగా.. ఈ ఏడాది 20% పెంచారు. రాష్ట్ర ఆర్థికప్రగతిలో వ్యవసాయం, ఉద్యాన, ఆక్వారంగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు.

వ్యవసాయ రంగానికి రూ.2.55 లక్షల కోట్లు

నాబార్డు రుణ ప్రణాళికలో భాగంగా రంగాలవారీ అంచనాలతో రూపొందించిన స్టేట్ ఫోకస్ పేపర్‌లో వ్యవసాయరంగానికి రూ.2.55 లక్షల కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇందులో పంటరుణాలకు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధకశాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, మత్స్యరంగానికి రూ.21,098 కోట్లు, ఉద్యానరంగానికి రూ.11,961 కోట్లు, వ్యవసాయ మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లు ప్రతిపాదించింది. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన అభివృద్ధికి రూ.5,313 కోట్లు అవసరమని పేర్కొంది. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1.64 లక్షల కోట్లు ప్రతిపాదించింది. సమావేశంలో నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, జీఎం కేవీఎస్ ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరంలో గిరిజనేతర నిర్వాసితులకు..

ఇంటి నిర్మాణ సాయం పెంపు

- రూ.3.85 లక్షల నుంచి రూ.5.57 లక్షలకు..

ఈనాడు, అమరావతి: పోలవరం ముంపు వల్ల నిర్వాసితులయ్యే గిరిజనేతరులు.. సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని పెంచింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. గిరిజనేతర నిర్వాసితులకు మాత్రమే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఈ సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇక వీరికి నిర్వాసిత కాలనీల్లో ఇళ్లు నిర్మించరు. ఇప్పటివరకు సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి నిర్మాణ వ్యయం కింద రూ.2.85 లక్షలు, ఇంటి స్థలం కొనుగోలుకు రూ.లక్ష ఇచ్చేవారు. ఇవి 2017-18 సంవత్సరంలో నిర్ణయించిన ధరలు. భూముల ధరలు పెరిగినందున మరింత సాయం ఇవ్వాలని నిర్వాసితులు అభ్యర్థించారు. పోలవరం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనతో పాటు పోలవరం సవరించిన అంచనాల కమిటీ సిఫార్సుల మేరకు.. ప్రస్తుతం ఈ సాయంలో మార్పులు చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.3.57 లక్షలు, స్థలం కొనుగోలుకు రూ.2 లక్షలు ఇచ్చేలా సవరించింది. మొత్తం రూ.5.57 లక్షల సాయం అందనుంది.

ఎనిమిది దశాబ్దాలుగా అక్కడ రామాలయం ఉంది

- అన్ని పరిశీలించాకే కలెక్టర్ ఎన్‌ఓసీ జారీచేశారు
- ఆకివీడు రామాలయం విషయంలో స్పష్టం చేసిన హైకోర్టు
- అనుమతులను సవాలు చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యం కొట్టివేత

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పెద్దపేటలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్నవారికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నిర్మాణ అనుమతులను సవాలుచేస్తూ దాఖలుచేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు ప్రాథమిక దశలోనే కొట్టేసింది. ఆ స్థలం విషయంలో వివాదం ఎక్కడుందని పిటిషనర్లను ప్రశ్నించింది. ఆధారాలను పరిశీలిస్తే ఎనిమిది దశాబ్దాలుగా అక్కడ రామాలయం ఉందని, రెవెన్యూ రికార్డులు ఈ విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయని పేర్కొంది. ఆ స్థలానికి ఆనుకొని ఉన్న మరో భూమి ఎన్‌కంబరెన్స్ ధ్రువపత్రాన్ని పరిశీలిస్తే ఉత్తరం వైపు హద్దు రామాలయం ఉన్నట్లుగా రుజువు కనపడుతోందని వ్యాఖ్యానించింది. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని ప్రభుత్వ పోరంబోకుగా నిర్వచించి.. పట్టాదారు కాలమ్‌లో 'గుడి'గా పేర్కొన్నారని వెల్లడించింది. కోర్టు ముందున్న వివరాలను పరిశీలిస్తే 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉన్నట్లు నిర్ధారణ అవుతోందని వ్యాఖ్యానించింది. తహసీల్దార్, ఆర్డీవో నివేదికలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించాకే జిల్లా కలెక్టర్ రామాలయం నిర్మాణానికి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) జారీ చేశారని గుర్తుచేసింది. 8 దశాబ్దాలుగా రామాలయం ఉన్న స్థానంలో పునర్నిర్మాణం చేపట్టడం తప్పెలా అవుతుందని ప్రశ్నించింది. ఈ నిర్మాణాన్ని అక్రమ కట్టడంగా పేర్కొనలేమని తేల్చిచెప్పింది. ప్రభుత్వస్థలంలో మత సంబంధ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదన్న వాదన ప్రస్తుత రామాలయం విషయంలో వర్తించదంటూ వ్యాజ్యాన్ని కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

● ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని పెద్దపేటలోని సర్వే నంబరు 470/12లో రామాలయం నిర్మాణానికి అధికారులు అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ పెద్దపేటకు చెందిన జ్యోత్స్న, మరో ఇద్దరు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. వారి తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ భూమిలో రామాలయ నిర్మాణం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధికారులు హడావుడిగా అనుమతులు మంజూరు చేశారన్నారు. అనుమతులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చి, వ్యాజ్యాన్ని కొట్టేశారు.

మోదీ చేసే అభివృద్ధి రాజకీయాలు గమనించాలి

- అందుకే ప్రతి ఎన్నికల్లో గెలుపు సాధ్యం
- గుంటూరు జిల్లా నేతలతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ అభివృద్ధి రాజకీయాలు చేస్తున్నారని, దాన్ని అందరూ గమనించాలని పార్టీనేతలకు సీఎం చంద్రబాబు సూచించారు. గుంటూరు జిల్లా ప్రతినిధులతో సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై కొద్దిసేపు సమావేశంలో చర్చించారు. సీఎం మాట్లాడుతూ.. 'మోదీ అభివృద్ధి రాజకీయాలు దేశంలోనే గొప్ప సక్సెస్ ఫార్ములా. 25 ఏళ్లు విరామం లేకుండా సీఎం, పీఎంగా ఆయన కొనసాగుతున్నారు. మోదీ ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతోంది. దేశంలో భాజపా సాధిస్తున్న విజయాలను పార్టీ నేతలంతా గమనించాలి. ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేసినప్పుడే నాయకులకు జనామోదం ఉంటుంది. ఎమ్మెల్యేలకు ఎప్పటికప్పుడు రీచెక్ ఉండాలి. ప్రతి నేత పనితీరునూ నేను సమీక్షిస్తున్నా. ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి పనిచేస్తేనే ప్రజలకు మంచి ఫలితాలు అందుతాయి. ఎమ్మెల్యేల పనితీరు నాకు నచ్చితే సరిపోదు. ప్రజలు.. ప్రతి ఒక్కరూ మెచ్చాలి' అని సీఎం ఉద్బోధించారు. టిడ్కో గృహాల పూర్తి, భూగర్భ డ్రైనేజి పనులు, గుంటూరు ఛానల్ విస్తరణ, ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల మెరుగుదల వంటి పనులపై దృష్టిపెట్టాలని జిల్లా ప్రజాప్రతినిధులు సీఎంను కోరారు. సమావేశానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు లోకేశ్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు అబ్దుల్ నజీర్, తెనాలి శ్రవణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, జిల్లా కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ హాజరయ్యారు.

నాదెండ్ల మనోహర్‌కు పవన్‌కల్యాణ్ పరామర్శ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనోహర్ తండ్రి, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఇటీవల మరణించడంతో హైదరాబాద్‌లోని మనోహర్ ఇంటికి ఆయన వెళ్లారు. భాస్కరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్

రాత్రంతా వెలిగొండ సొరంగంలోనే మంత్రి

- కార్మికుల్లో ఉత్సాహం నింపేలా నిమ్మల పర్యటన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు సమీపంలో జరుగుతున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలోని లైనింగ్ పనులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం రాత్రి పరిశీలించారు. బెంచింగ్, లైనింగ్ పనులు నత్తనడకగా సాగుతుండటంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగు గ్యాంట్రీల్లో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. లక్ష్యంలోగా పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. రాత్రంతా అక్కడే ఉండి కార్మికుల్లో ఉత్సాహం నింపారు. ఆయన వెంట తెదేపా యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు, ఉన్నతాధికారులు ఉన్నారు.



లైనింగ్ పనుల వివరాలను మంత్రి రామానాయుడికి వివరిస్తున్న ఇంజినీర్లు

పాలిసెట్ చరిత్రలోనే అత్యధికంగా 1.48 లక్షల మంది అర్హత

ఈనాడు, అమరావతి: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్‌లో 91.37% మంది అర్హత సాధించారు. పాలిసెట్ చరిత్రలోనే ఈ ఏడాది అత్యధికంగా 1,77,581 మంది నమోదు చేసుకోగా.. 1,63,008 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,48,950 మంది అర్హత సాధించారు. పాలిసెట్ ఫలితాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా మంగళవారం విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. అనర్హులు నిరాశ చెందకుండా పట్టుదలతో కృషిచేయాలని, విజయం తప్పకుండా వరిస్తుందని సూచించారు. గతేడాది ఉత్తీర్ణత 95.36%తో పోలిస్తే ఈ ఏడాది 3.99% తగ్గినా అభ్యర్థుల సంఖ్య పెరిగింది. బాలురు 89.88%, బాలికలు 93.57% ఉత్తీర్ణులయ్యారు. ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు లేనందున పరీక్ష రాసినవారందరికీ ర్యాంకులు కేటాయించారు.

వారందరికీ ఒక్కటే మార్కు: పాలిసెట్‌లో 16మందికి 120 మార్కులకు 120 వచ్చాయి. మార్కులు సమానంగా రావడంతో పుట్టినతేదీ ప్రకారం ర్యాంకులు కేటాయించారు. వీరిలో 9మంది పశ్చిమగోదావరి జిల్లా వారే. విశాఖపట్నం నుంచి ముగ్గురు, తూర్పుగోదావరిలో ఇద్దరు ఉండగా.. కాకినాడ, తిరుపతి జిల్లాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మొదటి ఐదుర్యాంకుల్లో దోమాడ రాంగౌతమ్ (తూర్పుగోదావరి), తమరల సాయి వైష్ణ తేజ (పశ్చిమగోదావరి), జమి చేతన్ (విశాఖపట్నం), తోట మానస (పశ్చిమగోదావరి), పిండి జగన్ వెంకట నరసింహస్వామి (పశ్చిమగోదావరి) నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 265 పాలిటెక్నిక్‌లలో 84వేలకుపైగా సీట్లు ఉన్నాయి. ప్రవేశాలకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉన్నతవిద్య కమిషనర్ భరత్‌గుప్తా తెలిపారు.

మరిన్ని వివరాలు eenadu.net లో

పిడుగురాళ్ల బోధనాసుపత్రిలో 20 నుంచి ఓపీడీ సేవలు

- మంత్రి సత్యకుమార్ వెల్లడి



ఈనాడు, అమరావతి: పిడుగురాళ్ల బోధనాసుపత్రిలో ఈ నెల 20 నుంచి అవుట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) సేవలు ప్రారంభిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్య కళాశాలలు, వసతి గృహాల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకాలపై సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డీఎంఈ, డీపీహెచ్, గుంటూరు ఆర్డీ, జిల్లా కలెక్టర్ స్థాయిలో నియామకాలను ఈ నెలాఖరు లోగా పూర్తిచేయాలన్నారు. అవసరమైతే ఒప్పంద పద్ధతిలో బోధన సిబ్బందిని నియమించాలని సూచించారు. ఆసుపత్రిలో ఓపీ సేవలు అందుబాటులోకి వస్తున్న విషయం ప్రజలకు చెప్పాలన్నారు. రోగులు ఆసుపత్రికి చేరుకునేలా రవాణా సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. నిర్మాణ సంస్థ యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడి మే 20 లోగా పనులు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఇన్‌ఛార్జి డీఎంఈ రాధికారెడ్డి, డీపీహెచ్ పద్మావతి, ఏపీఎంఎస్ఐడీసీ సీఈ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

మమత ఓడారు.. ఆదిలక్ష్మి శాంతించారు!

- 21 నెలల తర్వాత పాదరక్షలు ధరించిన భాజపా నాయకురాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటమి అనంతరం 21 నెలల తర్వాత పాదరక్షలు ధరించానని భాజపా ఏపీ కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి తెలిపారు. 'గతంలో ఆ రాష్ట్రంలో పర్యటించినప్పుడు అక్కడి అణచివేత ధోరణులు తీవ్రంగా కలచివేశాయి. అంతలోనే ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన జరిగింది. ఆ సమయంలో సీఎం మమతా బెనర్జీ ఓ ప్రదర్శన చేశారు. దీంతో ఆమె గద్దె దిగే వరకు చెప్పులు ధరించకూడదని ఆ రోజే సంకల్పం తీసుకున్నా. తాజాగా వచ్చిన ఎన్నికల ఫలితాల్లో భవానీపూర్‌లో మమత ఓడిపోయారు. ఇప్పుడు పాదరక్షలు ధరించా. ఈ 21 నెలలుగా దిల్లీ, తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో తిరిగాను. చెప్పులు విడిచారా? ఎక్కడైనా మరిచిపోయారా అంటూ చాలా మంది అడిగేవారు. పాదరక్షలు లేకుండా నడిస్తే సున్నితమైన నరాలపై ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరించారు. అయినా అలానే తిరిగాను' అని ఆదిలక్ష్మి వివరించారు.



పాదరక్షలు ధరిస్తున్న భోగిరెడ్డి ఆదిలక్ష్మి

మూడు రాష్ట్రాల్లో విజయం.. మోదీ సమర్థ నాయకత్వానికి నిదర్శనం

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి, విద్యాధరపురం, న్యూస్‌టుడే: మూడు రాష్ట్రాల్లో భాజపా విజయం సాధించడం ప్రధాని మోదీ సమర్థ నాయకత్వానికి నిదర్శనమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాల్లో చరిత్రాత్మక విజయాన్ని సాధించిన సందర్భంగా మంగళవారం విజయవాడ భవానీపురంలోని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి బ్యాంకు సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాధవ్ మాట్లాడారు. 'ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలోని 20 రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఉండడం ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనం. అస్సాంలో హిమంత్ బిశ్వ శర్మ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. తమిళనాడులో హిందూ వ్యతిరేక దుష్ట డీఎంకే ప్రభుత్వాన్ని మట్టి కరిపించి విజయ్ ఎవరి ఊహకూ అందని విధంగా విజయం సాధించారు. విజయ్‌కు భాజపా తరఫున అభినందనలు. పశ్చిమ బెంగాల్‌లో దారుణాలు చూడలేక అక్కడి ప్రజలు, ముస్లింలలో చైతన్యం వచ్చింది. అందరూ మమతను తరిమికొట్టాలని నిర్ణయించుకుని భాజపాకు ఓట్లేశారు. పశ్చిమ బెంగాల్‌లో గెలుపుతో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదానానికి నిజమైన నివాళి అర్పించినట్లయ్యింది' అని మాధవ్ పేర్కొన్నారు.



భాజపా రాష్ట్ర కార్యాలయం బయట ఝాల్ మురీ కలుపుతున్న పీవీఎన్ మాధవ్

ప్రతి కార్యకర్త ప్రజల కోసం బలంగా నిలబడాలి: మాధవ్

ఈనాడు, అమరావతి: ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజల కోసం బలంగా నిలబడాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జనతా వారధి జట్టు సమావేశంలో మాట్లాడారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను నాయకుడిగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామన్నారు.

ఆర్‌సెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం

- సంవత్సరం కోల్పోవాల్సి వస్తోందంటూ అభ్యర్థుల ఆవేదన

ఈనాడు, అమరావతి: పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌సెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రవేశాల కౌన్సెలింగ్ ఉన్నత విద్యామండలి నిర్వహించాలా? ఉన్నత విద్య కమిషనరేట్ నిర్వహించాలా? అనే దానిపై స్పష్టత రాకపోవడంతో ఈ అంశం పెండింగ్‌లో పడింది. మరోవైపు కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గతేడాది నవంబరులో ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ఫలితాలను డిసెంబరు 15న విడుదల చేసింది. మొత్తం 65 సబ్జెక్టులకు నిర్వహించిన పరీక్షకు 5,164 మంది హాజరుకాగా.. వీరిలో 2,859 మంది అర్హత సాధించారు. అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరి 2-6 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఫలితాలు వచ్చి, కౌన్సెలింగ్ చేపట్టే సమయంలో అన్ని ఉమ్మడి పరీక్షల ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ఉన్నత విద్య కమిషనరేట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత ఏప్రిల్ 20న ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆర్‌సెట్ కౌన్సెలింగ్ ఎవరు నిర్వహించాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఆర్‌సెట్ కౌన్సెలింగ్ బాధ్యతలను ఉన్నత విద్య కమిషనరేట్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోని ఉత్తర్వులను సవరించింది. గతేడాది ఆర్‌సెట్ కౌన్సెలింగ్ ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల నిలుపుదల
- లోతైన విచారణ అవసరమన్న ధర్మాసనం

ఈనాడు, అమరావతి: ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) గతేడాది ఆగస్టు 29న ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఆగస్టు 29కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం తదితర కారణాలతో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీన్ని ఆయన సవాల్ చేస్తూ క్యాట్‌ను ఆశ్రయించారు. విశాల్ గున్నిని సస్పెండ్ చేయడం చెల్లదని గతేడాది ఆగస్టులో క్యాట్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ గతేడాది అక్టోబరులో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం దీనిపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. సీఎస్, డీజీపీ తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. విశాల్ గున్ని తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యాజ్యంలో లోతైన విచారణ అవసరం అని పేర్కొంటూ క్యాట్ ఉత్తర్వుల అమలును తదుపరి విచారణ వరకు సస్పెండ్ చేసింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించి, ఆగస్టుకు వాయిదా వేసింది.

ఒత్తిడి తట్టుకోలేక జూనియర్ వైద్యుడి ఆత్మహత్యాయత్నం

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: కేజీహెచ్ సర్జరీ విభాగంలో జూనియర్ వైద్యుడు డాక్టర్ బొప్పరాజు శశినాథ్ (23) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రెండు రోజులుగా ఆహారం సరిగా తీసుకోలేదని, వృత్తిపరమైన ఒత్తిడి భరించలేకపోతున్నట్లు తనకు ఫోన్ చేసి చెప్పాడని శశినాథ్ తల్లి భవాని పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. ఘటనపై విశాఖ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, వైద్య కళాశాల వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖ శంకరమఠం ప్రాంతానికి చెందిన శశినాథ్ రెండు నెలల క్రితమే ఏఎంసీ సర్జరీ విభాగంలో మొదటి ఏడాది పీజీ కోర్సులో చేరారు. సోమవారం రాత్రి 10.30 సమయంలో విధి నిర్వహణలో ఉండగా బాత్రూంకు వెళ్తున్నట్లు సిబ్బందికి చెప్పారు. అరగంటైనా రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా శశినాథ్ రెండు చేతుల మణికట్ల వద్ద రక్తస్రావం జరుగుతూ అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించారు. ఆత్మహత్యాయత్నానికి కారణం తెలియలేదని, కేసు విచారణ దశలో ఉందని వన్‌టౌన్ సీఐ పూడి వరప్రసాద్ తెలిపారు. శశినాథ్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నామని ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి తెలిపారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శశినాథ్

ఇంటర్‌లో తక్కువ ఉత్తీర్ణత నమోదైన

సబ్జెక్టు లెక్చరర్లకు నోటీసులు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో 50% కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదైన సబ్జెక్టు లెక్చరర్లు, కళాశాలలపై క్రమశిక్షణ చర్యలకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. తక్కువ ఉత్తీర్ణత సాధించిన సబ్జెక్టు లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తక్కువ ఉత్తీర్ణత నమోదైన ప్రిన్సిపాళ్లు షోకాజ్ నోటీసులకు డైరెక్టర్‌కు వివరణ ఇవ్వాలని హెచ్చరించారు. 50శాతంలోపు ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో డైరెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. తమ సబ్జెక్టులో తక్కువ ఉత్తీర్ణత సాధించిన అతిథి అధ్యాపకులను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఉత్తీర్ణత శాతం పెంచేలా వచ్చే సంవత్సరానికి సమాధానాలతో కూడిన క్వశ్చన్ బ్యాంకులు అందించాలని నిర్ణయించారు.

పాస్టర్ల ఎస్సీ ధ్రువపత్రాల రద్దుకు హైకోర్టులో వ్యాజ్యం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లకు నోటీసులు

ఈనాడు, అమరావతి: క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న పాస్టర్ల ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ కార్యదర్శి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. విచారణను జులై 6కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

● పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పాస్టర్లుగా పనిచేస్తున్నవారు పొందిన ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన పెద్దిరెడ్డి ప్రసన్నకుమార్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతినీ, దానిలోని జీవరాశుల్నీ కాపాడుకోవాల్సిందే! దీన్ని గ్రహించే కొందరు వాటి సంరక్షణ కోసం కృషి చేస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా అలాంటివాళ్లని ప్రోత్సహించడానికి యూకేకు చెందిన వైట్లీ ఫండ్ ఫర్ నేచర్ అనే సంస్థ... 'వైట్లీ అవార్డు'ను ఇస్తుంటుంది. దీనికే 'గ్రీన్ ఆస్కార్' అని పేరు. ఈ ఏడాది మన దేశానికి చెందిన ఇద్దరు మహిళలు ఆ పురస్కారానికి ఎంపికయ్యారు. వాళ్లెవరంటే...

గ్రీన్ ఆస్కార్ గెలిచారు!

జీవవైవిధ్యాన్ని కాపాడి: బర్ఖా సుబ్బా



ప్రకృతి మీద ప్రేమతో బయాలజిస్ట్ అయ్యారు బర్ఖా. ఈమెది డార్జిలింగ్. అక్కడి కొండ ప్రాంతాలపై ప్రేమతో ఆ వాతావరణాన్ని సంరక్షించాలనుకున్నారు. అందుకే కన్జర్వేషన్ సైన్స్ అండ్ సస్టెయినబిలిటీ స్టడీస్‌లో పీహెచ్‌డీ చేశారు. జూ బయాలజిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్‌గా చేసి... ఫెడరేషన్ ఆఫ్ సైంటిస్ట్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అనే ఎన్‌జీఓలో కన్జర్వేషన్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఏళ్లుగా అనేక అరుదైన జీవజాతుల సంరక్షణకి కృషి చేస్తున్నారు బర్ఖా. ముఖ్యంగా స్థానికులను కూడగట్టి హిమాలయన్ సాలమాండర్‌ని రక్షిస్తున్నారు. ఇవి ఎక్కువగా భారత్, నేపాల్, భూటాన్‌ల్లోనే కనిపిస్తాయి. అంతరించిపోతున్న జాబితాలో ఉన్నాయి. ఈ ఉభయచరాలు తమ జన్మస్థలాల్లోనే గుడ్లు పొదగడానికి వస్తాయి. అవి సరిగా లేకపోవడం, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు వాటికి అడ్డుగా మారడం గమనించి... వాటి సంతానోత్పత్తి స్థలాలను గుర్తించి రక్షిస్తున్నారు. ఇందుకోసం 'సర్వైవర్ ఆఫ్ ఎ లాస్ట్ వరల్డ్: సేవింగ్ ద హిమాలయన్ సాలమాండర్ అండ్ ఇట్స్ వెట్‌ల్యాండ్స్' అనే ప్రాజెక్టునీ ప్రారంభించారు. ఏ నిధులూ రానప్పట్నుంచీ బర్ఖా వీటి సంరక్షణ చేపడుతున్నారు. ఎకో టూరిజాన్నీ ప్రోత్సహిస్తున్నారు. ఆ కృషికే గ్రీన్ ఆస్కార్ అందింది. 'దేశ సరిహద్దుల్ని దాటి... చిత్తడి నేలల్ని, ఇలాంటి అరుదైన జీవులను రక్షించాలి. అందుకు తగ్గ ప్రోగ్రామ్‌లను ఆయా ప్రభుత్వాల అండతో రూపొందించాలన్నది నా కల' అంటారీమె.

- ఈటీవీ భారత్

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 270 మంది వైట్లీ అవార్డుకు ప్రయత్నించారు. తుది జాబితాలో ఆరుగురిని ఎంపిక చేయగా ఇద్దరు మనవాళ్లు ఉన్నారు. అవార్డులో భాగంగా విజేతలకు రూ.50లక్షలు నిధులు అందిస్తారు. అంతే కాదు, మీడియా ట్రైనింగ్, నెట్‌వర్కింగ్ వంటి అవకాశాలూ కల్పిస్తారు.

పక్షుల రక్షకురాలు: పర్వీన్ షేక్





పర్వీన్‌ది ముంబయి. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ చేసిన ఈమె బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీతో కలిసి పనిచేయడం మొదలుపెట్టారు. నదులు, వాటి చుట్టూ పెరిగే పక్షి జాతులపై పరిశోధనలు చేశారీమె. ఈ క్రమంలోనే చంబల్ నదిపై పనిచేస్తున్నప్పుడు స్కిమ్మర్ పక్షులు అంతరించిపోవడం గమనించారామె. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం ఈ పక్షులు కనిపించేది మన దేశంలోనే. సాధారణంగా ఇవి ఇసుక మేటల్లో గూడు కట్టి, గుడ్లు పెడతాయి. నదిలో నీళ్లు తగ్గిపోవడం, అకస్మాత్తుగా డ్యామ్‌ల గేట్లు ఎత్తేయడం, వేట, ఇసుక అక్రమరవాణా... ఇలాంటివెన్నో వీటి ఉనికికి ప్రమాదంగా మారాయి. దీంతో వాటి సంఖ్య క్రమేణా పడిపోవడం చూసి... పరిష్కారం కనిపెట్టాలనుకున్నారు. స్థానికులకు అవగాహన కలిగించారు. ఆసక్తి ఉన్నవాళ్లకి శిక్షణనిచ్చి 'గార్డియన్ స్కిమ్మర్'లుగా తయారు చేశారు. వీళ్లు ఈ పక్షుల గూళ్లకు రక్షణగా ఉంటారు. మానవ, జంతు ప్రమాదాల బారినుంచి కాపాడతారు. ఈమె కృషితో వీటి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దానికి గుర్తింపుగానే పర్వీన్‌కి ఎన్నో అవార్డులు వచ్చాయి. తాజాగా గ్రీన్ ఆస్కార్ వరించింది. చంబల్, గంగా నదీ పరివాహక ప్రాంతాలకే పరిమితమైన ఆమె సేవలు... ఈ అవార్డు ద్వారా వచ్చిన ఫండ్‌తో ప్రయాగ్‌రాజ్‌కీ విస్తరిస్తారట.

బంగారం - వెండి



5న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,52,910	1,37,150	2,48,580
విజయవాడ	1,47,440	1,36,750	2,49,000
ప్రొద్దుటూరు	1,50,700	1,38,640	2,44,000
రాజమహేంద్రవరం	1,49,180	1,36,750	2,65,000
విశాఖపట్నం	149,180	1,30,000	2,60,000
తమిళనాడు	-----	1,38,200	2,65,000

ఏఐ వస్తే నా ఉద్యోగం పోతుందా..!

నేనో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని. మా బృందంలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. కృత్రిమ మేధ, మానవ మేధస్సును భర్తీ చేస్తుందనే వార్తలు రోజూ చదువుతున్నా. అదే గనక నిజమైతే ముందు మా ఉద్యోగాలే పోతాయి అనిపిస్తుంది. నేను అనవసరంగా భయపడుతున్నానా? – ఓ సోదరి

మీ ఆందోళన సరైనదే. కార్పొరేట్ రంగంలో ఇప్పటికే కృత్రిమమేధ కొన్ని స్థానాల్ని పాక్షికంగా భర్తీ చేసింది. భవిష్యత్తులో పూర్తిగా చేజిక్కించుకునే అవకాశమూ ఉంది. ఆ దిశగానే పరిశోధనలూ జరుగుతున్నాయి. ఇకపోతే, కంపెనీలు ఉద్యోగుల్ని తొలగించాల్సి వచ్చినప్పుడు కింది స్థాయి నుంచి ప్రక్రియను మొదలుపెడతాయి. ఆటోమేషన్ చెక్‌లిస్ట్‌లో మహిళల పేర్లే ఎక్కువగా ఉండే ఆస్కారం లేకపోలేదు. అయితే, వీటన్నింటి గురించి ఆలోచిస్తూ మీరు మనసు పాడుచేసుకోకండి. కొత్త సాంకేతికతను చూసి భయపడటం కంటే, దానిలో మెలకువల్ని అందిపుచ్చుకోవడం మేలు. మీ రంగంలో ఏయే పదవుల్ని కృత్రిమ మేధ భర్తీ చేసే అవకాశం ఉందో రిసెర్చ్ చేసి తెలుసుకోండి. సంబంధిత వాటిలో నైపుణ్యాల్ని ముందుగానే సంపాదించుకోండి. అప్పుడు మీ పని మారుతుందే తప్ప, మీ అవసరం కంపెనీకి లేకుండా పోదు. సాంకేతికత ఏదైనా... దాన్ని సరైన విధంగా నడిపించగలిగే మానవ మేధస్సు చాలా ముఖ్యం. కాబట్టి ఆ శక్తిసామర్థ్యాల్ని మీరు సంపాదించుకుంటే మీ ఉద్యోగానికి ఏ ఢోకా ఉండదు. మీ టీమ్‌లో ఉండే మహిళల్నీ ఈ దిశగా ప్రోత్సహించండి. నాయకత్వ లక్షణాలు, కొత్త నైపుణ్యాల్ని అందిపుచ్చుకునే తెలివి, టీమ్‌ని కూడా అన్నింటిలో భాగస్వామ్యం చేయగలిగే సామర్థ్యం నలుగురిలో ఒకరిగా మిమ్మల్ని నిలబెడతాయి. ఆల్ ద బెస్ట్!

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

వేసవిలో కాస్త ప్రత్యేకంగా!



ఈ మండే ఎండల్లో మీ ఫ్యాషన్ మాత్రమే మిమ్మల్ని తళుక్కుమనేలా చేస్తుంది. వేసవి సాయంకాలాల్లో స్నేహితులతో కలిసి చేసే డిన్నర్‌ను మరింత ప్రత్యేకంగా మార్చేస్తుంది. దానికోసం ఇలా చేసి చూడండి. అందరినీ ఇట్టే ఆకర్షించేస్తారు.

ఓవర్‌సైజ్డ్... క్యాట్-ఐస్, దీర్ఘచతురస్రం లేదా వలయాకార లెన్స్ ఆకారాల్లో బోల్డ్‌ఫ్రేమ్‌ను ఎంచుకుంటే చాలు. అందరిలో ఫ్యాషన్ ఐకాన్ మీరే అవుతారు. రంగురంగుల లెన్స్‌లతోపాటు ఫంకీ స్టైల్ సన్‌గ్లాసెస్‌తో ఎండకు తెర వేయడంతోపాటు ట్రెండీగానూ కనిపించొచ్చు.

బోల్డ్‌గా... చంకీ స్టేట్‌మెంట్ నెక్లెస్, పెద్ద పెద్ద చెవి పోగులతోపాటు అల్లికలతో వస్తున్న వివిధ రకాల బ్రేస్‌లెట్స్ మీ వార్డ్‌రోబ్‌లో ఉంటే చాలు. వేసవి విందుల్లో ప్రత్యేకంగా నిలవొచ్చు. చేతికి బంగారు బ్రేస్‌లెట్‌తోపాటు వెండి లేదా రంగురంగుల గాజులు కలిపి వేసుకోవచ్చు. బోల్డ్‌గా కనిపించే ఈ అలంకరణ ఎటువంటి అవుట్ ఫిట్‌కైనా ఇట్టే నప్పుతుంది.

వైబ్రెంట్‌గా... హ్యాండ్‌బ్యాగ్‌నీ మీ స్టైల్‌లో ఓ భాగంగా చేయొచ్చు. ఎటువంటి లుక్‌నైనా ఇది ఎలివేట్ చేస్తుంది. బోల్డ్ లేదా ముదురు, లేత వర్ణాల్లో ప్రత్యేకంగా కనిపించే పెద్దపెద్ద డిజైన్ బ్యాగ్‌లు ప్రస్తుతం ట్రెండ్ అవుతున్నాయి. అలాగే నియాన్, మెటాలిక్ క్లచ్ లేదా అలంకరణగా రకరకాల పూసలు, రాళ్లు ఉన్నవాటిని ఎంచుకుంటే గ్రాండ్‌గా కనిపిస్తారు.

వీటితోపాటు మ్యాచింగ్‌ను అనుసరించకుండా రకరకాల ప్యాటర్న్‌లను కలపాలి. వెల్వెట్ దుస్తులతో లెదర్ ఆభరణాలను జత చేయడం లేదా చారల ప్యాంటుకు ఫ్లోరల్‌ప్రింట్ టాప్ జోడించడం వంటివి మనల్ని కొత్తగా కనిపించేలా చేస్తాయి. అలాగే ఎటువంటి దుస్తులతోనైనా జోడీ కట్టగలిగే మెరిసే హీల్స్, రకరకాల అలంకరణలతో లేదా స్టేట్‌మెంట్ షూలు వంటివి వార్డ్‌రోబ్‌లో ఉంటే చాలు. మాగ్జిమలిస్ట్ ఫ్యాషన్‌కు చిరునామా మీరే అవుతారంటే నమ్మండి. మరి మీరు ఏమంటారు?

చిన్నారి పెళ్లికూతురు... క్రీడాకారిణిగా మారి..!

ఓవైపు ఇంటి బాధ్యతలు. మరోవైపు పొలంలో పని. ఇన్ని బరువులూ పదేళ్ల వయసులోనే మోశారు దుర్గ కుమావత్. వాటన్నింటినీ దాటి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఆమె ఎలా ఎదిగారు?





తండ్రి సెక్యూరిటీ గార్డు, తల్లి నాలుగు ఇళ్లల్లో చిన్నాచితకా పనులు చేసేవారు. దీనికితోడు ఆరుగురు పిల్లలు. ఇదీ దుర్గ కుటుంబ పరిస్థితి. దీంతో కనీస సౌకర్యాలూ ఉండేవి కావు. కరెంటు ఎరుగరు. అయితేనేం బాగా చదువుకుని ఈ పరిస్థితి మార్చాలి అనుకునేవారట దుర్గ. అక్కతో కలిసి వీధి దీపాల కిందే చదువుకునేవారు. వీళ్లది రాజస్థాన్. అక్కడ 'ఆటా-సాటా' అనే కుండమార్పిడి వివాహ పద్ధతి ఉండేది. అది ఒక్కరాత్రిలో ఆమె తలరాతని మార్చింది. అప్పటికి దుర్గకి పదేళ్లు. బంధువుల బలవంతమ్మీద తల్లిదండ్రులు కుండ మార్పిడి పద్ధతిలో పెళ్లిచేసి అత్తారింటికి పంపారు. కోరుకున్న చదువు లేదు. ముఖం కనిపించకుండా మేలి ముసుగు. దీనికితోడు బండెడు చాకిరీ. పదేళ్లమ్మాయి అన్న విషయమే అత్తారింట్లో మరిచారు. ఇల్లు, వంట పనయ్యాక పొలంలో సాయంత్రం వరకూ పని చేయించేవారు. తిరిగి ఇంటికొచ్చాక చాకిరీ. పుట్టింటికి వెళ్లినా వెంటనే రప్పించేవారు. తన జీవితాన్ని చూసి తానే జాలిపడేవారట దుర్గ.

కొన్నాళ్లకు తండ్రికి క్యాన్సర్ అని తెలిసింది. ఆ కబురు విన్నాక అత్తారింట్లో ఉండలేకపోయారు దుర్గ. పుట్టింటికి వచ్చేశారు. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండటానికి భవన నిర్మాణ కార్మికురాలిగా, ఫ్యాక్టరీలో... ఇలా దొరికిన పనల్లా చేశారు. ఆటోమొబైల్ సంస్థలో సహాయకురాలిగానూ చేరారు. అన్నీ శారీరక శ్రమతో కూడుకున్నవే. దీంతో ఆ ప్రభావం ఆరోగ్యం మీద పడింది. తిరిగి తనని తాను దృఢంగా మార్చుకోవాలనుకున్న దుర్గకి ఎవరో జిమ్‌లో చేరమని సలహా ఇచ్చారు. అలా తెలిసిన వారిదానిలో చేరారామె. అక్కడ స్ట్రెంత్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేసేవారు. ఎంత బరువులైనా అలవోకగా ఎత్తేస్తున్న ఆమెను కోచ్ గమనించి, పవర్ లిఫ్టింగ్ ప్రయత్నించమన్నారు. అది ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. మూడు నెలల్లోనే పట్టు సాధించిన దుర్గ తొలి పోటీలోనే బంగారు పతకం సాధించారు. జాతీయస్థాయిలో 300 కేజీల బరువు ఎత్తి రికార్డు సృష్టించడమే కాదు... వెండి పతకాన్నీ గెలిచారు. ఆమె పేరు మారుమోగడంతో అత్తింటివారు తిరిగి రమ్మని ఆహ్వానించారు. అందుకు ఆమె 'మేలి ముసుగు ధరించను. ఆటను వదిలి పెట్టను' అన్న షరతు విధించారు. దానికి అత్తింటివాళ్లు ఒప్పుకోకపోవడంతో ఆ బంధం నుంచి బయటికొచ్చారు దుర్గ. 'ఒకప్పుడు నా జీవితం ముగిసిపోయింది అనుకున్నా. కానీ ఆట నాకు ధైర్యాన్నిచ్చింది. నాపై నాకు నమ్మకాన్ని పెంచింది. దాన్ని వదులుకోను' అనే దుర్గకి ఆటలో రాణించాలి, దాని ద్వారా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి... కుటుంబాన్ని ఆదుకోవాలన్నవి లక్ష్యాలట. ఈమె ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

చిన్న గ్యాడ్జెట్లతో... పెద్ద మేలు!



నచ్చినప్పుడు సలాడ్ తినే సౌలభ్యం ఉంటే భలే ఉంటుంది కదా! వేడిగా, చల్లగా ఆహారాన్ని మనకి ఇష్టమైనట్లు తినగలిగితే? తినగా మిగిలిన చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లను సీల్ చేసి దాచిపెడితే... వినడానికి బానే ఉంది కానీ, ఇదంతా ఎక్కడ సాధ్యం అవుతుందని నిట్టూరుస్తున్నారా! సాధ్యమే ఈ గ్యాడ్జెట్లు ఉంటే...


ఉష్ణోగ్రతలను నియంత్రిస్తూ...



ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో కాస్త చల్లటి ఆహారాన్ని తినడానికే ఇష్టపడతారు చాలామంది. పైగా ఐస్‌క్రీమ్, లస్సీ, మజ్జిగ వంటివి చల్లగా ఉంటేనే ఉపశమనం. కానీ ఫ్రిజ్ నుంచి తీసిన నిమిషాల్లోనే అవి చల్లదనాన్ని కోల్పోతుంటాయి. అలా కాకూడదంటే ఈ 'వాటర్-ఇంజెక్షన్ ఇన్సులేటెడ్ సర్వింగ్ బౌల్'ను వాడి చూడండి. ఈ బౌల్‌కి ఇరువైపులా రెండు చిన్న చిన్న రంధ్రాలు ఉంటాయి. వాటిలో నీళ్లు నింపి ఫ్రిజ్‌లో పెడితే... బౌల్ కూల్ అవుతుంది. బయటికి తీశాక నచ్చిన ఆహారాన్ని అందులో వేసుకుని తినొచ్చు. దాదాపు రెండు మూడు గంటల వరకూ ఉష్ణోగ్రతలను నియంత్రించే సామర్థ్యం దీనికి ఉంటుంది. అలానే వేడి నీళ్లను నింపితే... ఆహారం వేడిగానూ అవుతుంది. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేయడం వల్ల మన్నిక కూడా ఎక్కువే.

నచ్చినప్పుడు సలాడ్ తినొచ్చు...

స్నాక్స్‌గా సలాడ్, ఫ్రూట్ కట్స్‌ను తినడానికి ఇష్టపడుతున్న వాళ్ల సంఖ్య పెరుగుతోంది. కానీ తాజాదనం ఉండదని ఇంట్లో ఉన్నప్పుడే వీటిని తినడానికి ఆసక్తి చూపిస్తాం. కానీ ఈ 'సలాడ్ పాడ్ జార్' ఉంటే ఎక్కడన్నా, ఎప్పుడైనా నచ్చిన సలాడ్స్, పండ్లను తినొచ్చు. వీటిల్లో చాలావరకూ బీపీఏ ఫ్రీ ప్లాస్టిక్‌తో తయారు చేయడంవల్ల పర్యావరణహితం కూడా. లేయర్లుగా నచ్చిన కూరగాయలు, పండ్లు వేసి, పైన కప్‌లా ఉండే దానిలో సాస్‌లు వేసుకుని మూత పెట్టేస్తే సరి. అవసరం అయినప్పుడు సాస్‌ని సలాడ్స్‌తో కలిపి షేక్ చేయాలి. జార్‌కి ఒకవైపు పెద్ద మూతలా ఉంటుంది. దాన్ని తెరిస్తే బాక్స్‌లో తిన్నట్లుగానే ఉంటుంది.





సీల్ చేస్తే సరి...





సాయంత్రం అయ్యిందంటే చాలు... 'అమ్మా చిప్స్ కావాలి, బిస్కెట్లు తెచ్చి ఇవ్వు' అంటూ అడుగుతుంటారు పిల్లలు. పూర్తిగా తింటారా అంటే... సగమే తిని, పక్కన పెట్టి వెళ్లిపోతుంటారు. మరి మిగతావి వృథా కావాల్సిందేనా? అలా కాకూడదంటే ఈ '3 ఇన్ 1 మినీ బ్యాగ్ సీలర్'ని వాడి చూడండి. దీనిలో ఉండే హీట్ టెక్నాలజీ ప్యాకెట్లను సులభంగా సీల్ చేస్తుంది. అవసరం అయినప్పుడు వాటిని తెరవడానికి వీలుగా బ్లేడ్ కూడా ఉంటుంది. వెనకున్న అయస్కాంతం సహాయంతో ఫ్రిజ్, కబోర్డులకు దీన్ని అతికించొచ్చు. యూఎస్‌బీ ఛార్జర్ ద్వారా ఛార్జింగ్ చేసుకుంటే సరి. పప్పులు, ఉప్పులు ప్యాకెట్లను సీల్ చేయడానికీ దీన్ని ఉపయోగించొచ్చు.

ఆత్మరక్షణ... మన చేతుల్లోనే..!



సందేహాలు... నిపుణుల సలహాలు

ఈనాడు-వసుంధర ఉచిత వెబినార్!

ఈనాడు వసుంధర

విద్య, ఉద్యోగం, వృత్తి, వ్యాపారాల్లో రాణించాలంటే ఆడపిల్లలు, మహిళలు ఒంటరిగా ప్రయాణించాల్సిన సందర్భాలెన్నో. అలాంటి సమయాల్లో వాళ్లమీద జరుగుతోన్న దాడులూ, దారుణాలూ మరెన్నో. వాటిని తప్పించుకుని సురక్షితంగా జీవించాలంటే ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ విద్యలు తప్పక వచ్చి ఉండాలి. అంటే కరాటే, తైక్వాండో... ఇలా ఏదో ఒక యుద్ధవిద్యను నేర్చుకోవాలి. అంతే చురుకుగా ఆలోచించగలగాలి. ఆత్మవిశ్వాసంతో మెలగాలి. చుట్టూ ఉన్న పరిస్థితిని, దాడి చేసే వ్యక్తి బలాన్నీ అంచనా వేయగలగాలి. ఏ పరిస్థితిలో తప్పించుకోవాలి, ఎప్పుడు దాడికి దిగాలి, ఎవరిని సంప్రదించాలి... వంటి అనేక విషయాల గురించి అవగాహన కలిగించేందుకు ఈనాడు- వసుంధర **మే 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకూ** ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. అందులో సీనియర్ పోలీస్ అధికారి, ప్రముఖ సైకాలజిస్ట్, మార్షల్ ఆర్ట్స్ నిపుణుల సలహాలు, సూచనలతోపాటు మీ సందేహాలకు సమాధానాలూ లభిస్తాయి! ఆరోజు ఈ లింక్‌లో జాయిన్ అవ్వండి!

07.05.2026 (గురువారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/a30561f4 వెబ్ లింకు ఓపెన్ చేయండి.
జూమ్ ఐడీ: 932 2611 3959
పాస్‌కోడ్: 359201 తోనూ హాజరు కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి. లేదా https://hov.to/6b6a0ff7 వెబ్ లింకు ఓపెన్ చేయండి.

తెలుగులో ప్రచారం... ఎమ్మెల్యేగా విజయం!

తను పుట్టిన గడ్డ మీద ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు చూసి చలించిపోయారు కీర్తనా సంపత్. ఉద్యోగం వదులుకుని మరీ ఆ ప్రాంత మార్పు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. అక్కడితో ఆగితే అందరిలా తన ప్రయాణమూ కేవలం తమిళనాడు రాజకీయాలకే పరిమితమయ్యేది. కానీ ఎన్నికల్లో భాగంగా స్థానికుల్ని ఆకట్టుకోవడానికి తెలుగులో ప్రచారం చేశారీమె. దాంతో ఎవరీ అమ్మాయి అంటూ వెతికేస్తున్నారు.



కీర్తన ఓ సామాన్య యువతి. మధ్యతరగతి కుటుంబం. రాజకీయ మూలాలే లేవు. అయినా పాలిటిక్స్‌లోకి వచ్చారు. కారణం తన చుట్టూ ఉన్న పరిస్థితులే. విరుద్‌నగర్ జిల్లాలోని చత్రరెడ్డియపట్టి ఈమెది. డిగ్రీ వరకు అక్కడే చదువుకున్నారు. తర్వాత పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తిచేశారు. డేటా అనలిస్ట్‌గా ఆమెకున్న నైపుణ్యాలు పొలిటికల్ కన్సల్టెంట్‌గా అవకాశాలు తెచ్చిపెట్టాయి.

అలా ప్రశాంత్ కిశోర్ బృందంలో చేరారీమె. తర్వాత గోవా, పశ్చిమ్ బంగా ఎన్నికల్లో రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించారు కీర్తన. 2021 ఎన్నికల్లో ఎం.కె. స్టాలిన్ కోసం పనిచేశారు. చివరగా హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ- సోషల్ మీడియా లీడ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలోనే తెలుగుపై పట్టు సంపాదించారు. 'ఈ ఉద్యోగ నేపథ్యం నన్ను ఎంతగా ప్రభావితం చేసిందంటే... ఇంతమంది నాయకుల గెలుపుని తెరవెనకుండి నడిపిస్తున్నా... సొంత జిల్లాకు ఏం చేయలేకపోతున్నా అన్న ఆలోచనలో పడేసింది. నేను పుట్టిపెరిగిన జిల్లాలో ఎటు చూసినా సమస్యలే. దేశానికే బాణసంచా రాజధాని శివకాశి. ఇక్కడ జరిగే అగ్ని ప్రమాదాల వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు చాలానే. తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు... వంటి మౌలిక సదుపాయాలు కూడా కరవే. డిగ్రీ, ఇంజినీరింగ్ చదివి యువత ఉద్యోగాల కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిందే. అలా వెళ్లడం ఇష్టం లేని వాళ్లు చిన్న దుకాణాలు పెట్టుకుని, ట్యాక్సీ డ్రైవర్లుగా స్థిరపడటం చూశా. అంతెందుకు నేనూ అలా వెళ్లినదాన్నే. ఈ పరిస్థితుల్లో మార్పు తేవాలన్నదే నా ప్రయత్నం. అందుకే ఉద్యోగం మానేసి సొంతూరుకు వచ్చేశా. సామాజిక మాధ్యమాల నిర్వహణపై నాకున్న పట్టును ఆసరాగా చేసుకుని... స్థానిక సమస్యల గురించి వీడియోలు పోస్ట్ చేయడం మొదలుపెట్టా. ఎన్జీవోలతో పనిచేస్తూ విద్యార్థులకు అదనపు నైపుణ్యాలు నేర్పే శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటుచేశా' అనే కీర్తన అనతి కాలంలోనే లక్షల సంఖ్యలో ఫాలోయర్లను సంపాదించుకున్నారు. ఆ ఫాలోయింగ్‌ని చూసే తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ ఎన్నికలకు సరిగ్గా నెల ముందు శివకాశి అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను ఆమెకు ఇచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న కీర్తన తనదైన శైలిలో ప్రచారం మొదలుపెట్టారు. కొన్నిచోట్ల ప్రచార కార్యక్రమాల్లో తెలుగులో మాట్లాడి సంబంధిత వర్గాన్ని ఆకట్టుకున్నారు కూడా. తాజా ఎన్నికల్లో ప్రత్యర్థిపై వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారీమె. శివకాశిలో పోటీ చేసి గెలిచిన తొలి మహిళా ఎమ్మెల్యే కూడా కీర్తననే. మరి తను అనుకున్నది సాధించాలని కోరుకుందామా!

ఆహ్వానం వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

గ్రాఫిక్ కథనానికి పులిట్జర్!



పాత్రికేయ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ అవార్డుకు భారతీయ జర్నలిస్టు సుపర్ణ శర్మ ఎంపికయ్యారు. 2026 కిగానూ ఇల్లస్ట్రేటెడ్ రిపోర్టింగ్, వ్యాఖ్యానం విభాగంలో అవార్డు అందుకోనున్నారీమె. లఖ్‌నవూకు చెందిన ఓ వైద్యురాలి డిజిటల్ అరెస్ట్ అనుభవాన్ని 'ట్రాప్డ్' పేరుతో గ్రాఫిక్ కథన రూపంలో వినూత్నంగా అందించారు. ఆ సమయంలో వైద్యురాలు దాదాపు రూ.2.5కోట్లు పోగొట్టుకున్నారు. బొమ్మలు వేసిన ఆనంద్ ఆర్యే, కథన రచనలో భాగమైన బ్లూమ్‌బర్గ్‌కు చెందిన జర్నలిస్ట్ నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి ఈ అవార్డు అందుకోనున్నారు సుపర్ణ. అమెరికాకు చెందిన పత్రిక బ్లూమ్‌బర్గ్‌లో గత డిసెంబరులో 'ట్రాప్డ్' ప్రచురితమైంది.

జర్నలిజంలో సుపర్ణకు 30 ఏళ్ల అనుభవం ఉంది. దేశంలో పలు ప్రముఖ ఆంగ్ల పత్రికల్లో పనిచేశారు. ప్రస్తుతం స్వతంత్ర జర్నలిస్ట్, ఎడిటర్‌గా అల్ జజీరా, రోలింగ్ స్టోన్ ఇండియా, బీబీసీ లాంటి అంతర్జాతీయ సంస్థలకు కథనాలు రాస్తున్నారు. నేరాలు, అంతర్గత యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అవినీతి... తదితర అంశాలపైన కథనాలు రాస్తూ వచ్చారీమె. నిజాలను నిర్భయంగా రాయగల జర్నలిస్ట్‌గా పేరొందారు. దిల్లీలో ఓ వృద్ధాశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు సీనియర్ సిటిజన్లు చనిపోయారు. అధికారుల సాయంతో ఆ సంస్థ వాస్తవాలు బయటకు రాకుండా చేయడంపైన పరిశీలనాత్మక కథనం అందించారు సుపర్ణ. ఇది 2023లో అల్ జజీరాలో ప్రచురితమైంది. మహిళా బాక్సర్లు రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపైన లైంగిక వేధింపుల గురించి మాట్లాడినప్పుడు లోతైన పరిశీలనాత్మక కథనం రాశారు. భారత్‌లో అత్యుత్తమ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కాలేజీల గ్రాడ్యుయేట్‌లు ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్యపెట్టడానికి, పక్కదారి పట్టించడానికి పొలిటికల్ కన్సల్టెన్సీగా మారడంపైన పరిశోధనాత్మక కథనం రాశారు. 'మీ టూ' సమయంలో అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న ఓ సీనియర్ జర్నలిస్టు విషయంలోనూ గళం విప్పారు. 'ఇల్లు, సమాజం, రాజకీయాలు, ప్రభుత్వ యంత్రాంగం, ఆర్థిక శక్తి... అన్నింటా పురుషాధిక్యం నడుస్తోంది. ప్రతిచోటా మహిళలు వేధింపులు ఎదుర్కొంటున్నారు. వీటిని అడ్డుకోవాలంటే తమకు ఎదురైన చేదు అనుభవాల గురించి మహిళలు మాట్లాడాలి' అంటారు సుపర్ణ.

పచ్చని సంతకం



మన పేరును పేపర్ మీద పెన్నుతో రాస్తాం, చాక్‌పీస్‌తో బోర్డు మీద రాస్తాం. కానీ, ఎప్పుడైనా మట్టిలో విత్తనాలతో రాశారా? అదే గ్రీన్ సిగ్నేచర్. ఇది సరదా గార్డెనింగ్ యాక్టివిటీ.


- వెడల్పుగా ఉండే ప్లాస్టిక్ టబ్ తీసుకోవాలి. అందులో మట్టిని సమానంగా పరచాలి.
- చిన్న పుల్ల లేదా వేలితో మట్టిపై మీ పేరును పెద్ద అక్షరాలతో రాయండి.

సెలవుల్లో సరదాగా!

- మీరు గీసిన అక్షరాల వెంబడి సన్నని విత్తనాలను దగ్గర దగ్గరగా వేయండి.
- ఆపైన.. విత్తనాల మీద తేలిగ్గా మట్టి చల్లండి. స్ప్రే బాటిల్‌తో నీళ్లను తీసుకుని, మెల్లగా విత్తనాలు కదిలిపోకుండా తడపాలి.
- మొలకలు అయితే కేవలం 3-4 రోజుల్లోనే మొలకలు వస్తాయి. మన పేరు పచ్చగా మెరిసిపోతుంది. ప్రయత్నిస్తారా మరి?



భలే భలే బటన్ ట్రీ



మనింట్లో పాత చొక్కాలకి ఊడిపోయిన బటన్స్ ఉంటాయి కదా? వాటిని పారేయకుండా, ఒక రంగుల చెట్టును సృష్టిద్దాం. అదే 'బటన్ ట్రీ ఆర్ట్'. ఇది చేయడానికి మనకు తెల్లటి డ్రాయింగ్ పేపర్ లేదా చార్ట్, బ్రౌన్ కలర్ పెయింట్ లేదా మార్కర్, రంగు రంగుల బటన్స్, ఫెవికాల్ కావాలి.

- పేపర్ మీద బ్రౌన్ కలర్ పెయింట్‌తో ఒక పెద్ద చెట్టు కాండాన్ని, దాని కొమ్మలను గీయాలి.
- ఆ కొమ్మలకు అందంగా పెయింట్ వేయండి. ఇది ఆరిపోయే వరకు కొంచెం సేపు ఆగండి.
- ఇప్పుడు కొమ్మల మీద అక్కడక్కడా గమ్ పెట్టి, మీ దగ్గరున్న రంగు రంగుల బటన్స్ అతికించండి. పెద్దవి, చిన్నవి కలిపి పెడితే భలే కనిపిస్తుంది.
- మీకు నచ్చితే ఆకుల మధ్యలో చిన్న చిన్న పువ్వులు, సీతాకోక చిలుకలు కూడా డ్రా చేయొచ్చు.



మన అవసరాల మేరకు లైన్లు.. రైళ్లు

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో సాకారం

- ముడసర్లోవ వద్ద జీఎం కార్యాలయం నిర్మాణం
- ఈ నెల 20 కల్లా ఉద్యోగుల కేటాయింపు పూర్తి!



కొత్తవలస-కిరండూల్ మార్గం

ఈనాడు– అమరావతి, విశాఖపట్నం

దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ నుంచి అమల్లో వస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనాలపై చర్చ మొదలైంది. ఇప్పటిదాకా రాష్ట్రంలో వివిధ మార్గాల్లో రద్దీకి అనుగుణంగా రైళ్లు పూర్తిస్థాయిలో పెంచేందుకు అవకాశం లేకపోయింది. ఉత్తరాంధ్ర జిల్లాలు భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో, మిగిలిన జిల్లాల్లో సింహభాగం సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉండేవి. దీంతో ప్రయాణికుల ప్రయోజనాల కంటే, జోన్ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చేవారు. కొత్తగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రావడంతో మన పరిధిలో రైళ్లు మనమే పెంచుకోవచ్చు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా కొత్తగా రైళ్లు నడుపుకోవచ్చు.

■ ఇప్పటిదాకా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి విశాఖపట్నం శివారు తాడి వరకు ఉంది. ఆ తర్వాత దువ్వాడ నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఉండేది. దీంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు రైళ్లను విశాఖ వరకే నడిపేది. దక్షిణ మధ్య రైల్వే కూడా పండుగలు, సెలవుల సమయంలో హైదరాబాద్, సికింద్రాబాద్, చర్లపల్లి నుంచి ప్రత్యేక రైళ్లను అనకాపల్లి వరకే నడుపుతోంది. విశాఖ, శ్రీకాకుళం రోడ్ వరకూ నడిపితే.. రాబడి ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌కు వెళ్తుందన్న భావనతో అధికారులు ఉండేవారు. ఇకపై ఇచ్ఛాపురం, శ్రీకాకుళం రోడ్, విశాఖపట్నం నుంచి.. తిరుపతి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాలకు కొత్త రైళ్లు నడిపేందుకు వీలుంటుంది.

■ విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రెండు నగరాల మధ్య నడిచేలా విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెస్తే.. కొంతకాలానికి దాన్ని విశాఖ నుంచి కాకుండా, భువనేశ్వర్ నుంచి మొదలయ్యేలా మార్చారు. దీనివల్ల వాల్తేరు డివిజన్, విజయవాడ డివిజన్ల పరిధిలో బెర్తుల కోటా తగ్గిపోయింది.

■ గతంలో విశాఖపట్నం నుంచి పుట్టపర్తి మీదుగా బెంగళూరుకు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను సైతం భువనేశ్వర్‌కు మార్పు చేశారు. ఇకపై ఇలాంటి అహేతుక మార్పులకు అడ్డుకట్ట వేయొచ్చు.



విశాఖపట్నంలో నిర్మాణంలో ఉన్న దక్షిణ కోస్తా రైల్వే జీఎం కార్యాలయం



జీఎం కార్యాలయ ఆకృతి

నాడు కన్‌స్ట్రక్షన్ విభాగాన్ని తరలించి..

గతంలో కోల్‌కతా కేంద్రంగా ఉండే సౌత్ ఈస్ట్ రైల్వే జోన్ పరిధిలో.. విశాఖ కేంద్రంగా వాల్తేరు డివిజన్ ఉండేది. అప్పట్లో ఆగ్రా, బెనారస్, చక్రధర్‌పుర్, ఖరగ్‌పుర్, ఖుర్దారోడ్, నాగ్‌పుర్, వాల్తేరు డివిజన్లకు కలిపి కీలకమైన కన్‌స్ట్రక్షన్ విభాగం ప్రధాన కార్యాలయం విశాఖలోనే ఉండేది. తర్వాత భువనేశ్వర్ కేంద్రంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పడినప్పుడు విశాఖలోని కన్‌స్ట్రక్షన్ విభాగాన్ని, అక్కడి అధికారులను భువనేశ్వర్‌కు తరలించారు. దీంతో విశాఖ కేంద్రంగా జోన్ ప్రకటించాలన్న డిమాండ్ అప్పట్లోనే పురుడుపోసుకుంది.

భూములివ్వకుండా చేతులెత్తేసిన వైకాపా సర్కారు

కొత్త జోనల్ కార్యాలయాలు, ఇతర భవనాల నిర్మాణానికి 2020-21లో కేంద్ర బడ్జెట్‌లో రూ.170 కోట్లు కేటాయించారు. ముడసర్లోవలో రైల్వేకి చెందిన 53 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. 2019 ఫిబ్రవరిలో జోన్ ఏర్పాటుపై కేంద్రం ప్రకటన చేశాక.. అదే ఏడాది రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చింది. రైల్వే అధికారులు భూముల స్వాధీనానికి ప్రయత్నించగా, రైతులు అడ్డుకున్నారు. దీనిపై జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అప్పగించనందునే.. జోన్ పనుల్లో జాప్యమవుతోందని 2024 ఫిబ్రవరి 1న లోక్‌సభలో రైల్వే మంత్రి ప్రకటించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, 53 ఎకరాలు రైల్వే శాఖకు అప్పగించడంతో జోనల్ కార్యాలయ నిర్మాణ పనులు మొదలయ్యాయి.

అరకు కావాలని అడిగినా..

■ ఇప్పటి వరకు వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కిరండూల్ లైన్ (కేకే లైన్) 442 కి.మీ. ఉండగా, అందులో ఏపీ పరిధిలోని కొత్తవలస-అరకు సెక్షన్ (105 కి.మీ.)ను విశాఖపట్నం డివిజన్‌లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. రైల్వే శాఖ దీన్ని రాయగడ డివిజన్‌కు కేటాయించింది. రాష్ట్రంలో ముఖ్య పర్యాటక కేంద్రంగా అరకుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ మార్గంలోనే బొర్రా రైల్వే స్టేషన్ కూడా ఉన్నందున దీన్ని విశాఖ డివిజన్‌లో ఉంచాలన్న డిమాండ్ నెరవేరలేదు.

■ ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ (53 కి.మీ.) విశాఖపట్నం డివిజన్‌లోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, రైల్వే శాఖ సమ్మతించింది.

■ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కర్నూలు-డోన్ సెక్షన్ (53 కి.మీ.) దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి తేవాలని కోరగా, పరిగణనలోకి తీసుకోలేదు.

■ గుంతకల్లు డివిజన్‌కు చెందిన రాయచూరు-వాడి, గుంటూరు డివిజన్‌లో కొనసాగిన విష్ణుపురం-పగిడిపల్లి లైన్లను సికింద్రాబాద్ డివిజన్‌లోకి మార్చారు. పలు అవసరాల నిమిత్తం వాటిని ఆ డివిజన్‌కు మార్చాల్సి వచ్చింది.

ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ షురూ

విశాఖలోని వీఎంఆర్‌డీఏ డెక్ భవనంలో జోనల్ కార్యాలయానికి తాత్కాలిక ఏర్పాట్లు చేయగా, అందులో సిబ్బంది 3 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జూన్ నుంచి ఇది పూర్తిస్థాయిలో తాత్కాలిక జోనల్ కార్యాలయం కానుంది. ఈ కార్యాలయానికి 128 మంది అధికారులు, 1,100 మంది సిబ్బంది అవసరమని గుర్తించారు. సౌత్ సెంట్రల్, ఈస్ట్ కోస్ట్, సదరన్, సెంట్రల్ రైల్వే జోన్లలో పనిచేస్తున్న ఏపీ.. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన ఉద్యోగులు 3,700 మంది విశాఖకు వస్తామంటూ దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,100 మందిని ఎంపికచేసే ప్రక్రియ ఈనెల 20కి పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.


డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చాకే..



2024 అక్టోబరు 8న దిల్లీలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలు అందిస్తున్న సీఎం చంద్రబాబు

- 2024 ఆగస్టులో ముడసర్లోవలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం కోసం 52.2 ఎకరాల భూమి కేటాయింపు.
- 2024 అక్టోబరులో సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి దిల్లీలోని తన అధికార నివాసం 1-జనపథ్‌లో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి త్వరగా శంకుస్థాపన చేయాలని, వాల్తేరు డివిజన్‌ను యథాతథంగా ఉంచాలని, రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు వేయాలని విజ్ఞప్తి.
- 2025 జనవరి 8న రూ.183.58 కోట్లతో తలపెట్టిన జోనల్ ప్రధాన కార్యాలయానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన.
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.55 కోట్ల బడ్జెట్ కేటాయింపు. అందులో మార్చి నాటికి రూ.32.31 కోట్ల వ్యయం.
- జోన్ ప్రధాన కార్యాలయానికి అనుబంధంగా ఉద్యోగుల గృహసముదాయం, ఇతర పనుల కోసం అదనంగా రూ.157.93 కోట్ల కేటాయింపు.
- కొత్త జోన్ కార్యాలయం అందుబాటులోకి వచ్చేవరకు వీఎంఆర్‌డీఏ భవనంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు తాత్కాలికంగా ప్రారంభం. అందులో జనరల్ మేనేజర్, ఇతర సీనియర్ మేనేజర్ల నియామకం. కంట్రోల్ ఆఫీస్ ఏర్పాటు. కొత్త జోన్‌లో పని చేయడానికి నాన్ గెజిటెడ్ ఉద్యోగుల నుంచి ఆప్షన్ల స్వీకరణ.

రాష్ట్ర అభివృద్ధికి ఇతోధికంగా దోహదం



–ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై రాష్ట్ర విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు. జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణారంగ ముఖచిత్రాన్ని మారుస్తుంది. కొత్తగా ఏర్పాటైన విశాఖ, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. రాష్ట్ర అభివృద్ధికి, ఉత్తరాంధ్ర పారిశ్రామిక విస్తరణకు ఇది ఇతోధికంగా దోహదం చేస్తుంది.


రైల్వే నెట్‌వర్క్ మరింత బలోపేతం



–ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

దక్షిణ కోస్తా రైల్వే జోన్ గెజిట్ ప్రకటన చరిత్రాత్మక నిర్ణయం. ఇది రాష్ట్ర అభివృద్ధికి కొత్త అడుగు. రవాణా వ్యవస్థను వేగవంతం చేస్తుంది. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తుంది. ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టిస్తుంది. రాష్ట్రానికి గర్వ కారణంగా నిలిచే ప్రకటన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు. కొత్త రైల్వే జోన్ సాకారానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్నా.

రైల్వే హబ్‌గా విశాఖ



–భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం ప్రధాని మోదీకే సాధ్యం. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో విశాఖ ప్రాంతం రైల్వే హబ్‌గా ఎదుగుతుంది. కొత్త సర్వీసులతో పాటు సేవలు మెరుగుపడతాయి. పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఎగుమతులు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులువవుతుంది. విశాఖలో విశాల స్థలంలో ఆధునిక పరిపాలన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ జోన్ వల్ల సుమారు 15 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

రైల్వే జోన్ స్వప్నం సాకారం

దక్షిణ మధ్య రైల్వే-దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ల సరిహద్దులు

సెక్షన్	డివిజన్ సరిహద్దు ఏ కి.మీ. వద్ద	ఏ డివిజన్ల మధ్య
గుంతకల్లు-రాయచూరు	562.00	గుంతకల్లు-సికింద్రాబాద్
విజయవాడ-ఖమ్మం	525.00	విజయవాడ-సికింద్రాబాద్
నడికుడి-బీబీనగర్	138.40	గుంటూరు-సికింద్రాబాద్
రాయచూరు-గద్వాల	1.49	హైదరాబాద్-సికింద్రాబాద్★
కృష్ణా-దేవరకద్ర	1.90	హైదరాబాద్-సికింద్రాబాద్★

★ ప్రస్తుతం గుంతకల్లు-హైదరాబాద్ డివిజన్ల మధ్య ఉన్న ఈ సరిహద్దును హైదరాబాద్-సికింద్రాబాద్ డివిజన్ల మధ్య సరిహద్దుగా మార్చారు.

దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే జోన్ల మధ్య సరిహద్దుల మార్పులు

సెక్షన్	రూట్ కి.మీ.	ఏ డివిజన్ నుంచి	ఏ డివిజన్‌కు
రాయచూరు-వాడి	108	గుంతకల్లు	సికింద్రాబాద్
విష్ణుపురం-పగిడిపల్లి-జాన్‌పహాడ్	142	గుంటూరు	సికింద్రాబాద్
కొండపల్లి-మోటుమర్రి (మినహాయించి)	46	సికింద్రాబాద్	విజయవాడ

దక్షిణ కోస్తా-తూర్పు కోస్తా రైల్వే జోన్ల సరిహద్దులు

సెక్షన్	డివిజన్ సరిహద్దు ఏ కి.మీ. వద్ద	ఏ డివిజన్ల మధ్య
సింగపురం రోడ్డు జంక్షన్-విజయనగరం జంక్షన్	363.385	రాయగడ-విశాఖపట్నం
కొత్తవలస జంక్షన్-కిరండూల్	3.692	రాయగడ-విశాఖపట్నం
నౌపడ జంక్షన్-గుణుపుర్	36.940	రాయగడ-విశాఖపట్నం
విజయనగరం జంక్షన్-పలాస-ఇచ్ఛాపురం	624.760	ఖుర్దా రోడ్డు-విశాఖపట్నం
రాయపుర్-సింగపురం రోడ్డు	327.132	రాయగడ-సంబల్‌పుర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. వారం రోజుల్లోనే సంబంధిత గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యేలా చూశారు. దీంతో భారతీయ రైల్వేలో మొత్తం జోన్ల సంఖ్య 18కి చేరనుంది.

12 ఏళ్లలో ఎన్నో పరిణామాలు

విశాఖపట్నం రైల్వే జోన్ సాధన వెనుక సుదీర్ఘ పోరాటాలు, నిరంతర ప్రయత్నాలున్నాయి. 2014 నుంచి 2018 వరకు ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెదేపా.. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన ప్రత్యేక హోదాతో పాటు రైల్వే జోన్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ అప్పట్లో కూటమి నుంచి వైదొలిగింది. ఆ తరుణంలోనే.. ఎన్నికల ముంగిట 2019 ఫిబ్రవరి 27న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం తరఫున నాటి రైల్వే మంత్రి పీయూష్ గోయల్ అధికారిక ప్రకటన చేశారు. 'విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పుడున్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు అందులో భాగమవుతాయి. వాల్తేర్ డివిజన్‌ను రెండు భాగాలుగా విడదీస్తాం. అందులో ఒక భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో చేర్చి పొరుగున ఉన్న విజయవాడ డివిజన్‌లో విలీనం చేస్తాం. మిగతా భాగాన్ని తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తాం. దక్షిణ మధ్య రైల్వేలో హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్లు ఉంటాయి' అని ప్రకటించారు. అయితే కొత్త రైల్వే జోన్ ఏర్పాటు పేరుతో చారిత్రక నేపథ్యమున్న వాల్తేర్ డివిజన్‌ను చీల్చి, దాని మనుగడను ప్రశ్నార్థకం చేయడమేంటని ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో పాటు పలువురు రైల్వే నిపుణులు కేంద్రాన్ని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు దీనిపై దిల్లీకి లేఖలు రాశారు. దీంతో కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుంది. వాల్తేర్ డివిజన్‌ను రెండుగా విభజించినా.. అందులో 463 రూట్ కి.మీ. భాగాన్ని విజయవాడలో విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకొని, విశాఖ కేంద్రంగా కొనసాగించాలని నిర్ణయించింది. మిగతా 696 రూట్ కి.మీ. భాగాన్ని రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేసిన కొత్త రైల్వే డివిజన్‌లో కలిపింది.

463 రూట్ కిలోమీటర్లతో విశాఖపట్నం డివిజన్

స్టేషన్లు (జ్యూరిస్‌డిక్షన్ ప్రాంతం)	రూట్ కి.మీ.
ఇచ్ఛాపురం-పలాస-విశాఖపట్నం-దువ్వాడ	270
విజయనగరం-కూనేరు	102
నౌపడ జంక్షన్-పర్లాఖెముండి (మినహాయింపు)	39
బొబ్బిలి జంక్షన్-సాలూరు పరిసర లైన్లు	17
సింహాచలం ఉత్తరం-దువ్వాడ బైపాస్ వడ్లపూడి-దువ్వాడ విశాఖపట్నం-జగ్గయ్యపాలెం	35
మొత్తం	463

★ ప్రస్తుతం ఖుర్దా రోడ్డు డివిజన్‌లోని 53 రూట్ కిలోమీటర్ల పలాస-ఇచ్ఛాపురం లైన్‌ను విశాఖపట్నం డివిజన్‌లోకి మార్చారు.

వాల్తేరు డివిజన్‌లోని ఏయే ప్రాంతాలు రాయగడ డివిజన్‌లోకి వెళ్తాయంటే?

సెక్షన్ జ్యూరిస్‌డిక్షన్ ప్రాంతం	రూట్ కి.మీ.
కోరాపుట్-సింగపురం రోడ్డు	164
కొత్తవలస (మినహాయించి)-కిరండూల్ (కేకే లైన్)	442
కూనేరు (మినహాయింపు)-తెరువలి (మినహాయింపు)	36
గుణుపుర్-పర్లాఖెముండి	54
మొత్తం	696

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కోసం ఇప్పుడున్న దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే జోన్ల సరిహద్దులను కేంద్రం మార్చింది. దాని ప్రకారం కొత్త జోన్ల స్వరూపం ఇలా ఉంటుంది.

దక్షిణ కోస్తా రైల్వే జోన్– విశాఖపట్నం: దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి విడదీసిన గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు, తూర్పు కోస్తా జోన్‌లో ఉన్న వాల్తేరు డివిజన్‌ను మార్చి ఏర్పాటు చేసిన విశాఖపట్నం డివిజన్

తూర్పు కోస్తా రైల్వే జోన్– భువనేశ్వర్: ప్రస్తుత సంబల్‌పుర్ డివిజన్, సవరించిన ఖుర్దా రోడ్డు, రాయగడ డివిజన్లు

దక్షిణ మధ్య రైల్వే– సికింద్రాబాద్: ప్రస్తుత హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు, సవరించిన సికింద్రాబాద్ డివిజన్.

గుంతకల్లు-వాడి మధ్య 3, 4 లైన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు నాలుగేళ్లు లక్ష్యంగా నిర్దేశించారు. దివంగత ప్రధానమంత్రి వాజ్‌పేయీ స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టగా, ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైల్వేలో అత్యధిక రద్దీ ఉన్న ఏడు మార్గాలను ఎంచుకొని వాటి బలోపేతంపై దృష్టిసారించినట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2 మెగా వంతెనలు, 35 పెద్ద వంతెనలు, 382 చిన్న వంతెనల నిర్మాణం చేపడతారు. ఈ మార్గం పొడవు 230 కిలోమీటర్లు అయినప్పటికీ ట్రాక్ పొడవు మొత్తం 502 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతం ఈ రైల్వేమార్గం 90% సామర్థ్యంతో నడుస్తోంది. ముమ్ముందు రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు 3, 4 లైన్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు.

▼ దీనివల్ల కర్ణాటకలోని రాయచూరు, ఎరమరస్, బళ్లారిల్లో ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు అవసరమైన బొగ్గును.. వివిధ బొగ్గు గనులతోపాటు, కృష్ణపట్నం పోర్టు నుంచి రవాణా చేయడానికి వీలవుతుంది. అలాగే న్యూమంగుళూరు పోర్టు, కాకినాడ పోర్టుల నుంచి ఈ ప్రాంతానికి ఎరువుల సరఫరా సులభమవుతుంది. కర్నూలు జిల్లాలోని మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం, అనంతపురం జిల్లాలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, రాయచూరు కోటలాంటి ఆధ్యాత్మిక, చారిత్రక స్థలాలకు రాకపోకలు సులభతరంగా మారుతాయి. ఈ లైన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏటా 17.4 మిలియన్ టన్నుల మేర అదనపు సరకు రవాణా సాధ్యమవుతుంది. దీనివల్ల 36 కోట్ల కేజీల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. అది 1.4 కోట్ల మొక్కల పెంపకంతో సమానం. సరకు రవాణా రహదారి మార్గం నుంచి రైలు మార్గానికి మళ్లడం వల్ల ఏడాదికి రూ.801 కోట్లు ఆదా అవుతుంది. ఈ లైన్ల నిర్మాణ సమయంలో 156 లక్షల మానవ పనిదినాలు లభ్యమవుతాయి. దీంతోపాటు మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని నాగ్దా-మథుర మధ్య రూ.16,403 కోట్లతో 568 కి.మీ., ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుర్వాల్-సీతాపుర్‌ల మధ్య రూ.2,276 కోట్లతో 103 కి.మీ. మేర 3, 4 లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 7 రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా సాగే ఈ లైన్ల వల్ల 901 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ పెరుగుతుంది. మొత్తం రూ.23,437 కోట్ల విలువైన ఈ మూడు ప్రాజెక్టులను 2030-31 కల్లా పూర్తి చేయాలన్నది లక్ష్యం.

పాలకోవాలో విషం పెట్టి భార్య హత్య

- లావు కావడంతో పాటు తనను అనుమానిస్తోందని భర్త ఘాతుకం



కిరణ్‌కుమార్, పద్మజ దంపతులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భార్య లావుగా మారడంతో పాటు తనను అనుమానిస్తోందని కక్ష పెంచుకున్న భర్త.. పాలకోవాలో విషం కలిపి ఆమెను హత్య చేశాడు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో గత నెలలో జరిగిన ఈ ఉదంతం పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి వచ్చింది. ఏఎస్పీ విబూ కృష్ణ మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరుకు చెందిన భద్రిపల్లి కిరణ్‌కుమార్ ఎనిమిదేళ్ల కిందట ముద్దనూరులోని కొత్తకొట్టాలకు చెందిన పద్మజ (31)ను పెళ్లి చేసుకుని, ఇల్లరికం అల్లుడిగా వెళ్లాడు. వీరికి ఓ కుమార్తె సంతానం. కిరణ్ ఐదేళ్లుగా ఇంటి వద్ద ఉంటూనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల భార్య లావుగా మారిందని, మాంసాహారం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకురమ్మంటోందని, పైగా తనను అనుమానిస్తోందని అతడు పద్మజపై కక్ష పెంచుకున్నాడు. భార్యను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. అనంతరం తన తల్లిదండ్రులను చూసొద్దామని చెప్పి భార్యను ప్రొద్దుటూరుకు తీసుకువెళ్లాడు. అక్కడ గత నెల 29న పాలకోవాలో విషం కలిపి ఆమెకు తినిపించి హత్య చేశాడు.

గూగుల్‌లో వెతికి మరీ హత్యకు ప్రణాళిక


విషంతో భార్యను చంపడం ఎలా అని యూట్యూబ్, గూగుల్‌లో కిరణ్‌కుమార్ వెతికాడు. ఓ వీడియోలో నంబర్ ఉండటంతో ఫోన్ చేసి మాట్లాడాడు. రూ.80 వేలకు ఒప్పందం కుదుర్చుకుని, గతనెల 29న కొరియర్ ద్వారా ప్రొద్దుటూరుకు విషం తెప్పించుకున్నాడు. అదే రోజు దాన్ని పాలకోవాలో కలిపి భార్యకు ఇచ్చాడు. కాసేపటికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం ఆమె ముఖంపై తలదిండుతో గట్టిగా అదిమి ఊపిరాడకుండా చేసి, చంపేశాడు. తర్వాత 3 గంటల పాటు మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచాడు. ఈ కేసు తన పైకి రాకుండా ఉండేందుకు గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. శవపరీక్షల అనంతరం కొన్ని ఆధారాలు దొరకడంతో భర్త కిరణ్‌కుమార్‌ను విచారించగా వాస్తవం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేశారు.

ఛాంపియన్



టోర్నీ ఆరంభంలో వరుసగా పరాభవాలు చవిచూసిన చెన్నై.. నెమ్మదిగానే అయినా, క్రమంగా పుంజుకుంటోంది. పది మ్యాచ్‌ల్లో అయిదో విజయంతో ఐపీఎల్ 2026లో తన ప్లేఆఫ్స్ అవకాశాలకు ఇంకాస్త బలం చేకూర్చుకుంది. ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో సీఎస్కే.. మంగళవారం దిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుగా ఓడించింది. సంజు శాంసన్ అదిరే ఇన్నింగ్స్‌తో చెన్నై విజయంలో కీలక పాత్ర పోషించాడు. నూర్, హొసీన్‌తో పాటు ఇతర బౌలర్ల సూపర్ బౌలింగ్‌తో మొదట దిల్లీకి కళ్లెం వేసిన చెన్నై.. శాంసన్ విధ్వంసక బ్యాటింగ్‌తో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. దిల్లీ పది మ్యాచ్‌ల్లో ఆరో ఓటమిని చవిచూసింది.

శాంసన్ దంచెన్



- దిల్లీపై చెన్నై ఘనవిజయం
- రాణించిన నూర్, హొసీన్, కార్తీక్

దిల్లీ

చెన్నై సూపర్‌కింగ్స్‌కు వరుసగా రెండో విజయం. సంజు శాంసన్ (87 నాటౌట్; 52 బంతుల్లో 7×4, 6×6) చెలరేగడంతో స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో సీఎస్కే 8 వికెట్ల తేడాతో దిల్లీని మట్టికరిపించింది. చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మొదట దిల్లీ 7 వికెట్లకు 155 పరుగులే చేయలిగింది. సమీర్ రిజ్వి (40 నాటౌట్; 24 బంతుల్లో 4×6), స్టబ్స్ (38; 31 బంతుల్లో 1×4, 2×6) మాత్రమే రాణించారు. నూర్ అహ్మద్ (2/22), అకీల్ హొసీన్ (1/19), గుర్జపనీత్ (1/29) గొప్పగా బౌలింగ్ చేశారు. శాంసన్‌తో పాటు కార్తీక్ శర్మ (41 నాటౌట్; 31 బంతుల్లో 4×4, 2×6) రాణించడంతో లక్ష్యాన్ని చెన్నై 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది.

సంజు దంచేశాడు: చెన్నై ఛేదనలో సంజు శాంసన్ ఆటే హైలైట్. మొదట్లో జాగ్రత్తగా ఆడిన అతడు.. క్రమంగా చెలరేగిపోయాడు. రుతురాజ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన శాంసన్.. రెండో ఓవర్లో అక్షర్ బౌలింగ్‌లో ఓ సిక్స్ కొట్టినా.. సంయమనాన్ని పాటించాడు. రుతురాజ్ (6) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఉర్విల్ పటేల్ (17) రెండు సిక్స్‌లు బాదినా, త్వరగానే ఔటయ్యాడు. ఏడో ఓవర్లో అతడు నిష్క్రమించడంతో చెన్నై 45/2తో నిలిచింది. కానీ ఎదుర్కొన్న తొలి 17 బంతుల్లో 15 పరుగులే చేసిన శాంసన్.. నిలదొక్కుకున్నాక ధనాధన్ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కార్తీక్ శర్మ అతడికి అండగా నిలిచాడు. కుల్‌దీప్ బంతిని డీప్ మిడ్ వికెట్లో స్టాండ్స్‌లోకి పంపిన శాంసన్.. నటరాజన్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు, మళ్లీ కుల్‌దీప్ ఓవర్లో వరుసగా 6, 6, 4తో విరుచుకుపడ్డాడు. స్టార్క్‌నూ రెండు ఫోర్లతో శిక్షించాడు. సమీకరణం తేలికైపోయింది. చెన్నై విజయానికి చివరి ఏడు ఓవర్లలో కావాల్సింది 51 పరుగులే. కార్తీక్ వేగంగా ఆడకపోయినా, శాంసన్ దూకుడు వల్ల చెన్నైకి ఇబ్బందిలేకపోయింది. కళ్లు చెదిరే షాట్లు ఆడిన శాంసన్.. నటరాజన్ ఓవర్లో వరుసగా 6, 6, 4.. ఎంగిడి ఓవర్లో రెండు ఫోర్లతో లక్ష్యాన్ని మరింత తేలికగా మార్చాడు. 16వ ఓవర్లో 138/2తో నిలిచింది చెన్నై. ఆ తర్వాత గెలుపు లాంఛనమే. మిగిలిన ఆసక్తి శాంసన్ సెంచరీ చేస్తాడా లేదా అన్నదే. అతడికి సెంచరీ సాధ్యం కాలేదు కానీ.. కార్తీక్ ఆఖర్లో చక్కని షాట్లతో అలరించాడు.

దిల్లీకి కళ్లెం: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దిల్లీ.. ఇన్నింగ్స్‌ను పేలవంగా ఆరంభించింది. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన చెన్నై, క్రమం తప్పకుండా వికెట్లు తీసింది. భాగస్వామ్యాలు నమోదు కానివ్వలేదు. స్పిన్నర్లకు సహకరించిన పిచ్‌పై దిల్లీ బ్యాటర్లు తమను తాము అన్వయించుకోలేకపోయారు. 11 ఓవర్లలో 69 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయి.. ఆ జట్టు చిక్కుల్లో పడింది. ఏ దశలోనూ ఇన్నింగ్స్‌లో ఊపులేదు. కొన్ని చక్కని షాట్లు ఆడిన ఓపెనర్ నిశాంక (19)ను నాలుగో ఓవర్లో ముకేశ్ చౌదరి ఔట్ చేయడంతో మొదలైంది దిల్లీ పతనం. ధాటిగా ఆడలేకపోయిన మరో ఓపెనర్ రాహుల్ (12)ను ఆరో ఓవర్లో స్పిన్నర్ హొసీన్ వెనక్కి పంపాడు. కరుణ్ నాయర్ (13) కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. అతణ్ని, నితీశ్ రాణా (15)ను తన వరుస ఓవర్లలో ఔట్ చేసి మరో స్పిన్నర్ నూర్.. దిల్లీని దెబ్బతీశాడు. స్టబ్స్ కూడా వెంటనే ఔట్ కావాల్సింది. కానీ గుర్జపనీత్ బౌలింగ్‌లో నూర్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ (2)కు మాత్రం అలా కలిసి రాలేదు. అదే ఓవర్లో షార్ట్ పిచ్ బంతిని ఆడిన అతడు.. హొసీన్‌కు చిక్కి వెనుదిరిగాడు. తక్కువ స్కోరుకే సగం వికెట్లు కోల్పోయిన దిల్లీని స్టబ్స్, రిజ్వి ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 65 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. గుర్జపనీత్ ఓవర్లో స్టబ్స్ సిక్స్ కొట్టగా.. ముకేశ్ బౌలింగ్‌లో ఓ సిక్స్, కాంబోజ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు కొట్టాడు రిజ్వి. 19వ ఓవర్లో స్టబ్స్ వెనుదిరగడంతో భాగస్వామ్యం విడిపోయింది. అశుతోష్ రెండు సిక్స్‌లు, రిజ్వి ఓ సిక్స్ బాదడంతో ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో కాంబోజ్ 20 పరుగులు సమర్పించుకున్నాడు. ఆఖరి మూడు ఓవర్లలో దిల్లీ 39 పరుగులు రాబట్టింది.

దిల్లీ ఇన్నింగ్స్: నిశాంక (సి) బ్రెవిస్ (బి) ముకేశ్ 19; రాహుల్ (సి) రుతురాజ్ (బి) హొసీన్ 12; నితీశ్ రాణా (సి) కార్తీక్ శర్మ (బి) నూర్ 15; కరుణ్ నాయర్ (సి) గుర్జపనీత్ (బి) నూర్ 13; అక్షర్ (సి) హొసీన్ (బి) గుర్జపనీత్ 2; స్టబ్స్ (సి) ముకేశ్ (బి) ఒవర్టన్ 38; రిజ్వి నాటౌట్ 40; అశుతోష్ రనౌట్ 14; స్టార్క్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 155

వికెట్ల పతనం: 1-29, 2-36, 3-52, 4-61, 5-69, 6-134, 7-149

బౌలింగ్: అకీల్ హొసీన్ 4-0-19-1; ముకేశ్ 4-0-31-1; అన్షుల్ కాంబోజ్ 4-0-49-0; నూర్ అహ్మద్ 3-0-22-2; గుర్జపనీత్ 4-0-29-1; ఒవర్టన్ 1-0-5-1

చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ నాటౌట్ 87; రుతురాజ్ (సి) రిజ్వి (బి) ఎంగిడి 6; ఉర్విల్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 17; కార్తీక్ శర్మ నాటౌట్ 41; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం:** (17.3 ఓవర్లలో 2 వికెట్లకు) **159**

వికెట్ల పతనం: 1-24, 2-45

బౌలింగ్: స్టార్క్ 4-0-30-0; అక్షర్ 4-0-25-1; ఎంగిడి 4-0-30-1; కుల్‌దీప్ 3-0-34-0; నటరాజన్ 2.3-0-39-0

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	10	5	5	0	10	0.151
దిల్లీ	10	4	6	0	8	-0.949
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబయి	10	3	7	0	6	-0.649
లఖ్‌నవూ	9	2	7	0	4	-1.076

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

రాయుడి చేతికి క్రికెట్ పగ్గాలు

హెచ్‌సీఏ ఆపరేషన్స్ హెడ్‌గా నియామకం

ఈనాడు - హైదరాబాద్


విజేందర్ పింగ్లే, జీవన్ రెడ్డి, అమర్‌నాథ్, రాయుడు

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో పాలనను మెరుగుపరచడంతో పాటు పారదర్శకతను పెంచే దిశగా అపెక్స్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ పర్యవేక్షణలో.. క్రికెట్ అభివృద్ధికి, ఆట ప్రమాణాల పెంపునకు సమగ్రమైన కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా భారత మాజీ ఆటగాడు అంబటి రాయుడును నియమించింది. హెచ్‌సీఏకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాయుడుకు కీలక బాధ్యతలు అప్పగించింది. మూడేళ్ల కాలానికి ఒప్పందంపై సంతకం చేసిన రాయుడు.. హెచ్‌సీఏ నుంచి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు తీసుకోకుండా సేవలు అందించనున్నాడు. మంగళవారమే బాధ్యతలు స్వీకరించిన రాయుడు.. శిక్షణ, సెలక్షన్స్, ప్రతిభాన్వేషణ సహా అన్ని వ్యవహారాలను చూసుకుంటాడని హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్, కార్యదర్శి జీవన్‌రెడ్డి వెల్లడించారు. "క్రికెట్‌ను పరిపాలన నుంచి వేరుగా ఉంచాలని నేను గట్టిగా నమ్ముతా. ఆటగాళ్ల సంక్షేమాన్ని చూసుకోవడం.. హైదరాబాద్‌కు నిజంగా దక్కాల్సిన గుర్తింపు తీసుకురావడం నా పని. ఎంతోమంది అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేసే కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి. అవినీతి రహిత క్రికెట్ నా లక్ష్యం. ఆటలో అవినీతిని ఉపేక్షించను. అవినీతి నిరోధక యూనిట్ (ఏసీయూ), ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఆటగాళ్లు లేదా ఇంకెవరైనా టోల్ ఫ్రీ నంబరు, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. దోషిగా తేలిన వారిని ఏసీయూ, బీసీసీఐకి నివేదించి బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం. అది ఆటగాడు, తల్లిదండ్రులు, సెలక్టర్, అంపైర్ ఎవరైనా సరే అవినీతికి దూరంగా ఉండేలా ఏసీయూ చూసుకుంటుంది. ముంబయి క్రికెట్ సంఘం ఇటీవల ప్రకటించిన ఆటగాళ్ల కాంట్రాక్ట్ విధానాన్ని అమల్లోకి తెస్తాం. సెలక్షన్ కమిటీలో సరైన వ్యక్తులతో ప్రతిభ ఆధారంగా ఎంపికలు ఉంటాయి. కేవలం లీగ్స్ ప్రదర్శనల ఆధారంగానే కాకుండా ఓపెన్ ట్రయల్స్ ద్వారా కూడా జట్లను ఎంపిక చేస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఏర్పాటు చేయాలని.. జిల్లాల క్రికెటర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని భావిస్తున్నాం" అని రాయుడు తెలిపాడు. ఏసీయూకు జిల్లా మాజీ జడ్జి విజేందర్ పింగ్లే ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మహిళా క్రికెటర్లు, సిబ్బందికి సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు 'పోష్' (లైంగిక వేధింపుల నిరోధక చట్టం- 2013) కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

జ్యోతి బృందానికి అయిదో సీడింగ్



షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నమెంట్లో జ్యోతి సురేఖతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు ఆశించిన ప్రదర్శన చేయలేకపోయింది. క్వాలిఫికేషన్లో 2092 పాయింట్లే సాధించిన భారత బృందానికి అయిదో సీడింగ్ వచ్చింది. సింగిల్స్‌లోనూ భారత అమ్మాయిలు నిరాశపరిచారు. అదితి (700) ఉత్తమంగా 13వ స్థానంలో నిలవగా.. ప్రగతి (697), జ్యోతి సురేఖ (695).. వరుసగా 19, 21వ స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల కాంపౌండ్ సింగిల్స్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ 711 పాయింట్లతో ఉత్తమంగా ఏడో స్థానంలో నిలిచాడు. అన్నే పాయింట్లు సాధించిన సాహిల్ జాదవ్ తర్వాతి స్థానాన్ని దక్కించుకున్నాడు. కుశాల్ దలాల్ (708).. 18వ స్థానంలో నిలవగా, అభిషేక్ వర్మ (705).. 25వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల కాంపౌండ్ టీమ్‌లో 2130 పాయింట్లతో భారత్ మూడో సీడింగ్‌ను సంపాదించింది. తుర్కియే (2134), ఫ్రాన్స్ (2132) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.


భారత బాక్సర్ల జోరు

తాష్కెంట్: 2026 ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం అండర్-15 పురుషుల విభాగంలో ఒయినా (46 కేజీలు) 5-0తో ఉషాన్లో (కజకిస్థాన్)ను ఓడించాడు. పర్షాంత్ (49 కేజీలు) కూడా 5-0తో అఖ్మెత్‌ను, యాసిర్ (58) నబిద్ (కిర్గిజ్‌స్థాన్)ను, నివేశ్ పాల్ (54) 5-0తో గాలియెయ్ (కజకిస్థాన్)ను ఓడించగా.. రణ్‌వీర్ (66)కు వాకోవర్ లభించింది. అండర్-17 పురుషుల విభాగంలోనూ నివేశ్, రణ్‌వీర్ విజయాలతో అదరగొట్టారు.

నంబర్‌వన్‌గానే భారత్

దుబాయ్: ప్రపంచ టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో భారత్ మొదటి ర్యాంకు సాధించింది. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్ వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్.. టైటిల్ నిలబెట్టుకున్న తొలి జట్టుగా ఘనత సాధించింది. రికార్డు స్థాయిలో మూడోసారి పొట్టి కప్పును భారత్ గెలుచుకుంది.

అలా చేయకపోతే బహిష్కరణే


సబలెంకా


రోమ్: టెన్నిస్ గ్రాండ్‌స్లామ్‌ల ఆదాయంలో క్రీడాకారులకు ఇచ్చే వాటాను పెంచకపోతే భవిష్యత్తులో టోర్నీలను బహిష్కరించక తప్పదని ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా హెచ్చరించింది. ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్‌మనీ విషయంలో నిర్వాహకులు అనుసరిస్తున్న వైఖరిపై సబలెంకా, స్టార్ ఆటగాడు సినర్ సహా టాప్-10లో ఉన్న పలువురు క్రీడాకారులు తీవ్రం అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. "మేం లేకపోతే టోర్నీలు ఉండవు. క్రీడాభిమానులకు వినోదం ఉండదు. కాబట్టి టోర్నీల ఆదాయంలో క్రీడాకారులకు దక్కాల్సిన వాటా మరింత ఎక్కువగా ఉండాలని భావిస్తున్నా. పరిస్థితులు ఇలాగే కొనసాగితే హక్కుల కోసం పోరాడే ఏకైక మార్గం టోర్నీల బహిష్కరణే" అని సబలెంకా పేర్కొంది.

ఐపీఎల్‌లో ఈనాడు

హైదరాబాద్ × పంజాబ్

వేదిక: హైదరాబాద్, రా॥ 7.30

సన్‌రైజర్స్‌కు పంజాబ్ సవాల్




ఈనాడు, హైదరాబాద్: ఐపీఎల్‌లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్, మూడో స్థానంలో కొనసాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బుధవారం ఉప్పల్ స్టేడియంలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. సొంతగడ్డపై గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించాలని సన్‌రైజర్స్ భావిస్తుండగా.. వరుసగా రెండు పరాజయాలతో దెబ్బతిన్న పంజాబ్ మళ్లీ గెలుపు బాట పట్టాలని కృతనిశ్చయంతో ఉంది. వరుసగా అయిదు విజయాలతో జోరు మీద కనిపించిన సన్‌రైజర్స్‌కు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఊహించని పరాజయం మేలుకొలుపు లాంటిదే. ఆ మ్యాచ్‌లో అభిషేక్, క్లాసెన్ ఇద్దరూ విఫలమవడం సన్‌రైజర్స్‌ను దెబ్బతీసింది. అయితే ట్రావిస్ హెడ్ వరుసగా రెండో అర్ధసెంచరీతో రాణించడం.. ఇషాన్ కిషన్ గాడినపడటం జట్టుకు సానుకూలాంశమే. గత మ్యాచ్‌కు దూరమైన ఆల్‌రౌండర్ నితీశ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. కెప్టెన్ కమిన్స్, ఇషాన్ మలింగ, సకిబ్ హుస్సేన్, శివాంగ్‌కుమార్‌లతో బౌలింగ్ పటిష్ఠంగా ఉంది. 9 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న పంజాబ్.. గత రెండు ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపు బాట పట్టాలని చూస్తోంది.

మేం వెనక్కి తగ్గలేదు

రాజస్థాన్ దక్కకపోవడంపై సొమాని నిరాశ

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్‌ను చేజిక్కించుకోలేకపోవడంపై కల్ సొమాని నేతృత్వంలోని కన్సార్షియం నిరాశ వ్యక్తం చేసింది. లక్ష్మీ మిత్తల్, అతడి తనయుడు ఆదిత్య మిత్తల్, అదార్ పూనావాలా కలిసి రూ.15,600 కోట్లకు రాజస్థాన్ ఫ్రాంఛైజీని సొంతం చేసుకున్న నేపథ్యంలో సొమాని కన్సార్షియం స్పందించింది. రాజస్థాన్ కోసం వారు విజయవంతంగా బిడ్ వేసినా.. వివిధ కారణాల వల్ల ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే. "రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేయలేకపోయినందుకు తీవ్రంగా నిరాశ చెందాం. ఆరు నెలల ప్రక్రియలో మేమే బిడ్డింగ్‌లో ముందున్నాం. మీడియాలో వార్తలు వచ్చినట్లుగా మా దగ్గర నిధుల కొరత లేదు. ఒప్పందం కుదుర్చుకోవాలనే అనుకున్నాం. మేం బిడ్‌ను ఎప్పుడూ ఉపసంహరించుకోలేదు. ఎంతో నిజాయతీ, అంకితభావంతో వ్యవహరించాం. కానీ దురదృష్టవశాత్తు మా ప్రయత్నం సరిపోలేదు. మాకు సమాన అవకాశం రాలేదు" అని సొమాని కన్సార్షియం ఓ ప్రకటనలో పేర్కొంది. అమ్మకం ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని చెప్పింది.



ఐపీఎల్‌లో ఒకప్పుడు హార్దిక్ పాండ్య మేటి ఆల్‌రౌండర్. ఆటగాడిగా ముంబయికి ఎన్నో విజయాలందించాడు. తర్వాత కెప్టెన్సీ అందుకున్న తొలి సీజన్‌లోనే గుజరాత్‌కు ట్రోఫీ అందించాడు. ఆపై తన తొలి జట్టు ముంబయికి తిరిగొచ్చాడు. కెప్టెన్సీ చేపట్టాడు. కానీ పునరాగమనంలో ఆల్‌రౌండర్‌గా తన పాత్రకు న్యాయం చేయడంలో, జట్టును ఏకతాటిపై నడిపించడంలో ఘోరంగా విఫలమవుతున్నాడు. ఈ సీజన్లో ముంబయి ఘోర వైఫల్యం నేపథ్యంలో అభిమానులు, విమర్శకుల వేళ్లన్నీ హార్దిక్ పాండ్య వైపే చూపిస్తున్నాయి. హార్దిక్ దూరమైన మ్యాచ్‌లో ముంబయి చక్కటి ప్రదర్శనతో విజయం సాధించడంతో జట్టులో అతడు ఒంటరయ్యాడా అనే సందేహాలు కలుగుతున్నాయి.

హార్దిక్ ఒంటరయ్యాడా...

ఈనాడు క్రీడావిభాగం

ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన కొన్నేళ్లలో భారత అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా పేరు సంపాదించాడు హార్దిక్ పాండ్య. ముంబయి దుర్భేద్యమైన జట్టుగా ఎదగడంలో, నిలకడగా టైటిళ్లు గెలవడంలో అతడి పాత్ర కీలకం. అయితే తనలో ఒక సమర్థుడైన కెప్టెన్ కూడా ఉన్నాడని 2022లో రుజువు చేశాడు హార్దిక్. అప్పుడే ఐపీఎల్‌లోకి అడుగు పెట్టిన గుజరాత్‌కు టైటిల్ అందించి అబ్బురపరిచాడు. ఆల్‌రౌండర్‌గానూ తన పాత్రను అద్భుతంగా నిర్వర్తించాడు. రెండో సీజన్లోనూ జీటీని రన్నరప్‌గా నిలిపాడు. అనంతరం కెప్టెన్సీ ఇవ్వాలనే షరతుపై.. తను అరంగేట్రం చేసిన ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చాడు. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి జట్టు పగ్గాలు అందుకున్న హార్దిక్.. మొదట్లో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. సొంత జట్టు అభిమానులు, సొంత మైదానం (వాంఖడే)లో అతణ్ని ఎగతాళి చేశారు. ఆ సీజన్లో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న హార్దిక్.. జట్టును సరైన దారిలో నడిపించలేకపోయాడు. కానీ గత ఏడాది ముంబయిని ప్లేఆఫ్స్‌కు తీసుకెళ్లగలిగాడు. దీంతో హార్దిక్ గాడినపడ్డట్లే కనిపించాడు. కానీ ఈసారి మళ్లీ ఆ జట్టు దారుణ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. హార్దిక్ ఇప్పటిదాకా ముంబయికి 37 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా.. అందులో ఆ జట్టు 14 మాత్రమే గెలిచింది. గుజరాత్‌కు రెండు సీజన్లలో కలిపి పాండ్య 32 మ్యాచ్‌ల్లో 23 విజయాలు అందించాడు. హార్దిక్‌ను సారథి చేయడం ఆ జట్టులోని కొందరికి మింగుడుపడలేదనే వార్తలు అప్పట్లో వినిపించాయి. కెప్టెన్సీ కోల్పోయాక రోహిత్ ఎప్పుడూ జట్టులో అంతర్భాగంగా లేడు! అతడికి తగ్గ గౌరవాన్ని జట్టు యాజమాన్యం, హార్దిక్ ఇస్తున్నట్లు కనిపించడం లేదు. నిరుడు రోహిత్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించడం చర్చనీయాంశమైంది. ఈసారి అతడు గాయంతో అయిదు మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. సోమవారమే పునరాగమనం చేశాడు. మరోవైపు బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ లాంటి సీనియర్లు హార్దిక్‌తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే వార్తలూ వస్తున్నాయి. కొన్ని మ్యాచ్‌ల్లో బుమ్రాకు కొత్త బంతి అందివ్వకపోవడం హార్దిక్‌కు అతడితో సమన్వయ లోపాన్ని తెలియజేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం కూడా బాలేదని అర్థమవుతోంది. పోనీ సరైన ఆటగాళ్లు లేరా అంటే అదీ కాదు. రోహిత్, బుమ్రా, సూర్యకుమార్, తిలక్, బౌల్ట్, డికాక్, రికెల్టన్ ఇలా జట్టు నిండా స్టార్లే. కానీ వారి నుంచి ప్రదర్శన రాబట్టేలా హార్దిక్ స్ఫూర్తిని నింపలేకపోతున్నాడని స్పష్టమవుతోంది. బుమ్రా, సూర్యకుమార్, తిలక్ వారి స్థాయిలో ఆడకపోవడం జట్టును దెబ్బ తీసింది. భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి ఇటీవల మాట్లాడుతూ.. జట్టులోని ఆటగాళ్ల నుంచి హార్దిక్‌కు కావాల్సిన మద్దతు అందడం లేదన్నాడు. దీంతో హార్దిక్ జట్టులో ఒంటరయ్యాడా? ఎవరూ అతడికి సహకరించడం లేదా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

మరోవైపు అతడు వ్యక్తిగతంగానైనా రాణిస్తున్నాడా అంటే అదీ లేదు. గుజరాత్ టైటాన్స్‌లో ఉన్నప్పుడు 30 ఇన్నింగ్స్‌ల్లో ఆరు అర్ధసెంచరీలు సహా 833 పరుగులు చేసి, 11 వికెట్లు పడగొట్టాడు. ముంబయికి వచ్చాక గత రెండు సీజన్లు కలిపి 25 ఇన్నింగ్స్‌ల్లో 440 పరుగులే చేశాడు. 11 వికెట్లు తీశాడు. ఈ సీజన్లో అతడు బ్యాటుతో, బంతితో ఘోరంగా విఫలమవుతున్నాడు. 9 మ్యాచ్‌ల్లో 146 పరుగులే చేసి, కేవలం 4 వికెట్లే పడగొట్టాడు. స్ట్రైక్‌రేట్ గణనీయంగా పడిపోయింది. పరుగుల కోసం ఆపసోపాలుపడుతున్నాడు. చెన్నైపై అతడి ఇన్నింగ్స్ (23 బంతుల్లో 18) అయితే పేలవం. ఈ ఐపీఎల్‌లో ఆర్సీబీపై చేసిన 40 పరుగులే హార్దిక్ అత్యధిక స్కోరు. హార్దిక్ వైఫల్యం, జట్టు ఘోర ప్రదర్శన, డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం సరిగా లేకపోవడం.. వీటన్నిటి నేపథ్యంలో సోమవారం లఖ్‌నవూతో మ్యాచ్‌లో హార్దిక్ ఆడకపోవడం అనుమానాలకు దారితీసింది. సూర్యకుమార్ అన్నట్లు నిజంగానే అతను గాయపడ్డాడా? లేక అతడిని పక్కన పెట్టారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులోకి రాకపోతే.. హార్దిక్‌పై వేటు పడిందనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఆస్ట్రేలియాను భారత్ నిలువరించేనా!

జెడ్డా: ఏఎఫ్‌సీ అండర్-17 ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వేళైంది. బుధవారం ఆరంభమయ్యే ఈ టోర్నీలో గ్రూప్-డి తొలి మ్యాచ్‌లో బలమైన ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. ర్యాంకింగ్‌లో తన కన్నా మెరుగైన సాకరూస్‌ను ఓడించడం పక్కనపెడితే.. కనీసం డ్రా చేసుకున్నా భారత్‌కు అది మంచి ప్రదర్శనే. భారత్ ఉన్న గ్రూప్-డిలోనే ఉజ్బెకిస్థాన్ కూడా ఆడుతుంది. మే 10న ఆ జట్టుతో భారత్ తలపడనుంది. మొత్తం 16 జట్లు 4 గ్రూప్‌లుగా విడిపోయి ఈ టోర్నీలో ఆడుతున్నాయి. గ్రూప్‌లో టాప్-2 జట్లు క్వార్టర్‌ఫైనల్ చేరతాయి. క్వార్టర్స్ చేరిన టీమ్స్ ఈ ఏడాది ఖతార్‌లో జరిగే ఫిఫా అండర్-17 టోర్నీకి అర్హత సాధిస్తాయి.

ఈ మహిళలు.. పోరాట యోధులు

బెంగాల్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన అతివలు

ఇళ్లల్లో పనిచేస్తూ ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన మహిళ ఒకరు. స్త్రీలపై తృణమూల్ నేతల అరాచకాలకు వ్యతిరేకంగా గళమెత్తిన మహిళ మరొకరు.. ఇలా సాధారణ నేపథ్యాల నుంచి వచ్చిన అతివలు పలువురు పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు.



పనిమనిషి నుంచి ఎమ్మెల్యే స్థాయికి..

పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు బర్ధమాన్ జిల్లా గుస్కరాకు చెందిన కలితా మాఝీ ఇళ్లల్లో అంట్లు తోముతూ, దుస్తులు ఉతుకుతూ నెలకు కేవలం 2,500 నుంచి 4,000 వరకు సంపాదించేవారు. భర్త ప్లంబర్‌గా పనిచేస్తారు. భాజపా బూత్ స్థాయి కార్యకర్తగానూ ఆమె పనిచేశారు. పార్టీ ఆమె నిబద్ధతను గుర్తించి 2021లో తొలిసారి టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో మాత్రం ఓడిపోయారు. అయినా ఆమెపై భాజపా నమ్మకం ఉంచి ఈ ఎన్నికల్లో ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా నిలబెట్టింది. ఆమె తన సమీప టీఎంసీ ప్రత్యర్థిపై 12,535 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.



తృణమూల్ అరాచకాలపై గొంతెత్తి..!

రేఖా పాత్రా.. సందేశ్‌ఖాలీకి చెందిన ఓ సాధారణ గృహిణి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మాజీ నేత షేక్ షాజహాన్, అతని అనుచరుల అరాచకాలపై గొంతెత్తి దేశవ్యాప్త గుర్తింపు పొందారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, భూకబ్జాలకు వ్యతిరేకంగా చేసిన నిరసనల్లో పాల్గొన్నారు. దీంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బసీర్‌హట్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆమెను ఎంపీ అభ్యర్థిగా భాజపా నిలబెట్టింది. ఆ ఎన్నికల్లో రేఖా పాత్రా ఓడిపోయారు. అయినా ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో హింగల్‌గంజ్ శాసనసభ సీటును ఆమెకు భాజపా కేటాయించింది. ఈసారి రేఖా పాత్రా 5,421 ఓట్లతో తన సమీప ప్రత్యర్థి.. టీఎంసీకి చెందిన ఆనంద్ సర్కార్‌పై విజయం సాధించారు.

న్యాయం కోసం రాజకీయాల్లోకి..



ఆర్‌జీ కర్ మెడికల్ వైద్యశాలలో ఘటన.. పశ్చిమబెంగాల్‌లో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో అత్యాచారం, హత్యకు గురైన బాధితురాలి తల్లి రత్నా దేబ్‌నాథ్‌ను ఉత్తర 24 పరగణాల జిల్లాలో తృణమూల్ కంచుకోటైన పానిహాటి అసెంబ్లీ స్థానం నుంచి భాజపా తన అభ్యర్థిగా నిలబెట్టింది. ఆమె తన సమీప ప్రత్యర్థి, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై 28,836 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాను న్యాయం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, బాధిత మహిళల పక్షాన పోరాడతానని తెలిపారు.



చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పెరియార్ విగ్రహానికి టీవీకే అధినేత విజయ్ నివాళులు

మెజార్టీ ఎలా?

- విజయ్ బృందం భారీ కసరత్తు
- డీఎంకే, అన్నాడీఎంకే కూటముల్లోని చిన్న పార్టీల మద్దతుపై దృష్టి

ఈనాడు-చెన్నై: తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన బలాన్ని కూడగట్టుకోవడంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ తలమునకలయ్యారు. ప్రస్తుతం టీవీకే బలం 108. ఇందులో విజయ్ రెండుచోట్ల నుంచి గెలిచారు కాబట్టి ఒక సీటును ఖాళీ చేయాల్సి ఉంటుంది. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఒకరిని స్పీకర్‌గా ఎన్నుకోవాలి. సాధారణ పరిస్థితుల్లో స్పీకర్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయలేరు కనుక ఈ రెండు సీట్ల బలాన్ని అదనంగా కూడగట్టుకోవాల్సిన అవసరముంది. 234 మంది సభ్యులుండే అసెంబ్లీలో బల నిరూపణకు అవసరమైన 118 సంఖ్యా బలాన్ని చేరుకోవడానికి మరో 12 మంది ఎమ్మెల్యేలు అవసరం. దీని కోసం ఎటువైపు అడుగులు వేయాలి, ఎవరి సాయం తీసుకోవాలనేది పెద్ద ప్రశ్నగా మారింది. టీవీకే మినహా రాష్ట్రంలో సీట్లు గెలిచిన కూటములు రెండే ఉన్నాయి. ఒకటి డీఎంకే, రెండు అన్నాడీఎంకే. ఏ సాయం తీసుకోవాలన్నా ఆ కూటములకు చెందిన పార్టీలే ఆధారం. ఎవరితో వెళితే భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ సమస్యలు వస్తాయి... వాటిని ఎలా అధిగమించాలి అనే విషయమై టీవీకేలోని ప్రముఖులు వ్యూహాలు రచిస్తున్నారు.

మరికొన్ని మార్గాలూ ఉన్నాయి..: టీవీకేకు మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహం చూపుతున్నాయి. విజయ్ తమ సాయం కోరారని, టీవీకే ప్రభుత్వానికి మద్దతివ్వడంపై నిర్ణయం తీసుకోవాలని ఆ పార్టీ అధిష్ఠానం కూడా మంగళవారం సూచించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ 5 స్థానాల్లో గెలుపొందింది. డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం, వీసీకేకు రెండు సీట్లు చొప్పున, డీఎండీకే దగ్గర ఒక సీటుంది. విజయ్ వారి మద్దతూ కోరవచ్చు. కూటమి కట్టుబాట్లను దాటి సీపీఐ, సీపీఎం, వీసీకే నేతలు విజయ్‌కు మద్దతిస్తారా అనేది ఇప్పుడు మరో సమస్యగా ఉంది. డీఎంకేకు వ్యతిరేకంగా విజయ్ ఎన్నికల్లోకి వెళ్లారు కాబట్టి.. ఆ పార్టీ సాయం కోరే అవకాశంలేదు.

■ ఒకవేళ అన్నాడీఎంకే కూటమి వైపు టీవీకే ఆసక్తి చూపితే.. పీఎంకేకు 4, ఏఎంఎంకేకు ఒక సీటుంది. ఈ బలం సరిపోదు.. మరి అన్నాడీఎంకే మద్దతిస్తుందా అనేది చూడాలి. విజయ్‌వైపు అప్పుడప్పుడూ సానుకూలంగా స్పందించే పీఎంకేకు 4 సీట్లు ఉండటంతో.. ఆ పార్టీతో పాటు డీఎంకే కూటమిలోని చిన్న పార్టీల మిశ్రమ బలమూ కూడగట్టుకోవచ్చు.

■ భాజపా, అన్నాడీఎంకే కూటమితో వెళ్తే కేంద్ర ప్రభుత్వంతో సమస్యలు తొలిగే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

■ ఒకవేళ 47 స్థానాలున్న అన్నాడీఎంకే పార్టీ మద్దతు కోరితే మొత్తం పార్టీనే తనవైపు ఉండేలా చూసుకోగలగాలి. పరిమిత ఎమ్మెల్యేల మద్దతు అడిగితే భవిష్యత్తులో అనర్హత వేటు సమస్యలొస్తాయి. ఇదివరకు విజయ్ ఎప్పుడూ అన్నాడీఎంకేను విమర్శించలేదు కాబట్టి.. ఈ మార్గానికీ అవకాశముంది.

అన్నాడీఎంకే ఏమంటుందో?

టీవీకేకు కావాల్సింది 12 సీట్లయినా దాని వెనక చాలా రాజకీయాలే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఓ వైపు డీఎంకే కూటమిలోని పలు పార్టీలు విజయ్‌కు సానుకూల సంకేతాలు పంపుతుండగా మరోవైపు అన్నాడీఎంకే, భాజపా కూటమి నుంచి కూడా ప్రయత్నాలున్నట్లు కనిపిస్తోంది. ఎడప్పాడి పళనిసామి నాయకత్వంలో అన్నాడీఎంకే ప్రాభవాన్ని కోల్పోయిందని, ఆయనపై నమ్మకం ఉంచకుండా సభ్యులు బయటికొచ్చి విజయ్‌కి మద్దతు పలకాలని పురట్చి అన్నాడీఎంకే అధినేత పుహళేంది కీలక వ్యాఖ్యలు చేశారు. అన్నాడీఎంకే నూతన ఎమ్మెల్యేలు బుధవారం సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.

మైనారిటీ కోటల్లోనూ భాజపా హవా

- తృణమూల్‌కు షాకిచ్చిన ఓటరు
- కాంగ్రెస్, లెఫ్ట్ కోలుకోవడమూ దెబ్బే
- ప్రభావం చూపిన ప్రాంతీయ పార్టీలు
- ఓట్లు చీలిపోయి లాభపడ్డ కమలదళం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో వెలువడిన అనూహ్య తీర్పు రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. భాజపా ప్రభంజనం.. తనకు కంచుకోటలుగా భావించే ప్రాంతాల్లోనే కాకుండా ముస్లిం మైనారిటీ కోటల్లోనూ స్పష్టంగా కనిపించింది. సంప్రదాయంగా తృణమూల్‌కు అండగా నిలిచే ఈ ప్రాంతాల్లో ఓట్లు చీలిపోయి భాజపా లాభపడింది.

- దశాబ్ద కాలంగా ముర్షీదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్‌పుర్ జిల్లాల్లో ముస్లిం మైనారిటీలు ఏకపక్షంగా తృణమూల్‌కు మద్దతిస్తూ వస్తున్నారు. ఈ జిల్లాల్లో 50 శాతం ఓట్లు వారివే ఉంటాయి. 2021లోనూ ఈ ఓట్లన్నీ తృణమూల్‌కే పడ్డాయి.
- ఈసారి ఎన్నికల్లో ఈ 3 జిల్లాల్లోని 43 సీట్లలో 19 చోట్ల భాజపా జెండా ఎగిరింది. 2021లో ఈ ప్రాంతాల్లో కేవలం 8 సీట్లనే భాజపా గెలుచుకుంది. అప్పట్లో 35 సీట్లలో తృణమూల్ ఆధిపత్యం కొనసాగింది. తాజా ఎన్నికల్లో తృణమూల్‌కు 22 సీట్లే దక్కాయి. మిగిలిన సీట్లను కాంగ్రెస్, ఏజేయూపీ గెలుచుకున్నాయి.
- వాస్తవానికి సర్ కారణంగా ముస్లిం ఓట్లన్నీ ఏకపక్షంగా తృణమూల్‌కే పడతాయని ఎన్నికలకు ముందు అంచనా ఉండేది. కానీ ఫలితం మరోలా వచ్చింది. ఈ ఓట్లు పలు ప్రతిపక్షాల మధ్య చీలిపోవడం గట్టి పోటీ ఉన్న నియోజకవర్గాల్లో తృణమూల్‌కు నష్టం కలిగించింది.



మాల్దాలో..

మాల్దాలో భాజపా 6 సీట్లు గెలుచుకుంది. ఇక్కడ కాంగ్రెస్ బలపడటంతో మైనారిటీల ఓట్లు చీలిపోయి కాషాయ పార్టీ లబ్ధి పొందింది. కాంగ్రెస్ పెద్దగా సీట్లు సాధించలేకపోయినా తృణమూల్ ఆధిక్యాలను తగ్గించగలిగింది.

ముర్షీదాబాద్‌లో..

ముర్షీదాబాద్ జిల్లాలో 22 సీట్లున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 60శాతం మంది ముస్లింలుంటారు. 2021లో ఇక్కడ 20 సీట్లను తృణమూల్ గెలుచుకుంది. ఈసారి కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. గత ఎన్నికల్లో 2 సీట్లు గెలిచిన భాజపా ఈసారి 9 స్థానాల్లో విజయం సాధించింది.

- సర్‌తో ఈ జిల్లాల్లో 7.8 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. దీనివల్లే మైనారిటీల ఓట్లు తగ్గి ఓడిపోయామని తృణమూల్ అంటున్నా.. వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. ముస్లింల ఓట్లు కాంగ్రెస్, సీపీఎం, ఏజేయూపీ మధ్య చీలిపోయి అసలైన నష్టం జరిగింది.
- అదే సమయంలో హిందువులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో వారి ఓట్లన్నీ ఏకపక్షంగా భాజపాకు పడ్డాయి.

ఉత్తర దినాజ్‌పుర్‌లో..

ఉత్తర దినాజ్‌పుర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో 2 సీట్లు గెలిచిన భాజపా ఈసారి 4 సీట్లు దక్కించుకుంది. తృణమూల్ 7 నుంచి 5కు పడిపోయింది. చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్, లెఫ్ట్‌లకు వచ్చిన ఓట్లు భాజపాకు వచ్చిన మెజారిటీల కంటే ఎక్కువగా ఉన్నాయి.

స్థానిక అంశాలూ..

ఈసారి ఎన్నికల్లో ఓట్ల ఏకీకరణ కంటే స్థానిక అంశాలు, అభ్యర్థుల విశ్వసనీయత, చారిత్రక పార్టీల పునరాగమనం ప్రభావం చూపాయి. పూర్తిగా మైనారిటీ ఓట్లపై ఆధారపడ్డ తృణమూల్‌కు 10 శాతం నుంచి 15 శాతం ఓట్లు తగ్గాయి. అంటే ఓట్ల విభజన ద్వారా భాజపా లబ్ధి పొందింది.

మిగిలిన చోట్లా..

దక్షిణ 24 పరగణాలు, బీర్‌భూమ్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ జిల్లాల్లో భాజపా గణనీయంగా సీట్లు సాధించింది. ఇక్కడ మైనారిటీ ఓట్లు చీలగా హిందువుల ఓట్లు ఏకపక్షంగా భాజపాకు దక్కాయి.

అప్పట్లో ఎన్‌ఆర్‌సీ, సీఏఏకు వ్యతిరేకంగా..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తామన్న ఎన్‌ఆర్‌సీ, సీఏఏకు వ్యతిరేకంగా 2021 ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ ఓట్లు ఏకపక్షంగా తృణమూల్‌కు పడ్డాయి. దీంతో మమతకు భారీ విజయం దక్కింది. ఈసారి ఆ భయాలు బలహీనపడ్డాయి. దీంతో చాలామంది కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల వెంట నడిచారు. ప్రాంతీయ పార్టీ అయిన ఏజేయూపీ, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌కూ మద్దతిచ్చారు.

ఓటు హక్కు కోల్పోయి.. ఎమ్మెల్యేగా ఎన్నికై..!

కోల్‌కతా: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో పేరు కోల్పోయిన వ్యక్తి.. ఎమ్మెల్యేగా నెగ్గిన ఆసక్తికర సంఘటన పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా నియోజకవర్గంలో చోటు చేసుకుంది. మొతాబ్ షేక్.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అయితే సర్‌లో భాగంగా ఎన్నికల ముందు ఆయన పేరును ఓటర్ల జాబితా నుంచి అధికారులు తొలగించారు. దీంతో సుప్రీంకోర్టు నియమించిన ట్రైబ్యునల్‌ను ఆయన ఆశ్రయించారు. నామినేషన్ల గడువు ముగియడానికి కొద్ది సేపటికి ముందు మొతాబ్ ఓటు హక్కును పునరుద్ధరిస్తూ ట్రైబ్యునల్ తీర్పిచ్చింది.. దీంతో ఆయన ఫరక్కా స్థానంలో నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో తన సమీప భాజపా అభ్యర్థి సునీల్ చౌదరీపై 8 వేలకు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించి ఎమ్మెల్యే అయ్యారు.



బెంగాల్‌లో హింస

భాజపా, తృణమూల్ కార్యకర్తల మృతి

కోల్‌కతా: ఎన్నికల ఫలితాల అనంతరం పశ్చిమ బెంగాల్‌లో మంగళవారం భారీ హింస చోటుచేసుకుంది. రెండు వేర్వేరు ఘటనల్లో భాజపా, తృణమూల్ కార్యకర్తలు ఇద్దరు మరణించారు. న్యూటౌన్ ప్రాంతంలో కాషాయ పార్టీ విజయోత్సవ ర్యాలీ జరుగుతుండగా తృణమూల్ కార్యకర్తలు దాడి చేయడంతో భాజపాకు చెందిన కార్యకర్త మధు మండల్ మృతి చెందారు. బీర్‌భూమ్‌లోని నానూర్‌లో భాజపా కార్యకర్తల దాడిలో తృణమూల్ కార్యకర్త అబీర్ షేక్ మరణించారు.

■ బిజోయ్‌గఢ్‌లో తృణమూల్ అభ్యర్థికి చెందిన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ■ ఆర్‌జీ కర్ హత్యాచార బాధితురాలి తల్లి గెలిచిన పానిహాటీలో తృణమూల్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ■ బెంగాల్ హింసాత్మక ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది.




50 నిమిషాలు కూర్చుంటే 2 నిమిషాలు నడవండి

8 గంటల పాటు ఏకధాటిగా కూర్చోడానికి అనువుగా శరీరం రూపొందలేదు.
ఏమాత్రం కదలకుండా కూర్చున్న ప్రతి గంట సమయం వెన్నెముకపై ఒత్తిడి పెంచుతుంది. పిరుదుల కండరాలు క్రియారహితం అవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. మెదడుకు రక్త ప్రసరణ తగ్గుతుంది.
ఈ ప్రమాదాల నుంచి తప్పించుకునేందుకు 50 నిమిషాలకోసారి లేచి రెండు నిమిషాలు నడవండి.
ఇది జీవక్రియ విధానాన్ని మారుస్తుంది.

\- గ్యారీ బ్రెకా, జీవశాస్త్రవేత్త

మీరేమైనా దేశ ప్రథమ పురోహితులా?

- శబరిమల ప్రవేశంపై పిటిషన్ వేసిన లాయర్స్ అసోసియేషన్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ప్రజాహిత వ్యాజ్యాల దుర్వినియోగంపై ఆగ్రహం



దిల్లీ: దేశంలోని యువ న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన లాయర్స్ అసోసియేషన్‌కు ఆలయ ప్రవేశాల్లో నిబంధనలపై ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలు చేయాల్సిన అవసరం ఏమిటని సర్వోన్నత న్యాయస్థానం నిలదీసింది. 'మీరేమైనా ఈ దేశ ప్రథమ పురోహితులా?' అంటూ ప్రశ్నించింది. సామాన్య ప్రజల ఉపయోగార్థం అందుబాటులో ఉంచిన ప్రజాహిత వ్యాజ్యమనే న్యాయపరమైన వెసులుబాటును దుర్వినియోగపరుస్తున్నారంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. శబరిమల ఆలయంతో పాటు దేశంలోని ప్రార్థనాస్థలాల్లో మహిళలపై వివక్షను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ముందు మంగళవారం కొనసాగింది. అయ్యప్పస్వామి ఆలయంలోకి 10-50ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను సవాల్ చేస్తూ 2006లో ఇండియన్ యంగ్ లాయర్స్ అసోసియేషన్ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ సంస్థ తరఫు న్యాయవాది రవి ప్రకాశ్ గుప్తా వాదనలు వినిపించారు. అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని తాము ప్రశ్నించడం లేదని, దానిని మరింత దృఢపరిచాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. 'న్యాయవాదుల సంస్థకు భగవంతుడిపై విశ్వాసం గురించి ఎందుకు? అది వ్యక్తులకు సంబంధించినది కదా?' అని జస్టిస్ బి.వి.నాగరత్న ప్రశ్నించారు. 'ఈ పిల్ దాఖలు చేయడానికి మీ సంస్థ తీర్మానం చేసిందా? సంస్థ అధ్యక్షుడు సంతకం చేశారా?' అని జస్టిస్ అరవింద్ కుమార్ ఆరా తీశారు. 'అసలు ఈ వ్యాజ్యం ఎందుకు దాఖలు చేశారు. మీ లక్ష్యం ఏమిట'ని జస్టిస్ సూర్యకాంత్ నిలదీశారు. ప్రజాహిత వ్యాజ్యాలు..రాజకీయ ప్రయోజన పిటిషన్లుగా, పైసా ప్రాయోజిత వ్యాజ్యాలుగా మారాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

కశ్మీరీలకు అన్ని రకాల మద్దతు: పాక్ ప్రకటన

ఇస్లామాబాద్: సమష్టి సంయమనం, బాధ్యతాయుత ప్రవర్తన, సార్వభౌమాధికారంపై పరస్పర గౌరవంతోనే దక్షిణాసియాలో శాంతి సుస్థిరతలు సాధ్యమవుతాయని పాకిస్థాన్‌కు చెందిన సైనిక అగ్ర నాయకత్వం మంగళవారం స్పష్టం చేసింది. రావల్పిండిలో పాకిస్థాన్ సైనిక దళాల ముఖ్యాధికారి ఫీల్డ్ మార్షల్ ఆసీం మునీర్ అధ్యక్షతన జరిగిన కోర్ కమాండర్స్ కాన్ఫరెన్స్‌లో ఈ అభిప్రాయం వ్యక్తమైంది. ఈ సమావేశంలో దేశం లోపల, బయటి భద్రతా వాతావరణంపై సమీక్ష జరిగిందని ఒక అధికార ప్రకటన తెలిపింది. కశ్మీరీ ప్రజల న్యాయమైన పోరాటానికి దౌత్య, రాజకీయ, నైతిక మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు. భారత్‌తో జరిగిన తాజా యుద్ధంలో పాకిస్థాన్ ఐరాస నిబంధనల మేరకు చట్టబద్ధంగా వ్యవహరించిందని, సాధారణ పౌరులు నివసించే ప్రదేశాలను మినహాయించి సైనిక స్థావరాలపై మాత్రమే దాడి చేసిందని దార్ ఈ సందర్భంగా అన్నారు.

సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య 38కి పెంపు

కీలక ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 34 నుంచి 38కి (ప్రధాన న్యాయమూర్తితో కలిపి) పెరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన దిల్లీలో మంగళవారం భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఇందుకు అనుగుణంగా బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92వేల కేసులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు వేగంగా న్యాయసేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ పెంపునకు ఆమోదముద్ర వేసినట్లు ఆయన తెలిపారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే సుప్రీంలో జడ్జీల సంఖ్య 38కి పెరుగుతుంది. న్యాయమూర్తుల సంఖ్య పెంపుతో తలెత్తే అదనపు ఖర్చును భారత సంఘటిత నిధి నుంచి సమకూరుస్తారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీజేఐతో కలిపి 32 మంది న్యాయమూర్తులు సేవలందిస్తున్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది నవంబర్‌లోపు నలుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం జడ్జీల సంఖ్య 76 ఏళ్లలో సంఖ్యాపరంగా 30, నిష్పత్తి ప్రకారం 375% పెరిగింది. చివరిసారిగా 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 30 నుంచి 33 (సీజేఐ మినహా)కు పెంచారు.

ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్ పురస్కారం

న్యూయార్క్: పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సుపర్ణా శర్మలు ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ మీడియా సంస్థ బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి ఆనంద్, సుపర్ణలు ఈ అవార్డును పంచుకోనున్నారు.

జన్యు గుట్టు విప్పుతూ.. చికిత్సలను మెరుగుపరుస్తూ

- సత్ఫలితాలిస్తున్న జీనోమ్‌ఇండియా ప్రాజెక్టు



పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం సరైనదేనా..? కాదు కదా! మరి ఐరోపావాసులపై పరిశోధనలు జరిపి.. వాటి ఆధారంగా రూపొందించిన ఔషధాలు, మోతాదులను భారతీయులు అదే స్థాయిల్లో ఉపయోగించడం ఎంతవరకు సముచితం? సరిగ్గా ఇదే ప్రశ్నతో.. భారతీయులకు మెరుగైన చికిత్స మార్గాలను రూపొందించాలన్న లక్ష్యంతో ఆరేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జీనోమ్‌ఇండియా ప్రాజెక్టు' క్రమంగా సత్ఫలితాలిస్తోంది. మనవాళ్లలో జన్యుపరమైన వైరుధ్యాలను స్పష్టంగా గుర్తిస్తూ.. పలు చిక్కుముళ్లను విప్పుతోంది.

0.1%లోనే ఎన్నో వైరుధ్యాలు

ఒక జీవిలోని డీఎన్‌ఏ మొత్తాన్నీ కలిపి విశ్వజన్యురాశి (జీనోమ్)గా పిలుస్తారు. మనుషులందరిలో 99.9% జీనోమ్ ఒకేలా ఉంటుంది. మిగతా 0.1% జన్యురాశే అనేక వైరుధ్యాలకు కారణమవుతుంది. ఆరోగ్యం, వ్యాధులు, ఔషధాల పనితీరుపై ఈ 0.1% వేరియంట్లు అధిక ప్రభావం చూపుతాయి. వాటిని స్పష్టంగా గుర్తిస్తే.. ఆయా వ్యక్తులకు వారి జన్యు ప్రొఫైల్ ఆధారంగా మెరుగైన చికిత్స అందించవచ్చు.

మన జన్యువులను విశ్లేషించేలా..

భారత్‌లో జన్యు వైవిధ్యం ఎక్కువ. కానీ ఇన్నేళ్లూ పరిశోధనల్లో మనవారి జన్యువులకు సముచిత ప్రాధాన్యం దక్కలేదు. ఇప్పటిదాకా జీనోమ్ అధ్యయనాల్లో పాల్గొన్నవారిలో దాదాపు 86.3% ఐరోపా సంతతివారే! అంటే- వారి జన్యువుల ఆధారంగానే ఔషధాలను, చికిత్స ప్రణాళికలను ఫార్మా సంస్థలు ఎక్కువగా రూపొందించాయి. ఈ నేపథ్యంలో భారతీయుల డీఎన్‌ఏను డీకోడ్ చేసి.. మన వారి కోసం నిర్దిష్ట చికిత్సా మార్గాలను, మోతాదులను నిర్దేశించుకునేందుకు వీలు కల్పించేలా కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) 2020 జనవరిలో జీనోమ్‌ఇండియా ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌లోని సీసీఎంబీ సహా పలు ప్రఖ్యాత సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలు చేపడుతున్నాయి.

20 వేల నమూనాల సేకరణ

జీనోమ్‌ఇండియా ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకూ.. ఒకరితో ఒకరికి సంబంధం లేని, ఆరోగ్యవంతులైన 20 వేలమందికిపైగా భారతీయుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఇందులో 87 రకాల జన సమూహాలకు (గిరిజనులు, గిరిజనేతరులు, గ్రామీణులు, పట్టణ ప్రజలు ఇలా..) చెందిన వ్యక్తులు ఉన్నారు. ఈ నమూనాలను బెంగళూరు సీబీఆర్‌లోని బయోబ్యాంకులో భద్రపరిచారు. వీటిలో 9,768 నమూనాల జీనోటైపింగ్ పూర్తయింది. గతంలో తెలియని 4.4 కోట్లకు పైగా జన్యు వేరియంట్లను ఈ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.



ప్రయోజనాలు ఇలా..

- బ్యుటైరిల్‌కోలినెస్టెరేస్ (బీసీహెచ్‌ఈ) అనే జన్యువులో ఉత్పరివర్తనం (మ్యుటేషన్).. కొన్నిరకాల మత్తుమందులను శరీరం విచ్ఛిన్నం చేసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ తరహా ఉత్పరివర్తనం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని వైశ్యులు సహా పలు భారతీయ వర్గాల్లో ఎక్కువ. అంతర్జాతీయ ప్రామాణిక డోసుల ప్రకారమే ఔషధాలను తీసుకున్నా.. శస్త్రచికిత్సల తర్వాత కండర పక్షవాతం వీరిలో సుదీర్ఘంగా కొనసాగేందుకు ఇది కారణమవ్వొచ్చు. ఇలాంటి వారికి మెరుగైన మోతాదులను గుర్తించేందుకు జీనోమ్ ఇండియా ప్రాజెక్టు విశ్లేషణలు దోహదపడతాయి.
- సమీప బంధువులను వివాహం చేసుకోవడం వల్ల.. భారతీయుల్లో వంశపారంపర్యంగా సికిల్‌సెల్ వ్యాధి బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇది గిరిజనులకే పరిమితమని గతంలో భావించేవారు. గిరిజనేతరుల్లోనూ ఇలాంటి కేసులు ఉంటున్నట్లు.. ఇటీవల కర్ణాటకలోని చామరాజనగర్‌లో చేసిన అధ్యయనం సహా పలు పరిశోధనలు తేల్చాయి.
- భారతీయుల్లో ఔషధాల జీవక్రియకు సంబంధించి జన్యుపరమైన పలు వేరియంట్లను ఈ ప్రాజెక్టులో గుర్తించారు. అంతర్జాతీయ ప్రామాణిక మోతాదులకు భిన్నంగా మనకోసం వేరే డోసేజులను నిర్దేశించేందుకు ఇది దోహదపడనుంది. **- నేషనల్ డెస్క్**

యూఏఈపై మళ్లీ ఇరాన్ దాడులు

దుబాయ్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై ఇరాన్ వరుసగా రెండో రోజూ దాడులు చేసింది. టెహ్రాన్ మంగళవారం తమ దేశంపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిందని.. వాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని యూఏఈ తెలిపింది. తాజా పరిణామం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దాడులు చేసి ప్రజలను చంపాలని తాను కోరుకోవడం లేదని, కాబట్టి టెహ్రాన్ తెలివిగా వ్యవహరించాలని సూచించారు. ఇరాన్‌లో ద్రవ్యోల్బణం 150%కు పెరిగిందని.. సైనికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఆ దేశం ఉందని విలేకర్లతో మాట్లాడుతూ పేర్కొన్నారు. మరోవైపు- హర్మూజ్‌లో, యూఏఈపై ఇరాన్ తాజాగా దాడులకు పాల్పడినప్పటికీ.. ఆ దేశంతో తమ కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. హర్మూజ్ చుట్టూ గగనతలంలో తమ దేశానికి చెందిన 100 మిలిటరీ విమానాలు గస్తీ తిరుగుతున్నాయని అమెరికా సైనిక ఉన్నతాధికారి డాన్ కైన్ తెలిపారు. హర్మూజ్‌లో టోల్ వసూళ్లను ఆపి, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించకపోతే ఇరాన్‌పై ఆంక్షలు విధించేందుకు వీలుగా ఐక్యరాజ్య సమితిలో తీర్మానం ప్రవేశపెట్టేందుకు అమెరికా, గల్ఫ్ దేశాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ముసాయిదా తీర్మానాన్ని తయారుచేశాయి.

ఇండో అమెరికన్ పరిశోధకులకు 'ఆర్గోన్' అవార్డులు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలో ముగ్గురు భారతీయ పరిశోధకులకు ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. అమెరికా ఇంధనశాఖకు చెందిన సైన్స్, ఇంజినీరింగ్ ప్రయోగశాల 'ఆర్గోన్ నేషనల్ లేబొరేటరీ' అందించే డాక్టరేట్ తర్వాతి పనితీరు పురస్కారాన్ని వీరు సొంతం చేసుకున్నారు. కృత్రిమమేధ, సూపర్ కంప్యూటింగ్ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శిల్పిక, కిరణ్‌కుమార్ యలమంచి ఈ ఏడాది పురస్కారానికి ఎంపికైనవారిలో ఉండగా.. ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి కృష్ణతేజ గతేడాది ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఐఐటీ మద్రాస్‌లో చదువుకున్న కిరణ్‌కుమార్ ఆర్గోన్‌లో అసోసియేట్ రీసెర్చ్ సైంటిస్టుగా పనిచేస్తున్నారు. భౌతికశాస్త్రాన్ని మెషిన్ లెర్నింగుతో అనుసంధానించే విషయంపై పరిశోధనలు చేస్తున్నారు. మరో ఇండో అమెరికన్ శిల్పిక.. ఎక్సాస్కేల్‌లో నిపుణురాలు. సూపర్ కంప్యూటర్లను శాస్త్రవేత్తలకు మరింత చేరువ చేయడంలో పరిశోధనలు చేస్తున్నారు. ఉస్మానియాలో ఇంజినీరింగు చేసిన కృష్ణతేజ.. ఆ తర్వాత అమెరికా వెళ్లి అయోవా స్టేట్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగులో పీహెచ్‌డీ చేశారు. అనంతరం 'ఆర్గోన్ ల్యాబ్'లో చేరిన ఆయన.. సూపర్ కంప్యూటర్లపై ఏఐ వ్యవస్థలను మరింత సమర్థంగా పనిచేసేలా చేయడంపై దృష్టి సారించారు. ఎల్‌ఎల్‌ఎం ఇన్ఫరెన్స్ బెంచ్ పేరుతో ఓపెన్ సోర్స్ టెస్టింగ్ టూల్‌నూ రూపొందించారు.

EENADU Vol: 31, Issue: 30
Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.
Founder Ramoji Rao

ఈనాడు సినిమా

'ఫౌజీ'.. తొలి పాట సన్నాహాలు




కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు హను రాఘవపూడి కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇమాన్వి కథానాయిక. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ లిరికల్ గీతానికి సంబంధించిన పనులు మొదలయ్యాయని.. ఈనెలలోనే ఇది బయటకొచ్చే అవకాశముందని సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక మరోవైపు ఈ సినిమా ఇప్పటికే 75శాతం పైగా చిత్రీకరణ పూర్తి చేసుకుందని, మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉందని ఇటీవలే చిత్ర వర్గాల నుంచి స్పష్టత వచ్చింది. ఇది ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతమందిస్తుండగా.. సుదీప్ ఛటర్జీ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

బాలకృష్ణ సరసన బాలీవుడ్ అందం?



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు కొరటాల శివ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే దీనిపై అధికారిక ప్రకటన వచ్చేసింది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించేందుకు తెర వెనుక సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇందులో కనిపించనున్న తారాగణమెవరన్నది ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఇందులో బాలకృష్ణకు జోడీగా ఓ బాలీవుడ్ నాయికను రంగంలోకి దించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే విద్యాబాలన్‌తో పాటు మరో నటి పేరు ప్రచారంలో ఉంది. విద్యా ఇప్పటికే బాలయ్యతో కలిసి 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ జోడీ మళ్లీ కొరటాల శివ సినిమాతో తిరిగి కలిసిందంటే.. దీనిపై ఉత్తరాదిలోనూ మంచి అంచనాలేర్పడే అవకాశముంది. ఇది బలమైన సామాజిక సందేశమున్న యాక్షన్ కథతో రూపొందనుందని.. దీంట్లో రాజకీయ అంశాలు మిళితమై ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి దుర్మరణం



కుటుంబ కథలకు ప్రాణంపోస్తూ... తన కుటుంబాన్నే సినిమాకి అంకితం చేసిన నిర్మాత ఆర్.బి.చౌదరి(76) ఇకలేరు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో మంగళవారం జరిగిన కారు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందారు. ఆయన చిత్ర నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్.. దశాబ్దాలుగా విలువలున్న సినిమాలకు ప్రతీకగా నిలుస్తూ ఓ బ్రాండ్‌గా మారిపోయింది. తరాలు మారినా... మాస్ మసాలా కథలు రాజ్యమేలుతున్నా సరే... కుటుంబ కథలకే పట్టం కట్టిందంటే కారణం ఆర్.బి.చౌదరి నమ్మిన సిద్ధాంతాలే.

వంద చిత్రాలకు చేరువై...

1950లో మద్రాస్‌లో బి.ఆర్.చౌదరి, పార్వతి బాయి దంపతులకు జన్మించిన ఆర్.బి.చౌదరి అసలు పేరు రతన్ భగత్‌రామ్ చౌదరి. ఉక్కు, ఆభరణాలు, ఎగుమతుల రంగంలో వ్యాపారం ప్రారంభించిన ఆయన సినిమాల్నీ గల్ఫ్ దేశాల్లో పంపిణీ చేశారు. అలా సినిమా రంగంతో అనుబంధం ఏర్పరుచుకున్న ఆయన ఆ తర్వాత నిర్మాణంలోకి అడుగుపెట్టారు. సూపర్ ఫిల్మ్స్ పేరుతో నిర్మాణ సంస్థని ప్రారంభించి మలయాళంలో సినిమాల్ని రూపొందించారు. ఆ తర్వాత తమిళం, తెలుగు భాషల్లోకి అడుగుపెట్టారు. 1990, 2000 దశకంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ పేరు మార్మోగిపోయింది. తెలుగులో ఎన్.వి.ప్రసాద్, శానం నాగ అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించిన 'శుభాకాంక్షలు'తోపాటు, ఆ తర్వాత వచ్చిన 'సూర్యవంశం', 'సుస్వాగతం', 'రాజా', 'శీను', 'సింహరాశి', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'స్నేహమంటే ఇదేరా', 'శివరామరాజు', 'లవ్‌టుడే', 'సంక్రాంతి', 'గోరింటాకు' తదితర చిత్రాలు ఘన విజయాల్ని అందుకున్నాయి. తమిళంలో నిర్మించిన చిత్రాల్ని తెలుగులో రీమేక్ చేస్తూ, తెలుగు చిత్రాల్ని తమిళంలోనూ రీమేక్ చేస్తూ ఆయన విజయాల్ని అందుకున్నారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, పవన్‌కల్యాణ్, రాజశేఖర్, రామ్‌చరణ్ తదితర తారలతోపాటు, యువతరం కథానాయకులతోనూ తెలుగులో సినిమాలు నిర్మించారు. తమిళంలోనూ విజయ్‌తోపాటు పలువురు అగ్ర కథానాయకులతో సినిమాలు నిర్మించారు. దాదాపుగా నాలుగు దశాబ్దాల ప్రయాణంలో ఆర్.బి.చౌదరి వంద సినిమాలకు చేరువయ్యారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సంస్థలపై ఆయన వరుసగా సినిమాలు నిర్మించారు. ఆయన 99వ చిత్రం 'మకుటం' విశాల్ కథా నాయకుడిగా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఆ చిత్రం సెట్స్‌పై ఉంది.

హీరోలుగా వారసులు

ఆర్.బి.చౌదరి కుటుంబం కూడా సినిమా రంగంలో రాణిస్తోంది. ఆయనకు నలుగురు కుమారులు సురేశ్, జీవన్, జితన్ రమేశ్, జీవా. సురేశ్ సినీ నిర్మాణంలోనే కొనసాగుతుండగా, జీవన్ ఉక్కు కంపెనీని నిర్వహిస్తున్నారు. మూడో తనయుడు జితన్ రమేశ్ కథా నాయకుడిగా, నిర్మాతగా ప్రేక్షకులకు సుపరిచితం. 'విద్యార్థి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్నీ పలకరించారు. చిన్న కుమారుడు జీవా కథానాయకుడిగా రాణిస్తున్నారు. 'రంగం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు జీవా. ఆయనకు భార్య మహెజబీన్ ఉన్నారు.

ఎంతోమందికి అవకాశాలు...

కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వడంలో ఎప్పుడూ ముందుండేవారు ఆర్.బి.చౌదరి. 'కెప్టెన్' సినిమాతో శరత్‌కుమార్‌ను కథానాయకుడిగా పరిచయం చేసింది ఆయనే. తమిళ చిత్రం 'పుదువసంతం' కొత్తవాళ్లతోనే తీశారు. ఆ చిత్రం 'నవవసంతం' పేరుతో తెలుగులోకి అనువాదమైంది. పలువురు దర్శకులు, కథానాయకులు, సాంకేతిక నిపుణులు సూపర్‌గుడ్ సంస్థల నుంచి పరిచయమై పరిశ్రమలో నిలదొక్కు కున్నారు. బుధవారం ఆయన పార్థివ దేహాన్ని చెన్నైకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

– చెన్నై, సైదాపేట, న్యూస్‌టుడే

ఆర్.బి.చౌదరి చిత్రసీమకు అందించిన సేవలు గుర్తుండిపోతాయి

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి ఆకస్మిక మరణ వార్త విని మనసు కలత చెందిందని కథానాయకుడు చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ చిత్రసీమకు ఆయన చేసిన సేవల్ని మాటల్లో వర్ణించలేమని.. ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, నటుల్ని తీర్చిదిద్దారని, ఎన్నో గొప్ప కథలకు జీవం పోశారని.. ఇటీవలే వారి సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో 'గాడ్ ఫాదర్' సినిమా చేశానని గుర్తు చేసుకుంటూ చిరు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. కథానాయకుడు రజనీకాంత్ స్పందిస్తూ.. "నా ప్రియ మిత్రుడు, సూపర్ గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్.బి.చౌదరి అద్భుతమైన మానవతావాది. ఆయన ఎంతోమంది యువ దర్శకులకు అవకాశాలు కల్పించి.. చిత్ర ప్రపంచాన్ని సజీవంగా ఉంచారు. ఆయన అకాల మరణవార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది" అని ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. ఆర్.బి.చౌదరి మరణం దిగ్భ్రాంతి కలిగించిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి, కథానాయకుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయనకు సంతాపం తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. "నేను నటించిన 'సుస్వాగతం' చిత్రాన్ని ఆర్.బి.చౌదరి నిర్మించారు. అది ఘన విజయం సాధించింది. ఆయన ఎప్పుడూ కుటుంబ సమేతంగా చూడదగ్గ కథల్ని ఎంపిక చేసుకుని, చక్కటి గీతాలు ఉండేలా సినిమాల్ని నిర్మించారు. వారి సంస్థలో చేసిన 'అన్నవరం' చిత్రంలోని సిస్టర్ సెంటిమెంట్ కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆయన ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో నిర్మాతగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు" అంటూ పవన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. కథానాయకుడు వెంకటేశ్ స్పందిస్తూ.. "ఆర్.బి.చౌదరి మరణవార్త విని తీవ్ర దుఃఖంలో మునిగిపోయాన"ని ఆవేదన వ్యక్తం చేశారు. తామిద్దరి మధ్య ఎన్నో ఏళ్లుగా గాఢమైన వ్యక్తిగత అనుబంధం ఉందని, 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'సంక్రాంతి' లాంటి చిత్రాల కోసం సూపర్ గుడ్ ఫిల్మ్స్‌తో కలిసి పని చేసే అవకాశం లభించిందని చౌదరితో ఉన్న జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. సినిమా రంగానికి ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయంటూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే కథానాయకులు విశాల్, మంచు మనోజ్, తేజ సజ్జా, దర్శకులు సౌందర్య రజనీకాంత్, కేఎస్ రవికుమార్, అనిల్ రావిపూడి, సంపత్ నంది తదితరులు ఆర్.బి.చౌదరి మృతి పట్ల సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం ప్రకటించారు.

బెంగాల్‌లో నన్ను అడుగు పెట్టనివ్వలేదు!



వివేక్ అగ్నిహోత్రి

'ది కశ్మీర్ ఫైల్స్' విడుదలైన తర్వాత పశ్చిమ బెంగాల్ నుంచి మమతా బెనర్జీ తనను పూర్తిగా బహిష్కరించారని అన్నారు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. తాజాగా జరిగిన ఎన్నికల్లో మమతా బెనర్జీ ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వివేక్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. "ఇక ఎప్పటికీ ఇలాంటివి వద్దు. తెలియని వారి కోసం చెబుతున్నా. 'ది కశ్మీర్ ఫైల్స్' విడుదలైన తర్వాత ఆ సినిమాను థియేటర్ల నుంచి తొలగించడమే కాకుండా.. నన్ను బెంగాల్‌లో అడుగుపెట్టనివ్వనని అన్నారు మమతా బెనర్జీ. గతేడాది వచ్చిన 'ది బెంగాల్ ఫైల్స్'ను పశ్చిమ బెంగాల్‌లో పూర్తిగా నిషేధించారు. మా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. మా పై దాడి చేసి కొట్టారు. నాపై డజన్ల కొద్దీ ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. చివరికి గవర్నర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించడానికి కూడా నేను వెళ్లలేకపోయాను. అయినా మేమెప్పుడూ వెనకడుగు వేయలేదు. ఈ ఎన్నికల సమయంలో 'ది బెంగాల్ ఫైల్స్' చిత్రాన్ని బెంగాల్ వ్యాప్తంగా సాధ్యమైనంత ఎక్కువమందికి రహస్యంగా చూపించాం. మా శక్తి మేరకు పోరాడినందుకు నాకు సంతోషంగా ఉంది. చివరగా బెంగాల్ మహనీయులకు అభినందనలు. ఇకపై అక్కడి ప్రజలు ఎలాంటి భయం లేకుండా తలెత్తి గర్వంగా నడవొచ్చు"ని ఆ వీడియోలో చెప్పారు వివేక్.

వీళ్లంటేనే ప్రత్యేకం!



బాలీవుడ్ కథానాయిక అనన్య పాండే, లక్ష్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చాంద్ మేరా దిల్'. ఈ రొమాంటిక్ డ్రామాకు వివేక్ సోని దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు, పోస్టర్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలోనే మరో గీతాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. "వీళ్లకు సంబంధించిన ప్రతీ విషయం ప్రత్యేకమే" అనే వ్యాఖ్యను జోడించింది. 'ఖసియత్..' అంటూ సాగుతున్న ఈ పాటలో లక్ష్య, అనన్యల జోడీ సరికొత్తగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. సచిన్-జిగర్ స్వరపరిచిన ఈ గీతాన్ని రాఘవ్ చైతన్య, జోనితా గాంధీ ఆలపించారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 22న థియేటర్లలోకి రాబోతుంది.

లక్ష్యం సంక్రాంతే!



రజనీకాంత్

కథా నాయకుడు రజనీకాంత్ ఇటీవలే 'జైలర్ 2' సినిమాని ముగించారు. దీంతో ఇప్పుడు తన తదుపరి 173వ చిత్రంపై దృష్టి సారించారు. 'తలైవర్ 173' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని కథానాయకుడు కమల్‌హాసన్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సుందర్.సి ఈ చిత్ర దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాక.. శిబి చక్రవర్తిని దర్శకుడిగా ఖరారు చేశారు. కానీ, ఇప్పుడాయన కూడా వ్యక్తిగత కారణాలతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో దీన్ని తెరకెక్కించే బాధ్యతను అశ్వత్ మారిముత్తు అందిపుచ్చుకున్నట్లు సమాచారం. ఈ చిత్రం ప్రకటించినప్పుడే దీన్ని పొంగల్ బరిలో దించనున్నట్లు కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్ట్‌లో దర్శకత్వ పరంగా కీలక మార్పులు జరిగినప్పటికీ పండగ లక్ష్యంలో ఏ మార్పు ఉండదని తెలుస్తోంది. దీనికి తగ్గట్లే అశ్వత్ జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించి, వరుస షెడ్యూల్స్‌లో ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులతో పాటు పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే దర్శకత్వ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిసింది. ఇక రజనీ నటించిన 'జైలర్ 2' ఆగస్టులో థియేటర్లలోకి రానున్నట్లు సమాచారం.

సూపర్ హీరోతో కరీనా?



'క్యోం కీ', 'మై ఔర్ మిసెస్ ఖన్నా', 'బజరంగీ భాయ్‌జాన్' లాంటి విజయవంతమైన చిత్రాలతో హిట్ జోడీ అనిపించుకున్నారు బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్, కథానాయిక కరీనా కపూర్. ఇప్పుడీ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది. రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న ఓ చిత్రంలో సల్మాన్ సూపర్ హీరోగా నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో నాయికగా కరీనాను ఎంపిక చేసిందట చిత్రబృందం. "ఇందులోని పాత్ర కోసం కరీనాను స్వయంగా సంప్రదించారు సల్మాన్. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నటించడానికి కరీనా చాలా ఉత్సాహంగా ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

పేరుకి తగ్గట్టే తొలి సినిమాతోనే ఫేమస్ అయిన కథానాయకుడు... సుమంత్ ప్రభాస్. 'మేమ్ ఫేమస్' సినిమాతో కథానాయకుడిగా, దర్శకుడిగా పరిచయమైన ఆయన... తన రెండో చిత్రంగా 'గోదారి గట్టుపైన' చేశారు. 'ఈ వేసవిలో కూల్ అయిపోండి...' అంటూ ప్రచార జోరుని కొనసాగిస్తున్నాడు. సుభాష్‌చంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

అప్పుడే మంచి కథల కోసం వెతకడం మానేశా!



రెండో సినిమాని చాలా సమయం తీసుకుని చేసినట్టున్నారు...

'మేమ్ ఫేమస్' తర్వాత మరొక సినిమా చేయాలనుకున్నప్పుడు 'తొలి సినిమాతోనే నీకు మంచి గుర్తింపు వచ్చింది కదా. రెండో సినిమానీ మంచి కథతో చేయి' అని సలహా ఇచ్చారు చాలామంది. అలా చాలా కథలు విన్నా. ఒక దశలో ఎలాంటి కథ చేయాలో తెలియక ఒత్తిడి పెరిగింది. అప్పుడే మంచి కథలు వెతకడం మానేసి, ఒక మంచి దర్శకుడితో జట్టు కడితే బాగుంటుందనుకున్నా. ఆ క్రమంలోనే వంద లఘు చిత్రాలు తీసిన అనుభవం ఉన్న సుభాష్ అన్నని కలిశా. ఆయన చెప్పిన ఈ కథ నచ్చి సినిమా చేశా.

మీలోనూ ఓ దర్శకుడు ఉన్నాడు కదా. రచన, దర్శకత్వం పరంగా మీ భాగస్వామ్యం ఏమైనా ఉందా?

కథ వినగానే 'నేను మీకు లొంగిపోతున్నా...' అని దర్శకుడితో చెప్పా. ఆయన ఈ కథని పకడ్బందీగా రాసుకుని, తనదైన శైలిలోనే తెరపైకి తీసుకొచ్చారు. సినిమా పూర్తయ్యాక ప్రచారం బాధ్యతల్ని మాత్రం నాకు వదిలేయండి అని చెప్పా(నవ్వుతూ). నా తొలి సినిమా కోసం ఎలా ప్రచారం చేశామో, అలా ఈ సినిమానీ ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలని 'కూల్...' అంటూ నేనే స్వయంగా ప్రచార చిత్రాల్ని డిజైన్ చేశా. అందులో కృత్రిమ మేధనీ వాడుకుంటున్నాం.

'గోదారి గట్టుపైన' కథలో మిమ్మల్ని ప్రధానంగా ఆకట్టుకున్న విషయాలేమిటి?

గోదావరి నేపథ్యంలో సాగే అందమైన ఈ కథ, భావోద్వేగాలే నన్ను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. తొలి సినిమా తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఈసారి అందుకు భిన్నమైన నేపథ్యం కావడంతో నటుడిగా నాకు సవాల్‌గా అనిపించింది.

గోదావరి యాస విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకొన్నారు?

నేను పుట్టి పెరిగింది తెలంగాణలో. పక్కాగా అయితే గోదావరి యాసలో మాట్లాడలేను. అక్కడ పుట్టి పెరిగినవారు నా యాస విన్నప్పుడు 'మనలా మాట్లాడేందుకు ప్రయత్నించాడు' అనుకున్నా చాలు. యాస కోసం నాలుగు నెలల పాటు సన్నాహాలు చేసి ఇందులో నటించా. కచ్చితంగా నా ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నా. ఇందులో నేనొక ఆటోడ్రైవర్‌గా కనిపిస్తా.


జగపతిబాబు, లైలా తదితర సీనియర్ నటులు ఇందులో ఉన్నారు కదా. వాళ్లతో పనిచేసిన అనుభవం ఎలా ఉంది?

చాలా రోజుల తర్వాత జగపతిబాబు ఆయన నటించిన 'శుభలగ్నం', 'ఫ్యామిలీ సర్కస్' సినిమాల్ని గుర్తు చేసేలా అందమైన పాత్రని ఇందులో చేశారు. ఆయనకు జోడీగా ఒకప్పటి కథానాయిక లైలా నటించారు. వాళ్లిద్దరి కలయిక ప్రత్యేకంగా అనిపిస్తుంది. జగపతిబాబు తనతో కలిసిపోవాలని నన్ను భీమవరంలో సినిమాకీ, బజ్జీలు తినడానికీ తీసుకెళ్లేవారు. దర్శకుడు, నటుడు దేవీప్రసాద్ కూడా ఇందులో కీలకపాత్రని చేశా. నిర్మాత అభినవ్ దర్శకుడికి పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఏ విషయంలోనూ రాజీపడకుండా సినిమా చేశారు.

నటనపైనే దృష్టిపెడతారా? మళ్లీ మీ దర్శకత్వంలో సినిమా ఎప్పుడు?

దర్శకత్వం చేయకూడదనేమీ లేదు. ఇప్పుడు కూడా స్క్రిప్ట్ రాసుకుంటున్నా. అయితే నేను కథానాయకుడిగా ఇప్పటికే మూడు సినిమాలకి సంతకం చేశా. అందులో ఒక సినిమా చిత్రీకరణ కూడా పూర్తయింది. ఈ ప్రయాణం మధ్యలో నాకు సమయం దొరికితే కచ్చితంగా దర్శకత్వం చేస్తా.

యజమాని కోసం ఇల్లు ఎదురుచూపు



ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ 'ది ఒడిస్సీ' చిత్రంతో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో టామ్ హాలెండ్, మాట్ డామన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జులై 17న థియేటర్లలోకి రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్ర బృందం. "యజమాని కోసం ఎదురుచూస్తున్న ఇల్లు ఇది', 'ఇథాకా రాజు తిరిగి వస్తున్నాడు" లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది ట్రైలర్.

మలయాళ నటుడు సంతోష్ నాయర్ మృతి



మలయాళ సీనియర్ నటుడు సంతోష్ నాయర్(65) కన్నుమూశారు. మంగళవారం ఉదయం కేరళలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. పతనంతిట్ట జిల్లా ఏనత్తు సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో నాయర్‌తో పాటు ఆయన భార్య సుభాశ్రీ కూడా గాయపడ్డారు. ప్రమాద సమయంలో నాయర్ ఛాతీ.. స్టీరింగ్ వీల్‌కు బలంగా తగలడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని పోలీసులు తెలిపారు. 1982లో సినీరంగంలోకి అడుగుపెట్టిన నాయర్.. హీరో, విలన్, సహాయ పాత్రల్లో తనదైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించారు. 100కి పైగా సినిమాల్లో విభిన్నమైన పాత్రల్ని పోషించారు. నాయర్ మృతి పట్ల అగ్రహీరో మోహన్‌లాల్‌తో పాటు పలువురు మలయాళ సినీప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఓటీటీలో ఈ వారం

కొత్త వారం... అందులోనూ వేసవి. మరి సినీప్రియుల్ని నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేస్తూ కూల్ చేసే కథలు కావాలి కదా! దీని కోసమే ఓటీటీలు కొత్త కంటెంట్‌తో వినోదాలు వడ్డించడానికి రెడీగా ఉన్నాయి. ఎప్పటిలాగే ఈ వారాంతం వైవిధ్యమైన కథలు, సిరీస్‌లతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్నాయి.

'డెకాయిట్' యాక్షన్



'అందరూ మహేశ్‌బాబులు అయిపోదామనే' అంటూ ఇటీవలే థియేటర్లలో సందడి చేసింది 'డెకాయిట్' చిత్రం. హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రమిది. షానియల్ డియో దర్శకత్వం వహించారు. ఇందులో హరిదాస్ పాత్రలో తన యాక్షన్‌తో ఆకట్టుకున్నారు శేష్. కళ్లతోనే హావభావాల్ని పండిస్తూ జూలియట్ పాత్రలో మృణాల్ ఒదిగిపోయింది. ఇప్పుడీ రొమాంటిక్ యాక్షన్ డ్రామా శుక్రవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.

సిటాడెల్ సీజన్ 2 (సిరీస్)	బుధవారం	అమెజాన్ ప్రైమ్
ఎల్ఐకే (చిత్రం)	బుధవారం	అమెజాన్ ప్రైమ్
పాపం ప్రతాప్ (చిత్రం)	గురువారం	ఈటీవీ విన్
లెజెండ్స్ (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
మై డియరెస్ట్ అసాసిన్(చిత్రం)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ది చెస్ట్‌నట్ మ్యాన్:హైడ్ అండ్ సీక్(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
నో ప్లేస్ టు బీ సింగిల్ (చిత్రం)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్
రిమార్కబ్లీ బ్రైట్ క్రీచర్స్ (చిత్రం)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
మై రాయల్ నెమెసిస్ (సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
లుక్కో (సిరీస్)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్
వాలా 2 (చిత్రం)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
హో బటర్‌ఫ్లై (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్ట్స్
సూపర్ హిట్ (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్ట్స్

ఈనాడు బిజినెస్

అల్ట్రా లగ్జరీ ఇళ్ల విక్రయాల్లో హైదరాబాదే అగ్రస్థానం

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో రూ.10 కోట్లు, అంతకంటే విలువైన అత్యంత విలాసవంత గృహాల (అల్ట్రా-లగ్జరీ) విక్రయాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో కలిపి 811 అల్ట్రా-లగ్జరీ ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.11,246 కోట్లని స్థిరాస్తి సేవల సంస్థ ఇండియా సోత్‌బీస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, డేటా అనలిటిక్స్ సంస్థ క్రీ మ్యాట్రిక్స్ సంయుక్తంగా విడుదల చేసిన 'సదరన్ ఇండియా హై ఎండ్ లగ్జరీ హౌసింగ్' నివేదిక పేర్కొంది. వీటిల్లో హైదరాబాద్‌లోనే రూ.8,562 కోట్ల విలువైన 625 ఇళ్లు అమ్ముడయ్యాయి. రూ.10 కోట్ల పెట్టుబడికి 6,210 చదరపు అడుగుల ఇళ్లు లభిస్తుండటం ఇందుకు కారణం. నగరంలో అల్ట్రా-లగ్జరీ ప్రీమియం ప్రాజెక్టులకు కోకాపేట ప్రాంతం ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది. బెంగళూరులో రూ.1,957 కోట్ల విలువైన 128 ఇళ్లు, చెన్నైలో రూ.727 కోట్ల విలువైన 58 ఇళ్ల విక్రయమయ్యాయి.

ఎంఎస్ఎంఈలు, విమానయాన సంస్థలకు రూ.18,100 కోట్ల రుణహామీ పథకం

పశ్చిమాసియా యుద్ధం కారణంగా మూలధనం కోసం ఇబ్బందిపడుతున్న ఎంఎస్ఎంఈలు, విమానయాన సంస్థలు, ఇతర కంపెనీల కోసం రూ.18,100 కోట్లతో అత్యవసర రుణహామీ పథకం (ఈసీఎల్‌జీఎస్)ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా మొత్తం రూ.2.55 లక్షల కోట్ల అదనపు రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సంస్థల కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, ఉద్యోగాల పరిరక్షణ, సరఫరా వ్యవస్థలను అదుపుచేసేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

హీరో మోటోకార్ప్ తుది డివిడెండ్ రూ.75

దిల్లీ: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్, జనవరి-మార్చి త్రైమాసికానికి రూ.1,473.92 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,168.75 కోట్ల కంటే ఇది 26% అధికం. మొత్తం వాహన విక్రయాలు 24% పెరిగి 17.14 లక్షలుగా నమోదయ్యాయి. కార్యకలాపాల ఆదాయం రూ.9,969.81 కోట్ల నుంచి రూ.12,978.28 కోట్లకు పెరిగింది. అమ్మకాలు పెరగడమే లాభాదాయ వృద్ధికి కారణం. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.75 తుది డివిడెండును చెల్లించేందుకు బోర్డు సిఫారసు చేసింది. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పవన్ ముంజాల్‌ను అక్టోబరు 1 నుంచి మరో ఐదేళ్ల కాలానికి నియమించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

కోడి గుడ్డు

6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	515
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

లక్ష్మీ ఫౌండేషన్‌కు 60 లక్షల అవాంటెల్ షేర్ల విరాళం

ప్రకటించిన సీఎండీ అబ్బూరి విద్యాసాగర్

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసే లక్ష్యంతో లక్ష్మీ ఫౌండేషన్‌కు 60 లక్షల అవాంటెల్ షేర్లను సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అబ్బూరి విద్యాసాగర్ విరాళంగా ఇచ్చారు. వీటి విలువ దాదాపు రూ.91.08 కోట్లు (ఎన్ఎస్ఈలో మంగళవారం ఈ షేరు ధర రూ.151.80).

ఎఫ్‌డీఐపై 12 వారాల్లో నిర్ణయం

ప్రామాణీకరించిన నిర్వహణ ప్రక్రియలో మార్పులు



దిల్లీ: ప్రభుత్వం ఇక నుంచి అన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనలను 12 వారాల్లో పరిష్కరించనుంది. ఆ మేరకు ప్రామాణీకరించిన నిర్వహణ ప్రక్రియ (ఎస్ఓపీ)ను అప్‌డేట్ చేసింది. ఎస్ఓపీ ప్రకారం.. ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడానికి 12 వారాల సమయాన్ని నిర్ణయించారు. ఇందులో దరఖాస్తుదారులు తమ ప్రతిపాదనల్లోని లోపాలను తొలగించడం లేదా అదనపు సమాచారాన్ని సంబంధిత అధికారులకు సమర్పించడానికి పట్టే సమయం లెక్కలోకి రాదు. 2017 నాటి ఎస్ఓపీ ప్రకారం.. ఒక ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడానికి గరిష్ఠ సమయం 10 వారాలుగా ఉంది. ప్రస్తుత ఎస్ఓపీ కింద అదనంగా ఇచ్చిన 2 వారాల సమయంలో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) ఈ ప్రతిపాదనను తిరస్కరించాలా లేదా అదనపు షరతులను సంబంధిత అథారిటీ విధించాల్సి ఉందా అన్న విషయాన్ని పరిశీలిస్తుంది. కొత్త ఎస్ఓపీ కింద ఎఫ్‌డీఐ దరఖాస్తు ఫైలింగ్ అంతా కాగిత రహితంగానే ఉంటుంది.

ఈ దేశాల ఎఫ్‌డీఐలు ఇలా..

భారత్‌తో భూసరిహద్దులు పంచుకునే దేశాలకు సంబంధించిన అన్ని దరఖాస్తులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతికి పంపుతారు. అయితే ఇతర దరఖాస్తులనూ ఆర్‌బీఐ, హోం శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ సహా అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఏ ప్రతిపాదనపైన అయినా సంప్రదిస్తారు. నిర్దేశిత సమయంలో ఆయా విభాగాలు/శాఖలు తమ వ్యాఖ్యలను పంపాల్సి ఉంటుంది. సమయంలోగా స్పందించని పక్షంలో, ఎటువంటి వ్యాఖ్యలు లేవని భావిస్తారు.

40 ఉప రంగాల గుర్తింపు

మనతో భూసరిహద్దులు పంచుకునే దేశాల ఎఫ్‌డీఐ ప్రతిపాదనలపై వేగవంతమైన అనుమతులకు 6 రంగాల్లో 40 ఉప రంగాలను కేంద్రం గుర్తించింది. ఇందులో యంత్రపరికరాల తయారీ; ఎలక్ట్రానిక్ యంత్ర పరికరాలు-ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ; పాలీసిలికాన్, ఇన్‌గాట్ వేఫర్లు; అధునాతన బ్యాటరీ విడిభాగాలు; అరుదైన భూలోహస్వాంతాలు, అరుదైన భూ అయస్కాంత ప్రాసెసింగ్.. రంగాల్లో ఉప రంగాలను గుర్తించారు. అందులో ఇన్పుట్ వస్తువుల తయారీ, థర్మల్/హైడ్రో/అణు ఇంధన ప్లాంట్ల కాస్టింగ్, ఫోర్జింగ్, మెషీన్ టూల్స్; డిస్‌ప్లే విడిభాగాలు; కెమెరా మాడ్యూళ్లు; ఎలక్ట్రానిక్ కెపాసిటర్లు, ఐసీటీ ఉత్పత్తులకు స్పీకర్లు-మైక్రోఫోన్లు; లిథియం అయాన్ బ్యాటరీలు; వేరబుల్స్; రేర్ ఎర్త్ మెటల్, అలాయ్-మ్యాగ్నెట్ తయారీ తదితరాలున్నాయి.

బయోకాన్ వారసురాలు క్లెయిర్ మజుందార్!

కిరణ్ మజుందార్‌కు మేనకోడలే



కిరణ్ మజుందార్ క్లెయిర్ మజుందార్

బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా(73) అధికారికంగా వారసత్వ ప్రణాళికను ప్రకటించారు. తన సోదరుడి కుమార్తె క్లెయిర్ మజుందార్ షాకు కంపెనీ పగ్గాలు ఇవ్వబోతున్నట్లు ఫార్చ్యూన్ ఇండియాకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాలుగు దశాబ్దాల కిందట బయోకాన్‌ను స్థాపించిన మజుందార్ షాకు పిల్లలు లేరు. రూ.60,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన తమ కంపెనీ తదుపరి దశ వృద్ధికి నేతృత్వం వహించడానికి, 37 ఏళ్ల క్లెయిర్ మజుందార్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నట్లు ఆమె తెలిపారు. 'బయోకాన్‌కు ఏకైక యజమానిని నేనే. ఈ కంపెనీని నమ్మదగ్గ వ్యక్తుల చేతుల్లో పెట్టేలా నేను చూసుకోవాలి. నా మేనకోడలు క్లెయిర్‌ను నా వారసురాలిగా చూశాను. ఒక కంపెనీని నిర్వహించగలదని తను ఇప్పటికే నిరూపించుకుంద'ని కిరణ్ వివరించారు. 'నా బాధ్యతల నుంచి తొలగాలని ఇప్పుడే అనుకోవడం లేదు. నా పాత్రలోకి క్లెయిర్‌ను క్రమక్రమంగా తీసుకువస్తాను' అని పేర్కొన్నారు.

ఎవరీ క్లెయిర్..: బయోకాన్‌లోనే ఆవిర్భవించిన బైకరా థెరాప్యూటిక్స్‌కు వ్యవస్థాపకురాలు, సీఈఓగా క్లెయిర్ ఉన్నారు. నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ ఇది. ఎమ్ఐటీ నుంచి బయోలాజికల్ ఇంజినీరింగ్, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ చదివిన క్లెయిర్‌కు క్యాన్సర్ బయాలజీలో స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుంచి పీహెచ్‌డీ కూడా ఉంది.

ఆసుపత్రులపైనా నియంత్రణ అవసరం

స్టార్ హెల్త్ ఎండీ-సీఈఓ ఆనంద్ రాయ్



ఈనాడు, హైదరాబాద్: బీమా రంగంలో 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడం, రిటైల్ ఆరోగ్య బీమాపై 18% జీఎస్టీని రద్దు చేయడం వంటి ప్రభుత్వ నిర్ణయాలు బీమా పరిశ్రమకు ఎంతో మేలు చేస్తాయని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఆనంద్ రాయ్ అన్నారు. ఇందువల్ల విదేశీ పెట్టుబడులతో పాటు, ఆధునిక సాంకేతికత, మెరుగైన సేవలు, నూతన ఆవిష్కరణలు మన దేశానికి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో వైద్య ఖర్చుల ద్రవ్యోల్బణం 15 శాతానికి పైగా నమోదవుతోందని తెలిపారు. బీమారంగం కట్టుదిట్టమైన నియంత్రణలో ఉన్నా, ఆరోగ్య సంరక్షణ రంగంపై నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఆసుపత్రులపైనా నియంత్రణ ఉంటేనే ఖర్చులు అదుపులోకి వస్తాయని వివరించారు.

చిన్న పట్టణాల కోసం అందుబాటు ధర పాలసీలు

స్టార్ హెల్త్ వ్యాపారంలో 10% ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచే వస్తోందని, 3-4 ఏళ్లలో దీన్ని 12-15 శాతానికి పెంచుతామని వెల్లడించారు. ఐఆర్‌డీఏఐ స్టార్ హెల్త్‌ను ఆంధ్రప్రదేశ్‌కు 'స్టేట్ ఇన్సూరెన్స్ లీడర్'గా కేటాయించిందని, రాష్ట్రంలో బీమా విస్తరణకు తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. చిన్న పట్టణాల ప్రజల అవసరాలకు తగ్గట్లుగా తక్కువ ప్రీమియంతో పాలసీలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. పాలసీదారులకు నగదు రహిత చికిత్స అందించేందుకు ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు చెప్పారు. గుంటూరు లాంటి నగరాల్లో వినియోగదారులకు తక్కువ ప్రీమియంతో పాలసీలను అందిస్తున్నామని, ఏ వైద్యానికైనా బీమా రక్షణ కల్పిస్తున్నామని అన్నారు. ఆరోగ్య బీమా పాలసీలతో 24 గంటలు ఆసుపత్రిలో ఉండనవసరం లేకుండా, రోబోటిక్ సర్జరీల వంటి ఆధునిక వైద్య విధానాలకూ బీమా వర్తిస్తుందని ఏపీ, తెలంగాణ బిజినెస్ హెడ్ కేబీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

కాగ్నిజెంట్‌లో 12,000-15,000 ఉద్యోగాల కోత!

అమెరికా కేంద్రంగా పనిచేసే బహుళజాతి ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్, ప్రపంచవ్యాప్తంగా 12,000-15,000 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగ్నిజెంట్‌లో 3,57,000 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తుండగా, వీరిలో అధికులు (2.5 లక్షల మందికి పైగా) మన దేశంలోనే ఉన్నారు. సమీప భవిష్యత్తులో ఉద్యోగుల తొలగింపులు కూడా మనదేశంలోనే ఎక్కువగా ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపినట్లు ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. తాము కొత్తగా ప్రకటించిన 'ప్రాజెక్ట్ లీప్' కింద 230-320 మిలియన్ డాలర్ల (రూ.2,200-3,000 కోట్ల) వరకు ఉద్యోగ విరమణ ఖర్చులు భరించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఏప్రిల్ 29న కంపెనీ తెలిపింది. సమీప భవిష్యత్తులో ఎన్ని ఉద్యోగాల కోత విధిస్తుందనేది అప్పుడు సంస్థ వెల్లడించలేదు. మనదేశంలో కాగ్నిజెంట్ ఉద్యోగుల సగటు వార్షిక వేతనం రూ.15 లక్షలుగా ఉన్నట్లు అంచనా. ఉద్యోగ విరమణ పరిహారం 6 నెలల వేతనానికి సమానంగా ఉంటుంది. భారత్‌లో 12,000-13,000 మంది ఉద్యోగులపై తాజా తొలగింపుల ప్రభావం పడొచ్చని తెలుస్తోంది.

3% తగ్గిన ఎల్ అండ్ టీ లాభం

దిల్లీ: మౌలిక రంగ దిగ్గజ సంస్థ ఎల్ అండ్ టీ, 2025-26 మార్చి త్రైమాసికంలో రూ.5,326 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.5,497 కోట్లతో పోలిస్తే ఇది 3% తక్కువ. గత ఆర్థిక సంవత్సరంలో రూ.475 కోట్ల అసాధారణ లాభం పొందడం వల్ల, ఇప్పుడు తగ్గినట్లు కనిపిస్తోందని కంపెనీ తెలిపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.74,392 కోట్ల నుంచి 11% పెరిగి రూ.82,762 కోట్లకు చేరింది. 2026 మార్చి 31కి కంపెనీ ఆర్డరు పుస్తకం రూ.7,40,327 కోట్లకు చేరింది. ఇందులో అంతర్జాతీయ ఆర్డర్ల వాటా 52 శాతంగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.38 చొప్పున తుది డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది.

● వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో (హైదరాబాద్), నాభా పవర్ లిమిటెడ్‌ల్లో పూర్తి వాటాలను విక్రయించడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. జూన్ చివరికి ఈ ప్రక్రియ పూర్తి కావొచ్చని పేర్కొన్నారు.

ప్రవాసుల నగదు మనకే ఎక్కువ

2024లో 137 బి.డాలర్లు



ఐక్యరాజ్యసమితి: విదేశాల్లోని వ్యక్తులు తమ స్వదేశంలోని వారికి పంపే నగదు (రెమిటెన్సెస్) అందుకోవడంలో భారత్ ప్రథమస్థానంలో ఉంటోంది. 2024లో ఏకంగా 137 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13 లక్షల కోట్ల)కు పైగా నగదును ఈ రూపేణ మన దేశం అందుకుంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ విడుదల చేసిన వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్ ప్రకారం..

2024లో భారత్ తర్వాతి స్థానాల్లో మెక్సికో, ఫిలిప్పైన్స్, ఫ్రాన్స్ నిలిచాయి. మనదేశం 137 బి.డాలర్ల కంటే అధికంగా అందుకోవడంతో పాటు, 100 బి.డాలర్లను అధిగమించిన ఏకైక దేశంగా ఉంది. రెమిటెన్సెస్‌లో 2010 నుంచీ మనదేశం తొలి స్థానంలోనే ఉంది. ఆ ఏడాది 53.48 బి.డాలర్లను అందుకుంది. 2015లో 68.91 బి.డాలర్లు, 2020లో 83.15 బి.డాలర్లు, 2024లో 137.67 బి.డాలర్ల చొప్పున పొందింది.

అమెరికా నుంచే ఎక్కువ: కొన్ని దశాబ్దాలుగా అమెరికా నుంచి రెమిటెన్సెస్ అత్యధిక స్థాయిలో వెళుతున్నాయి. 2024లో 100 బి.డాలర్లకు పైగా ఈ దేశం నుంచి ఇతర దేశాలకు తరలివెళ్లాయి. తర్వాతి స్థానాల్లో సౌదీ(46 బి.డాలర్లు), స్విట్జర్లాండ్(40 బి.డాలర్లు), జర్మనీ(24 బి.డాలర్లు) ఉన్నాయి.

6.2 లక్షల మంది విద్యార్థులు విదేశాల్లో..: ఆసియా నుంచే అత్యధిక విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లారు. 2022లో చైనా నుంచే 10 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులున్నారు. భారత్ ఈ విషయంలో 6.2 లక్షల మందితో రెండో స్థానంలో ఉంది.

2 కొత్త సెమీకండక్టర్ యూనిట్లకు ఆమోదం

భారత సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద గుజరాత్‌లో రెండు కొత్త సెమీకండక్టర్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులపై రూ.3,936 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ యూనిట్ల ద్వారా దాదాపు 2,230 మంది నిపుణులకు ఉపాధి లభిస్తుంది. గుజరాత్‌లోని ధోలేరాలో గాలియం నైట్రైడ్ టెక్నాలజీ ఆధారంగా మినీ/మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే తయారీ కేంద్రాన్ని క్రిస్టల్ మ్యాట్రిక్స్ ఏర్పాటు చేయనుంది. సూరత్‌లో డిస్క్రీట్ సెమీకండక్టర్ల తయారీ కోసం అసెంబ్లీ, టెస్టింగ్ కేంద్రాన్ని సుచి సెమీకాన్ నెలకొల్పనుంది. ఈ రెండింటితో కలిపి దేశంలో ఇప్పటివరకు ఆమోదించిన సెమీకండక్టర్ ప్రాజెక్టుల సంఖ్య 12కు చేరింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ రూ.1.64 లక్షల కోట్లు.

వొడాఫోన్ ఐడియా నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బిర్లా

వొడాఫోన్ ఐడియా నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా నియమితులయ్యారు. రవీందర్ టక్కర్ స్థానాన్ని బిర్లా భర్తీ చేస్తారు. అయితే నాన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా రవీందర్ కొనసాగుతూ, బిర్లాకు సాయం చేస్తారు.

మహీంద్రా హాలిడేస్ సీఎఫ్‌ఓ విమల్ అగర్వాల్ రాజీనామా

మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ సీఎఫ్ఓ విమల్ అగర్వాల్ రాజీనామా చేశారు. 2026 జూన్ 30 పని వేళలు ముగిశాక, ఇది అమల్లోకి వస్తుందని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. జులై 1 నుంచి సీఎఫ్ఓగా రాజీవ్ విమల్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. విమల్ అగర్వాల్ మహీంద్రా గ్రూప్‌లోనే కొత్త బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

పోర్షే ఇండియా బ్రాండ్ డైరెక్టర్‌గా అశుతోష్ దీక్షిత్

పోర్షే ఇండియా బ్రాండ్ డైరెక్టర్‌గా అశుతోష్ దీక్షిత్ నియామకం వెంటనే అమల్లోకి వచ్చినట్లు స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించింది. మనోలితో వుజిసిక్ స్థానాన్ని దీక్షిత్ భర్తీ చేస్తున్నారని పేర్కొంది.

ఎల్ అండ్ టీకి రూ.2,500-5,000 కోట్ల ఆర్డర్

ఒడిశాలో బొగ్గు నుంచి అమ్మోనియం నైట్రేట్ అభివృద్ధి చేసే ప్రాజెక్టు కోసం, ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సంయుక్త సంస్థ నుంచి రూ.2,500-5,000 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకున్నట్లు ఎల్ అండ్ టీ వెల్లడించింది.

అదానీ పోర్ట్స్‌లో 2% వాటా విక్రయం

అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్‌లో ప్రమోటర్ గ్రూప్ సంస్థ వరల్డ్‌వైడ్ ఎమర్జింగ్ మార్కెట్ హోల్డింగ్ లిమిటెడ్ 2% వాటాను రూ.7,486 కోట్లకు విక్రయించింది. అమెరికాకు చెందిన క్యాపిటల్ గ్రూప్ వీటిని కొనుగోలు చేసింది. బీఎస్ఈలో అదానీ పోర్ట్స్ షేరు మంగళవారం 1.10% నష్టపోయి రూ.1,723.75 వద్ద ముగిసింది.

నిఫ్టీ 500 కంపెనీల్లో డీఐఐల వాటా 20.9%

నిఫ్టీ 500 కంపెనీల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) యాజమాన్యం 17.1 శాతానికి తగ్గగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) భారతీయ ఈక్విటీలపై తమ పట్టు పెంచుకున్నారని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ వెల్లడించింది. మార్చి త్రైమాసికంలో నిఫ్టీ 500 కంపెనీల్లో డీఐఐల వాటా రికార్డు స్థాయిలో 20.9 శాతానికి పెరిగినట్లు పేర్కొంది.

స్పామ్‌కాల్స్‌లో అయిదో స్థానంలో భారత్

ప్రపంచంలోనే స్పామ్‌కాల్స్ అత్యధికంగా ఉండే దేశాల్లో భారత్ 5వ స్థానంలో ఉందని ట్రూకాలర్ సంస్థ తెలిపింది. ఇండొనేషియా, చిలీ, వియత్నాం, బ్రెజిల్ తరవాత స్థానంలో భారత్ ఉంది. ప్రపంచంలో తమకు ఉన్న 50 కోట్ల మంది వినియోగదారుల డేటాను విశ్లేషించి, ఈ వివరాలను సంస్థ వెల్లడించింది.

ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచుతున్న రిలయన్స్

ఆల్కలైట్స్ ఎగుమతుల్లో కోత



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఏర్పడిన సరఫరా అంతరాయాల వల్ల మనదేశంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత ఏర్పడుతోంది. అందుకే ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇందుకోసం ఆల్కలైట్స్ ఉత్పత్తిని తగ్గించుకుంటోంది. గ్యాసోలైన్‌లో మిశ్రమంగా ఆల్కలైట్స్‌ను వాడతారు. రిలయన్స్ తన రిఫైనింగ్ కాంప్లెక్స్‌లో ఆల్కైలేషన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఉత్పత్తి చేసిన ఆల్కలైట్స్‌ను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచేందుకు ఆల్కలైట్స్ ఎగుమతులను రిలయన్స్ ఇండస్ట్రీస్ తగ్గించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే, ఎల్‌పీజీ ఉత్పత్తి మూడింతలకు పైగా పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెబుతోంది. దీంతో పశ్చిమాసియా దేశాల నుంచి తగ్గిన ఎల్‌పీజీ దిగుమతుల్లో కొంత మేర భర్తీ చేయగలిగామని కంపెనీ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది.

నిర్వహణ కోసం క్రూడ్ యూనిట్ మూసివేత

రోజుకు 6.60 లక్షల బ్యారెళ్ల ముడిచమురును శుద్ధి చేయగలిగిన తన రిఫైనరీ కాంప్లెక్స్‌లో ఉన్న క్రూడ్ యూనిట్, మరికొన్ని అనుబంధ యూనిట్లను వార్షిక నిర్వహణ పనుల కోసం కొంతకాలం మూసివేసే యోచనలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల మధ్య నుంచి 3-4 వారాల పాటు ఈ యూనిట్లలో కార్యకలాపాలు ఆపేయనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత సమస్య తలెత్తకుండా, నయారా ఎనర్జీ రిఫైనరీ కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాక ఈ యూనిట్లలో కార్యకలాపాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ నిలిపి వేస్తుందని వెల్లడించాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా లాభం రూ.5,260 కోట్లు

వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మార్చి త్రైమాసికంలో రూ.5,259.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,541.85 కోట్లతో పోలిస్తే ఇది 48.5% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ లాభం రూ.18,621.71 కోట్లుగా నమోదైంది. 2024-25 లాభం రూ.14,073.17 కోట్ల కంటే ఇది 32.32% అధికం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,58,749.75 కోట్ల నుంచి రూ.1,97,792.78 కోట్లకు చేరింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.



● **విభాగాల వారీగా:** మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు 21% పెరిగి 3.07 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2025-26లో ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాక్టర్ల విభాగంలో కంపెనీ మార్కెట్ వాటా 43.6 శాతానికి పెరిగింది. 2025-26లో 5 లక్షలకు పైగా ట్రాక్టర్ల బిల్లింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించింది.

● **భవిష్యత్తు అంచనాలు, ప్రణాళికలు:** 2031 నాటికి 10 కొత్త ఐసీఈ ఎస్‌యూవీలు, 6 కొత్త విద్యుత్తు వాహనాలను తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాదిలో ట్రాక్టర్ పరిశ్రమ స్వల్ప వృద్ధి నమోదు చేయొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచడం ద్వారా అన్ని వ్యాపార విభాగాలను ఆధునికీకరించాలని కంపెనీ యోచిస్తోంది.

● ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎం అండ్ ఎం షేరు 3.41% లాభంతో రూ.3,211.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,168.98 కోట్లు పెరిగి రూ.3.99 లక్షల కోట్లకు చేరింది.

ఏప్రిల్‌లో 26,11,317 వాహనాల విక్రయాలు: ఫాడా



ఏప్రిల్‌లో దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాలు 26,11,317గా నమోదయ్యాయి. 2025 ఇదే నెలలో విక్రయమైన 23,12,221 వాహనాల కంటే ఇవి 12.94% అధికమని డీలర్ల సంఘం ఫాడా తెలిపింది. ఆర్‌బీఐ సానుకూల వడ్డీ రేట్లు, జీఎస్‌టీ 2.0 ప్రయోజనాలు, పెళ్లిళ్ల సీజన్, గ్రామీణ డిమాండ్ ఇందుకు తోడ్పడ్డాయని వెల్లడించింది. ప్రయాణికుల వాహన (పీవీ) అమ్మకాలు 3,63,028 నుంచి 12.21% పెరిగి 4,07,355 కు చేరాయి. ద్విచక్రవాహన విక్రయాలు 13.01% వృద్ధితో 19,16,258 యూనిట్లుగా నమోదయ్యాయి. వాణిజ్య వాహన (సీవీ) అమ్మకాలు 15.02% పెరిగి 99,339 యూనిట్లకు చేరాయి. త్రిచక్రవాహన విక్రయాలు 7.19% వృద్ధితో 1,06,908గా ఉన్నాయి. మొత్తం 6 వాహన విభాగాల్లో 5, గత నెలలో జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయని ఫాడా ఉపాధ్యక్షుడు సాయి గిరిధర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ బలంగా ఉంది. ముఖ్యంగా పీవీ విభాగంలో గ్రామీణ అమ్మకాలు 20.40% పెరగ్గా, పట్టణ వృద్ధి 7.11% శాతంగా ఉంది. రాబోయే మూడు నెలలపై పరిశ్రమ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా వడగాల్పుల హెచ్చరికలు, పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల పెరిగే ఇంధన ధరలు, వాణిజ్య వాహన విభాగంలో నగదు లభ్యత వంటి అంశాలను గమనించాల్సి ఉంటుందని గిరిధర్ స్పష్టం చేశారు.


టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్ నుంచి వేణు, విజయ్ బయటకు

టాటా ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (టీఈడీటీ) నుంచి టీవీఎస్ మోటార్ గౌరవ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ మే 11న నిష్క్రమించనున్నారు. వీరి పునః నియామకాలకు ఏకగ్రీవ ఆమోదం అవసరం కాగా, దీనిని మెహ్లీ మిస్త్రీ వ్యతిరేకిస్తుండటం ఇందుకు నేపథ్యం. టాటా ట్రస్ట్స్ మధ్య పాలనపరమైన విభేదాలను ఇది సూచిస్తోంది. శ్రీనివాసన్, సింగ్ ఒకరికొకరు మద్దతు పలకగా, వీరిద్దరి నియామకాన్ని మెహ్లీ వ్యతిరేకిస్తున్నారు. మిగతా ట్రస్టీలైన నోయల్ టాటా, జహంగీర్ టాటా ఓటు వేయలేదని సమాచారం. బాయ్ హీరాబాయ్ ట్రస్ట్ నుంచి ఏప్రిల్‌లో వైదొలగిన అనంతరం వేణు శ్రీనివాసన్ నిష్క్రమిస్తున్న రెండో టాటా ట్రస్టు ఇదే. తాజా మార్పుల నేపథ్యంలో టీఈడీటీలో ముగ్గురు (నోయల్, మెహ్లీ, జహంగీర్) ట్రస్టీలే మిగిలారు. ఇందులో నోయల్, మెహ్లీవి శాశ్వత నియామకాలు కాగా, జహంగీర్ పదవీ కాలం వచ్చే ఏడాది వరకూ ఉంది. శుక్రవారం జరగబోయే బోర్డు సమావేశంలో టాటాసన్స్‌లో ప్రాతినిధ్యాన్ని టాటా ట్రస్ట్స్ సమీక్షించనుంది.

హార్మూజ్ ఉద్రిక్తతలు పడేశాయ్

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,621.58 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.2,602.62 కోట్లు

సెన్సెక్స్ ▼252 77018 **నిఫ్టీ ▼87 24033**



హార్మూజ్ జలసంధిలో తాజాగా పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో, మంగళవారం మన స్టాక్ మార్కెట్‌లో విక్రయాల ఒత్తిడి కనిపించింది. రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోయి, ముడి చమురు ధరలు బెంబేలెత్తిస్తుండటంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు లాభపడి 95.18 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా సూచీలు పని చేయలేదు. హాంకాంగ్ సూచీ డీలా పడింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.43,000 కోట్లు తగ్గి, రూ.466.81 లక్షల కోట్ల (4.90 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

● సెన్సెక్స్ ఉదయం 77,103.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,269.40 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,515.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 77,151.33 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 251.61 పాయింట్ల నష్టంతో 77,017.79 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 86.50 పాయింట్లు కోల్పోయి 24,032.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,081.70-23,882.05 పాయింట్ల మధ్య కదలాడింది.

● సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.53%, ఎటర్నల్ 1.37%, టెక్ మహీంద్రా 1.30%, యాక్సిస్ బ్యాంక్ 1.20%, మారుతీ సుజుకీ 1.15%, భారతీ ఎయిర్‌టెల్ 1.08%, ఎల్ అండ్ టీ 1.07% చొప్పున పడ్డాయి. ఎం అండ్ ఎం 3.41%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.79%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.32%, బజాజ్ ఫైనాన్స్ 0.87%, హెచ్‌యూఎల్ 0.84%, ఇన్ఫోసిస్ 0.80% మేర లాభపడ్డాయి.

● రంగాల వారీగా స్థిరాస్తి, టాప్ 10 బ్యాంక్స్ సేవలు, మన్నికైన వినిమయ వస్తువులు, ప్రైవేటు బ్యాంకులు, బ్యాంకెక్స్ సూచీలు తగ్గాయి. విద్యుత్, ఎఫ్ఎంసీజీ, కమొడిటీస్, ఆరోగ్య సంరక్షణ, ఐటీ, టెలికాం, యుటిలిటీస్, వాహన, భారీ యంత్ర పరికరాలు, ఫోకస్డ్ ఐటీ సూచీలు పెరిగాయి. బీఎస్ఈలో 1,882 షేర్లు సానుకూలంగా, 2,293 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 180 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

జనవరి - మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
షాపర్స్ స్టాప్	(16.35)	1.99	1210	1064
జీహెచ్‌సీఎల్	115.6	150.27	791	781
ఎస్ఆర్ఎఫ్	582	526	4640	4347
క్యాన్ కార్ప్1	64.34	95.44	3892	3656
పూనావాలా ఫిన్‌కార్ప్	255	62	2120	1173
మారికో2	408	345	13,611	--
అజంతా ఫార్మా	267	225	1422	1170
ఎంక్యూర్ ఫార్మా3	244	197	2470	2116
రేమండ్	11.93	25.42	603	557.46
పంజాబ్ నేషనల్ బ్యాంక్4	5225	4567	36319	36705
యునైటెడ్ బ్రూవరీస్	102	98	4408	4427
ఎన్ఎస్ఈ	2871	2650	5360	4397

1) డివిడెండ్ రూ.6 2) డివిడెండ్ రూ.4 3) డివిడెండ్ రూ.3.6
4) డివిడెండ్ రూ.3



అది ఆంధ్రప్రదేశ్, పల్నాడు జిల్లాలోని ఒక పల్లె. ఓ రైతు ఆకాశం వంక చూస్తున్నాడు. విపరీతమైన ఎండతో పాటు ఒకటే ఉక్కపోత. అతని పెదవులు ఒక్క మాటే పలుకుతున్నాయి. 'వర్షం ఎప్పుడొస్తుందో? దేశం ఎప్పుడు చల్లబడుతుందో?'
- కానీ ఆకాశం సహకరించేటట్లు కనిపించటం లేదు. అతడికేం తెలుసు తాను నిరీక్షిస్తున్న వర్షాన్ని ఆపుతున్న అజ్ఞాత హస్తాలు అనేకం ఉన్నాయని? వేల కిలోమీటర్ల దూరాన, పర్షియా గల్ఫ్ తీరంలో బాంబులు పేలటం దగ్గరి నుంచి వాతావరణ కాలుష్యం, ఎల్-నినో వరకూ అన్నీ వర్షాలను అడ్డుకుంటున్నాయని.

వర్షానికి యుద్ధ సెగ!

కర్ణుడి చావుకు కోటి కారణాలు అన్నట్టుగా.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను విశ్లేషిస్తే అనేక కారణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా మూడు శక్తులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్టు అవగతం అవుతుంది. 1. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్-యుద్ధం. 2. దశాబ్దాలుగా పేరుకుపోయిన వాతావరణ కాలుష్యం. 3. పసిఫిక్ మహా సముద్రంలో నిద్ర లేచిన ఎల్-నినో. వీటి మూలంగా కొన్ని ప్రాంతాల్లో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4-5 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతుండటం గమనార్హం. ఒకచోట మంట రాజుకుంటే, దాని సెగ వేల మైళ్ల దూరం ప్రయాణించి మరొకచోట ప్రభావం చూపుతుంది. ఇది కల్పన కాదు. వాతావరణ శాస్త్రం చెప్పే నిష్ఠుర సత్యం.

యుద్ధ రాక్షసి పీడ

అక్కడెక్కడో యుద్ధం జరిగితే మనకేం సంబంధమని అనుకుంటున్నారేమో. కానీ సమాధానం ప్రకృతికి తెలుసు. గాలికి గుర్తులు లేవు, మేఘాలకు సరిహద్దులు లేవు. ఎక్కడ నిప్పు రాజుకున్నా ఆ సెగ మన ఇంటి వరకూ వస్తుంది! ఇరాన్ యుద్ధం మన వర్షాన్ని ఎలా ఆపగలదో అర్థం చేసుకోవాలంటే ముందు అరేబియా సముద్రాన్ని చూడాలి. మన దేశానికి పడమరలో ఉన్న ఈ సముద్రమే మన రుతుపవనాలకు పుట్టిల్లు. ఇక్కడ నుంచే తేమ నిండిన గాలులు లేచి, దేశమంతటా వర్షం కురిపిస్తాయి. ఇప్పుడు గమనించండి- పర్షియన్ గల్ఫ్ నుంచి అరేబియా సముద్రానికి హర్మూజ్ జలసంధి ద్వారా కేవలం కొన్ని వందల కిలోమీటర్లే. భౌగోళికంగా చూస్తే ఇవి ఒకే వాతావరణ వ్యవస్థలోని భాగాలే. అంటే యుద్ధభూమి మన వర్షపు పుట్టిల్లు పక్కనే ఉందన్నమాట. భారీ పేలుళ్లు, చమురు క్షేత్రాల దహనంతో ఆకాశంలోకి కోట్లాది సూక్ష్మ రసాయన కణాలు (ఏరోసాల్స్) వెలువడతాయి. ఇవి గాలిలో కలిసి 'జెట్ స్ట్రీమ్' రూపంలో ప్రయాణిస్తాయి. గంటకు 300 కిలోమీటర్ల వేగంతో వీచే ఇవి అక్కడి ఏరోసాల్స్‌ను 3-7 రోజుల్లోనే భారత ఉపఖండం మీదికి మోసుకురాగలవు. అరేబియా సముద్రపు ఉపరితలంపై ఈ కణాలు చేరినప్పుడు సముద్రం వేడెక్కుతుంది. వేడెక్కిన సముద్రం మీద ఏర్పడే రుతుపవన గాలులు తమ దిశను మార్చుకుంటాయి, తీవ్రతను కోల్పోతాయి. దీంతో వర్షాలు కురవటం ఆలస్యమవుతుంది లేదా తక్కువ పడుతుంది. అయితే నేరుగా ఈ ఒక్క కారణంతోనే ఇవి జరుగుతాయని కాదు. వాతావరణ వ్యవస్థలోని అనేక సంక్లిష్ట పరస్పర చర్యల మూలంగా ఈ ప్రభావాలు కనిపించొచ్చు. చరిత్ర కూడా ఇదే చెబుతోంది.

- **1991 గల్ఫ్ యుద్ధం:** కువైట్‌లో 700కు పైగా చమురు బావులు నెలల తరబడి మండాయి. వీటి నుంచి వెలువడిన పొగ భారత ఉపఖండం మీదుగా ప్రయాణించిందని నాసా ఉపగ్రహ చిత్రాలు నిరూపించాయి. ఆ సంవత్సరం భారత వర్షపాతంలో గణనీయమైన అసాధారణతలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.
- **2003 ఇరాక్ యుద్ధం:** మధ్యప్రాచ్యంలో ఏరోసాల్ సాంద్రత 30% పెరిగిందని పరిశోధకులు నమోదు చేశారు.

- వీటి ప్రభావాలను వివిధ అంతర్జాతీయ అధ్యయనాలు సూచించినప్పటికీ, అవి ప్రాంతానికొకలా మారవచ్చు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ ఒక విషయం మాత్రం సుస్పష్టం. రుతుపవనాలను ప్రభావితం చేసే అంశాలు చాలా ఉన్నప్పటికీ, అవి సంక్లిష్టమైనవి అయినప్పటికీ యుద్ధపు ఏరోసాల్స్ కూడా కారణం కావొచ్చు. వీటికి అసలేం సంబంధం లేదని అనుకోవటానికి లేదు. వాతావరణ వ్యవస్థలో అన్నీ పరస్పరం అనుసంధానమయ్యే ఉంటాయి మరి.

ఆకాశాన కాలుష్య దుప్పటి

యుద్ధం తక్షణ వేడిని కలిగిస్తే, పేరుకుపోయిన కాలుష్యం వాతావరణాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తోంది. యుద్ధ విమానాల నుండి వెలువడే కార్బన్, క్షిపణుల రసాయన పొగ, పారిశ్రామికీకరణలో భాగంగా ఫ్యాక్టరీల నుండి వెలువడే బొగ్గు పులుసు వాయువు.. ఇవన్నీ వాతావరణంలో ఒక అదృశ్య దుప్పటిలా పేరుకు పోతున్నాయి. దీన్నే శాస్త్రవేత్తలు 'గ్రీన్ హౌస్ ప్రభావం' అంటారు. ఇది భూతాపానికి దారితీస్తూ వర్షపాతం నమూనాలనూ మార్చేస్తోంది. కాలుష్య దుప్పటి సూర్యుని వేడిని లోపలికి రానిస్తుంది కానీ, భూమి నుంచి తిరిగి వెళ్లాల్సిన వేడిని బయటకు పోనివ్వదు. ఈ ప్రస్తుత వాతావరణ మార్పును మన వంటింట్లో ఉండే ప్రెషర్ కుక్కర్‌తో పోల్చవచ్చు. కుక్కర్‌లో నీళ్లు పోసి వేడి చేస్తే ఆవిరి విజిల్ ద్వారా బయటకు వెళ్తుంది. కానీ విజిల్‌ను గట్టిగా నొక్కిపట్టి ఆవిరి పోకుండా చేస్తే? లోపల వేడి, ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయి కుక్కర్ రగిలిపోతుంది కదా. నేడు మన ఆకాశం సరిగ్గా అలాగే ఉంది. యుద్ధ రసాయన పొగ ఒక పక్కన, వేడెక్కిన సముద్రపు గాలులు మరోపక్కన కలిసి ఆకాశంలో ఒక అదృశ్య 'నిప్పుల గుమ్మటం'లా ఏర్పడ్డాయి. ఈ అధిక పీడన పొర ఒక మూతలా పనిచేస్తూ, భూమి నుంచి పైకి వెళ్లాల్సిన వేడిని బయటకు పోనివ్వడం లేదు. అందుకే ఈ ఏడాది ఎండలు కేవలం వేడిగా మాత్రమే కాక, ఊపిరి అందనంత ఉక్కపోతగా అనిపిస్తున్నాయి. మరో పెద్ద ప్రమాదం- కాలుష్య కణాలు మేఘాలు ఏర్పడకుండా అడ్డుకోవటం. తేమ ఉన్నా కూడా అది వర్షపు చినుకుగా మారకుండా ఈ కణాలు మేఘాలను 'చంపేస్తాయి'.

ఎల్-నినో రాక్షసి మేల్కొంది

సముద్ర గర్భంలో కొన్నేళ్లకు ఒకసారి ఓ అసాధారణ మార్పు జరుగుతుంది. దీని వల్ల పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రత అసాధారణంగా పెరుగుతుంది. దీనినే 'ఎల్-నినో' అంటారు. ఇది ఏర్పడిన సంవత్సరాల్లో సాధారణంగా భారత్‌లో వర్షపాతం తగ్గుతుంటుంది. అయితే ప్రతిసారీ ఇదే పరిస్థితి ఉండాల్సిన అవసరం లేదు. అగ్నికి ఆజ్యం తోడైనట్టు ఇప్పుడు ఎల్-నినోకు యుద్ధపు పొగా జత కలిసింది. ఎల్-నినోతో మేఘాలు తక్కువగా ఏర్పడతాయి. యుద్ధం వల్ల ఉన్న తేమ కూడా చచ్చిపోతుంది. ఈ రెండు శక్తుల కలయిక మన రుతుపవనాలను రెండు వైపుల నుంచీ దెబ్బతీస్తోంది.

కష్టాల్, నష్టాల్


యుద్ధం, కాలుష్యం, ఎల్‌నినో కలిసి విపరీతమైన వేడిని జీవావరణం పై ప్రయోగిస్తున్నాయి. ఈ విషం - కరవుగా, ఆకలిగా, ఆర్థిక సంక్షోభంగా మారి అనేక రూపాల్లో మనల్ని వెంటాడుతోంది. వర్షం ఆలస్యమైతే ఆ ప్రభావం నేరుగా మన జేబు మీద పడుతుంది. భూగర్భ జలాలు ఎండిపోయి బోరుల కోసం రైతు అప్పు చేయాల్సి వస్తుంది. పంట దిగుబడి తగ్గితే మార్కెట్లో కూరగాయలు, ధాన్యాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతాయి. రైతు కూలీలు, శ్రామికులు వేసవి వేడిలో వడదెబ్బకు గురవుతారు. 2015 నుంచి 2024 మధ్య మనదేశంలో అధికారికంగా ఆరు వేల మంది వడగాలులతో మరణించారు. ఈ లెక్కలో చేరని నిరుపేదల సంఖ్య ఇంకెంతో.

మహాభారత నిజం-విజ్ఞాన సత్యం

వ్యాస మహర్షి మహాభారతం ద్వారా ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పారు. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత భూమిపై పంటలు పండలేదు, నదులు క్షీణించాయి. యుద్ధం కేవలం రాజ్యాలను మాత్రమే కాదు, పర్యావరణాన్నీ బూడిద చేస్తుందని ఆయన వేల సంవత్సరాల క్రితమే హెచ్చరించారు. నేడు విజ్ఞానశాస్త్రం ఆ హెచ్చరికను డేటాతో నిరూపిస్తోంది. అమెరికాలోని మసాచుసెట్స్ యూనివర్సిటీ, జర్మనీలోని పోట్స్‌డామ్ వాతావరణ శాస్త్ర విభాగాల ప్రకారం- పెద్ద పేలుళ్లు జరిగినప్పుడు అవి 500 కిలోమీటర్ల పరిధిలో వాతావరణంపై తీవ్ర ప్రభావాలు చూపుతాయి. నాసా గాడార్డ్ ఇన్‌స్టిట్యూట్, ఐపీసీసీ నివేదికల ప్రకారం- భారీ పారిశ్రామిక దహనాలు వాతావరణంలో ఏరోసాల్ సాంద్రతను పెంచి వర్షపాత నమూనాలను మార్చగలవు. అంటే ఈ యుద్ధం నేరుగా రుతుపవనాలకు పుట్టినిల్లయిన అరేబియా సముద్రాన్ని ప్రభావితం చేస్తుందన్నది సుస్పష్టం. వాతావరణ మార్పుల్లో ఎల్-నినో దక్షిణ డోలనం, ఇండియన్ ఓషన్ డైపోల్ వంటి అంశాలూ కీలక పాత్ర పోషిస్తాయని ఆధునిక పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ యుద్ధాన్ని ఆపటం మన చేతిలో లేకపోవచ్చు. కానీ కాలుష్యాన్ని తగ్గించగలం. చెట్లు నాటగలం. నీటిని ఆదా చేయగలం. మన ప్రతి చిన్న చర్యా ఆ అదృశ్య దుప్పటిని కొంచెం కొంచెంగా తొలగిస్తుందనటంలో సందేహం లేదు.

'లోకాః సమస్తా సుఖినో భవంతు' ఇది కేవలం ప్రార్థన కాదు. వాతావరణ శాస్త్ర తార్కిక నిజం. 2050 నాటికి మనదేశంలో వర్షపాతం 20% తగ్గవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ముప్పు తప్పాలంటే నేడు బాంబుల మోత ఆగాలి. సముద్ర ఉపరితలం చల్లబడాలి. అందుకే ప్రపంచ శాంతి అనేది కేవలం రాజకీయ నినాదం కాదు. అది మన పొలం మీద కురిసే తొలి వర్షపు చినుకు!

– డా॥ మొహమ్మద్ నయీమ్, అసోసియేట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు



ప్రింటవుట్ లేదా స్క్రీన్‌షాట్ నుంచి డేటాను ఎక్సెల్‌లోకి ఎంటర్ చేయటం శ్రమతో కూడిన పని. తప్పులూ దొర్లొచ్చు. మరి ఈ పనిని ఎక్సెల్‌కే అప్పగిస్తే పోలా? ఫోన్ గానీ కంప్యూటర్ గానీ అందుబాటులో ఉంటే చాలు. పిక్చర్ టూల్‌కే పని అప్పగించొచ్చు. ఇది చిటికెలో ఇమేజ్ వరుసలను డిజిటల్ గదులుగా మార్చేస్తుంది.

» పిక్చర్ టూల్ ఎక్సలెంట్ «

ఎక్సెల్‌లోని పిక్చర్ టూల్‌లో ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్) పరిజ్ఞానం ఉంటుంది. ఇది ఫొటో లేదా స్క్రీన్‌షాట్ ఆకృతిని, లేఅవుట్‌ను విశ్లేషించగలదు. ఇమేజ్ ద్వారా ఎక్సెల్‌కు సమాచారాన్ని అందించినప్పుడు ఓసీఆర్ ఇంజిన్ గీతలు, ఖాళీలు, అమరికలను పసిగడుతుంది. వరుసలు ఎక్కడ మొదలయ్యాయో, ఎక్కడ ముగిసాయో నిర్ధారించుకుంటుంది. ఫలితంగా ఇమేజ్ కాస్తా సవరించటానికి వీలైన స్ప్రెడ్‌షీట్‌గా మారుతుంది. అంటే మాన్యువల్‌గా డేటాను ఎంటర్ చేయాల్సిన పనిలేకుండా నేరుగా విశ్లేషించటం సాధ్యమవుతుందన్నమాట. అయితే ఓసీఆర్ కచ్చితంగా పనిచేయటమనేది ఇమేజ్ నాణ్యత మీద ఆధారపడి ఉంటుంది. ఇమేజ్ మసకగా ఉన్నట్టయితే సమాచారాన్ని సరిగా గ్రహించలేదు.

డెస్క్‌టాప్ యాప్‌తో ఇలా

- ఎక్సెల్ వర్క్‌బుక్‌ను ఓపెన్ చేయాలి. ఎక్కడ పని మొదలెట్టాలో ఎంచుకోవాలి.
- రిబ్బన్ మీదుండే డేటా ట్యాబ్ మీద నొక్కి, ఫ్రమ్ పిక్చర్‌ను క్లిక్ చేయాలి.
- సేవ్ చేసిన ఇమేజ్‌ను ఉపయోగించుకుంటున్నట్టయితే పిక్చర్ ఫ్రం ఫైల్ మీద క్లిక్ చేయాలి. ఒకవేళ అప్పుడే స్క్రీన్‌షాట్‌ను తీసినట్టయితే పిక్చర్ ఫ్రం క్లిప్‌బోర్డు మీద క్లిక్ చేయాలి.
- ఫైలును ఉపయోగిస్తున్నట్టయితే ఇమేజ్‌ను బ్రౌజ్ చేసి, దాన్ని ఎంచుకొని ఇన్‌సర్ట్ మీద క్లిక్ చేయాలి.
- అప్పుడు ఎక్సెల్ ఆ సమాచారానికి సంబంధించిన ప్రివ్యూను సృష్టిస్తుంది. ఇది రివ్యూ పేన్‌లో కనిపిస్తుంది. ఒకసారి సమీక్షించుకొని కన్‌ఫర్మ్ చేసుకోవాలి. ఇన్‌సర్ట్ డేటా లేదా ఇన్‌సర్ట్ మీద క్లిక్ చేసి, డేటాను ఎక్సెల్ టేబుల్ రూపంలో ఫార్మాట్ చేసుకోవాలి.

మొబైల్ యాప్‌లో ఇలా

- ఫోన్‌లోని ఎక్సెల్ మొబైల్ యాప్‌లో కొత్త వర్క్‌షీట్‌ను ఓపెన్ చేయాలి. డేటా ఎక్కడ చేరాలో ఆ భాగాన్ని ఎంచుకోవాలి.
- టూల్‌బార్ లేదా ఇన్‌సర్ట్ మెనూలో ఉండే డేటా ఫ్రం పిక్చర్‌ను తాకాలి.
- ఇమేజ్‌ను క్యాప్చర్ చేయటానికి షటర్ బటన్ తాకాలి. గ్యాలరీలోని పిక్చర్ కోసమైతే ఇంపోర్ట్ మీద తాకాలి. క్రాపింగ్ హ్యాండిల్ ఆప్షన్‌తోనైతే అవసరమైన టేబుల్ వరకే ఇంపోర్టు చేసుకోవచ్చు.
- తర్వాత యాప్ వర్షన్‌ను బట్టి రివ్యూ అండ్ ఎడిట్ లేదా రివ్యూ మీద తాకాలి.
- రివ్యూ స్క్రీన్‌లో ప్రివ్యూను చూసి తప్పులేవైనా ఉన్నాయేమో చూసి, కన్‌ఫర్మ్ చేసుకోవాలి. ఇన్‌సర్ట్ డేటా లేదా ఇన్‌సర్ట్ మీద తాకాలి. డేటాను ఎక్సెల్ టేబుల్ రూపంలో ఫార్మాట్ చేసుకోవాలి.

గూగుల్ మ్యాప్స్ గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఇదిప్పుడు అందరి ఫోన్లలోనూ నిక్షిప్తమయ్యింది. కొత్త చోట్లకు ఎక్కడికి వెళ్లాలన్నా ఇదే దారి చూపుతోంది. లొకేషన్‌ను గుర్తించటానికీ ఉపయోగిస్తుంటాం. కొందరైతే పెట్రోలు పంపులు ఎక్కడున్నాయో తెలుసుకోవటానికీ వాడుతుంటారు. అయితే ఇందులో చాలామందికి తెలియని ఫీచర్లూ ఎన్నో ఉన్నాయి. ఇవి అలాంటివే. అయితే ముందుగా గూగుల్ మ్యాప్స్‌ను అప్‌డేట్ చేసుకోవాలని మరవొద్దు.

మ్యాప్స్ ఇంద్రజాలం

ఆస్క్ మ్యాప్స్

ఎక్కడికైనా వెళ్లాలని అనుకుంటున్నారా? ఎలా ప్లాన్ చేసుకోవాలో తెలియటం లేదా? అయితే ఆస్క్ మ్యాప్స్ సాయం తీసుకోవచ్చు. ఉదాహరణకు- నేను ఆదివారం హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లాలని అనుకుంటున్నా. లంచ్ కోసం ఎక్కడ ఆగాలి? దారిలో చూడదగ్గ ప్రదేశాలు ఏమేం ఉన్నాయి?' అని ప్రశ్నించారనుకోండి. అప్పుడు దానిలోని జెమినై ఏఐ ఆ దారి వెంట ఉండే హోటళ్లు, రెస్టరెంట్లు, పర్యటక ప్రాంతాలకు సంబంధించిన రివ్యూలను పరిశీలించి సమాధానమిస్తుంది. ఇది 30 కోట్ల ప్రాంతాలు, 50 కోట్ల కమ్యూనిటీ రివ్యూలను పరిశీలించగలదు. మనదేశంలో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లందరికీ ఈ ఫీచర్ అందుబాటులో ఉంది.

ఇలా వాడుకోవాలి: సెర్చ్ బార్ కింద ఉండే ఆస్క్ మ్యాప్స్ బటన్ మీద తాకాలి. మామూలు భాషలో ప్రశ్నను టైప్ చేయాలి.

3డీ వ్యూలో దృశ్యాలు

మ్యాప్స్ రూపొందించినప్పటి నుంచీ గూగుల్ తీసుకొచ్చిన అతిపెద్ద అప్‌డేట్ ఇదే అనుకోవచ్చు. నీలం బాణం గుర్తుకు బదులు 3డీలో దృశ్యాలను చూపిస్తుంది. ముందుకు సాగుతున్నకొద్దీ దారితో పాటు భవనాలు, వంతెనలు, ట్రాఫిక్ లైట్లు, క్రాస్‌వాక్స్, లేన్ మార్కింగ్స్ వంటివన్నీ ఫొటోరియలిస్టిక్‌గా కనిపిస్తాయి. భవనాలను పారదర్శకంగా చూపించటం ద్వారా వాటి వెనకాల ఉన్నవేంటో కూడా చూడొచ్చు. సంక్లిష్ట ఫ్లైఓవర్లు, కూడళ్లు ఉన్న మనదేశంలో ఇదెంతో ఉపయుక్తం.

ఇలా వాడుకోవాలి: ప్రయాణాన్ని ఆరంభించాక నావిగేషన్ స్క్రీన్‌లో పైన కుడి మూలన ఉండే 3డీ గుర్తును తాకాలి.

ఆటో అప్‌డేటెడ్ ఆఫ్‌లైన్ మ్యాప్స్

మ్యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఆఫ్‌లైన్‌లో వాడుకోవచ్చన్నది తెలిసిందే. అయితే డౌన్‌లోడ్ చేసుకున్న మ్యాప్‌లు వై-ఫై అందుబాటులో ఉన్నప్పుడు వాటికవే రిఫ్రెష్ అవుతాయని చాలామందికి తెలియదు. అంటే ఆఫ్‌లైన్ మ్యాప్‌లు సైతం ప్రస్తుతమున్న రోడ్డు, నిర్మాణ డేటానే కలిగుంటాయన్నమాట.

ఇలా వాడుకోవాలి: పట్టణం లేదా ప్రాంతాన్ని సెర్చ్ చేసి, డౌన్‌లోడ్ మీద తాకాలి. ఆ మ్యాప్ దానికదే అప్‌డేట్ అవుతుంది.

నో బిఫోర్ యు గో సారాంశాలు

ఏదో కొత్త ప్రదేశానికి వెళ్తున్నారు. అక్కడ ఏయే సౌకర్యాలున్నాయో తెలుసుకోవాలంటే యూజర్ల రివ్యూలను చూస్తుంటాం కదా. ఇలా బోలెడన్ని రివ్యూలను చదివే పనిలేకుండా వాటి సారాంశాన్ని తెలియజేసేదే నో బిఫోర్ యు గో సదుపాయం. ఇది యూజర్ రివ్యూల ఆధారంగా అత్యంత సమంజసమైన వివరాలతో కూడిన ఏఐ జనరేటెడ్ సారాంశాన్ని అందిస్తుంది. అక్కడ ఎక్కువ మందికి నచ్చినవేంటి? వేటిని వదిలేయాలి? ఎంత సేపు వేచి ఉండాల్సి వస్తుంది? పార్కింగ్ అందుబాటులో ఉందా? వంటివన్నీ తెలుస్తాయి.

ఇలా వాడుకోవాలి: ఏదైనా రెస్టరెంట్, షాప్ లేదా ఆకర్షణీయ ప్రాంతాన్ని సెర్చ్ చేయాలి. వాటి జాబితా మీద పైకి స్క్రోల్ చేస్తే నో బిఫోర్ యు గో విభాగం కనిపిస్తుంది.



లైవ్ వ్యూతో నడక

తెలియని ప్రదేశంలో నడుస్తున్నారు. అక్కడి భవనాలు, ప్రాంతం వివరాలను తెలుసుకోవాలని అనుకుంటున్నారు. కానీ ఎలా? ఇక్కడే లైవ్ వ్యూ సాయం చేస్తుంది. మ్యాప్స్‌లో వాకింగ్ మోడ్‌ను ఎంచుకొని, ఎదురుగా ఉన్న వాటిపై ఫోన్ కెమెరాను ఫోకస్ చేస్తే చాలు. అప్పుడది ఆగ్మెంటెడ్ రియాల్టీ పరిజ్ఞానంతో వాకింగ్ బాణం గుర్తులను, వీధులు, దుకాణాల పేర్ల వంటి వాటిని ప్రత్యక్షంగా కెమెరా ఫీడ్‌లో కనిపించేలా చేస్తుంది. రద్దీ భారతీయ మార్కెట్లలో 2డీ మ్యాప్ కన్నా ఇది అనువుగా ఉంటుంది. ముంబై, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె నగరాల్లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మున్ముందు మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు.

ఇలా వాడుకోవాలి: లక్ష్యాన్ని సెర్చ్ చేసి 'డైరెక్షన్స్' ఎంచుకోవాలి. వాకింగ్ గుర్తును తట్టి, లైవ్ వ్యూ బటన్ మీద తాకాలి.

యాక్సెసబుల్ ప్రాంతాల గుర్తింపు

దివ్యాంగుల వంటి వారు వీల్ చైర్లను వాడుతుంటారు. అయితే అన్నిచోట్లా వీటితో వెళ్లటం కుదరకపోవచ్చు. ఇలాంటప్పుడు యాక్సెసబుల్ ప్లేసెస్ ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. వీల్‌చైర్లు వెళ్లటానికి అనువైన ప్రవేశ ద్వారాలు, బాత్రూమ్‌లు, మెట్లు లేని దారులు గల చోట్లను చూపిస్తుంది. వీల్‌చైర్ వాడేవారికే కాదు, వృద్ధులకు, లగేజ్ మోసేవారికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

ఇలా వాడుకోవాలి: సెటింగ్స్ ద్వారా యాక్సెసిబిలిటీలోకి వెళ్లి యాక్సెసబుల్ ప్లేసెస్ ఫీచర్‌ను ఆన్ చేసుకోవాలి.

బృంద ప్రయాణాలకు షేర్

గూగుల్ డాక్‌ను షేర్ చేయటం తెలిసిందే. బృంద ప్రయాణాలకు సన్నద్ధమయ్యేటప్పుడు ఆయా ప్రాంతాలను షేర్ చేస్తే? చాలా బాగుంటుంది కదా. షేర్ ఫీచర్ అదే చేస్తుంది. రెస్టరెంట్లు, హోటళ్లు, ఆకర్షణీయ ప్రాంతాల జాబితా సిద్ధం చేసి స్నేహితులు లేదా కుటుంబ సభ్యులకు షేర్ చేయొచ్చు. అప్పుడు వాళ్లు తమ సూచనలను, సలహాలను పంచుకోవచ్చు. రేటింగ్ ఇవ్వచ్చు.

ఇలా వాడుకోవాలి: సేవ్ ద్వారా లిస్ట్‌లోకి వెళ్లి న్యూ లిస్ట్ మీద తాకాలి. తర్వాత అవసరమైనవారికి షేర్ చేయాలి.

మోటో కొత్తతరం మడత ఫోన్లు



మోటొరోలా తమ కొత్తతరం మడత ఫోన్లను గ్లోబల్ మార్కెట్లలో ప్రవేశపెట్టింది. పెద్ద ఎక్స్‌టర్నల్ డిస్‌ప్లే, అప్‌గ్రేడెడ్ కెమెరాలు, మరింత దృఢత్వం, లోతైన ఏఐ సమ్మేళనంతో వస్తున్న వీటి పేర్లు రేజర్ 70, రేజర్ 70 ప్లస్, రేజర్ 70 అల్ట్రా.

- **రేజర్ 70 ఫీచర్లు:** 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.96 అంగుళాల ఇంటర్నల్ పీఓఎల్‌డీ ఎల్‌టీపీఓ తెర, మీడియాటెక్ డైమెన్సిటీ 7450ఎక్స్ చిప్‌సెట్.. 30డబ్ల్యూ వైర్డ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్‌ను సపోర్టు చేసే 4,800ఎంఏహెచ్ బ్యాటరీ, వెనకాల రెండు 50ఎంపీ కెమెరాలు, ముందు 32ఎంపీ సెల్ఫీ కెమెరా. ధర సుమారు రూ.76,200.
- **రేజర్ 70 ప్లస్ ఫీచర్లు:** స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 3 చిప్‌సెట్, 165హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం గల 4 అంగుళాల ఎక్స్‌టర్నల్ డిస్‌ప్లే, స్టాండర్డ్ రకం మాదిరిగానే ఫ్రంట్ డిస్‌ప్లే.. 45డబ్ల్యూ వైర్డ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్‌ను సపోర్టు చేసే 4,500ఎంఏహెచ్ బ్యాటరీ, వెనకాల రెండు 50 ఎంపీ కెమెరాలు, ముందు 32ఎంపీ సెల్ఫీ కెమెరా. ధర సుమారు రూ.1,04,800.
- **రేజర్ 70 అల్ట్రా ఫీచర్లు:** స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్, 5,000 గరిష్ఠ ప్రకాశం గల 7 అంగుళాల 1.5కే ఎల్‌టీపీఓ ఎమోలెడ్ ఫోల్డింగ్ డిస్‌ప్లే, 4 అంగుళాల ఔటర్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ సెరామిక్ 3 రక్షణ, వెనకాల 50 ఎంపీ మెయిన్ కెమెరా, 50ఎంపీ అల్ట్రా వైడ్ లెన్స్, ముందు 50 ఎంపీ కెమెరా.. 68డబ్ల్యూ వైర్డ్, 30డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్టు చేసే 5,000ఎంఏహెచ్ బ్యాటరీ. ధర సుమారు రూ.1,42,900.

వన్‌ప్లస్ ప్యాడ్ 4 వచ్చేసింది



వన్‌ప్లస్ సంస్థ తాజాగా ప్యాడ్ 4 ట్యాబ్లెట్‌ను మనదేశంలో పరిచయం చేసింది. ఇది కొత్త స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆక్సిజన్‌ఓఎస్ 16తో పనిచేస్తుంది. 144హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 3.4కే రెజల్యూషన్, డాల్బీ విజన్‌తో కూడిన 13.2 అంగుళాల పెద్ద డిస్‌ప్లేతో ఆకట్టుకుంటోంది. ఎనిమిది స్పీకర్ల వ్యవస్థతో వినోద అనుభూతిని మరింత పెంచగలదు. వన్‌ప్లస్ స్టైలో ప్రొ పెన్, స్మార్ట్ కీబోర్డుతో వాడుకోవచ్చు. వెనకాల 13ఎంపీ కెమెరా, ముందు 8ఎంపీ కెమెరా.. 8జీబీ/12జీబీ ర్యామ్, 256జీబీ/512జీబీ స్టోరేజీ, 13,380ఎంఏహెచ్ బ్యాటరీ, 80డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టు, భారీ వేపర్ కూలింగ్ ఛాంబర్, ఏఐ రైటర్, ఏఐ రికార్డర్, ఏఐ ట్రాన్స్‌లేషన్ వంటి ఫీచర్లతో అలరిస్తోంది. డ్యూన్ గ్లో, సేజ్ మిస్ట్ రంగుల్లో లభించే దీని ప్రారంభ ధర రూ.59,999.

ఫొటోస్‌తో డిజిటల్ వార్డ్‌రోబ్



ఒకసారి మీ పాత ఫొటోలను చూడండి. ఎన్నెన్నో దుస్తులు ధరించారు కదా. ఇప్పుడు అవన్నీ ఒకదగ్గర వార్డ్‌రోబ్‌లో ఉంటే? వాటిని మార్చి మార్చి వేసుకొని చూస్తే? అదెలా సాధ్యమని ఆశ్చర్యపోతున్నారా? నిజ రూపంలో కాకపోయినా, డిజిటల్ రూపంలో సాధ్యమే. గూగుల్ ఫొటోస్ అలాంటి ఏఐ టూల్‌నే తీసుకొస్తోంది. వ్యక్తిగత ఫొటోలను డిజిటల్ వార్డ్‌రోబ్‌గా మార్చటం దీని ప్రత్యేకత. ఇది కృత్రిమ మేధ సాయంతో గూగుల్ ఫొటోస్‌లో స్టోర్ అయిన ఇమేజ్‌లను స్కాన్ చేస్తుంది. ప్యాంట్లు, చొక్కాలు, చీరలు, జాకెట్లు, సల్వార్ సూట్లు, ధరించే ఆభరణాల వంటి వాటిని గుర్తించి, డిజిటల్ అల్మారాలో భద్రపరుస్తుంది. అక్కడి నుంచి యూజర్లు ఆయా విభాగాల్లోంచి బ్రౌజ్ చేసుకోవచ్చు. దేనికి ఏది నప్పుతుందో చూసుకొని, సరికొత్త లుక్‌ను సృష్టించుకోవచ్చు. ఈ టూల్ తనకు తానే వార్డ్‌రోబ్‌ను సృష్టిస్తుంది. అయితే ఇమేజ్‌లు స్పష్టంగా ఉంటే మంచి ఫలితాలు అందిస్తుంది. ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఏయే దుస్తులు ధరించాలో నిర్ణయించుకోవటానికి ఇది తోడ్పడుతుంది. వాటిని ధరిస్తే ఎలా ఉంటుందో వర్చువల్‌గా చూసుకోవచ్చు. ఈ వేసవి చివర్లో ఆండ్రాయిడ్ ఫోన్లలో దీన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. తర్వాత ఐఓఎస్ పరికరాలకు విస్తరించనున్నారు. అందుబాటులోకి వచ్చాక ఇది గూగుల్ ఫొటోస్‌లో కలెక్షన్ విభాగం కింద కనిపిస్తుంది.

తిరిగి పేజీ మొదలుకు

ఐఫోన్‌లో ఏదైనా వెబ్ పేజీలో లేదా యాప్‌లో చివరి వరకూ స్క్రోల్ చేశారా? తిరిగి పై భాగానికి రావాలంటే మొత్తమంతా స్క్రోల్ చేయాల్సిన పనిలేదు. తెరకు మీద పైభాగంలో టైమ్ లేదా బ్యాటరీ ఏరియా వద్ద తాకి చూడండి. వెంటనే తిరిగి మొదటికి వస్తారు. ఇది మెసేజెస్, మెయిల్, సఫారీ, ఎక్స్ వంటి యాప్స్‌లో పనిచేస్తుంది. అయితే ఆండ్రాయిడ్ యూజర్లకు ఇలాంటి సార్వత్రిక సదుపాయం లేదు. కానీ కొన్ని యాప్స్‌లో కింద బ్యాక్ టు టాప్ బాణం గుర్తు ఉంటుంది.

ఉచ్చారణ నేర్చుకోండి

మీకు ఇంగ్లిష్ బాగా వచ్చా? కానీ హిందీలో సరిగా మాట్లాడలేకపోతున్నారా? ఆయా పదాలను, వాక్యాలను ఎలా ఉచ్చరించాలో తెలియటం లేదా? చింతించకండి. గూగుల్ ట్రాన్స్‌లేషన్ యాప్‌తో సాధన చేయండి. అవును, ఇప్పుడు గూగుల్ ట్రాన్స్‌లేషన్‌లో ఉచ్చారణ నేర్చుకోవటానికి తోడ్పడే ఫీచర్ జతచేరింది. ఇది ఏఐ సాయంతో మన మాటలను విశ్లేషించి, తక్షణం ఫీడ్‌బ్యాక్ అందిస్తుంది. సరిగ్గా ఎలా పలకాలో నేర్పిస్తుంది. కాకపోతే ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ ఫోన్లకు మాత్రమే పరిమితం. ప్రస్తుతానికిది అమెరికా, భారత్‌లో ఇంగ్లిష్, స్పానిష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉంది. దీన్ని ఎలా వాడుకోవాలంటే? హిందీలోకి అనువాదం చేయాలనుకునే మాటలను టైప్ చేయాలి. తర్వాత అడుగున ఉండే ప్రాక్టీస్ బటన్ మీద తాకి, ప్రనౌన్స్‌ను ఎంచుకోవాలి. అనంతరం తెర మీద కనిపిస్తున్న టెక్స్ట్‌ను చదవాలి. అప్పుడది మన మాటలను విశ్లేషిస్తుంది. లిజన్ బటన్ మీద తాకితే ఎలా పలకాలో చెబుతుంది. ఇలా ఎన్ని మాటలనైనా తేలికగా సాధన చేయొచ్చు.

చప్పట్లతో ఫోన్ గుర్తింపు



ఇంట్లో ఫోన్ ఎక్కడో పెడతాం. ఎక్కడ పెట్టామో చప్పున గుర్తుకు రాదు. మీరూ ఇలాగే తరచూ మరచి పోతున్నారా? అయితే ఫైండ్ మై ఫోన్ బై క్లాప్ యాప్ సాయం తీసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలు రెండింటిలోనూ పనిచేస్తుంది. దీన్ని డౌన్‌లోడ్ చేసుకొని, స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని, మైక్రోఫోన్ వాడకానికి అనుమతిస్తే చాలు. ఈ యాప్ పేరుకు తగ్గట్టుగానే చప్పట్లు కొట్టగానే ఫోన్‌లో పెద్ద శబ్దం వస్తుంది. దీన్ని బట్టి ఫోన్ ఎక్కడుందో గుర్తించొచ్చు. ఇది చీకట్లో కాంతినీ వెదజల్లుతుంది. కంపిస్తుంది కూడా. ఫోన్ సైలెంట్‌లో ఉన్నా ఇది పనిచేస్తుంది. కావాలనుకుంటే వేర్వేరు శబ్దాలు వినిపించేలా మార్చుకోవచ్చు.

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

★ ఏ చిత్రంలో నటనకుగాను నటి రష్మిక మందన్న తెలంగాణ గద్దర్ అవార్డుల్లో ఉత్తమనటి పురస్కారాన్ని గెలుచుకుంది?
జ: 'ది గర్ల్ ఫ్రెండ్' (రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మిక 'భూమా దేవి' పాత్రను పోషించింది.)

★ అంతర్జాతీయ మలేరియా సదస్సు – 2026ను మార్చి 7 నుంచి 9 వరకు ఏ నగరంలో నిర్వహించారు?
జ: న్యూదిల్లీ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలోని ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ ఈ సదస్సును 'డిస్కవరీ, డెవలప్‌మెంట్ అండ్ డెలివరీ: డ్రైవింగ్ మలేరియా ఎలిమినేషన్ అండ్ బియాండ్' అనే థీమ్‌తో నిర్వహించింది.)

★ పని ప్రదేశంలో మహిళల భద్రతను బలోపేతం చేయడానికి, సంస్థ అంతటా మహిళా ఉద్యోగులకు సాధికారత కల్పించడానికి భారతీయ రైల్వే ఇటీవల ప్రారంభించిన యాప్ ఏది?
జ: షైన్ (SHINE - సెక్సువల్ హరాస్‌మెంట్ ఇన్సిడెంట్ నోటిఫికేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్. లైంగిక వేధింపుల సంఘటనలను హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (HRMS) ద్వారా నేరుగా నివేదించడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది.) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ యాప్‌ను 2026, మార్చి 8న ప్రారంభించారు.)

మరింత సమాచారం

Statistics



Transitioning to Class 10 Statistics requires moving from simple data organization to more complex mathematical analysis. In Class 10, the student will learn to calculate the Mean, Median, and Mode for grouped data, but they must first be fluent in the foundational concepts from Classes 8 and 9.

Data Organization (Class 8 Foundations)

Before calculating any values, a student must know how to handle raw data.

10th Class Bridge Course Mathematics

Raw Data Vs Arrayed Data: Understanding that data collected directly is 'raw' and must be arranged in ascending or descending order (an 'array') for analysis.

Tally Marks: The method of counting occurrences of a data point using vertical lines and diagonal slashes for groups of five.

Frequency: Knowing that frequency refers to how many times a particular observation occurs.

Class Intervals: Grouping data into ranges (e.g.: 0-10).

Lower Limit: The smallest number in an interval (e.g.: 0).

Upper Limit: The largest number in an interval (e.g.: 10).

Class Size: The difference between the upper and lower limits.

Measures of Central Tendency (Class 9 Depth)

In Class 9, students learn to find the 'center' of a data set for ungrouped data. Class 10 will apply these same logic-sets to much larger, grouped tables.

A) Arithmetic Mean (Average): The student must be comfortable with the formula.

$$\text{Mean} = \frac{\text{Sum of all observations}}{\text{Total number of observations}} = \frac{\Sigma x_i}{n}$$

In Class 10, this evolves into the 'Assumed Mean' and 'Step Deviation' methods, so understanding the basic average is critical.

For more Concepts

B) Median: The middle value of the data. The student must remember the two rules.

i) If n is odd: Median = $\frac{n+1}{2}$ th observation.

ii) If n is even: Median = Average of $\frac{n}{2}$ th and $\left(\frac{n}{2}+1\right)$ th observations.

C) Mode: The observation that occurs most frequently in the data set.



Writer: T.S.V.S. Suryanarayana Murty

చేసే చేతులు పెరిగితే కరిగిపోయే కాలం!

ఒక విద్యార్థి స్కూలు గ్రౌండ్‌ను శుభ్రం చేయాలంటే రోజంతా పడుతుంది. అదే క్లాస్‌లో ఉన్న వారంతా చేతులు కలిపితే, గంటలో పని పూర్తవుతుంది. ఇక్కడ పరిశీలిస్తే పని, శక్తి లేదా సామర్థ్యం, కేటాయించిన సమయం మధ్య చక్కటి సమన్వయం కనిపిస్తుంది. పని చేసే వ్యక్తుల సంఖ్య పెరిగితే, పని త్వరగా పూర్తవుతుంది, కాలం కరిగిపోయి, తగ్గిపోతుంది. అంటే పూర్తి చేయాల్సిన పనిలో తేడా లేకపోతే కాలం, సమయం విలోమానుపాతంలో ఉంటాయని అర్థమవుతుంది. అభ్యర్థుల్లో సమయపాలన, ప్రాజెక్టు ప్లానింగ్, నిర్వహణ, తార్కిక ఆలోచన శక్తిని అంచనా వేయడానికి ఇలాంటి ప్రశ్నలను పోటీ పరీక్షల్లో అడుగుతుంటారు. పని, శక్తి, సమయం మధ్య గణిత సంబంధాన్ని సమగ్రంగా అర్థం చేసుకుంటే, వాటికి తేలికగా సమాధానాలను గుర్తించవచ్చు. ఇందు కోసం ప్రాథమిక గణిత సూత్రాలను నేర్చుకోవాలి. మొత్తం పనిని యూనిట్లుగా భావిస్తూ లెక్కను సులభంగా పరిష్కరించాలి. దాని వల్ల సంప్రదాయ పద్ధతి కంటే వేగంగా జవాబు కనుక్కోవచ్చు.



కాలం - పని - సామర్థ్యం

◆ పని సమానమైనప్పుడు కాలం, సామర్థ్యం విలోమ నిష్పత్తిలో ఉంటాయి.

$$\text{కాలం } (t) \propto \frac{1}{\text{సామర్థ్యం } (c)}$$

◆ A ఒక పనిని m రోజుల్లో చేయగలడు. B అదే పనిని n రోజుల్లో చేయగలడు. అయితే A, B లు కలిసి ఆ పనిని చేయడానికి పట్టే కాలం

$$= \frac{mn}{m+n}$$

◆ A, B లు కలిసి ఒక పనిని m రోజుల్లో చేయగలరు. A ఒక్కడే ఆ పనిని n రోజుల్లో చేయగలడు. అయితే B ఒక్కడే ఆ పనిని చేసే రోజులు

$$B = \frac{mn}{n-m} \quad (\because n > m)$$


నోట్: సమస్య సాధనలో కసాగు అంటే మొత్తం పని అని అర్థం. దీనిని మనం 'చదివే పుస్తకాలుగా' భావిస్తాం. కాబట్టి A 5 రోజులు పని చేశాడు అంటే A 5 రోజులపాటు అతడి సామర్థ్యం ఆధారంగా చదువుతున్నాడని అర్థం.



మాదిరి ప్రశ్నలు

1. ఒక వ్యక్తి ఒక పనిని 15 రోజుల్లో చేస్తాడు. అతడి తండ్రి 20 రోజుల్లో, తమ్ముడు 25 రోజుల్లో చేస్తే; ముగ్గురు కలిసి ఆ పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరు?

1) 6 2) $\frac{300}{47}$ 3) $\frac{300}{46}$ 4) 8



వివరణ:

	S_1	F	S_2	కసాగు
	15	20	25	300 (మొత్తం పని)
సామర్థ్యాలు →	20	15	12	

ముగ్గురూ కలిసి → 20 + 15 + 12 = 47 పుస్తకాలు ఒక (1) రోజుకు చదువుతారు.

∴ మొత్తం రోజులు = $\frac{300}{47}$ **జ: 2**

2. ఒక పనిని A, B లు కలిసి 12 రోజుల్లో; B, C లు 15 రోజుల్లో; C, A లు కలిసి 20 రోజుల్లో చేయగలరు. అయితే ముగ్గురూ కలిసి ఆ పనిని ఎన్ని రోజుల్లో చేయగలరు?

1) 10 2) 15 3) 12 4) 18

వివరణ:

	A + B	B + C	C + A	కసాగు
	12	15	20	60
సామర్థ్యాలు →	5	4	3	



మొత్తం పుస్తకాలు = 60

(A + B) + (B + C) + (C + A) = 5 + 4 + 3

2(A + B + C) = 12 ⇒ A + B + C = 6

ముగ్గురూ కలిసి ఒక (1) రోజుకు చదివే పుస్తకాలు = 6

∴ మొత్తం రోజులు = $\frac{60}{6}$ = 10 రోజులు. **జ: 1**

జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

3. ఆదిత్య ఒక పనిని 15 రోజుల్లో చేస్తాడు. ఆదిత్య కంటే వివేక్ 50% ఎక్కువ పనిమంతుడు. అయితే వివేక్ ఒక్కడే ఆ పనిని ఎన్ని రోజుల్లో చేయగలడు?

1) 20 2) 10
3) 25 4) 30

వివరణ: ఆదిత్య : వివేక్

సామర్థ్యాలు → 100 : 150

కాలాలు → 150 : 100

3 : 2

$\left(\text{కాలం} \propto \frac{1}{\text{సామర్థ్యం}}\right)$

ఆదిత్య 3 → 15 రోజులు

2 → ? 10 రోజులు

జ: 2



4. 15 మంది స్త్రీలు (w) 12 రోజుల్లో చేసే పనిని 16 రోజుల్లో 10 మంది పురుషులు (m) చేయగలరు. అయితే పురుషులు, స్త్రీల పనితనాల నిష్పత్తి?

1) 3 : 4 2) 7 : 9 3) 8 : 9 4) 9 : 8

వివరణ: స్త్రీలు చేసే పని = పురుషులు చేసే పని.

15 w × 12 రోజుల్లో = 10 m × 16 రోజుల్లో

$$\frac{m}{w} = \frac{15 \times 12}{10 \times 16} = \frac{9}{8}$$



⇒ m : w = 9 : 8 **జ: 4**

5. ఒక పురుషుడు(m) లేదా ఇద్దరు స్త్రీలు(w) లేదా ముగ్గురు బాలురు(b) ఒక పనిని 88 రోజుల్లో పూర్తి చేయగలరు. అదే పనిని ఒక పురుషుడు, ఒక స్త్రీ, ఒక బాలుడు ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరు?

1) 46 2) 54 3) 48 4) 44

వివరణ: ఇచ్చిన దత్తాంశం 1m లేదా 2w లేదా 3b → 88

అడిగిన ప్రశ్న 1m + 1w + 1b → ?

$$= \frac{88 \text{ రోజులు}}{\frac{1}{1}+\frac{1}{2}+\frac{1}{3}} = \frac{88}{\frac{6+3+2}{6}} = \frac{88 \times 6}{11}$$

= 48 రోజులు **జ: 3**

6. 12 మంది పురుషులు(m), 16 మంది బాలురు(b) ఒక పనిని 5 రోజుల్లో పూర్తి చేస్తారు. అదే పనిని 13 మంది పురుషులు, 24 మంది బాలురు 4 రోజుల్లో పూర్తి చేస్తే పురుషులు, బాలుర పనితనాల నిష్పత్తి?

1) 3 : 2 2) 2 : 1 3) 1 : 2 4) 2 : 3

వివరణ: (12 m + 16 b) → 5 రోజులు } పనులు
(13 m + 24 b) → 4 రోజులు } సమానం

(12 m + 16 b) × 5 = (13 m + 24 b) × 4

60 m + 80 b = 52 m + 96 b

8 m = 16 b

$$\frac{m}{b} = \frac{2}{1}$$

m : b = 2 : 1 **జ: 2**



రచయిత: పిరాది నరేష్

అక్కడి పాలనకు మంత్రి మండలి సలహా అక్కర్లేదు!


కేంద్రపాలిత ప్రాంతాలు

దేశంలో పరిపాలనాపరమైన విభజనలో రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలూ ఉన్నాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం నేరుగా పాలిస్తుంది. పరిపాలన, భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, వ్యూహాత్మక కారణాలతో కేంద్రం వీటిని తన నియంత్రణలో ఉంచుకుంటుంది. పాలన అంతా రాష్ట్రపతి నియమించే లెఫ్టినెంట్ గవర్నర్, అడ్మినిస్ట్రేటర్ ద్వారా జరుగుతుంది. కొన్నింటికి శాసనసభలు, ముఖ్యమంత్రి, మంత్రిమండలి ఉన్నప్పటికీ వారికి పరిమిత అధికారాలే ఉంటాయి. కేంద్ర చట్టాలు, నిబంధనలే దాదాపుగా అమలయ్యే ఈ ప్రాంతాల ఏర్పాటు, పరిపాలనా వ్యవహారాలు, రాజ్యాంగపరమైన నియమాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒక్కో కేంద్రపాలిత ప్రాంతం ప్రత్యేకతలు, సంబంధిత చట్టాలు, స్థానిక శాసనసభలో, పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యం వివరాలను గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

1. కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో వివరణ ఉంది?
   1) VIIవ భాగం 2) VIIIవ భాగం
   3) IXవ భాగం 4) Xవ భాగం

2. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.



   ఎ) రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం, 1956 ద్వారా కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్, మణిపుర్, త్రిపుర తర్వాత కాలంలో రాష్ట్రాలుగా మారాయి.
   బి) 1961లో భారత్‌లో విలీనమైన గోవా, 1987లో రాష్ట్రంగా ఏర్పడింది.
   సి) జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019 ప్రకారం జమ్ము-కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు.
   డి) ప్రస్తుతం మన దేశంలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు-8.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

3. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 239 కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన గురించి వివరిస్తుంది.
   బి) కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన రాష్ట్రపతి ద్వారా నిర్వహిస్తారు.
   సి) కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన కోసం రాష్ట్రపతి పాలకులను నియమిస్తారు.
   డి) కేంద్రపాలిత ప్రాంతం కేంద్ర ప్రభుత్వంలో భాగంగా పనిచేస్తుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. ఏ ఆర్టికల్ ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా కేంద్రపాలిత ప్రాంతాల్లో శాసన సభను ఏర్పాటు చేయగలదు?
   1) ఆర్టికల్ 239(ఎ) 2) ఆర్టికల్ 239(బి)
   3) ఆర్టికల్ 239(సి) 4) ఆర్టికల్ 239(డి)

5. రాజ్యాంగానికి ఆర్టికల్ 239(ఎ)ను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?
   1) 7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956
   2) 9వ రాజ్యాంగ సవరణ చట్టం, 1961
   3) 14వ రాజ్యాంగ సవరణ చట్టం, 1962
   4) 24వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971

6. కేంద్రపాలిత ప్రాంతాల పాలనా చట్టాన్ని పార్లమెంటు ఎప్పుడు రూపొందించింది?
   1) 1962 2) 1963 3) 1965 4) 1967

7. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) కేంద్రపాలిత ప్రాంత పాలకులను రాష్ట్రపతి నియమిస్తారు.
   బి) కేంద్రపాలిత ప్రాంత పాలకుడు మంత్రిమండలి సలహాతో సంబంధం లేకుండా తన విచక్షణను అనుసరించి పరిపాలన నిర్వహిస్తారు.
   సి) కేంద్రపాలిత ప్రాంతాల పాలకుడు న్యాయపరమైన, అర్ధ న్యాయపరమైన అధికారాల నిర్వహణ విషయంలో రాష్ట్ర మంత్రిమండలికి బాధ్యత వహించాలి.
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) ఎ, బి, సి

8. శాసనసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలను గుర్తించండి.
   1) పుదుచ్చేరి, జమ్ము-కశ్మీర్, దిల్లీ
   2) జమ్ము-కశ్మీర్, చండీగఢ్, దిల్లీ
   3) లద్దాఖ్, జమ్ము-కశ్మీర్, పుదుచ్చేరి
   4) చండీగఢ్, దాద్రానగర్ హవేలీ డామన్ డయ్యూ, దిల్లీ

9. వివిధ కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడిన సంవత్సరాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



   ఎ) అండమాన్ నికోబార్ దీవులు - 1956
   బి) లక్షద్వీప్ - 1956
   సి) పుదుచ్చేరి - 1962
   డి) దిల్లీ - 1956
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

10. దాద్రానగర్ హవేలీ డయ్యూ డామన్ కేంద్రపాలిత ప్రాంతం ఎప్పుడు ఏర్పడింది?
    1) 2017 2) 2019 3) 2020 4) 2022

11. 2019లో ఏర్పడిన కేంద్ర పాలిత ప్రాంతాలను గుర్తించండి.
    1) జమ్ము-కశ్మీర్, లద్దాఖ్
    2) జమ్ము-కశ్మీర్, శ్రీనగర్
    3) శ్రీనగర్, లద్దాఖ్
    4) జమ్ము-కశ్మీర్, పుదుచ్చేరి

12. చండీగఢ్‌ని కేంద్రపాలిత ప్రాంతంగా ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1961 2) 1963 3) 1966 4) 1971

13. లెఫ్టినెంట్ గవర్నర్ 'పాలకుడు'గా వ్యవహరించే కేంద్రపాలిత ప్రాంతాన్ని గుర్తించండి.
    ఎ) దిల్లీ, అండమాన్ - నికోబార్ దీవులు
    బి) పుదుచ్చేరి, లక్షద్వీప్
    సి) జమ్ము-కశ్మీర్, లద్దాఖ్
    డి) పుదుచ్చేరి
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

14. దిల్లీకి 'జాతీయ రాజధాని ప్రాంతం' (నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ దిల్లీ) హోదాను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కల్పించారు?
    1) 69వ రాజ్యాంగ సవరణ చట్టం, 1991
    2) 70వ రాజ్యాంగ సవరణ చట్టం, 1991
    3) 71వ రాజ్యాంగ సవరణ చట్టం, 1992
    4) 72వ రాజ్యాంగ సవరణ చట్టం, 1992

15. దిల్లీ 'జాతీయ రాజధాని ప్రాంతం'గా ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?



    1) 1991, ఫిబ్రవరి 1 2) 1991, ఏప్రిల్ 1
    3) 1992, ఫిబ్రవరి 1 4) 1992, జూన్ 1

16. 'దిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం' పరిపాలన గురించి వివరిస్తున్న రాజ్యాంగ అధికరణ ఏది?
    1) ఆర్టికల్ 239 (ఎ) 2) ఆర్టికల్ 239 (ఎఎ)
    3) ఆర్టికల్ 239 (ఎబి) 4) ఆర్టికల్ 239 (ఎసి)

17. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ఆర్టికల్ 239 ఎఎ (2)(ఎ) ప్రకారం దిల్లీకి శాసనసభ ఉంటుంది.
    బి) ఆర్టికల్ 239 ఎఎ (2)(బి) ప్రకారం దిల్లీ శాసనసభలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రిజర్వ్ చేయాల్సిన స్థానాల సంఖ్యను పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.
    సి) ఆర్టికల్ 239 ఎఎ (3)(ఎ) ప్రకారం రాష్ట్ర జాబితాలో ఉన్న అంశాలపై, ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలపై శాసనాలు రూపొందించే అధికారం దిల్లీ శాసనసభకు ఉంటుంది.
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, సి 4) ఎ, బి, సి

18. 'చీఫ్ అడ్మినిస్ట్రేటర్' పాలకుడిగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలను గుర్తించండి.
    1) లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ డామన్ డయ్యూ, చండీగఢ్
    2) పుదుచ్చేరి, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ డామన్ డయ్యూ
    3) లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు
    4) చండీగఢ్, లక్షద్వీప్, పుదుచ్చేరి

19. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.



    ఎ) దిల్లీ పరిపాలనలో లెఫ్టినెంట్ గవర్నర్‌కు పరిపాలనలో సహకరించేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రిమండలి ఉంటుంది.
    బి) మంత్రిమండలి దిల్లీ శాసనసభకు సమష్టి బాధ్యత వహించాలి.
    సి) దిల్లీ మంత్రిమండలి నిర్ణయాలతో లెఫ్టినెంట్ గవర్నర్ విభేదించినప్పుడు సంబంధిత అంశాన్ని రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేస్తారు.
    డి) రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన అంశంపై రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అత్యవసరమని భావిస్తే లెఫ్టినెంట్ గవర్నర్ తన నిర్ణయాన్ని అమలు చేయగలరు.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

20. దిల్లీ శాసనసభలోని ఎమ్మెల్యేల సంఖ్య?
    1) 40 2) 60 3) 70 4) 90



21. పుదుచ్చేరి శాసనసభలోని ఎమ్మెల్యేల సంఖ్య?
    1) 30 2) 40 3) 60 4) 70

22. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) లోక్‌సభలో పుదుచ్చేరికి కేటాయించిన స్థానాల సంఖ్య - 1
    బి) లోక్‌సభలో దిల్లీకి కేటాయించిన స్థానాల సంఖ్య - 7
    సి) రాజ్యసభలో పుదుచ్చేరికి కేటాయించిన స్థానాల సంఖ్య - 1
    డి) రాజ్యసభలో దిల్లీకి కేటాయించిన స్థానాల సంఖ్య - 3
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

23. రాజ్యాంగపరంగా దిల్లీ పరిపాలన జరగలేదని దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నివేదికను సమర్పిస్తే ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి దిల్లీ పరిపాలనకు కల్పించిన అన్ని అంశాలను సస్పెండ్ చేస్తారు?
    1) ఆర్టికల్ 239 (ఎబి) 2) ఆర్టికల్ 239 (ఎసి)
    3) ఆర్టికల్ 239 (బిడి) 4) ఆర్టికల్ 239 (ఎ)

24. జమ్ము–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019కి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ఈ చట్టం 2019, అక్టోబరు 31 నుంచి అమల్లోకి వచ్చింది.
    బి) జమ్ము-కశ్మీర్‌కి ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370ను రద్దు చేశారు.
    సి) జమ్ము-కశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ము-కశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేశారు.
    డి) జమ్ము-కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి ప్రత్యేక శాసనసభ ఉంటుంది.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

25. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) రాజ్యసభలో జమ్ము-కశ్మీర్‌కు కేటాయించిన స్థానాల సంఖ్య - 4
    బి) లోక్‌సభలో జమ్ము-కశ్మీర్‌కు కేటాయించిన స్థానాల సంఖ్య - 5
    సి) లోక్‌సభలో లద్దాఖ్‌కు కేటాయించిన స్థానాల సంఖ్య - 1
    డి) జమ్ము-కశ్మీర్ శాసనసభలోని ఎమ్మెల్యేల సంఖ్య - 111
    1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1-2; 2-4; 3-1; 4-1; 5-3; 6-2; 7-1; 8-1; 9-4; 10-3; 11-1; 12-3; 13-2; 14-1; 15-3; 16-2; 17-4; 18-1; 19-4; 20-3; 21-1; 22-4; 23-1; 24-4; 25-4.

మిస్సింగ్ నంబర్స్

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి వచ్చే తప్పనిసరి అంశాల్లో మిస్సింగ్ నంబర్స్ ఒకటి. ఇందులో పలు రకాల జ్యామితీయ పటాల్లో కొన్ని అంకెలు/సంఖ్యల క్రమాన్ని ఇస్తారు. ఆ క్రమంలో ఏదో ఒక చోట ప్రశ్నార్థకాన్ని ఇచ్చి, ఆ స్థానంలో వచ్చే అంకె లేదా సంఖ్యను గుర్తించమని అడుగుతారు. ఈ క్రమం ఒక నియమాన్ని అనుసరిస్తూ ఉంటుంది. అభ్యర్థులు దాన్ని కనుక్కొని క్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటిని సాధించాలంటే ప్రాథమిక గణిత పరిక్రియలు, సంఖ్యా నియమాలు, వర్గాలు, ఘనాలపై పట్టు ఏర్పర్చుకోవాలి.




ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

నిర్దిష్ట నియమంలో క్రమం.. ఛేదిస్తేనే సమాధానం!

సూచన (ప్ర. 1 – 10): దిగువ ఇచ్చిన ప్రశ్నల్లో ప్రశ్నార్థకం ఉన్న స్థానంలో వచ్చే సరైన సమాధానాన్ని కనుక్కోండి.

1.




1) 98 2) 80 3) 18 4) 89

సాధన: మొదటి చిత్రం: $9 + 5 + 15 + 92 = 121$
రెండో చిత్రం: $16 + 19 + 24 + 20 = 79$
మూడో చిత్రం: $56 + 7 + 9 + 8 = 80$

సమాధానం: 2

2.




1) 71 2) 62 3) 59 4) 55

సాధన: $(5 \times 4) + (3 \times 2) = 26$
$(8 \times 4) + (6 \times 5) = 62$
$(8 \times 3) + (7 \times 5) = 59$

సమాధానం: 3

3.



1) 2 2) 8 3) 64 4) 6

సాధన: $\sqrt{(3)^2 + (4)^2} = \sqrt{9 + 16} = \sqrt{25} = 5$
$\sqrt{5^2 + 12^2} = \sqrt{25 + 144} = 13$
$\sqrt{x^2 + (15)^2} = (17) \Rightarrow x^2 + 225 = 289$
$\Rightarrow x^2 = 289 - 225 \Rightarrow x^2 = \sqrt{64} = 8$

సమాధానం: 2

4.




1) 7 2) 12 3) 8 4) 10

సాధన: $6 \times 6 = 9 \times 4$; $9 \times 8 = 24 \times 3$; $9 \times ? = 15 \times 6$
$36 = 36$ $72 = 72$ $? = 10$

సమాధానం: 4

5.




1) 6 2) 5 3) 8 4) 9

సాధన: $5 + 0 = 5$; $4 + 0 = 4$; $4 + 3 = 7$
$3 + 1 = 4$; $2 + 1 = 3$; $1 + 1 = 2$
9 7 9

సమాధానం: 4

6.




1) 21 2) 17 3) 25 4) 27

సాధన: $7 \times 4 = 28$ $8 \times 5 = 40$
$19 + 9 = 28$ $28 + 12 = 40$
ఇదేవిధంగా $9 \times 3 = 27$
$? + 6 = 27$
$? = 27 - 6$
$? = 21$

సమాధానం: 1

7.




1) 28 2) 24 3) 22 4) 25

$7 + 4 = 11$ $5 + 5 = 10$ $8 + 3 = 11$
$7 \times 4 = 28$ $5 \times 5 = 25$ $8 \times 3 = 24$

సమాధానం: 2

8.




1) 68 2) 76 3) 71 4) 53

సాధన: $(6 \times 7) + (8 + 4) = 42 + 12 = 54$,
$(8 \times 4) + (12 + 7) = 32 + 19 = 51$
$(9 \times 5) + (14 + 9) = 45 + 23 = 68$

సమాధానం: 1

9.



1) 84 2) 104 3) 94 4) 74

సాధన: $(11 \times 12) - (6 \times 9)$
$132 - 54 = 78$
$(14 \times 10) - (7 \times 8)$
$140 - 56 = 84$

సమాధానం: 1

10.

9	8	7
6	7	8
5	4	?
270	224	336

1) 7 2) 9 3) 6 4) 5

సాధన: $9 \times 6 \times 5 = 270$
$8 \times 7 \times 4 = 224$
$8 \times 7 \times x = 336$
$x = \frac{336}{56}$
$x = 6$

సమాధానం: 3



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

1002 Word of the Day

Absolve

Telugu meaning: విముక్తి కలిగించడం, క్షమించడం

English meaning: The word absolve (అబ్సాల్వ్) is a verb that describes the act of declaring someone free from blame, guilt, or responsibility.

Synonyms: Forgive, Acquit; ***Antonyms:*** Blame, Accuse

Usage: **1.** The court decided to absolve the accused after reviewing all the evidence and concluding that he was innocent.

2. The teacher chose to absolve the student of punishment after understanding the genuine reasons behind the mistake.

కరెంట్ అఫైర్స్



గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12% వృద్ధితో రూ.23.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రభుత్వం సవరించిన అంచనా అయిన రూ.24.21 లక్షల కోట్ల కంటే ఈ మొత్తం తక్కువే. 2024-25లో ఇవి రూ.22.26 లక్షల కోట్లుగా ఉన్నాయి.



దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2026, మే 4న వెల్లడయ్యాయి. పశ్చిమ బెంగాల్‌ను భాజపా భారీ మెజారిటీతో కైవసం చేసుకుంది. తమిళనాడులో కొత్తగా ఏర్పడిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అతి పెద్ద పార్టీగా అవతరించింది. కేరళంలో యూడీఎఫ్ జయకేతనం ఎగురవేసింది. అస్సాంలో హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన భాజపా అయిదింట నాలుగొంతుల మెజారిటీ సాధించింది. పుదుచ్చేరిలో రంగసామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ అధికారం నిలబెట్టుకుంది. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో పరాజయం పాలయ్యారు.

ఫెమా కింద చేపట్టిన మార్పులను ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫై చేయడంతో, ఆటోమేటిక్ రూట్ కింద మన దేశంలో పెట్టుబడి పెట్టడానికి 10 శాతం వరకు చైనా వాటా ఉన్న విదేశీ కంపెనీలను అనుమతించే నిర్ణయం మే 1 నుంచి అమల్లోకి వచ్చింది. డీపీఐఐటీ 2020 ప్రెస్ నోట్ (పీఎన్) 3 సవరణలకు కేంద్ర మంత్రి వర్గం మార్చిలో ఆమోదం తెలిపింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత డిప్యూటీ గవర్నర్ టి.రవి శంకర్‌కు పొడిగించిన పదవీ కాలం కూడా 2026, మే 2తో పూర్తి కావడంతో ఆయన స్థానంలో రోహిత్‌ను నియమించింది.

విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. మొబైల్ స్క్రీన్ సమయాన్ని విజ్ఞానదాయకంగా మార్చే లక్ష్యంతో రూపొందించిన గేమిఫైడ్ మ్యాథ్ లెర్నింగ్ యాప్ 'మ్యాథ్‌జోరో' అందుబాటులోకి వచ్చింది. దీన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చీఫ్ కోఆర్డినేషన్ ఆఫీసర్ బుద్ధ చంద్రశేఖర్ దిల్లీలోని ఏఐసీటీఈ కార్యాలయంలో 2026, మే 4న ఆవిష్కరించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

భారత మిలటరీ ఆపరేషన్స్ (పార్ట్ -2)

జనరల్ నాలెడ్జ్ స్టడీ జోన్

ప్రపంచంలోనే అత్యుత్తమ సాయుధ బలగాల్లో భారత మిలటరీ ఒకటి. ఇది ప్రధానంగా సరిహద్దు భద్రత, తిరుగుబాటు నిరోధం, ఉగ్రవాద నిర్మూలన, మానవతా సహాయం/విపత్తు సాయం లాంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. ఉగ్రవాద నిరోధం, శాంతి - భద్రతల నిర్వహణకు నిత్యం కృషి చేస్తూ ఉంటుంది. వీటిలో జమ్మూ - కశ్మీర్‌లో ఆపరేషన్ రక్షక్ లాంటి దీర్ఘకాలిక కార్యకలాపాలు; ఆపరేషన్ విజయ్ (గోవా) - ఆపరేషన్ పోలో (హైదరాబాద్) లాంటి ప్రాంతీయ చర్యలు; ప్రకృతి వైపరీత్యాల సమయంలో పౌరులకు సాయం చేయడం లాంటివి ఉన్నాయి. సాధారణంగా ఆయా రాష్ట్రాల్లోని పోలీస్ వ్యవస్థ లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షిస్తుంది. ఉగ్రమూక దాడులు, ప్రాంతాల మధ్య వైషమ్యాలు లాంటివి సంభవించినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి మిలటరీ రంగంలోకి దిగుతుంది. పోటీ పరీక్షల కోణంలో మన మిలటరీ స్వదేశంలో నిర్వహించిన ముఖ్యమైన ఆపరేషన్స్ గురించి తెలుసుకుందాం..!

ఆపరేషన్ పోలో, 1948




భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా హైదరాబాద్ సంస్థానం 13 నెలల పాటు నిజాం పాలనలోనే ఉంది. ఆ సమయంలో రజాకార్ల అకృత్యాలు, నిజాం నిరంకుశ పాలన, కమ్యూనిస్టుల తిరుగుబాటు చర్యల కారణంగా రాజ్యంలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో పేరుతో పోలీస్ చర్యకు సిద్ధమైంది. ఈ ఆపరేషన్ 1948 సెప్టెంబరు 13న ప్రారంభమై 17న ముగిసింది.

ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ పరాక్రమ్, ఆపరేషన్ సిందూర్ గురించి కీలకాంశాలతోపాటు వీటి గురించి వివిధ పోటీపరీక్షల్లో అడిగిన ప్రశ్నల తీరు ఎలా ఉంది? జవాబులతో సహా రూపొందించిన ఈబుక్‌తో పాటు జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన టాపిక్స్‌పై ఈబుక్స్, మంత్లీ కరెంట్ అఫైర్స్, ప్రాక్టీస్ టెస్ట్స్ 'ఈనాడు ఈప్రతిభ జనరల్ నాలెడ్జ్ & కరెంట్ అఫైర్స్ కోర్సు'లో అందుబాటులో ఉన్నాయి. వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉత్ప్రేరణ - రకాలు

రసాయన చర్యలో వినియోగించే చర్యా మిశ్రమానికి బాహ్య పదార్థాన్ని కలిపి, చర్య వేగాన్ని పెంచే ప్రక్రియను ఉత్ప్రేరణ (Catalysis) అంటారు. ఇలా కలిపిన బాహ్య పదార్థాన్ని ఉత్ప్రేరకం (Catalyst) అంటారు. రసాయన చర్యలో తాను వినియోగం చెందకుండా చర్యా వేగాన్ని పెంచే ఇతర పదార్థమే ఉత్ప్రేరకం. వీటిలోని రకాలు, వాటి చర్యలు, అభిలాక్షణిక ధర్మాలు తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.



ఉత్ప్రేరణ రకాలు

ఉత్ప్రేరకం భౌతిక స్థితి, క్రియాజనకాల భౌతిక స్థితుల ఆధారంగా ఉత్ప్రేరణాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. సజాతి ఉత్ప్రేరణ 2. విజాతి ఉత్ప్రేరణ

ఉత్ప్రేరకం అభిలాక్షణిక ధర్మాలు

ఉత్ప్రేరకం చర్య వేగాన్ని మారుస్తుంది తప్ప చర్యను ప్రారంభించదు.

- ఉత్ప్రేరకం చర్యలో వినియోగం కాదు. రసాయనికంగా ఎలాంటి శాశ్వత మార్పు చెందదు.
- ఒక రసాయన చర్య వేగాన్ని పెంచేందుకు కొద్దిపాటి పరిమాణంలో ఉత్ప్రేరకం సరిపోతుంది.

స్వయం ఉత్ప్రేరణ చర్యలు

చర్యలో ఏర్పడే ఒక మధ్యస్థ పదార్థమే చర్యకు ఉత్ప్రేరకంగా పనిచేసే దృగ్విషయాన్ని స్వయం ఉత్ప్రేరణ అంటారు. ఈ రకం ఉత్ప్రేరకాన్ని స్వయం ఉత్ప్రేరకం అంటారు.

ఉత్ప్రేరణ - ఉదాహరణలు, విజాతి ఉత్ప్రేరణ, ద్రవ ప్రావస్థలో చర్యలకు ఉదాహరణలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Non-Teaching Jobs

The Indian Institute of Science Education and Research (IISER), Mohali, invites applications to fill non-teaching positions across various departments on a regular basis. The total number of Posts is 40. The application fee is Rs.1,298. Eligible candidates can apply online before 15 June 2026.

Engineer Posts

The Rail Land Development Authority (RLDA), under the Ministry of Railways, Government of India, is inviting applications to fill Site Engineer posts on a contractual basis for its projects located across the country. The total number of posts is 40. The last date for receipt of online applications is 22 May 2026.

Did You Apply..?

Today (May 6) is the last date for the following Jobs

- 18 Junior Resident Jobs at IGIMS Patna. ***Qualifications:*** MBBS.
- 59 Junior Engineer Jobs at NMDC Hyderabad. ***Eligibility:*** Diploma in Mining Engineering.
- 24 Non-Executive Posts in MECON Limited. ***Eligibility:*** Intermediate of The ICAI/ICMAI, BBA.
- 11 Junior Engineer Posts in Reserve Bank of India. ***Eligibility:*** Diploma or Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams
English
Fillers

Directions (Qs. 1 - 13): *Here, a sentence is given with one or two blank spaces, indicating that those words have been omitted from it. Select the word/words that fit in the blank(s), thereby making the sentence meaningful and grammatically correct.*

1. The government's subsidy reforms aim to .... fiscal burden while .... targeted benefits to the needy.
A) increase, denying
B) reduce, ensuring
C) expand, delaying
D) complicate, restricting
E) ignore, withdrawing

2. The company's aggressive expansion strategy may .... short-term profits but could .... long-term sustainability.
A) boost, threaten B) damage, secure
C) reduce, strengthen
D) stabilize, enhance
E) limit, guarantee

3. Strict data protection laws are essential to .... user privacy and .... misuse of personal information.
A) violate, encourage
B) ignore, permit
C) safeguard, prevent
D) weaken, allow
E) question, promote

4. The sudden depreciation of the currency may .... import costs and .... inflationary pressures.
A) reduce, ease B) lower, control
C) stabilize, weaken
D) increase, intensify
E) balance, neutralize

5. The audit report failed to .... key discrepancies, thereby .... doubts about the company's transparency.
A) highlight, raising
B) conceal, eliminating
C) ignore, reducing
D) justify, removing
E) approve, settling

6. To remain competitive, startups must .... innovation and .... quickly to changing market dynamics.
A) resist, delay B) ignore, hesitate
C) discourage, avoid
D) restrict, struggle
E) embrace, adapt

7. The policy seeks to .... income inequality by .... access to quality education.
A) widen, limiting
B) ignore, reducing
C) deepen, restricting
D) reduce, expanding
E) increase, controlling

8. The bank's failure to comply with regulations may .... penalties and .... its reputation.
A) invite, damage
B) avoid, protect
C) reduce, strengthen
D) eliminate, enhance
E) prevent, improve

9. The rise of fintech companies has .... traditional banking models and .... the pace of digital transformation.
A) strengthened, slowed
B) complemented, reduced
C) disrupted, accelerated
D) supported, weakened
E) stabilized, limited

10. Effective leadership requires the ability to .... complex situations and .... informed decisions under pressure.
A) avoid, delay
B) misjudge, postpone
C) simplify, ignore
D) complicate, defer
E) analyze, make

11. The central bank's timely intervention helped .... liquidity concerns and .... confidence in the financial markets.
A) aggravate, destroy
B) alleviate, restore
C) ignore, weaken
D) delay, question
E) complicate, diminish

12. The company's inability to .... market trends resulted in poor planning and .... losses over time.
A) anticipate, mounting
B) follow, reducing
C) predict, stabilizing
D) observe, minimizing
E) analyze, limiting

13. The regulator imposed strict norms to .... financial irregularities and .... transparency across institutions.
A) promote, obscure
B) curb, enhance
C) ignore, reduce
D) support, weaken
E) justify, conceal

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*



అరుణాచల్‌లో కనిపించిన 'అటవీ రైతు'

ఇటానగర్: తూర్పు హిమాలయాల జీవవైవిధ్య హాట్ స్పాట్‌గా ఉన్న అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు సియాంగ్ జిల్లా పరిధిలో గల పాసీఘాట్‌లో చాలాకాలం తర్వాత నలుపు, తెలుపు రంగుల 'హార్న్ బిల్' పక్షి కనిపించింది. ఈ ప్రాంతంలో ఉన్న ఆరోగ్యకరమైన అటవీ పర్యావరణ వ్యవస్థకు ఇది సూచికగా అధికారులు పేర్కొన్నారు. అటవీ కార్యాలయ సమీపంలో ఆహారం కోసం వెదుకుతున్న ఈ పక్షిని స్థానికుడైన బిస్వజిత్ తాయేంగ్ గుర్తించినట్లు వెల్లడించారు. సుదూర ప్రాంతాలకు విత్తనాల వ్యాప్తి ద్వారా అటవీ విస్తరణలో కీలకపాత్ర పోషిస్తూ జీవ వైవిధ్య పరిరక్షణకు ఈ పక్షి దోహదం చేస్తుంది. అందుకే దీన్ని 'అటవీ రైతు' అంటారు. సుదీర్ఘ విరామం తర్వాత ఈ పక్షి తిరిగిరావడం స్థానిక ఆవాస పరిస్థితుల సానుకూలతను చాటుతోందని అటవీ అధికారులు చెప్పారు.

కేరళ తదుపరి సీఎం ఎవరు?

- సంప్రదింపులు ప్రారంభించిన కాంగ్రెస్



వి.డి.సతీశన్ రమేశ్ చెన్నితాల కె.సి.వేణుగోపాల్

తిరువనంతపురం: కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు నేతల మధ్య సంప్రదింపులు మొదలయ్యాయి. 'తమ'పై ప్రజలు తిరిగి నమ్మకం ఉంచారంటూ పలువురు సీనియర్ నేతలు నర్మగర్భ ప్రకటనలతో మనసులో మాటల్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం యత్నాల్ని ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి పదవి రేసులో గత శాసనసభలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన వి.డి. సతీశన్, సీనియర్ నాయకుడు రమేశ్ చెన్నితాల, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యుడు కె.సి. వేణుగోపాల్‌లు ఉన్నారు. ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియలో భాగంగా అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లను పరిశీలకులుగా కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఐయూఎంఎల్‌తో పాటు ఇతర భాగస్వామ్య పక్షాలతోనూ ఈ బృందం సమాలోచనలు జరపనుంది. అయితే సొంతంగా 63 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్, పదవుల పంపకం విషయంలో కూటమి సభ్యుల ఒత్తిడికి తలొగ్గే అవకాశం ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ప్రైవేటు వాహనంలో వెనుదిరిగిన విజయన్

శాసనసభ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ కూటమి ఓడిపోయిన నేపథ్యంలో కణ్నూర్ నుంచి తిరువనంతపురానికి విమానంలో వచ్చిన కేరళ సీఎం పినరయి విజయన్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి అధికారిక వాహనంలో కాకుండా ఒక ప్రైవేటు వాహనంలో సామాన్యునిలా వెళ్లారు. ఎలాంటి భద్రతా బలగాల తోడు లేకుండా ప్రైవేటు వాహనం ఎక్కి ఇంటికి వెళ్లిపోయిన ఆయన వెంట భార్య, కుమార్తె, కొందరు వామపక్ష నాయకులు ఉన్నారు. విమానం దిగిన వెంటనే ఆయన అక్కడి విలేకరుల వైపు చూసి చిరునవ్వు చిందించారు. వారి వైపు చేయి ఊపుతూ వెళ్లిపోయారు. ఆయనతో ముచ్చటించేందుకు విలేకరులు చేసిన ప్రయత్నం ఫలించలేదు.



భారత్ పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం మంగళవారం బిహార్‌లోని బుద్ధగయలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఓ దేవాలయాన్ని సందర్శించి మొక్క నాటారు

ఇద్దరు ఆడ, ఇద్దరు మగ.. ఒకే కాన్పులో నలుగురు

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని శ్యోపుర్ జిల్లాలో ఒక మహిళ మొదటి ప్రసవంలో ఒకేసారి నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. నెలలు నిండక ముందే పుట్టిన ఈ శిశువుల్లో ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉండటం విశేషం. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు సివిల్ సర్జన్ డాక్టర్ ఆర్.బి. గోయల్ తెలిపారు. తహసీల్ సమీపంలో ఉన్న భైరుపురా గ్రామానికి చెందిన పూజా సుమన్‌కు ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున జిల్లా ఆసుపత్రిలో ప్రసవం చేయగా.. గంట వ్యవధిలో ఆమె నలుగురు పిల్లలకు జన్మనిచ్చారు. ప్రత్యేక వైద్యబృందం ఆ శిశువులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో సిజేరియన్ చేస్తారని,



ఈ ప్రసవం సహజ పద్ధతిలోనే జరిగిందని వైద్యులు తెలిపారు. పిల్లలు ఒక్కొక్కరు సుమారు కిలో బరువు ఉన్నారని, ఇది సాధారణ బరువు కంటే తక్కువని చెప్పారు. "ఇది దేవుడిచ్చిన వరం" అని పిల్లల తండ్రి హుకుమ్ సుమన్ ఆనందం వ్యక్తం చేశారు.

'బారామతి'లో సునేత్రా పవార్ రికార్డు

2.18 లక్షల ఓట్ల తేడాతో గెలుపు

దిల్లీ: మహారాష్ట్రలోని బారామతి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎన్సీపీ అధ్యక్షురాలు సునేత్రా పవార్ 2,18,969 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. భారత దేశ ఎన్నికల చరిత్రలో ఓ శాసనసభ స్థానంలో ఈ స్థాయిలో మెజారిటీ రావడం ఇదే తొలిసారి. గత రికార్డు భాజపాకు చెందిన సునీల్ కుమార్ శర్మ పేరిట ఉంది. ఆయన 2022లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సాహిబాబాద్ నుంచి 2.14 లక్షల ఓట్లతో గెలుపొందారు. సునేత్రా పవార్ భర్త అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ఇటీవల మరణించడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రధాన పార్టీలు.. ఈ ఉప ఎన్నికలో అభ్యర్థులను నిలబెట్టలేదు. కొందరు స్వతంత్రులు మాత్రమే పోటీ చేశారు.

ఈడీ, ఐటీ దాడులతో... పెట్టుబడుల మందగమనం

దేశంలో వేతన వృద్ధి సంక్షోభం: కాంగ్రెస్

దిల్లీ: మోదీ పాలనలో దేశంలో ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు మందగించాయని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. వస్తు వినియోగ డిమాండ్ సన్నగిల్లిన కారణంగా వేతనాలు స్తంభించి సంక్షోభ పరిస్థితులు తలెత్తడం దీనికి ఒక కారణమని ఆ పార్టీ పేర్కొంది. దేశంలో సాగుతున్న ఈడీ-సీబీఐ-ఐటీ దాడుల రాజ్యం ఇందుకు మరో కారణమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ తెలిపారు. "జీడీపీ నిజ వృద్ధిని సాధించకుండా నిరోధిస్తున్న మౌలిక సమస్య అయిన కార్పొరేట్ పెట్టుబడుల మందగమనాన్ని మా పార్టీ కొంత కాలంగా లేవనెత్తుతోంది. పన్నులు తగ్గించారు, వ్యాపార నిర్వహణ గణనీయంగా సులభమైంది. అయినా ప్రైవేటు పెట్టుబడులు పెరగడంలేదు. కోవిడ్-19 అనంతరం దేశంలోని అతిపెద్ద కార్పొరేట్ కంపెనీల లాభాలు 30.8 శాతం మేరకు పెరిగాయి. కానీ ఆ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి నిరాకరిస్తున్నాయి. దీనికి అనేక కారణాలున్నాయి. వేతనాల వృద్ధిలో నెలకొన్న స్తబ్ధత కారణంగా తగ్గిపోయిన వినియోగ డిమాండ్ అందులో ఒకటి. ఈడీ-సీబీఐ-ఐటీ దాడుల రాజ్యం వ్యాపారవేత్తల్లో భయాన్ని నింపి వాణిజ్య వాతావరణంలో అనిశ్చితిని సృష్టించింది" అని ఆయన ఆరోపించారు.

రాహుల్ పేరిట కాంగ్రెస్ నేతలకు రూ.కోట్ల టోకరా: మోసగాడి అరెస్టు

దేహరాదూన్: ట్రూకాలర్ ప్రొఫైల్ సాయంతో తాను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వ్యక్తిగత కార్యదర్శినంటూ, పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు, పార్టీ పదవులు ఆశిస్తున్న వారి నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన ఒక డిజిటల్ మోసగాణ్ని ఉత్తరాఖండ్ పోలీసులు పట్టుకున్నారు. ఉత్తరాఖండ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకురాలు భావనా పాండే రాయ్‌పుర్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 3న ఇచ్చిన ఫిర్యాదు ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేసింది. పార్టీలో పెద్ద పదవి ఇప్పిస్తానంటూ నిందితుడు తన నుంచి రూ 25 లక్షలు తీసుకున్నాడని ఆమె ఫిర్యాదు చేశారు. అమృత్‌సర్ నివాసి అయిన నిందితుడు గౌరవ్ కుమార్ తనకు డబ్బులు ముట్టజెబితే పదవులు, పార్టీ టికెట్లు ఇప్పిస్తానని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలకు, టికెట్ ఆశావహులకు టోకరా వేశాడని పోలీసులు తెలిపారు. తన పేరు కనిష్క్ సింగ్ అనీ, తాను రాహుల్ గాంధీ వ్యక్తిగత కార్యదర్శినని నిందితుడు చెప్పుకున్నాడని దర్యాప్తులో తేలినట్టు వారు వివరించారు. వివిధ వెబ్‌సైట్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఉత్తరాఖండ్, రాజస్థాన్, బిహార్‌లలో నిందితుడు ఈ అక్రమాలకు పాల్పడ్డాడని వివరించారు. బాధితుల నుంచి డబ్బులు ముట్టాక నిందితుడు వారి నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ ఎత్తడం ఆపేశాడని తెలిపారు.

శ్వేతసౌధం సమీపంలో కాల్పులు

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేతసౌధం సమీపంలో మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఓ సాయుధుడు భద్రతా సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో భద్రతా సిబ్బంది అతడిపై ఎదురుకాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆగంతకుణ్ని సమీప ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది కొంతసేపు శ్వేతసౌధాన్ని మూసేశారు. ఈ ఘటన జరగడానికి ముందే ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కాన్వాయ్ ఆ రోడ్డులో వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో జరిగిన కాల్పులకు తాజా ఘటనతో ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కాల్పుల్లో గాయపడిన మరో బాలుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

కోల్‌కతా డీసీపీపై ఈడీ లుకౌట్ నోటీసు

కోల్‌కతా: ఒక మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోల్‌కతా డిప్యూటీ కమిషనర్ శాంతను సిన్హా బిశ్వాస్ కోసం లుకౌట్ నోటీసు జారీ చేసింది. తాము జారీ చేసిన పలు సమన్లను బేఖాతరు చేసినందునే డీసీపీకి లుకౌట్ నోటీసు జారీ చేశామని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. శాంతను సిన్హా బిస్వాస్ దేశం విడిచి వెళ్లిపోయే ప్రయత్నం చేయకుండా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు తదితర రవాణా సదుపాయాల వద్ద లుకౌట్ నోటీసులు జారీ చేశామని ఈడీ ప్రకటించింది. "గతంలో ఆయనకు ఐదుసార్లు సమన్లు జారీ చేశాం. ఒక్కసారీ మా సమక్షంలో హాజరు కాలేదు. నిరంతర సహాయ నిరాకరణకు పాల్పడుతున్న ఆయన విచారణ నుంచి తప్పించుకోవడం కోసం దేశం విడిచి పారిపోయే అవకాశం ఉందని అనుమానిస్తున్నాం' ' అని ఈడీ అధికారి ఒకరు వెల్లడించారు.

బెంగాల్లో ప్రజాస్వామ్యం హైజాక్.. పంజాబ్‌లో అడ్డుకుంటాం: కేజ్రీవాల్

దిల్లీ, చండీగఢ్: పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అవకతవకలతో భాజపా ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసిందని, పంజాబ్‌లో మటుకు ఆ పార్టీ విజయ రథానికి అడ్డుకట్ట వేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. కపూర్థలా హౌస్‌లో సమావేశమైన పంజాబ్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి మంగళవారం ఆయన మాట్లాడారు. రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలే ప్రధాని మోదీకి చివరి ఎన్నికలని, ఆ తర్వాత మోదీ సర్కారు కూలిపోతుందన్నారు. "దిల్లీలో ఏమిచేశారో అదే పని పశ్చిమ బెంగాల్‌లోనూ వాళ్లు చేశారు. నా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లను తొలగించారు" అని ఆరోపించారు. బెంగాల్ విజయం తర్వాత పంజాబ్‌లోనూ అధికారం హస్తగతం చేసుకుంటామని భాజపా నేతలు చెబుతున్నారని, పంజాబ్ అంటే ఎవరంటేవారు నడిపే ట్రక్కు కాదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. భాజపాను అడ్డుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు పంజాబ్‌పై ఉందని తెలిపారు.

చైనా బాణసంచా పరిశ్రమలో పేలుడు

26 మంది మృతి, 61 మందికి గాయాలు

బీజింగ్: చైనాలోని హునాన్ ప్రావిన్సులో ఉన్న ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి 26 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 61 మంది గాయపడ్డారని అధికారులు మంగళవారం తెలిపారు. బాణసంచా తయారీకి ప్రసిద్ధి చెందిన లియుయాంగ్ నగరంలో జరిగిన ఈ పేలుడు వల్ల భారీ ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. 480 మందికిపైగా రక్షణ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టిన అధికారులు ప్రమాద సమయంలో మరిన్ని పేలుళ్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రమాదానికి కారణాలను గుర్తించి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశించారు.

భారతీయ నౌక సిబ్బందికి పాక్ సాయం!

ఇస్లామాబాద్: అరేబియా సముద్రంలో చిక్కుకుపోయిన భారతీయ నావికాసిబ్బందికి పాకిస్థాన్ నౌకాదళం మానవీయ సాయం అందించినట్టు తెలిసింది. ఈ సహాయ చర్యల్లో పాకిస్థాన్ సముద్ర భద్రతా సంస్థ (పీఎంఎస్ఏ) పాల్గొన్నట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయని "డాన్"పత్రిక వెల్లడించింది. ముంబయిలోని సముద్ర సహాయ సమన్వయ కేంద్రం చేసిన అభ్యర్థన మేరకు ఆరుగురు భారతీయులను, ఒక ఇండోనేసియన్ జాతీయుణ్ని పీఎంఎస్ఏ కాపాడిందని పాక్ నౌకాదళం పేర్కొన్నట్టు పత్రిక వెల్లడించింది. ఒమన్ నుంచి భారత్‌వైపు వెళ్తున్న ఎంవీ గౌతమ్ అనే నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని సిబ్బంది పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. భారత నౌకా సిబ్బందికి అత్యవసర సాయంగా పీఎంఎస్ఏ ఆహారం, ఔషధాలు, సాంకేతిక సాయం అందించిందని పత్రిక వెల్లడించింది.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాళ్ల గుట్టురట్టు

ఉత్తరాఖండ్‌లో ఐదుగురి అరెస్టు

దిల్లీ: ఆన్‌లైన్ పెట్టుబడులు, టాస్క్ ఆధారిత మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠా గుట్టును దిల్లీ పోలీసులు ఛేదించారు. ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్‌లో నలుగురు టీనేజర్లు సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు సరఫరా చేసే సిండికేట్‌లో వీరు భాగమని పేర్కొన్నారు. న్యూ అశోక్‌నగర్‌కు చెందిన శశి రంజన్ భారతి ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ అరెస్టులు జరిగాయి. డిజిటల్ మార్కెటింగ్ నిపుణులుగా నటించిన ఈ మోసగాళ్లు అధిక లాభాలు వస్తాయని చెప్పి నమ్మించి బాధితుడిని ప్రలోభపరిచారు. అనేక విడతలు డబ్బు పంపిన తర్వాత శశి రంజన్ మోసపోయినట్లు గ్రహించారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం రూ.5 కోట్లు అడిగారు

తృణమూల్‌పై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆరోపణ

కోల్‌కతా: ఎమ్మెల్యే టికెట్ కావాలంటే రూ.5 కోట్లు చెల్లించాలని తనను పార్టీ అడిగిందని తృణమూల్ కాంగ్రెస్‌పై టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్ర ఆరోపణలు చేశారు. తాను డబ్బు ఇవ్వడానికి నిరాకరించినందునే శిబ్‌పుర్ నియోజకవర్గ టికెట్ తనకు ఇవ్వలేదని అన్నారు. తృణమూల్ ఓటమిపై స్పందిస్తూ.. ఈ పరాజయం తనను ఆశ్చర్యపరచలేదని, పార్టీ అవినీతిమయమైందని, ఏ రంగంలోనూ అభివృద్ధి జరగలేదని అన్నారు.

1,475 మంది సీఏల పేర్లను తొలగించాం: ఐసీఏఐ

ఈనాడు, దిల్లీ: నిర్దేశిత ఫీజు చెల్లించలేదన్న కారణంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ).. 1,475 మంది ఛార్టర్డ్ అకౌంటెంట్ల(సీఏల) సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈమేరకు ఐసీఏఐ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఛార్టర్డ్ అకౌంటెంట్స్ యాక్ట్-1949లోని సెక్షన్ 20(1)(సి) అధికారాలను ఉపయోగించి ఈ 1,475 మంది పేర్లను 2023 నవంబర్ 1 నుంచి మెంబర్ షిప్ రిజిస్టర్ నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొంది.



అత్యంత ప్రమాదకరమైన హంటా వైరస్ ప్రబలి రిపబ్లిక్ ఆఫ్ కేప్ వెర్డ్ తీరంలో నిలబడిపోయిన అర్జెంటీనాకు చెందిన క్రూయిజ్ నౌక ఎంవీ హోండియస్. ధ్రువ ప్రాంత విహారం చేపట్టిన ఈ నౌక ప్రయాణికుల్లో ముగ్గురు వైరస్ సోకి మరణించారు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఓడలోని 150 మంది ప్రయాణికులు తమ దేశంలోకి ప్రవేశించేందుకు కేప్ వెర్డ్ దేశ ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

యుద్ధంలో పాక్‌పై భారత్‌దే ఆధిపత్యం

- ఆస్ట్రియా విశ్లేషకుడు టామ్ వ్యాఖ్య

ఈటీవీ భారత్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో ఉన్న ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేసిన దాడులపై ఆస్ట్రియా వైమానిక యుద్ధ విశ్లేషకుడు, చరిత్రకారుడు టామ్ కూపర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్‌పై భారత్ దాడులను స్పష్టమైన సైనిక విజయంగా ఆయన అభివర్ణించారు. భారత్ సైనికపరంగా పాక్‌ను మించిపోవడమే కాకుండా తన ప్రణాళికాబద్ధమైన, కచ్చితమైన ప్రతిస్పందన ద్వారా బలమైన వ్యూహాత్మక సందేశాన్ని దాయాది దేశానికి ఇచ్చిందని, పూర్తి ఆధిపత్యం చెలాయించిందని ఓ ఇంటర్వ్యూలో టామ్ వ్యాఖ్యానించారు. "పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ అత్యంత కచ్చితమైన ప్రతీకార దాడులు చేసింది. భారత్ చేరుకోలేదని భావించిన అసాధ్యమైన లక్ష్యాలనూ ఛేదించింది. దీంతో తీవ్రంగా నష్టపోయిన పాక్ రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లింది. భారత్ కార్యాచరణ సామర్థ్యం దాని వ్యూహాత్మక విధానంలో ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. పాకిస్థాన్‌లోని దేనిపైనైనా దాడి చేయగలమని, తమను ఆపలేరని పాక్‌కు భారత్ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. దీనికి ప్రతిగా పాక్ చేసిన దాడులను భారత రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నాయి" అని టామ్ పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించేంత స్థాయి పాక్‌కు లేదని ఆయన అభిప్రాయపడ్డారు.



రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయిన రాజ్యసభ సభ్యులు అశోక్ మిత్తల్, రాఘవ్ చద్దా, రాజిందర్ గుప్తా, సందీప్ పాఠక్ ★ పంజాబ్ సీఎం భగవంత్ మాన్

రాష్ట్రపతి భవన్‌కు 'ఆప్' పంచాయతీ

- ముర్ముతో వేర్వేరుగా భేటీ అయిన పంజాబ్ సీఎం, రాఘవ్ చద్ధా బృందం

దిల్లీ, చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి ఇటీవల బయటకు వెళ్లిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు భాజపాలో చేరడం, తదనంతర పరిణామాల పంచాయతీ రాష్ట్రపతి భవన్‌కు చేరింది. ఆ ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ నుంచి రాజ్యసభకు వెళ్లినవారే కావడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎంపీల రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. వారిపై చర్య తీసుకోవాలంటూ దాదాపు 90 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేసిన ఓ వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. రాష్ట్ర శాసనసభలో ఇద్దరు సభ్యులున్న భాజపాకు ఇప్పుడు ఆరుగురు రాజ్యసభ సభ్యులు ఉండటం ఎలా సాధ్యమని ముర్ము దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రపతి భవన్ నుంచి బయటకు వచ్చాక మాన్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ నిపుణులతో సంప్రదించి దీనిపై స్పందిస్తానని రాష్ట్రపతి హామీ ఇచ్చారన్నారు. "ఆప్‌లో కొనసాగడం ఆ ఎంపీలకు ఇష్టం లేకపోతే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాల్సింది. ఇటువంటి వాటిని అడ్డుకొనేందుకు రాజ్యాంగంలో 'రీకాల్' వ్యవస్థ ఉండాలి" అని తెలిపారు. ఎంపీల పార్టీ మార్పిడిని రాజ్యాంగ విరుద్ధం, హత్యగా మాన్ అభివర్ణించారు. ✦ మరోవైపు.. ఆప్ నుంచి భాజపాలో చేరిన ఎంపీల బృందంలో కీలక సభ్యుడైన రాఘవ్ చద్దా సైతం మంగళవారం భగవంత్ మాన్ కంటే ముందే రాష్ట్రపతిని కలిసి ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. పంజాబ్ సర్కారు తమపై రాజకీయ ప్రేరేపిత వేధింపులకు పాల్పడుతోందని ఫిర్యాదు చేశారు. పోలీస్, విజిలెన్స్, పొల్యూషన్ బోర్డు వంటి సంస్థల దుర్వినియోగంతో తమపై ఒత్తిడి తీసుకువస్తూ ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని తెలిపారు.

నేడు అస్సాం సీఎం రాజీనామా

గువాహటి: అస్సాంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ బుధవారం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిసి తన రాజీనామాను సమర్పించనున్నారు. భాజపా కేంద్ర పరిశీలకులు జేపీ నడ్డా, నయాబ్ సింగ్ సైనీ సమక్షంలో కొత్తగా ఎన్నికైన పార్టీ ఎమ్మెల్యేల సమావేశం జరగనుందని హిమంత తెలిపారు. సమావేశ తేదీ ఖరారు కాలేదని అన్నారు.

మాదక ద్రవ్యాల నావపై అమెరికా దాడి.. ఇద్దరి మృతి

వాషింగ్టన్: కరీబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాలు మోసుకెళ్తున్న ఒక పడవపై తాము జరిపిన దాడిలో ఇద్దరు మరణించారని అమెరికా సైన్యం ప్రకటించింది. లాటిన్ అమెరికా సముద్ర జలాల్లో సాగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ట్రంప్ యంత్రాంగం గత సంవత్సరం సెప్టెంబరు నుంచీ నిర్వహిస్తున్న దాడుల్లో ఇప్పటి వరకూ మొత్తం 188 మంది మరణించారు. తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోనూ అమెరికా ఇలాంటి దాడులే నిర్వహిస్తోంది. అమెరికా యంత్రాంగం తీవ్ర చర్యలు తీసుకుంటున్నా పశ్చిమార్ధగోళంలో సాగుతున్న మాదక ద్రవ్యాల ఉగ్రవాదం (నార్కోటెర్రరిజం) సద్దుమణగడం లేదు. అయితే అమెరికా దాడులు నిర్వహించిన పడవల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సాగుతోందన్న సాక్ష్యాధారాలేవీ అమెరికా బహిర్గతం చేయడం లేదు. సోమవారం జరిగిన తాజా దాడిలో స్మగ్లింగ్ మార్గాలపై గురిపెట్టామని అమెరికా సైన్యం సదరన్ కమాండ్ విభాగం పునరుద్ఘాటించింది. లాటిన్ అమెరికాలోని మాదకద్రవ్యాల ముఠాలపై తాము యుద్ధం సాగిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

సీబీఐ డీఎస్పీపై దర్యాప్తు సంస్థ కేసు

దిల్లీ: బ్యాంకింగ్, సెక్యూరిటీస్ విభాగంలో పనిచేస్తున్నప్పటి నుంచే లంచం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన సంస్థలోని ఓ ఉన్నతాధికారిపై సీబీఐ తాజాగా మరో కేసు నమోదు చేసింది. సీబీఐలోని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు(డీఎస్పీ)పై ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో కేసు నమోదైనట్లు అధికారులు మంగళవారం తెలిపారు. 2021-2024 మధ్య డీఎస్పీ, ఆయన భార్య మొత్తం రూ. 98.33 లక్షల ఆస్తులను కూడబెట్టారని, ఇది వారి వాస్తవ సంపాదనకు 87 శాతం అధికమని పేర్కొన్నారు. విచారణ ఎదుర్కొంటున్న కంపెనీలు, వ్యక్తుల నుంచి రూ. 5 కోట్లు లంచం తీసుకున్నారనే ఆరోపణలతో 2024లో నమోదైన కేసులో డీఎస్పీ నిందితుడిగా ఉన్నారు.

24 గంటల్లోనే తృణమూల్ ఖతం: సువేందు

ఈటీవీ భారత్: బెంగాల్‌లో ఓటమి పాలైన తృణమూల్ కాంగ్రెస్ 24 గంటల్లోనే ఖతమవుతుందని భాజపా నేత సువేందు అధికారి జోస్యం చెప్పారు. అవినీతిమయమైన ఆ కుటుంబ పార్టీకి ఎలాంటి సిద్ధాంతాల్లేవని విమర్శించారు. నందిగ్రామ్‌లోని హిందూ ప్రజలే నన్ను మళ్లీ గెలిపించారు. ఇక్కడ ముస్లిం ఓట్లన్నీ తృణమూల్‌కే పడ్డాయి. అందువల్ల నా మార్గం సరైనదే. ఐ-ప్యాక్, కొందరు పోలీసులు, కొందరు రౌడీలు, ముఖ్యంగా ఒక వర్గం గూండాల అండతో నడిచే పార్టీ తృణమూల్. ఆ పార్టీ కచ్చితంగా అంతమైపోతుంది. రాసిపెట్టుకోండి' సువేందు వ్యాఖ్యానించారు.

గుండు చేయించుకున్న కొత్త ఎమ్మెల్యే

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 2021 ఫలితాల అనంతరం హత్యకు గురైన కార్యకర్తలకు నివాళిగా బహరంపుర్ నుంచి కొత్తగా ఎన్నికైన భాజపా ఎమ్మెల్యే సుబ్రత మైత్రా మంగళవారం గుండు చేయించుకున్నారు. అప్పట్లో పలువురు భాజపా కార్యకర్తలను తృణమూల్ గూండాలు హత్య చేశారని ఆరోపించారు. వారి త్యాగాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటామని స్పష్టం చేశారు.

7 జిల్లాల్లో ఖాతా తెరవని తృణమూల్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తృణమూల్ 7 జిల్లాల్లో ఖాతానే తెరవలేదు. ఈ జిల్లాల్లోని 68 నియోజకవర్గాల్లో భాజపా ప్రభంజనం కనిపించింది. బెంగాల్‌లో మొత్తం 23 జిల్లాలున్నాయి. తూర్పు మేదినీపుర్, దార్జీలింగ్, కాలింపాంగ్, జల్పాయ్‌గుడీ, అలీపుర్దువర్ తదితర జిల్లాల్లో పట్టును భాజపా నిరూపించుకుంది. ఉత్తర బెంగాల్‌లోని 54 సీట్లలో 40 చోట్ల భాజపా గెలిచింది. ✦ అటవీ ప్రాంతం అధికంగా ఉన్న మధ్య బెంగాల్‌లోని పురులియా, బంకురా, ఝార్‌గ్రాంలలో తృణమూల్‌కు ఒక్క సీటూ దక్కలేదు. ✦ 35 మంది తృణమూల్ మంత్రుల్లో 22 మంది ఓటమి పాలయ్యారు.

సీపీఎంకు ఓట్లు తగ్గినా ఒక సీటు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు సుదీర్ఘ కాలం అధికారం చెలాయించిన లెఫ్ట్ పార్టీలు కుంచించుకుపోతున్నాయి. గత ఎన్నికల్లో 4.73 శాతం ఓట్లు సాధించిన ఆ కూటమి ఈసారి మరింత తగ్గి 4.45 శాతానికి పరిమితమైంది. అయితే గత ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కించుకోని ఆ కూటమి ఈసారి ఒక చోట గెలిచి అసెంబ్లీలో ప్రాతినిధ్యం సాధించింది. ముర్షీదాబాద్ జిల్లాలోని డోంకాల్ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి విజయం సాధించారు. మరో రెండు చోట్ల రెండో స్థానంలో నిలిచింది.

బెంగాల్ సెక్రటేరియట్‌లో సంబరాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంతో కోల్‌కతాలోని సెక్రటేరియట్ ఉద్యోగులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. కాషాయ జెండాలు పట్టుకుని జైశ్రీరాం, భారత్ మాతా కీ జై నినాదాలు చేశారు.

ఒబామా సంసారంలో ట్రంప్ రచ్చ!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భార్యా పిల్లలతో సుఖంగా కాలం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కుటుంబంలో రచ్చకు కారణమవుతున్నారా? అవునని స్వయంగా ఒబామా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంగీకరించారు. ఒకవైపు ట్రంప్ పరిపాలన సాగించినంతకాలం క్రియాశీల రాజకీయాల్లో కొనసాగాలని ఒబామాపై డెమోక్రటిక్ పార్టీ ఒత్తిడి చేస్తోంది. మరోవైపు ఆయన భార్య మిషెల్ ...చేసింది చాలు ఇక రాజకీయాలు మనకొద్దని అంటున్నారు. ఒకవైపు పార్టీ, మరొకవైపు భార్య మధ్య సతమతమవుతున్నారు ఒబామా. "శేష జీవితంలో భర్త మరింత సమయాన్ని తన కోసం కేటాయించాలని ఆమె కోరుకుంటున్నారు. ఇది మా సంసారంలో ఉద్రిక్తతకు దారితీస్తోంది. ఆమె నిరాశకు గురవుతున్నారు" అని ఒబామా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు సాధారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఒబామా కూడా అలాగే ఉండేవారు. ఆయన పనితీరుపై ఎలాంటి వ్యాఖ్యలూ చేసేవారు కాదు. అయితే కాలం గడిచే కొద్దీ ట్రంప్ విధానాలపై మాజీ అధ్యక్షుడు విమర్శలు గుప్పించడం ప్రారంభించారు. దేశ అధ్యక్ష పదవిని వదిలి 16 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా పార్టీ కోసం పనిచేస్తున్న అరుదైన డెమోక్రటిక్ పార్టీ నేతల్లో ఒబామా ఒకరు.

ఇరాన్‌కు పోప్ సాయం: అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: వలసదారులను అగౌరవపరచకూడదనే తన వ్యాఖ్యల ద్వారా పోప్ లియో ఇరాన్‌కు సాయం చేస్తున్నారని, ప్రపంచాన్ని అభద్రతలోకి నెట్టేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇరాన్‌వద్ద అణ్వాయుధం ఉండటం సబబేనని ఆయన అంటున్నారని, అది అంత మంచిది కాదని, ఆయన క్యాథలిక్కులను ప్రమాదంలో పడేస్తున్నారని స్పష్టం చేశారు. సోమవారం ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

నిర్మాత ఆర్‌బీ చౌదరి మృతి పట్ల సీఎం దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: చిత్ర నిర్మాత, సూపర్‌గుడ్ ఫిలిమ్స్ అధినేత ఆర్‌బీ చౌదరి మరణంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డుప్రమాదంలో ఆయన మరణించడం బాధాకరమన్నారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో 90కి పైగా చిత్రాలను చౌదరి నిర్మించారు. ఎంతోమంది నటీనటులకు అవకాశాలు కల్పించారు. ఆయన మరణం చిత్రసీమకు తీరని లోటు' అని సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆర్‌బీ చౌదరి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలల వివరాలు పంపాలని ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గుర్తింపు లేని పాఠశాలల వివరాలను పంపించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం కోరిన మేరకు ఈ వివరాలను నిర్ణీత ఫార్మాట్‌లో పంపించాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సూచించింది. జిల్లాల వారీగా గుర్తింపులేని పాఠశాలల సంఖ్య, గత మూడేళ్లలో గుర్తింపులేని పాఠశాలల మూసివేతకు ఇచ్చిన ఉత్తర్వులు, విధించిన జరిమానాలు, క్రమబద్ధీకరణ కోసం తీసుకున్న చర్యలు తెలిపాలని వెల్లడించింది. గుర్తింపులేని పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య, అలాంటి పిల్లలకు విద్యా సంవత్సరం నష్టపోకుండా తీసుకున్న చర్యలను పేర్కొంటూ వివరాలను సమర్పించాలని సూచించింది.

మంత్రి మనోహర్‌ను పరామర్శించిన మధుకర్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భాజపా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్ మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని నివాసానికి వెళ్లి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. మంత్రి మనోహర్‌ను కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీతోపాటు పలువురు పరామర్శించారు.

త్వరలో ఏపీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్ ఫలితాలు విడుదల

ఈనాడు, అమరావతి: డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టుల ఫలితాలను మూడు, నాలుగు రోజుల్లో ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ రోస్టర్‌పై స్పష్టతనిస్తూ ఉన్నత విద్యాశాఖ ఇటీవల నివేదిక పంపడంతో ఫలితాలు ఇచ్చేందుకు ప్రాసెస్ కొనసాగుతోంది. రాష్ట్రంలో 290 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి 2023 డిసెంబరులో ఏపీపీఎస్సీ ప్రకటన ఇచ్చింది. 2025 జులైలో అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించింది. రిజర్వేషన్ రోస్టర్‌పై స్పష్టత కావాలని గతేడాది నవంబరులో ఉన్నత విద్య కమిషనరేట్‌కు ఏపీపీఎస్సీ దస్త్రం పంపింది. ఇది ఇటీవల ఏపీపీఎస్సీకి చేరింది. ఫలితాలు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ కసరత్తు చేస్తోంది.

కాంట్రాక్టు అధ్యాపకులకు వెయిటేజీపై పరిశీలన

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో బోధన పోస్టుల భర్తీలో ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు వెయిటేజీపై ఉన్నత విద్యాశాఖ ఆలోచన చేస్తోంది. గత కొన్నేళ్లుగా వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు తమకు వెయిటేజీ ఇవ్వాలని కోరుతుండడంతో దీనిపై ఏం చేయాలనే దానిపై పరిశీలన చేస్తోంది. ఏడాదికి 0.5 పాయింట్లు చొప్పున గరిష్ఠంగా ఐదు పాయింట్లు ఇస్తే ఎలా ఉంటుంది? దీన్ని ఎక్కడ అమలు చేయాలి? అనేదానిపై అధ్యయనం చేస్తోంది. విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి ఈ నెల 15న 1,500 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఉన్నత విద్యాశాఖ సిద్ధమవుతోంది. రిజర్వేషన్ రోస్టర్‌పై వర్సిటీలు కసరత్తు చేస్తున్నాయి. గతంలో చేసిన రేషనలైజేషన్ ఆధారంగానే పోస్టులను వర్సిటీల్లోని విభాగాలకు కేటాయించారు. గతంలోలానే సహాయ ఆచార్యుల పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది. మెరిట్‌లో నిలిచిన వారికి వర్సిటీలు ఏర్పాటు చేసిన కమిటీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంపిక ప్రక్రియ వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు.



కుంకీ ఏనుగులకూ ఆధార్..!

డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించిన అధికారులు


పలమనేరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో ఉన్న కుంకీ ఏనుగులకు అధికారులు డీఎన్‌ఏ పరీక్షలు చేయించారు. ఏనుగుల సంరక్షణ, పరిరక్షణ, శాస్త్రీయ అధ్యయనాల నిమిత్తం రెండు రోజుల క్రితం రక్త నమూనాలను సేకరించి దేహ్రాదూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపారు. పరీక్షల ఫలితాల తర్వాత వాటి వివరాలతో ఒక గుర్తింపు కార్డును ఏనుగుకు తగిలిస్తారు. అది ఆధార్ కార్డులా ఉపయోగపడుతుంది. ఈ వివరాలతో జన్యుపరమైన సమస్యలకు వైద్యంతో పాటు వాటి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా సమగ్ర వివరాల కోసం డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు తెలిపారు.

● జయంత్, రంజన్, అభిమన్యు, కృష్ణ, దేవ, వినయ్ అనే ఆరు కుంకీలను కర్ణాటక నుంచి రప్పించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇవన్నీ పలమనేరు క్యాంపులోనే ఉన్నాయి. వీటి ద్వారా అడవిలోని ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా వాటిని మళ్లించడానికి శిక్షణ కూడా ఇచ్చారు. రెండుసార్లు ఏనుగులను మళ్లించే ప్రక్రియ విజయవంతంగా చేశారు.

8 థర్మల్ యూనిట్ల పునరుద్ధరణ

● రూ.750 కోట్లతో పనులు

● మరో 15 ఏళ్లు వినియోగించుకునే అవకాశం



ఈనాడు, అమరావతి: కాలంచెల్లిన థర్మల్ ప్లాంట్ల పునరుద్ధరణ, ఆధునికీకరణకు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఏ) అనుమతించింది. 2030 వరకు ఏ ఒక్క ప్లాంటు మూసేయకూడదని పేర్కొంది. దీంతో జీవితకాలం పూర్తయిన ప్లాంట్లకు రూ.750 కోట్లతో ఆధునికీకరణ పనులను ఏపీ జెన్‌కో చేపట్టింది. 30 ఏళ్లకు పైబడి విజయవాడ వీటీపీఎస్‌లో ఒక్కొక్కటి 210 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 6 యూనిట్లు, కడప ఆర్‌టీపీపీలో 1, 2 యూనిట్ల పునరుద్ధరణ పనులను అధికారులు ప్రతిపాదించారు. అవసరమైన మొత్తాన్ని రుణంగా తీసుకున్నారు. వీటితో సుమారు 1,680 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఆధునికీకరణ పనులతో మరో 15 ఏళ్లు వాటిని వినియోగించుకోవచ్చని అధికారుల అంచనా. ఇవి ఉత్పత్తి చేసే విద్యుత్ 2034 వరకు కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) ద్వారా తీసుకునేందుకు వీలుగా ఏపీఈఆర్‌సీ అనుమతించింది.

మరమ్మతులకు కార్యాచరణ

థర్మల్ యూనిట్లలో ప్రధానంగా కోల్ ప్లాంట్, యాష్ పాండ్, వాటర్ సిస్టమ్‌లో పాడైన పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు ఫ్యూయల్ గ్యాస్ డీసల్ఫరైజేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్దేశించింది. వాటికి భారీ మొత్తంలో ఖర్చు అవుతుంది. దీంతోపాటు అన్ని ప్లాంట్లకు వ్యాక్యూమ్/కంప్రెసర్ సామర్థ్యాన్ని పెంచేలా పనులను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు సీఈఏ నుంచి అనుమతి పొందే ప్రయత్నాలను అధికారులు ప్రారంభించారు. ఈ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలన్నది అధికారుల ఆలోచన.

రూ.750 కోట్లతో అంచనా

2024-25 నుంచి 2028-29 మధ్య (ఐదో నియంత్రిత వ్యవధి)లో పనులు పూర్తి చేసేలా జెన్‌కో ప్రతిపాదనలు రూపొందించింది. వీటీపీఎస్ యూనిట్లకు రూ.525 కోట్లు, ఆర్‌టీపీపీ యూనిట్లకు రూ.225 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇప్పటికే వీటీపీఎస్ స్టేజ్-3 ప్లాంట్‌కు సంబంధించి రూ.60 కోట్లతో యాష్ పాండ్‌ను పనులను జెన్‌కో చేపట్టింది. స్కాడా సిస్టం, డిజిటల్ ఏవీఆర్ సిస్టం పనులను నిర్వహిస్తున్నారు.

గ్రిడ్ భద్రతకు దిగుల్లేదు

రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా గ్రిడ్ బేస్‌లోడ్ నిర్వహించాలి. ప్రస్తుతం థర్మల్, పునరుత్పాదక విద్యుత్ కలిపి సుమారు 21,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. వివిధ మార్గాల్లో సుమారు 10,700 మెగావాట్లు గ్రిడ్ బేస్ లోడ్ కింద అందుతుంది. ప్రస్తుతం డిమాండ్‌కు బేస్‌లో సరిపోతుంది. ఇందులో జీవితకాలం పూర్తయిన యూనిట్ల నుంచి 1,680 మెగావాట్ల విద్యుత్ అందుతోంది.

పోలవరం నిర్వాసితులకు..

అటవీ హక్కుల చట్టం అమలు మాటేంటి?

● ప్రశ్నించిన కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి

● ఉపసంఘం పరిశీలిస్తోందన్న అధికారులు

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులు అవుతున్న గిరిజనులకు ఇతర ప్రాంతాల్లో పునరావాసం కల్పించే క్రమంలో వారి సామాజిక సమతౌల్యం, సహజ జీవన విధానం దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారా? ఏ తెగ గిరిజనులు నిర్వాసితులవుతున్నారో అదే తెగ నివసించే ప్రాంతాలకే వారిని తరలిస్తున్నారా? పునరావాసం తర్వాత వారికి అడవితో అనుబంధం కొనసాగుతుందా? అటవీ హక్కుల చట్టాన్ని ఎలా వర్తింపజేస్తున్నారు?' అంటూ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా ప్రశ్నించారు. ప్రాజెక్టు 11వ పర్యవేక్షక కమిటీ సమావేశం మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన కార్యదర్శి చోప్రా.. నిర్వాసిత గిరిజనులకు కల్పిస్తున్న వసతులు, వారి హక్కుల రక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. గతంలో ఉత్పన్నమైన సమస్యలను ఎలా పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యదర్శి రఘురామ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ కేంద్ర బృందం ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కేంద్ర జలవనరుల శాఖ సహాయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో సంజీవ్ ఓహ్రా తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వకు ముందే పునరావాసం

పోలవరం జలాశయం 2027 జూన్ నాటికి పూర్తవుతుందని, తొలిదశ వరకు నీళ్లు నిల్వ చేయడానికి ముందే నిర్వాసితులకు పునరావాసం కల్పించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు.. రంజనా చోప్రాకు వివరించారు. 'నిర్వాసితులకు అటవీ హక్కుల చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసింది. ఆ కమిటీ చేసే సిఫార్సులను బట్టి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. వివిధ వృత్తి పనుల్లో శిక్షణ ఇస్తున్నాం' అని అభిషేక్ వివరించారు. భూసేకరణ, భూమికి బదులు భూమి ఇవ్వడం, ఇళ్ల నిర్మాణం, కాలనీల్లో వసతుల కల్పనపై అధికారులు చర్చించారు.

కలెక్టర్ల సదస్సులో ఉన్నతాధికారుల క్షేత్ర పర్యటనలపైనా చర్చ

ఈనాడు, అమరావతి: జిల్లా కలెక్టర్ల సదస్సులో వివిధ అంశాలతో పాటు జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు, కార్యదర్శుల క్షేత్ర పర్యటనలపైనా చర్చించనున్నారు. గత సమావేశాల్లో ప్రదర్శించిన స్ఫూర్తిదాయక కార్యక్రమాలు, వాటి అమలు తీరుతో పాటు కొత్త ఆవిష్కరణలకు చోటు కల్పించారు. జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల 7, 8 తేదీల్లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరగనుంది. మొదటిరోజు జీఎస్‌డీపీ, స్వర్ణాంధ్ర పదిసూత్రాలు, వైద్య, విద్య, పెట్టుబడుల ప్రతిపాదనలు, కొత్త ఆవిష్కరణలు, జలధారపై చర్చించనున్నారు. రెండోరోజు ఈ-ఆఫీస్, ప్రజా సంతృప్తి, క్షేత్ర పర్యటనలు, సూపర్ సిక్స్, సంక్షేమ కార్యక్రమాలు, 2026-27 ప్రణాళిక, భూ పరిపాలన, ఆదాయార్జనశాఖలు, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై చర్చిస్తారు. రంగాలకు అనుగుణంగా 15 నుంచి 60 నిమిషాల పాటు నోడల్ అధికారి, కార్యదర్శులు ప్రజెంటేషన్లు ఇస్తారు. అనంతరం 15 నిమిషాలపాటు దానిపై చర్చ జరుగుతుంది.

పొదుపు సంఘాల ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

'స్వయం ఏపీ'తో బ్రాండింగ్: మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: పట్టణ స్వయం సహాయక సంఘాల (పొదుపు సంఘాలు) ఆధ్వర్యంలోని వివిధ ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండింగ్ ద్వారా త్వరలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెటింగ్ చేయనున్నారు. దాదాపు 15 రకాలైన ఆహార వస్తువులు, హస్త కళలు, కుట్లు, అల్లికలు, గృహోపకరణాలు వీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఎండీ, ఇతర అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ మంగళవారం సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధులు మెరుగుపడేందుకు, తలసరి ఆదాయం పెరిగేందుకు 'స్వయం ఏపీ' బ్రాండింగ్ ద్వారా మార్కెటింగ్ దోహదం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి వ్యాపారం మరింత విస్తరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉత్పత్తుల బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాల్లో అమలు చేసే విధానాలను మెప్మా ఎండీ వాకాటి కరుణ మంత్రికి వివరించారు. మెప్మా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇతర కార్యక్రమాల గురించి కూడా ఆమె తెలిపారు.

ద్రవిడ వర్సిటీ ఆధ్వర్యంలో ఏపీ ఎడ్‌సెట్ పరీక్షలు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ఏపీ ఎడ్‌సెట్-2026 పరీక్షను ఈ నెల 8న నిర్వహించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కౌన్సిల్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బాధ్యతను కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి అప్పగించింది. పరీక్షలకు సంబంధించి మార్గదర్శకాలు, విద్యార్థులు, పరీక్షా కేంద్రాల వివరాలను బుధవారం వీసీ ఆచార్య మల్లయ్య, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ అధికారికంగా వెల్లడించనున్నారు.

అనుత్తీర్ణుల్లో తెలుగులోనే 41.3% మంది

● గరిష్ఠంగా సైన్స్‌లో 59.5% మంది ఫెయిల్

● 'పది'లో సగం మంది ఒక్కటే తప్పారు!

● అంశాల వారీగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల విశ్లేషణ

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల్లో అత్యధికంగా ఒక్క సబ్జెక్టులో తప్పినవారే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 91,150 మంది ఫెయిల్ కాగా, వారిలో కేవలం ఒక్క సబ్జెక్టులోనే ఫెయిల్ అయినవారు 44,662 మంది (49%) ఉన్నారు. 23.3% మంది రెండింట, 14.2% మంది మూడింట, 3.9% మంది ఐదు సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లల్లో 76,957 మంది అనుత్తీర్ణులయ్యారు.

● అనుత్తీర్ణుల్లో 54,376 మంది బాలురు, 36,774 మంది బాలికలు ఉన్నారు. కేటగిరీల వారీగా చూస్తే ఎస్టీల్లో ఉత్తీర్ణత తక్కువగా 74.13 శాతం ఉండగా, ఓసీల్లో అత్యధికంగా 92.65 శాతం నమోదైంది.

● ఫెయిలైన విద్యార్థుల్లో 37,679 మంది (41.3%) విద్యార్థులు తెలుగులో గట్టెక్కలేకపోయారు. హిందీలో 1.6%, ఆంగ్లంలో 9.6% మంది ఫెయిలయ్యారు. అంటే.. భాషా సబ్జెక్టుల పరంగా చూస్తే తెలుగులోనే ఎక్కువ మంది తప్పారన్నమాట! అత్యధికంగా సామాన్యశాస్త్రంలో 59.5%, ఆ తర్వాత గణితంలో 43.6%, సాంఘికశాస్త్రంలో 41.8% మంది అనుత్తీర్ణులయ్యారు.

ప్రత్యేక తరగతులు

సర్కారు బడుల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం పాఠశాల విద్యాశాఖ పునశ్చరణ తరగతులు ప్రారంభించింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఈ తరగతులు కొనసాగనున్నాయి. ఏ ఒక్కరూ చదువు మధ్యలో మానేయకూడదన్న ఉద్దేశంతో ప్రత్యేక తరగతులు బోధిస్తోంది. ఒకే బడిలో 15-20 వరకు విద్యార్థులు ఫెయిలైన చోట అదే పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. తక్కువ మంది విద్యార్థులుంటే 2-3 పాఠశాలలు కలిపి ఒకచోట తరగతులు బోధిస్తారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల స్కూళ్లలో పునశ్చరణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించిన విద్యాశాఖ.. సంబంధిత ప్రణాళికను ప్రధానోపాధ్యాయులకు పంపించింది.

కేటగిరీల వారీగా ఫెయిల్..

కేటగిరీ	హాజరైన వారు	ఉత్తీర్ణులు	ఫెయిల్	ఉత్తీర్ణత శాతం
ఓసీ	1,20,168	1,11,335	8,833	92.65
బీసీ-ఏ	1,07,149	87,221	19,928	81.4
బీసీ-బీ	81,156	71,588	9,568	88.21
బీసీ-సీ	1,878	1,719	159	91.53
బీసీ-డీ	1,03,110	92,390	10,720	89.60
బీసీ-ఈ	42,143	34,722	7,421	82.39
ఎస్సీ	1,27,270	1,01,791	25,479	79.98
ఎస్టీ	34,918	25,886	9,032	74.13

ఏ సబ్జెక్టులో ఎంత మంది ఫెయిలయ్యారంటే..?

సబ్జెక్టు	ఫెయిలైన వారు	మొత్తం ఫెయిల్‌లో శాతం
తెలుగు	37,679	41.3
హిందీ	1,436	1.6
ఆంగ్లం	8,771	9.6
గణితం	39,722	43.6
సైన్స్	54,272	59.5
సోషల్	38,066	41.8

ఫెయిల్ అయిన వారిలో.. ఎంత శాతం మంది ఎన్నేసి సబ్జెక్టుల్లో తప్పారంటే..

సబ్జెక్టులు	ఫెయిల్	శాతం
1	44,662	49
2	21,195	23.3
3	12,938	14.2
4	8,268	9.1
5	3,514	3.9
6	573	0.6

ముందుగా ఏర్పడ్డా ఐఓడీ ఆదుకునేది

● జూన్, జులై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో తీవ్రంగా ఉండే అవకాశం

● 'ఈనాడు'తో ఇన్‌కాయిస్ ఓఎండీఏ హెడ్, శాస్త్రవేత్త ఫ్రాన్సిస్



ఫ్రాన్సిస్

ఈనాడు, హైదరాబాద్: 'ప్రపంచవ్యాప్తంగా వివిధ వాతావరణ సంస్థల అంచనాలు చూపిస్తున్నట్లుగా ఈ ఏడాది మనకు బలమైన ఎల్‌నినోకు అవకాశం ఉంది. అందువల్ల రుతుపవనాలు ప్రభావితం కావొచ్చు. జూన్, జులై, ఆగస్టు నెలలు మనకు రుతుపవనాలు ఉండే కీలకమైన నెలలు. ఈ సమయంలో ఎల్‌నినో తీవ్రంగా ఉండే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి' అని ఇన్‌కాయిస్ ఓషన్ మోడలింగ్ డేటా అసిమిలేషన్(ఓఎండీఏ) హెడ్, శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ పీఏ అన్నారు. ఎల్ నినో ఆలస్యంగా మేలో ఏర్పడడం కూడా దేశంలో రుతుపవనాలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ముందుగా ఏర్పడ్డా ఇండియన్ ఓషన్ డైపోల్(ఐఓడీ) ఆదుకునేదని అభిప్రాయపడ్డారు. ఎల్ నినో ఏర్పడడం దాని ప్రభావం తదితర అంశాలపై ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

అప్వెల్లింగ్ ఆధారంగా..

హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రాలను ఉష్ణమండల ప్రాంతం(ట్రాపికల్ రీజియన్) అని పిలుస్తాం. భూమధ్యరేఖకు దగ్గరగా ఉండటంతో ఉష్ణమండల మహాసముద్రాలు సాధారణంగా వెచ్చగా ఉంటాయి. సముద్రపు వేడిని తగ్గించే ప్రక్రియల్లో అప్వెల్లింగ్ ప్రధాన అంశం. సముద్ర ఉపరితలం నుంచి వంద మీటర్లు అంతకంటే లోతు నుంచి చల్లటి నీరు పైకి వచ్చి పైనున్న వేడి నీటితో కలిసే ప్రక్రియను అప్వెల్లింగ్ అంటారు. పసిఫిక్ మహాసముద్రపు తూర్పు భాగంలో ఈ అప్వెల్లింగ్ ఎక్కువగా జరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతం చల్లగా ఉంటుంది. దీనికి భిన్నమైన పరిస్థితులు పసిఫిక్ మహాసముద్రపు పశ్చిమ భాగంలో ఉండి ఆ ప్రాంతం చాలా వెచ్చగా ఉంటుంది. కొన్ని సంవత్సరాలకు ఈ పరిస్థితి మారుతుంది. పశ్చిమ పసిఫిక్ నుంచి వెచ్చని నీరు తూర్పు దిశకు ప్రవహిస్తుంది. ఆ సమయంలో అప్వెల్లింగ్ బలహీనపడుతుంది. దీనివల్ల తూర్పు భాగం కూడా వెచ్చగా మారుతుంది. ఈ పరిస్థితిని ఎల్‌నినో అంటారు. ఇది సాధారణంగా 6-7 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. అప్వెల్లింగ్ మరింత తీవ్రమైతే చల్లటి నీరు ఎక్కువగా కలిసి సముద్ర ఉపరితలం మరింత చల్లగా మారుతుంది. దీనిని లా నినా అంటారు.

ఇప్పుడు సమయం లేదు..

ఎల్ నినో సమయంలో హిందూ మహాసముద్రంలో జరిగే కీలక మార్పులను ఇండియన్ ఓషన్ డైపోల్(ఐఓడీ) అంటారు. ఎల్‌నినో తీవ్రంగా ఉన్న సంవత్సరాల్లో కూడా కొన్నిసార్లు రుతుపవనాలు విఫలం కాలేదు. దీనికి కారణం ఐఓడీ అని గుర్తించారు. సాధారణంగా ఎల్‌నినో ముందుగానే ప్రారంభమైతే ఐఓడీని ప్రేరేపించేందుకు సానుకూల పరిస్థితులు ఉంటాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎల్‌నినో మొదలైతే ఐఓడీని ప్రేరేపించడానికి తగినంత సమయం ఉంటుంది. అలా జరిగితే రుతుపవనాల సమయంలో ఐఓడీ పరిపక్వం చెంది ఎల్‌నినో ఉన్నా.. రుతుపవనాలపై సానుకూల ప్రభావం ఉంటుంది. కానీ ఈసారి ఎల్‌నినో ఆలస్యంతో ఐఓడీ రుతుపవనాలపై సానుకూల ప్రభావం చూపే అవకాశం తక్కువగా ఉంటుంది.

రైల్వే జోన్ల ఏర్పాటు క్రమమిది..

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుపై రైల్వే శాఖ నోటిఫికేషన్ ఇవ్వడంతో.. దేశంలో జోన్ల సంఖ్య 18కి చేరినట్లైంది. స్వాతంత్ర్యానంతరం తొలుత 1951లో ముంబయి కేంద్రంగా 5 డివిజన్లతో మధ్య రైల్వే జోన్ ఏర్పాటైంది. అదే ఏడాది ముంబయి కేంద్రంగానే పశ్చిమ రైల్వే, చెన్నై కేంద్రంగా దక్షిణ రైల్వే జోన్లను కేంద్రం ఏర్పాటు చేసింది. 1952లో తూర్పు (కోల్‌కత్తా), ఈశాన్య (గోరఖ్‌పుర్), ఉత్తర (దిల్లీ) రైల్వే జోన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని మరిన్ని జోన్లుగా విభజించే క్రమంలో 1955లో కోల్‌కత్తా కేంద్రంగా ఆగ్నేయ, 1958లో గువాహటి కేంద్రంగా ఈశాన్య ప్రాంత రైల్వే జోన్లను ప్రారంభించారు. 1966లో ఆరు డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ సాకారం కాగా, వచ్చే జూన్ నుంచి దీని పరిధిలో మూడు డివిజన్లు మాత్రమే మిగలనున్నాయి. 2002లో హాజీపుర్‌లో తూర్పు మధ్య, జైపుర్‌లో వాయవ్య రైల్వే జోన్లను కొత్తగా ప్రారంభించారు. ఆ మరుసటి ఏడాది ఈస్ట్ కోస్ట్ (భువనేశ్వర్), ఉత్తర మధ్య (అలహాబాద్), ఆగ్నేయ మధ్య (బిలాస్‌పుర్), నైరుతి (హుబ్బళ్లి), పశ్చిమ మధ్య (జబల్‌పుర్) జోన్లు ఉనికిలోకి వచ్చాయి. 2010లో కోల్‌కత్తా మెట్రో రైల్వేను కూడా జోన్‌గా ప్రకటించారు.

రైల్వే జోన్ నోటిఫికేషన్‌పై హర్షాతిరేకాలు

ఈనాడు, అమరావతి: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు రాష్ట్ర నేతలు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థ అనుసంధానానికి ఇది దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ

–మంత్రి నారా లోకేశ్

దక్షిణ కోస్తా రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు, ఇందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. ఇది రాష్ట్రంలో రవాణా వ్యవస్థల అనుసంధానానికి, ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపుతుంది. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుంది. కొత్త అవకాశాలను సృష్టిస్తుంది.

ఆంధ్రుల మెడలో మరో మాల

–తెదేపా అధికార ప్రతినిధి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మిత్తల్ స్టీల్ కంపెనీ, గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలను విశాఖకు తెచ్చిన కూటమి ప్రభుత్వం.. తాజాగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌నూ సాధించి, ఆంధ్రుల మెడలో మరో దండ వేసింది. ఈ జోన్ పరిధిలో వచ్చే ఆదాయం ఏపీలో రైల్ నెట్‌వర్క్ అభివృద్ధికి, కొత్త రైళ్ల ఏర్పాటుకు ఉపయోగపడుతుంది. విశాఖ చుట్టుపక్కల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఉత్తరాంధ్ర పోరాటాలకు దక్కిన ఫలితం

–తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు అంటూ గళమెత్తిన రాష్ట్ర నాయకులు, ఉత్తరాంధ్ర ప్రజల పోరాటాలకు ఫలితం దక్కింది. ఇక్కడి ప్రజలు దీన్నొక జాతీయ ఎజెండాగా మార్చి ఉద్యమించారు. వైకాపా హయాంలో భూసేకరణలో జాప్యం వల్లే ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. 2024 తర్వాత కూటమి ప్రభుత్వం భూసేకరణ పూర్తిచేసి, పాలనా పరమైన అడ్డంకులను తొలగించింది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు ఈ జోన్ పరిధిలోకి రావడం వల్ల ఏపీకి సొంత రైల్వే లైన్ లభించినట్లైంది. సీఎం చంద్రబాబు నిరంతర ప్రధాని మోదీ, రైల్వే శాఖతో చర్చించి, ప్రక్రియను వేగవంతం చేశారు.

ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారం

– మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి పథంలో బుల్లెట్ ట్రైన్‌లా దూసుకుపోతోంది. ఐదేళ్ల వైకాపా పాలనలో జగన్ అండ్ కో ఉత్తరాంధ్ర ప్రజల ఆస్తుల్ని లూటీ చేస్తే.. కూటమి ప్రభుత్వం వారి కలలను సాకారం చేస్తోంది. విశాఖకు భారీ పరిశ్రమలను తెస్తోంది. రైల్వే జోన్ అందులో కీలకమైన ప్రాజెక్టు అవుతుంది.

హోమ్‌స్టేలకు గృహ విద్యుత్ కేటగిరీ అమలు

● ఉత్తర్వులు జారీ చేసిన ఏపీఈఆర్‌సీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థలో (ఏపీటీడీసీ) నమోదైన హోమ్‌స్టేలు, బెడ్, బ్రేక్‌ఫాస్ట్ (బి అండ్ బి) సంస్థలను గృహ విద్యుత్ వినియోగదారుల కేటగిరీ కింద పరిగణించి బిల్లులు జారీ చేయాలని డిస్కంలను ఆదేశిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పు వల్ల డిస్కంల ఆదాయానికి నష్టం ఏర్పడితే.. నెలవారీ వాస్తవ విద్యుత్ వినియోగం ఆధారంగా బిల్లులు రూపొందించి ఏపీటీడీసీ నుంచి వసూలు చేయాలని కమిషన్ సూచించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైల్ సప్లై టారిఫ్(ఆర్‌ఎస్‌టీ) ఆర్డర్‌లో హోమ్‌స్టేలు, బి అండ్ బి టారిఫ్ గురించి ప్రస్తావించకున్నా.. ప్రభుత్వం నుంచి అందిన సూచన మేరకు గృహ విద్యుత్ టారిఫ్ నిబంధన వర్తింపజేయాలని నిర్ణయించినట్లు కమిషన్ పేర్కొంది. వాటి వల్ల రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, వైవిధ్యాన్ని ఆస్వాదించే అవకాశాన్ని హోమ్‌స్టేలు/బి అండ్ బి సంస్థలు పర్యాటకులకు కల్పిస్తాయని.. స్థానికులకు తగిన ఆర్థిక ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

రిజిస్టర్డ్ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి: ఫోర్టో

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులు, విద్యా రంగ సమస్యలపై రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరుతూ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫోరం ఆఫ్ రిజిస్టర్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, అంకాల్ కొండయ్య వినతిపత్రం సమర్పించారు. 'ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని విద్యా సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలుకు చర్యలు తీసుకోవాలి. అర్హత కలిగిన ఉపాధ్యాయులకు జూనియర్, డైట్, ఎస్‌సీఈఆర్టీ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలి. ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, పీజీటీ, అధికారుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలి. వారానికి గరిష్ఠంగా 30 పీరియడ్స్‌కు మాత్రమే బోధన సమయాన్ని పరిమితం చేయాలి' అని కోరారు.

క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగించాలి

● జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌కు వినతి



జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజసుందర్‌బాబు

ఈనాడు, దిల్లీ: క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సామాజిక ఉద్యమకారుడు గోళ్లమూడి రాజసుందర్‌బాబు జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను కోరారు. మతం మారిన వారి ఎస్సీ హోదా కొనసాగింపునకు కేంద్రం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ కేజీ బాలకృష్ణన్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజసుందర్‌బాబు మంగళవారం ఇక్కడ జస్టిస్ బాలకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. "రాజ్యాంగంలో ఆర్టికల్ 341లో మత ప్రస్తావన లేదు. అమల్లోకి వచ్చిన 8 నెలల తర్వాత హిందూమతంలో ఉన్న వారే ఎస్సీలని రాష్ట్రపతి పేరున కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేశారు. 1956లో సిక్కు మతంలోని దళితులు, 1990లో బౌద్ధమతంలోని దళితులూ ఎస్సీలేనని రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణలు చేశారు. క్రైస్తవం, ముస్లిం మతాల్లో ఉన్న ఎస్సీలకు ఆ నిబంధన వర్తింపజేయకుండా అన్యాయం చేశారు. క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా కల్పించాలని, లేకపోతే దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద నమోదైన లక్షల కేసుల్లో బాధితులకు అన్యాయం జరుగుతుంది" అని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఏమిటది!

నేస్తాలు.. ఇవాళ వెరైటీగా ఆటను, చదువును కలుపుదామా.. ఎందుకంటే ఇది వివిధ రకాల ఆకారాలను గుర్తించే 'గెస్ ది షేప్' గేమ్ మరి!



- కొన్ని కాగితాల మీద త్రిభుజం, చతురస్రం, వృత్తం.. ఇలా వివిధ ఆకారాలను గీసి, వాటిని గోడకు అంటించాలి.
- తర్వాత మీరు ఆ గోడకు ముఖం పెట్టి నిల్చోవాలి.
- ఇప్పుడు మరో వ్యక్తి మీ వీపుపైన ఆ ఆకారాలను వేలితో గీస్తారు.
- వారు ఏ ఆకారాన్ని గీశారో మీరు గుర్తించి, గోడపై ఉన్న ఆ ఆకారంపై మీ చేయి పెట్టాలి. సరిగ్గా గుర్తించగలిగితే మీరే విన్. దీని ద్వారా మన మెదడు చురుగ్గా పనిచేయడమే కాకుండా, పరిశీలనా శక్తి పెరుగుతుంది.

సెలవుల్లో సరదాగా!

మన ఇంటి పండుగలు

స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవాలు వంటివి చూసే ఉంటారు. మన ఇంటికీ ఇలాంటి ప్రత్యేక రోజులు, పండుగలు ఉంటాయి. ఈ సెలవుల్లో వాటిని ఒకచోట రాస్తూ జ్ఞాపకాల చార్ట్‌ను తయారు చేసుకుందాం. మన ఇంటి ముఖ్యమైన రోజులను తెలియజేస్తూ అమ్మానాన్నలకు చిన్న సర్‌ప్రైజ్ ఇద్దాం.

ఒక చార్ట్ తీసుకోండి. మీ దగ్గరున్న పెన్నులు, క్రేయాన్స్‌తో 'మా ఇంటి ముఖ్యమైన తేదీల పట్టిక' అని రాయండి.



- ఇప్పుడు ఎడమవైపు తేదీ రాసి, కుడివైపు సందర్భం రాయండి. వీలైతే ఆయా తేదీల పక్కన మీ కుటుంబ సభ్యుల ఫొటోలు అతికించండి.
- అలా అందరి గురించి వివరాలు ఒకచోట రాయండి.
- ఈ చార్ట్‌ను ఇంట్లో వాళ్లకు చూపిస్తే భలే ఆశ్చర్యపోతారు.

పాలిటెక్నిక్‌లో ఎలక్టివ్ సబ్జెక్టుల విధానం

- కంప్యూటర్ ఆధారిత బ్రాంచిల్లో క్వాంటమ్ కంప్యూటింగ్
- అన్ని కోర్సుల వారికి కృత్రిమ మేధ సబ్జెక్టు
- 2026–27 నుంచి అమల్లోకి కొత్త సిలబస్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పాలిటెక్నిక్‌లోనూ కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ సబ్జెక్టులను తీసుకొస్తూ ఉన్నత విద్యాశాఖ సిలబస్‌ను మార్చింది. మూడేళ్లకోసారి పాఠ్యప్రణాళికను మారుస్తారు. ఇందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి కొత్త సిలబస్‌ను తీసుకొచ్చింది. ఆరు కంప్యూటర్ అనుబంధ బ్రాంచిల కోసం క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రవేశపెట్టారు. ఏఐ సబ్జెక్టును అన్ని బ్రాంచిల విద్యార్థులు చదివేలా సిలబస్‌ను రూపొందించారు. మొదటిసారిగా కొన్ని సబ్జెక్టులను ఎంచుకునే విధానాన్ని తీసుకొచ్చారు. మూడో సెమిస్టర్ నుంచి ఐదో సెమిస్టర్ వరకు ఎలక్టివ్ సబ్జెక్టులు ఉంటాయి. ఓపెన్ ఎలక్టివ్‌లో ఏ సబ్జెక్టును ఎవరైనా ఎంచుకోవచ్చు. ఇదికాక బ్రాంచి ఆధారిత ఎలక్టివ్ ఉంటుంది. అందరికీ ఏఐ గురించి పరిచయం చేసేలా సబ్జెక్టును రూపొందించారు. కంప్యూటర్ అనుబంధ బ్రాంచిలకే క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రవేశపెట్టారు. పరిశ్రమల అంచనాలు, అంతర్జాతీయ ప్రమాణాలైన ఎన్‌బీఏ, వాషింగ్టన్ అకార్డ్‌కు అనుగుణంగా సిలబస్‌ను రూపొందించారు. దీంతో మన పాఠ్యప్రణాళికకు వాషింగ్టన్ అకార్డ్‌పై సంతకం చేసిన 25 దేశాలలోనూ గుర్తింపు లభిస్తుంది.

158 మంది నిపుణులు.. 20 కార్యశాలలు

డిప్లొమా సిలబస్ రూపకల్పనలో 158 మంది నిపుణులు పాలుపంచుకున్నారు. 108 మంది పరిశ్రమల నిపుణులు, 50 మంది ఐఐటీ, ప్రముఖ విశ్వవిద్యాలయాల విద్యావేత్తలు ఈ సిలబస్ మార్పునకు సూచనలు అందించారు. మొత్తం 20 కార్యశాలలు నిర్వహించారు. మొదటి సంవత్సరంలో సమగ్ర నిరంతర మూల్యాంకనానికి అనుగుణంగా మూడు మిడ్‌లు, తర్వాత ఐదో సెమిస్టర్ వరకు సెమిస్టర్‌కు రెండు మిడ్‌లు ఉంటాయి. ఇప్పటివరకు మిడ్‌కు 20% వెయిటేజి ఉండగా.. దీన్ని 30%కు పెంచారు. కంప్యూటర్ ఇంజినీరింగ్ బ్రాంచిని సీఎస్ఈగా మార్చారు. సెమిస్టర్‌కు 20 క్రెడిట్ల చొప్పున ఏడాదికి 40 క్రెడిట్లు ఉంటాయి. ఆరో సెమిస్టర్‌లో పూర్తిగా పరిశ్రమల్లో శిక్షణ ఉంటుంది. దీన్ని అధ్యాపకులు పర్యవేక్షించేలా ప్రణాళిక రూపొందించారు.

చంద్రబాబు వద్ద కోటరీల్లేవు

- సామాన్య కార్యకర్తా నేరుగా కలవొచ్చు
- ప్రతి ఓటూ ముఖ్యమే... తమిళనాడులో ఒక్క ఓటుతో గెలిచిన ఎమ్మెల్యే ఉన్నారు
- తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో లోకేశ్ 'కాఫీ కబుర్లు'



తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో నిర్వహించిన 'కాఫీకబుర్లు'లో ఓ నాయకుడితో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు వద్ద కోటరీల్లేవని, సామాన్య కార్యకర్త సైతం నేరుగా ఆయనను కలిసి సమస్యలు చెప్పుకొనే అవకాశముందని మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తెలిపారు. ప్రతివారం ముఖ్యమంత్రి గానీ, తాను గానీ పార్టీ కార్యాలయంలో కేడర్‌కు అందుబాటులో ఉంటామన్నారు. మై టీడీపీ యాప్‌లోని టాప్-10 కేడర్‌ను మూడు నెలలకోసారి కలుస్తానని ఆయన పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం ఆయన పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో 'కాఫీ కబుర్లు' భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనని, తాజాగా తమిళనాడు ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో ఓ ఎమ్మెల్యే గెలిచారని.. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేడర్ పనిచేయాలని లోకేశ్ సూచించారు. "పార్టీలో శిక్షణ తరగతులు నిరంతరం కొనసాగుతాయి. ఏడాదిలో 300 రోజులపాటు మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులకు తరగతులు నిర్వహిస్తాం" అని తెలిపారు. ప్రతి నాయకుడి పనితీరును మూడు నెలలకోసారి సమీక్షిస్తానని, పని చేయకపోతే పదవులు పోతాయని చంద్రబాబు తమతో నిర్మొహమాటంగా చెప్పారని లోకేశ్ పేర్కొన్నారు.

2027లోగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తా

"తెలుగుదేశంలో వ్యక్తులు శాశ్వతం కాదు. పార్టీ శాశ్వతం. ఏమైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపై మాట్లాడి పరిష్కరించుకోవాలి. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 50 నియోజకవర్గాల్లో పర్యటించి కార్యకర్తల్ని కలుసుకున్నాను. 2027లోగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాను. వైకాపా హయాంలో పార్టీ కేడర్‌పై పెట్టినవాటిలో 80% అక్రమ కేసుల్ని ఇప్పటికే తొలగించాం. మిగిలినవీ తీసేస్తాం" అని తెలిపారు.

భాజపా విధానాలపై అధ్యయనం

దీర్ఘకాలంపాటు అధికారంలో కొనసాగేందుకు భాజపా అనుసరిస్తున్న విధానాల్ని అధ్యయనం చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. తెదేపాకు 'మై టీడీపీ' యాప్ మాదిరిగానే... భాజపాకి సరళ్ యాప్ ఉందని, కేంద్రమంత్రి నుంచి సామాన్య కార్యకర్త వరకు వారు చేసే రోజువారీ పనిని దానిలో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యకర్తలు వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు వారిని గౌరవంగా చూడాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. "ముఖ్యమంత్రి, నేను పర్యటనకు మా సొంత వాహనాలు వినియోగిస్తున్నాం. వ్యక్తిగత విదేశీ పర్యటనలకు సొంత ఖర్చుతోనే వెళుతున్నాం. కానీ ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారి ఫేక్ ప్రచారాన్ని మనం వాస్తవ సమాచారంతో వెంటనే తిప్పికొట్టాలి" అని పేర్కొన్నారు.

సింగిల్ థియేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- సినీ ఎగ్జిబిటర్లకు మంత్రి దుర్గేష్ హామీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మల్టీప్లెక్స్‌లు, ఓటీటీల ప్రభావంతో థియేటర్ల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర సినీ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని మంగళవారం సచివాలయంలో కలిసి వివరించారు. మూతపడిన థియేటర్ల పునరుద్ధరణ, మనుగడకు సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం అనుమతిస్తున్న టికెట్ అదనపు ధరలో 20% వాటాను థియేటర్ల నిర్వహణకు కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కమర్షియల్ విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సినీ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాదరావు (అలంకార్ ప్రసాద్), ఇతర ప్రతినిధులు గోరంట్ల బాబు (గోరంట్ల కాంప్లెక్స్, ఒంగోలు), గౌరీశంకర్ రాము (గుంటూరు గౌరీ శంకర్ థియేటర్), భగవాన్ (ఎస్వీ థియేటర్స్ జీఎం), ఓంకార్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కంభం చెరువును అభివృద్ధి చేయాలి

చారిత్రక ప్రాధాన్యం ఉన్న మార్కాపురం జిల్లాలోని కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి రూ.4 కోట్లు కేటాయించాలని మంత్రి దుర్గేష్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. నిధుల విడుదలకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



సంభాషణా నైపుణ్యాల మెరుగుకు..

సంభాషణా నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు అనేక మార్గాలున్నాయి. క్రమం తప్పకుండా మంచి పుస్తకాలు చదవడం వాటిలో ఒకటి. మనం ఎలాంటి భాషను వింటామో, చదువుతామో దానిని మన సంభాషణల్లో వినియోగిస్తాం. కాబట్టి అందమైన, ఉన్నతమైన భాషా ప్రపంచంలో విహరించండి.

– జోషువా డి ఫిలిప్స్, ప్రొఫెసర్

కూలీలపై పిడుగుపాటు.. నలుగురి మృతి

విజయనగరం జిల్లాలో విషాదం



గెడ్డవలసలో మృతదేహాల వద్ద కుటుంబ సభ్యుల రోదనలు

ఈనాడు, విజయనగరం: పిడుగుల బారిన పడి రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం విజయనగరం జిల్లా రాజాం మండలం గెడ్డవలస సమీపంలో పలువురు మహిళలు వ్యవసాయ పనులకు వచ్చారు. వారు పనిచేస్తున్న సమయంలో వర్షం, ఈదురుగాలులు ప్రారంభమవడంతో తల దాచుకోవడానికి సమీపంలోని చెట్టు కిందకు చేరారు. అప్పుడే పిడుగుపడటంతో సత్తెమ్మ (65), రాము (48), నర్సమ్మ (55)లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఘటనలో తెర్లాం మండలం చిన్నయ్యపేటలో ఉపాధి పనులు చేస్తుండగా పిడుగుపాటుకు జమ్మల సూర్యనారాయణ (71) మృతి చెందారు. సమీపంలో పనిచేస్తున్న మరొకరు గాయపడ్డారు.

3 రోజులు పిడుగులతో కూడిన వర్షాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని, మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు ఎక్కువగా ఉంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం నంద్యాల జిల్లా బనగానపల్లిలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది.

'ఆ శాఖలో అసలేం బాలేదు' అనే అంశం జోలికి వెళ్లకండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: ఐఏఎస్ అధికారి అహ్మద్‌బాబు (బాబు ఎ) శాఖాధిపతిగా ఉన్న రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ, ఇతర శాఖల్లో 'అసలేం బాగా లేనట్లు'గా కనిపిస్తోందంటూ సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఉద్యోగుల సంఘం ఇచ్చిన వినతిపై నిర్ణయం తీసుకోవాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలుపుదల చేసేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. అహ్మద్‌బాబు పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పదోన్నతి ఇవ్వకుండా వేధిస్తున్నారని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 28న ఈ వ్యాజ్యంపై తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి.. అహ్మద్‌బాబు శాఖాధిపతిగా ఉన్న శాఖల్లో 'అసలేం బాగా లేనట్లు'గా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ తీర్పును సవాలు చేస్తూ అహ్మద్‌బాబు దాఖలు చేసిన అప్పీల్‌పై ధర్మాసనం విచారణ జరిపింది.

'కాచిగూడ-జగ్గయ్యపేట' రైల్వేలైన్ లైడార్ సర్వే పూర్తి

ఈనాడు, హైదరాబాద్: కాచిగూడ నుంచి ఏపీలోని జగ్గయ్యపేట వరకు ప్రతిపాదిత రైల్వే లైన్‌కు సంబంధించిన లైడార్ సర్వే పూర్తయింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అంచనా వ్యయం, భూసేకరణ సహా సమగ్ర అంచనాల సమాచారాన్ని రైల్వే అధికారులు సిద్ధం చేస్తున్నారు. జూన్ నెలాఖరుకల్లా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారుచేయనున్నట్లు సమాచారం. 2023 జులైలో సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలపగా.. దాదాపు మూడేళ్లకు పూర్తయింది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. ప్రాజెక్టు మొత్తం దూరం 228 కిలోమీటర్లు. పాత విధానాలతో పోలిస్తే లైడార్ సర్వే ఆధునిక పద్ధతుల్లో, కచ్చితత్వంతో ఉంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీల నియామకంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: గవర్నరు కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ ఎం.కోదండరామరెడ్డి (కోదండరాం), మహమ్మద్ అజారుద్దీన్‌ల నియామకాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కోదండరాం, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 26న జారీ చేసిన జీవో 71పై హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ హైదర్ పిటిషన్ దాఖలు చేశారు. నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేసిన వారికి రాజ్యాంగం నిర్దేశించిన అర్హతలు లేవని పిటిషనర్ పేర్కొన్నారు. సాహిత్యం, విజ్ఞానం, కళలు, సహకార ఉద్యమం, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు మాత్రమే గవర్నరు కోటాలో అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. అభ్యర్థులకున్న అర్హతలను ప్రభుత్వం పరిశీలించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందన్నారు. ఇవి రాజకీయ నియామకాలుగా మారాయని ఆరోపించారు. జీవో 71 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రతివాదులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కోదండరాం, అజారుద్దీన్‌లను పేర్కొన్నారు.

గోదాం నుంచి 82 గ్యాస్ సిలిండర్ల చోరీ



గోదాం ప్రహరీ మీద పడేసిన సీసీ కెమెరా

జహీరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ల దొంగలు హల్‌చల్ చేశారు. సీఐ శివలింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి భీంనగర్ కాలనీలోని మనీషా ఇండేన్ గ్యాస్ సిలిండర్ల గోదాం ప్రవేశద్వారం వద్ద దుండగులు సీసీ కెమెరాను ధ్వంసం చేసి లోపలికి చొరబడ్డారు. తలుపులు పగలగొట్టి 82(51నిండినవి, 31ఖాళీవి) సిలిండర్లు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం గోదాం తలుపులు తెరిచి ఉండటాన్ని డెలివరీ బాయ్స్ చూసి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సిరంజీల తయారీ కష్టమే

- యుద్ధంతో ఇప్పటికే రాష్ట్రానికి సరఫరా చేయలేమన్న ఉత్పత్తిదారు
- 25% వరకు పెరిగిన సర్జికల్స్ ధరలు
- ఔషధాల రేట్లు 30 శాతం పైగానే..



ఈనాడు, హైదరాబాద్: ఆసుపత్రుల్లో, రోగ నిర్ధారణ కేంద్రాల్లో చాలా ముఖ్యమైనవి ఇంజెక్షన్ చేసే సిరంజీలు. ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో త్వరలో వాటి తయారీపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం కనిపిస్తోంది. వైద్య రంగంలోని సర్జికల్స్ తయారీలో పెట్రోకెమికల్స్ కీలకం కావడం.. గల్ఫ్ యుద్ధంతో ఇంధనం కొరత కారణంగా వైద్య పరికరాలు తయారు చేసే పరిశ్రమలు తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు (టీజీఎంఎస్ఐడీసీకి) పెద్ద ఎత్తున సిరంజీలు సరఫరా చేసే తమిళనాడుకు చెందిన ఓ కంపెనీ ఇక తాము సరఫరా చేయలేమని చేతులెత్తేసింది. దీంతో టీజీఎంఎస్ఐడీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొంది. యుద్ధం కొనసాగితే మరో మూడు నెలల్లో వీటి ఉత్పత్తి తగ్గుతుందని ఫలితంగా వైద్య రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధం ప్రారంభం నాటితో పోలిస్తే సర్జికల్స్ ధరలు 15 నుంచి 25 శాతం, ఔషధాల ధరలు 30 శాతానికి పైగా పెరిగినట్లు మందుల దుకాణదారులు విశ్లేషిస్తున్నారు. చేతి గ్లోవ్స్ తయారు చేసేందుకు వినియోగించే నైట్రైల్ బుటాడిన్ రబ్బర్ (ఎన్‌బీఆర్) ధర 110 శాతం పెరిగిందని ఓ ఔషధ తయారీ కంపెనీ వివరించింది.

★ యుద్ధం ప్రభావంతో రోగులపై ఆర్థిక భారం అంతకంతకీ పెరిగిపోతోంది. హోల్‌సేల్‌లో సిరంజీల సామర్థ్యాన్ని బట్టి రూ.2 నుంచి రూ.10 వరకు విక్రయించే వారు ఇప్పుడు వాటి ధరను రెట్టింపు చేశారు. ఉత్పత్తిదారులు 25 శాతం ధరలు పెంచామని సరఫరాదారులకు సమాచారం ఇచ్చినప్పటికీ రోగుల వరకు వచ్చేసరికి కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో సర్జికల్స్ గతంతో పోలిస్తే రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

★ ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా సరఫరాదారులు ఔషధాలు, సర్జికల్స్ సరఫరా నిలిపేశారు. దీంతో సర్కారు ఆసుపత్రుల్లో సిరంజీలు, చేతి గ్లౌజులు, ఐవీ సెట్లు తదితర ప్రాథమిక స్థాయిలో వినియోగించే వస్తువుల కొరత అధికమవుతోంది. తమకు రూ.140 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని, దీనికి తోడు యుద్ధం వల్ల కంపెనీలు ధరలు పెంచాయని, ఇక తాము సరఫరా చేసే పరిస్థితి లేదని సరఫరాదారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన సర్వే గణాంకాల ప్రకారం దేశంలోనే వైద్యం ఖర్చు రాష్ట్రంలోనే అధికంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లోని ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేరితే సగటున రోగులపై రూ.79,783 భారం పడుతోందని పేర్కొంది. ఈ క్రమంలో ఇప్పుడు పెరిగిన మెడికల్, సర్జికల్స్ ధరలతో చికిత్స మరింత ప్రియం కావడం ఆందోళన కలిగిస్తోంది.

బీసీ కులగణన కోసం 9న ఆమరణ నిరాహారదీక్ష: వీహెచ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 9న ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తెలిపారు. బీసీ కులగణనపై కేంద్రం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తన దీక్ష కొనసాగుతుందన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం 10న తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ.. 8వ తేదీ లోపు దీనిపై స్పష్టత ఇచ్చి ఆ తర్వాతే రావాలని డిమాండ్ చేశారు. పీసీసీ ఓబీసీ సెల్ కన్వీనర్ డా.కేతూరి వెంకటేశ్ తదితరులతో కలిసి ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9న చేపట్టనున్న ఆమరణ నిరాహారదీక్షకు బీసీ సంఘాలు తరలి రావాలని వీహెచ్ కోరారు. తాను దీక్షకు కూర్చునే స్థలాన్ని ముందుగా ప్రకటిస్తే పోలీసులు భగ్నం చేసే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

ముస్లింలు ఏకం కావాలి

బెంగాల్‌లో ఎంఐఎం ఫలితాలను సమీక్షిస్తాం: ఒవైసీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్‌లో ఓటర్లకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై స్పందించారు. మంగళవారం తన పార్టీ కార్యాలయంలో ఒవైసీ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో పార్టీ పనితీరును, వచ్చిన ఫలితాలను సమీక్షించుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముస్లింలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలోని సెక్యులర్ పార్టీలకు మైనార్టీలు కేవలం ఓటుబ్యాంకుగా ఉపయోగపడుతున్నారన్నారు. ముస్లింలు ఓటర్లుగా కాదు.. సిటిజన్లుగా మారాలని కోరారు. సెక్యులర్‌లుగా ప్రచారం చేసుకునే పార్టీలు బెంగాల్‌లో భాజపాను ఎందుకు నిలువరించలేకపోయాయని ప్రశ్నించారు.

రాజ్యాంగ పదవులు నిర్వహించే వ్యక్తులను 'గౌరవనీయ'తో సంబోధించాలి

ప్రయాగ్‌రాజ్: ఎంపీలు, ఎమ్మెల్యేలు వంటి శాసనకర్తలు, రాజ్యాంగపరమైన సార్వభౌమ విధులు నిర్వహించే మంత్రులు, న్యాయవ్యవస్థకు చెందిన జడ్జీల పేర్లకు ముందు గౌరవ వాచకం చేర్చాలని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. అసెంబ్లీ, లోక్‌సభ స్పీకర్లు, రాజ్యసభ ఛైర్‌పర్సన్ పేర్లను గౌరవ వాచకంతో సంబోధించాలని స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధ సార్వభౌమ పదవుల్లో లేనట్లయితే..సివిల్ సర్వెంట్లకు 'గౌరవనీయ' వంటి సంబోధనలను అధికారిక కార్యక్రమాల్లో చేయాల్సిన అవసరం లేదని ఉత్తర్‌ప్రదేశ్‌లో తలెత్తిన ప్రొటోకాల్‌కు సంబంధించిన వివాదంలో జస్టిస్ జె.జె.మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనా ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ప్రపంచ ప్రవాసులు 30.4 కోట్ల మంది

ఐరాస: ప్రపంచవ్యాప్తంగా 30.4 కోట్ల మంది దేశం కాని దేశంలో ప్రవాసులుగా నివసిస్తున్నారని ప్రపంచ వలసల నివేదిక-2026 వెల్లడించింది. అత్యధిక వలసలు నమోదవుతున్న పది ప్రాంతాల జాబితాలో భారత్-యూఏఈ, భారత్-అమెరికా ఉన్నాయని 2024 నాటి గణాంకాలు తెలియజేస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. ప్రపంచ జనాభాలో వలసదారుల వృద్ధి 1990లో 2.9 శాతం ఉండగా, 2024 నాటికి అది 3.7 శాతానికి పెరిగిందని వివరించింది. మెక్సికో నుంచి అమెరికాకు జరుగుతున్న వలసలు ప్రపంచంలోనే అత్యధికమని (1.1 కోట్లు) నివేదిక వివరించింది. అఫ్గానిస్థాన్ నుంచి ఇరాన్‌కు సాగుతున్న వలసలది తరువాతి స్థానం (37 లక్షలు), అని పేర్కొంది.

500 ఏళ్ల వైష్ణవ సత్రానికి అస్సాం ముస్లింల కాపలా



ఈటీవీ భారత్: అస్సాంలోని మోరీగావ్ జిల్లా లాహారీఘాట్ రెవెన్యూ సర్కిల్ పరిధిలో గల 500 ఏళ్లనాటి వైష్ణవ సత్రం 'శ్రీ శ్రీ అలిపుఖురి పటేకీబోరీ సత్ర' మత సామరస్యానికి ప్రతీకగా వర్ధిల్లుతోంది. చుట్టూ ఉన్న ముస్లిం కుటుంబాల పరిరక్షణలోనే ఈ సత్రం కొనసాగుతోంది. అంతేకాదు.. స్థానికంగా పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సైతం ఈ కుటుంబాలే పదే పదే ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాయి. కృష్ణతత్వ వ్యాప్తికి 15వ శతాబ్దానికి చెందిన మహా సాధువు శ్రీమంత శంకరదేవ, ఆయన శిష్యుడు మాధవ్‌దేవ అస్సాంలో ఈ సత్రాల సంస్కృతిని ప్రారంభించారు. ఆ తర్వాత రాజుల ప్రోద్బలంతో వేలాది ప్రాంతాలకు ఇది విస్తరించింది. బంగ్లాదేశ్ మూలాలున్న చొరబాటుదారులు ఈ సత్రాల భూములను ఆక్రమించారన్న రాజకీయ వివాదం రాష్ట్రంలో తరచూ తెరపైకి వస్తూ ఉంటుంది. అలిపుఖురి పూజారి 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ.."కొన్ని దశాబ్దాలుగా స్థానిక ముస్లింలే ఈ సత్రానికి, భూములకు రక్షణగా ఉన్నారు. గతంలో అల్లర్లు జరిగిన సందర్భాల్లో వారి కుటుంబాలే అండగా నిలబడ్డాయి. 1980ల నాటి అస్సాం ఉద్యమ సమయంలోనూ వారే ఆహారధాన్యాలను పంచిపెట్టారు" అని గుర్తు చేసుకున్నారు.



కలంకారీ శైలి గౌనులో సుధారెడ్డి

న్యూయార్క్ మెట్ గాలాలో మెరిసిన మన కలంకారీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: న్యూయార్క్ వేదికగా జరిగిన మెట్ గాలాలో ప్రముఖ వ్యాపారవేత్త సుధారెడ్డి మరోసారి రెడ్ కార్పెట్‌పై మెరిశారు. 3 వేల ఏళ్ల పురాతన మచిలీపట్నం కలంకారీ కళ శైలిలో మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన 'ట్రీ ఆఫ్ లైఫ్' గౌను ధరించి ఈ వేడుకలో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వస్త్రాల తయారీలో 90 మంది కళాకారులు 3,459 గంటలు పనిచేశారు.

నెట్‌కేప్‌పై భాగ్యనగర వృక్ష, జంతుజాలాల ఆకృతులను రేషమ్ జరీతో నేశారు. వెనక భాగంలో అమర్చిన మెటల్ వృక్షాకృతి... తంగేడు పువ్వు, జమ్మిచెట్టు, సూర్యుడు, చంద్రుడు, కల్పవృక్ష చిత్రాలతో తెలంగాణ నేపథ్యాన్ని ప్రతిబింబించింది. భారతీయ, తెలంగాణ కళకు ప్రపంచ గుర్తింపు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా సుధారెడ్డి పేర్కొన్నారు. 2024లోనూ ఆమె ఇలాంటి ప్రదర్శన ఇచ్చారు.

ప్రీతి జింటాను కలిసేందుకు.. 80 కి.మీ. పరుగెత్తాడు



ఈటీవీ భారత్: బాలీవుడ్ నటి ప్రీతి జింటాను కలిసేందుకు ఓ బాలుడు ఏకంగా 80 కిలోమీటర్ల మేర పరుగెత్తాడు. పంజాబ్‌లోని లుధియానా జిల్లా ఖన్నాకు చెందిన అమరిందర్ సింగ్ (17)కు పరుగంటే ప్రాణం. చిన్నప్పటి నుంచే రన్నింగ్ చేసేవాడు. ఇటీవల మొహాలీలో ఐపీఎల్ మ్యాచ్ జరిగింది. మ్యాచ్ చూడటంతోపాటు పంజాబ్ జట్టు ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటాను కలవాలనే లక్ష్యంతో ఇంటి నుంచి అమరిందర్ పరుగు మొదలుపెట్టాడు. అలసట, ఎండ వంటి అడ్డంకులను అధిగమించి దాదాపు 80 కి.మీ. పరుగెత్తాడు. చివరకు స్టేడియానికి చేరుకున్నా.. టికెటు లేకపోవడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అమరిందర్ పట్టుదలను గమనించిన పోలీసులు.. సోషల్ మీడియా ద్వారా అప్పటికే అతడి గురించి తెలిసి ఉండటంతో లోపలకు అనుమతించారు. "స్టేడియంలోకి వెళ్లాక ప్రీతి జింటాను కలిశాను. నా ప్రయాణం గురించి తెలుసుకొని ఆమె అభినందించారు. ఐపీఎల్ టీమ్ టీ-షర్ట్‌ను బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ పంజాబీ కళాకారులు గురుదాస్ మాన్, అమ్మీ విర్క్, సునంద శర్మ వంటివారినీ కలిశాను. వారంతా నన్నెంతో ప్రోత్సహించారు" అని అమరిందర్ తెలిపాడు.